ఈనాడు

విజయవాడ 25-2-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 196

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

గల్వాన్ తర్వాత చైనా రహస్య అణు పరీక్షలు!



వివరాలు బహిర్గతం చేసిన అమెరికా

ఇంటర్నెట్ డెస్క్: చైనా రహస్య అణు పరీక్షలకు సంబంధించిన పలు వివరాలను అమెరికా బహిర్గతం చేసింది. 2020 జూన్‌లో బీజింగ్ అణు పరీక్షలు నిర్వహించిందని అమెరికా విదేశాంగశాఖ అండర్ సెక్రటరీ క్రిస్టోఫర్ యేవ్ పేర్కొన్నారు. అమెరికా-రష్యా మధ్య 'న్యూస్టార్ట్' అణు ఒప్పందం గడువు జనవరిలో ముగిసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో జరిగిన అణ్వస్త్ర నిరాయుధీకరణ సమావేశంలో క్రిస్టోఫర్ మాట్లాడారు. బీజింగ్ ఉద్దేశపూర్వకంగా అణు శక్తిని భారీగా విస్తరిస్తోందని పేర్కొన్నారు. చైనా ఉద్దేశాలు శాస్త్రీయంగా పారదర్శకత లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. 2020 జూన్ 22న చైనాలోని లాప్ నుర్ భూగర్భ కేంద్రంలో 2.75 తీవ్రతతో ప్రకంపనలు వెలువడినట్లు తెలిపారు. కజకిస్థాన్‌లోని ఇంటర్నేషనల్ మానిటరింగ్ సెంటర్ ఈ ప్రకంపనలను గుర్తించినట్లు వెల్లడించారు. అమెరికా మాదిరిగా అణు పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ ప్రపంచ క్షేత్రంలో అందుబాటులో లేదని... దీంతో అణు పరీక్షల ప్రదర్శన వ్యాప్తి కాకుండా... ఈ అంశంపై దౌత్య మార్గాలను అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. గల్వాన్ ఘర్షణల అనంతరం బీజింగ్ ఈ పరీక్షలను ప్రారంభించడం గమనార్హం. ఇదే సమావేశంలో పాల్గొన్న చైనా రాయబారి జియాన్ సెన్ అమెరికా ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బీజింగ్ అణు విధానాన్ని కొన్ని దేశాలు వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. అణు పరీక్షలపై వాషింగ్టన్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవన్నారు.

గోదాట్లో గాలింపు



ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ వద్ద గోదావరి తీరంలో చుట్టుపక్కల గ్రామాల జనం సాగించే గాలింపు ఏటా ఈ సీజన్‌లో కనిపించే సన్నివేశమే. నదిలో నీరు తగ్గినపుడు రైతులు ఆందోళన చెందితే.. వీరు మాత్రం ఎన్నో ఆశలతో నీటిలోకి దిగి జల్లెడలు, వలలతో గాలిస్తారు. త్ర్యంబకేశ్వర్ నుంచి మొదలయ్యే గోదావరి ప్రవాహం నాసిక్ మీదుగా సంభాజీనగర్‌కు చేరుకునేందుకు 200 కి.మీ.లకు పైగా పయనిస్తుంది. మార్గమధ్యంలో చాలామంది తమ బంధువుల అంత్యక్రియలు నిర్వహించాక వారికి సంబంధించిన నగానట్రా, ఇతర విలువైన వస్తువులు, నాణేలు ఈ నదిలో వదులుతుంటారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా నదిలో శోధిస్తున్న ఈ వ్యక్తులు పూడికను జల్లెడ పట్టి దొరికిన ఆయా వస్తువులను నదీమతల్లి కానుకగా స్వీకరిస్తారు.

నేటి నుంచి

మోదీ ఇజ్రాయెల్ పర్యటన



దిల్లీ: ద్వైపాక్షిక రక్షణ, వాణిజ్య సహకారాన్ని పెంపొందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. అమెరికా, ఇరాన్ మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించడం తోపాటు పశ్చిమాసియాలో ఇతరత్రా ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న దశలో ప్రధాని పర్యటన సాగనుంది. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో మోదీ ప్రసంగించనున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అనేక అంశాలపై సంప్రదింపులు జరపడంతోపాటు ఆ దేశ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌తో సమావేశం కానున్నారు. రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై ప్రధానమంత్రుల ప్రతినిధి బృందాలు విస్తృతంగా చర్చించనున్నాయి. నెతన్యాహు బుధవారం రాత్రి ఏర్పాటు చేయనున్న వ్యక్తిగత విందులో మోదీ పాల్గొంటారు. గడచిన తొమ్మిదేళ్లలో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడం ఇది రెండోసారి. చివరిసారిగా ఆయన 2017 జులైలో ఆ దేశాన్ని సందర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని సైతం 2018 జనవరిలో భారత పర్యటనకు విచ్చేశారు. తాజా పర్యటనలో భాగంగా ఇరువురు ప్రధానులు గాజా పరిస్థితితో పాటు పశ్చిమాసియాకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించనున్నారు. 41 వేల మంది ప్రవాస భారతీయులు ఇజ్రాయెల్‌లో ఉన్నారు. వారితో మోదీ సంభాషించే అవకాశం ఉంది.

రేపు భారత్‌కు కెనడా ప్రధాని




టొరంటో: కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన గురువారం ముంబయికి చేరుకుని ప్రధాని నరేంద్ర మోదీ, వ్యాపారవేత్తలతో భేటీ కానున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, దౌత్య సంబంధాల పునరుద్ధరణకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఎదురుచూస్తోందని కెనడా ప్రధానమంత్రి కార్యాలయం మంగళవారం పేర్కొంది. అమెరికా ప్రభుత్వంతో ఉన్న వాణిజ్య సంబంధాలను వైవిధ్య పరిచే ప్రణాళికలో భాగంగా భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లలో కార్నీ పర్యటించనున్నట్లు తెలిపింది.

తహవ్వుర్ రాణా పౌరసత్వ రద్దుకు చర్యలు!

కార్నీ భారత పర్యటనకు బయలుదేరటానికి ముందే... ముంబయి ఉగ్రదాడి (2008)లో కీలక పాత్ర పోషించిన నిందితుడు, పాకిస్థాన్‌లో జన్మించిన కెనడా వాసి తహవ్వుర్ రాణా(64) పౌరసత్వాన్ని రద్దు చేసే దిశగా కెనడా ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఆయనే ఉగ్రవాద చర్యలకు కావడం...దరఖాస్తుల్లో తప్పుడు సమాచారానికి గాను రాణా పౌరసత్వాన్ని రద్దు చేయాలని కెనడా నిర్ణయం తీసుకుందని ఓ నివేదిక తెలిపింది. 2001లో కెనడా పౌరసత్వాన్ని పొందిన రాణా.. అంతకుముందు తన నివాసం వివరాలను వక్రీకరించారని పోలీసుల విచారణలో తేలింది. ఇది అత్యంత తీవ్రమైన నేరమని ఇమిగ్రేషన్ అధికారులు నిర్ధరించి పౌరసత్వ రద్దుకు ఉపక్రమించారు. రాణా ప్రస్తుతం భారత్ కస్టడీలో ఉన్నాడు.

నేను ఎంతకాలం ఉంటానో తెలియదు

అమెరికా అధ్యక్షుడి నిర్వేదం



ఇంటర్నెట్ డెస్క్: తనపై జరుగుతున్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నిస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో తెలియడం లేదని వ్యాఖ్యానించారు. ఇటువంటి ఘటనల్లో సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. అసాధారణ విజయాలు సాధించే తనలాంటి అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికా మాజీ అధ్యక్షులు అబ్రహాం లింకన్, జాన్ ఎఫ్.కెన్నెడీల హత్య ఘటనలను ఉదహరించారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా.. తాను తీసుకున్న నిర్ణయాల నుంచి వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



కండర బలోపేతానికి బాదం

పోషకాల గనిగా వ్యవహరించే బాదం గింజలతో కండరాలు బలోపేతమవుతాయని తాజా అధ్యయనంలో తేలింది. పురుషులు, మహిళలకు నాలుగు వారాలపాటు ప్రయోగాత్మకంగా రోజువారీ ఆహారంలో 57 గ్రాముల బాదం చేర్చడం ద్వారా ఈ విషయం తేటతెల్లమైంది. కండరాల క్షీణతను అడ్డుకోవడంతో పాటు అలసట కూడా దూరమైంది. వీటితోపాటు ఇన్సులిన్ సెన్సిటివిటీ కూడా మెరుగైంది.

– క్రిస్టీ లియాంగ్, వైద్యురాలు

నీతి ఆయోగ్ సీఈవోగా నిధి ఛిబ్బర్



దిల్లీ: నీతి ఆయోగ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి(సీఈవో)గా సీనియర్ ఐఏఎస్ అధికారిణి నిధి ఛిబ్బర్ నియమితులయ్యారు. ఛిబ్బర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు మంగళవారం సిబ్బంది వ్యవహారాల శాఖ వెల్లడించింది. 1994 అఖిల భారత సర్వీసుల్లోని ఛత్తీస్‌గఢ్ క్యాడర్‌కి చెందిన ఛిబ్బర్.. ప్రస్తుతం నీతి ఆయోగ్‌లోని అభివృద్ధి పర్యవేక్షణ, మూల్యాంకన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సీఈవో బి.వి.ఆర్.సుబ్రమణ్యం పదవీ కాలం మంగళవారం ముగియడంతో నిధి ఛిబ్బర్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది.

రహదారుల

నిర్మాణం, పర్యవేక్షణలో ఏఐ

- కిలో హైడ్రోజన్ రూపాయికి తగ్గాలన్నది నా కల
- భవిష్యత్తు ఈవీలదే
- కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి


దిల్లీ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి



జాతీయ రహదారుల నిర్మాణం, పర్యవేక్షణలో ఏఐని వాడుతున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రహదారుల నిర్మాణానికి సంబంధించిన సవివర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) తయారీకి, ఆక్రమణల గుర్తింపునకు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించడానికి ఏఐ, ఉపగ్రహ చిత్రాలను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంద్వారా రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ప్రమాదాలను తగ్గించడం, నాణ్యతను మెరుగుపరచడం, జాప్యాన్ని నివారించడం వంటివి చేపట్టినట్లు వెల్లడించారు. దిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న రెండు రోజుల బిజినెస్ స్టాండర్డ్ మంథన్-2026 సదస్సులో భాగంగా తొలిరోజైన మంగళవారం ఆయన మాట్లాడారు. ఏఐ ఆధారిత మౌలిక వసతులు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, రవాణా ఖర్చులు తగ్గడం, రోడ్డు భద్రత సంస్కరణలు వంటివి భారత్ దీర్ఘకాల వృద్ధికి దోహదపడతాయని వివరించారు. విద్యుత్ వాహనాల విషయంలో భారత్ అత్యధిక వృద్ధి రేటును సాధిస్తోందని గడ్కరీ చెప్పారు. ఈవీల విక్రయాల్లో 30-40 శాతం పెరుగుదల ఉందని తెలిపారు. కిలో హైడ్రోజన్ ధర 1 డాలర్‌కు రావాలన్నది తన కలని పేర్కొన్నారు. వాహనాలు పరస్పరం ఢీ కొట్టుకునే ప్రమాదాన్ని ఏఐ సాయంతో గుర్తించి, బ్రేకులు వేసే విధానాన్ని తెచ్చే అంశంపై ఐటీ మంత్రిత్వశాఖతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం అవసరమైన ఫ్రీక్వెన్సీని కేటాయించాలని కోరుతున్నట్లు తెలిపారు. ప్రపంచానికి భారత్ ప్రస్తుతం ఒయాసిస్‌లా మారిందని సదస్సులో పాల్గొన్న కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. పరిస్థితులు చక్కబడగానే అమెరికాతో వాణిజ్య చర్చలను పునరుద్ధరిస్తామని చెప్పారు. చైనా నుంచి సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల విషయంలో తమ వైఖరిని సమీక్షించడానికి భారత్ సిద్ధమని గోయల్ తెలిపారు.

వ్యవసాయ చట్టాలను మళ్లీ తేబోం

రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను తిరిగి తెచ్చే ఆలోచన కేంద్రానికి లేదని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. సంస్థాగత సంస్కరణలు, నిర్దిష్ట చర్యల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. మంగళవారం నాటి సదస్సులో వక్తలు వాణిజ్యం, సుంకాలు, కృత్రిమ మేధ, ఇతర ఆధునిక పరిజ్ఞానాలపై మాట్లాడారు. భవిష్యత్‌కు భారత్‌ను సన్నద్ధం చేయడం అనే ఇతివృత్తంపై ఇది సాగింది.



ఇందులో ఏఐ, జనాభాపరమైన ప్రయోజనాలు, మౌలిక వసతులు, వ్యవసాయంపై ప్రధానంగా చర్చలు సాగాయి. ఇందులో కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు, మార్కెట్ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

డేటా సెంటర్లపై జరిగిన చర్చలో నిపుణులు వీటితో భారీగా జరుగుతున్న విద్యుత్ వినియోగం, చల్లబరచడానికి భారీగా వాడుతున్న నీటి గురించి మాట్లాడారు. గ్రీన్ డేటా సెంటర్లపై ప్రధానంగా దృష్టి ఉండాలన్నారు. పునరుత్పాదక ఇంధన ఉపయోగించడం వల్ల ఈ లక్ష్యాన్ని సాధించొచ్చని పేర్కొన్నారు. డేటా కేంద్రాలకు అణు ఇంధనాన్ని వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్ మహేంద్ర దేవ్.. సంస్కరణల ఎజెండాపై మాట్లాడారు.

వీఎస్ఆర్ వెంచర్స్‌పై డీజీసీఏ కొరడా

దిల్లీ: విమానయాన నిబంధనల అమలులో పలు ఉల్లంఘనలు బయటపడటంతో వీఎస్ఆర్ వెంచర్స్‌పై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మంగళవారం కొరడా ఝళిపించింది. ఆ సంస్థకు చెందిన నాలుగు విమానాల గగన విహారాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. వీఎస్ఆర్ వెంచర్స్‌కు చెందిన లియర్‌జెట్-45 విమానం (వీటీ-ఎస్ఎస్‌కే) గత నెల 28న బారామతిలో కూలిపోవడంతో మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా మరో నలుగురు మృతిచెందారు. ఈ ఘటన నేపథ్యంలో డీజీసీఏ ఆదేశాల మేరకు సంస్థలో ప్రత్యేక భద్రతా తనిఖీలు చేపట్టిన ఆడిట్ బృందం.. ఎయిర్‌సేఫ్టీ, ప్రయాణ యోగ్యత, ప్రయాణ కార్యకలాపాల వంటి అంశాల్లో నిబంధనలను అమలు చేయడంలో లోపాలను గుర్తించింది. నిబంధనలను సంపూర్ణంగా అమలు చేసేవరకు వీటీ-వీఆర్ఏ, వీటీ-వీఆర్ఎస్, వీటీ-వీఆర్‌వీ, వీటీ-టీఆర్ఐ రిజిస్ట్రేషన్లు ఉన్న లియర్‌జెట్-40/45 విమానాల గగన విహారాన్ని నిషేధించింది.

క్రికెట్‌లో టీనేజర్ల గొడవ

బాలుడి మృతి; ముగ్గురి అరెస్టు

దిల్లీ: పశ్చిమ దిల్లీలోని తిలక్‌నగర్‌లో క్రికెట్ ఆడుకుంటున్న పిల్లల మధ్య వివాదం ముదిరి దాడికి దిగడంతో నిశాంత్ (15) అనే బాలుడు మృతిచెందినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. స్థానికపార్కులో సోమవారం క్రికెట్ ఆడుతూ నిశాంత్, మరో బాలుడు (12) వాదులాడుకున్నారు. ఆ బాలుడు ఇంటికి వెళ్లి 13.. 17 ఏళ్ల వయసున్న తన కజిన్స్‌ను వెంటబెట్టుకొని వచ్చాడు. వీరు ఇంట్లో ఉన్న నిశాంత్‌ను బయటకు పిలిచి దూరంగా తీసుకువెళ్లి దాడికి పాల్పడ్డారు. మెడ విరిగి స్పృహతప్పి పడిపోయిన నిశాంత్‌ను కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిశాంత్ తండ్రి స్థానికంగా టీ విక్రయిస్తారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తిలక్ నగర్ పోలీసులు నిందితులు ముగ్గురినీ అరెస్టు చేశారు.

ఇరాన్‌పై అమెరికా దాడి చేసినా స్పందించొద్దు

హెజ్‌బొల్లాకు లెబనాన్ సూచన

జెనీవా: అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించొద్దని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపునకు లెబనాన్ ప్రభుత్వం సూచించింది. ఈ యుద్ధం జరిగితే మళ్లీ ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య ఘర్షణ తలెత్తే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో లెబనాన్ విదేశాంగశాఖ మంత్రి యూసఫ్ రాజ్జీ మంగళవారం కొంత మంది మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. మళ్లీ ఘర్షణ తలెత్తితే లెబనాన్‌లోని పౌర అవాసాలపై ఇజ్రాయెల్ బలమైన దాడులు చేస్తుందని, మౌలిక వసతులు దెబ్బతింటాయని ఆయన వివరించారు.

అద్దె విమాన సంస్థలకు కఠిన నిబంధనలు

ప్రకటించిన డీజీసీఏ

దిల్లీ: భద్రతా వైఫల్యాల కారణంగా జరిగే విమాన ప్రమాదాలకు కేవలం పైలట్లనే బాధ్యుల్ని చేయడం సరికాదని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మంగళవారం స్పష్టం చేసింది. విమానాలను అద్దెకు నడిపే నాన్ షెడ్యూల్డు ఆపరేటర్ (ఎన్ఎస్ఓపీ) సంస్థల కోసం రూపొందించిన కఠిన నిబంధనల్ని ఈ సందర్భంగా ప్రకటించింది. ఆడిట్ ప్రక్రియను కఠినతరం చేయడం, భద్రతా ప్రమాణాల అమలుకు సంబంధించి విమాన సంస్థలకు ర్యాంకులు ఇవ్వడం వంటి అనేక చర్యలను వెల్లడించింది. ఇటీవల బారామతిలో మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనలో మరణించిన విషయం మరువకముందే ఝార్ఖండ్‌లో మరో అద్దె విమానం ప్రమాదానికి గురై ఏడుగురు మృతిచెందిన నేపథ్యంలో డీజీసీఏ నాన్ షెడ్యూల్డు విమాన ఆపరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఎన్ఎస్ఓపీ సంస్థలు నడిపే అద్దె విమానాలు ప్రమాదానికి గురైనప్పుడు.. ప్రమాదానికి దారితీసిన కారణాలకు సంస్థల ఉన్నతాధికారులను వ్యక్తిగతంగా బాధ్యులుగా ప్రకటిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

ఉక్రెయిన్‌కు బ్రిటన్, ఫ్రాన్స్ అణ్వాయుధాలు!


రష్యా ఆరోపణ

మాస్కో: అణ్వాయుధాలను ఉక్రెయిన్‌కు తరలించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ కుట్ర పన్నుతున్నాయని రష్యా ఆరోపించింది. ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. రష్యా విదేశీ నిఘా విభాగం (ఎస్‌వీఆర్) మంగళవారం ఒక నివేదికను ఉటంకిస్తూ ఈ వివరాలను వెల్లడించింది. అయితే ఈ తరలింపునకు సంబంధించిన ఆధారాలను అది బయట పెట్టలేదు.

ఝార్ఖండ్, ఒడిశాల నుంచి న్యాయాధికారులు

- బెంగాల్‌లో 'సర్' తనిఖీలకు సుప్రీంకోర్టు అనుమతి

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా వచ్చిన 80 లక్షల క్లెయింలు, అభ్యంతరాలను పరిశీలించేందుకు ఝార్ఖండ్, ఒడిశాల నుంచి న్యాయాధికారులను నియమించేందుకు సుప్రీం కోర్టు అనుమతించింది. క్లిష్ట పరిస్థితులను, సమయాభావాన్ని పరిగణనలోకి తీసుకుని పొరుగు రాష్ట్రాల నుంచి సివిల్ జడ్జీలను, న్యాయాధికారులను తీసుకొచ్చేందుకు కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి మంగళవారం ఈ అనుమతిని మంజూరు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. అంతకు ముందు సర్ అభ్యంతరాల పరిశీలనకు 250 మంది న్యాయాధికారులను నియమించామని, 80 లక్షల దరఖాస్తులను పరిశీలించాలంటే 80 రోజులు పడుతుందని సుప్రీం కోర్టుకు కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేఖ రాశారు. దీంతో పొరుగు రాష్ట్రాల ప్రధాన న్యాయమూర్తులను సంప్రదించి న్యాయాధికారులను తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. అందుకయ్యే ఖర్చులను ఎన్నికల సంఘం భరించాలని ఆదేశించింది. ఈ నెల 28వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు ఎన్నికల సంఘానికి అనుమతించింది.



నాయకుల నాణ్యత నోటాతో మెరుగుపడిందా?

- ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో 'నోటా' సదుపాయం.. ఎన్నికైన నాయకుల నాణ్యత మెరుగుదలకు దోహదపడిందా అని సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. బరిలో ఒకే అభ్యర్థి ఉన్నప్పుడు నోటా సదుపాయానికి వీలు లేకుండా చేసే నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం విచారణ నిర్వహించింది. ఒక స్థానం కోసం పోటీకి నిలిచిన అభ్యర్థుల సంఖ్య ఒక్కటా లేదా అంతకన్నా ఎక్కువా అన్న విషయంతో ప్రమేయం లేకుండా నోటా సదుపాయాన్ని తప్పనిసరిగా అమలుచేయాలని పిటిషన్‌దారు పిల్‌లో అభ్యర్థించారు. 'ఎన్నికైన అభ్యర్థుల నాణ్యతను నోటా పెంచిందా' అని విచారణ సందర్భంగా జస్టిస్ బాగ్చీ ప్రశ్నించారు. నోటాకు అత్యధిక ఓట్లు వచ్చినా అది సీట్లను భర్తీ చేయలేదని గుర్తుచేశారు. మంచి అభ్యర్థులు ఎన్నికల్లో విజయం సాధించడానికి వీలుగా అందరూ తప్పనిసరిగా ఓటింగులో పాల్గొనేలా నియమం ప్రవేశపెట్టాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసుపై తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 17కు వాయిదా వేసింది.



పోఖ్రాన్‌లో సైన్యం 'అగ్ని వర్ష' విన్యాసాలు

దిల్లీ: యుద్ధ సామర్థ్యాలను, సన్నద్ధతను చాటిచెప్పేలా రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారుల్లో సైన్యం మంగళవారం 'అగ్ని వర్ష' పేరుతో భారీ విన్యాసాలు నిర్వహించింది. సైన్యంలోని సదరన్ కమాండ్ బలగాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ విన్యాసాల్లో మానవరహిత గగనతల వాహనాలు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, ఆధునిక ఆర్టిల్లరీ ప్లాట్‌ఫాంలు, నిఘా వ్యవస్థలను ఎక్కువగా ప్రదర్శించారు. 25 దేశాలకు చెందిన విదేశీ పాత్రికేయులు వీటిని వీక్షించారు.

భారత్, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాల ప్రారంభం

హిమాచల్‌లోని బక్లోహ్‌లో భారత్, అమెరికా సైన్యాలు 16వ విడత సంయుక్త మిలిటరీ విన్యాసాలను మంగళవారం ప్రారంభించాయి. మూడు వారాలపాటు ఇవి కొనసాగనున్నాయి. పర్వతాలతో కూడిన ప్రాంతాల్లో సంయుక్త బలగాల ఆపరేషన్లను చేపట్టే సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడంపై ఇందులో దృష్టిపెట్టనున్నట్లు సైన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది.

పోలింగ్ రోజున పోలీసులకూ జంబ్లింగ్

దిల్లీ: పోలింగ్ ప్రక్రియలో మరింత పారదర్శకత కోసం ఎన్నికల సంఘం (ఈసీ) మరిన్ని చర్యలు చేపట్టింది. నియోజకవర్గాల్లో పోలీసులను జంబ్లింగ్ పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించింది. ఈ అధికారం కేంద్ర పోలీసు పరిశీలకులకు ఉంటుంది. పోలింగ్ రోజున కేంద్ర పరిశీలకుల సమక్షంలో ఈ పద్ధతిని అనుసరించనున్నారు. దీనివల్ల తటస్థ పరిస్థితులతో పాటు స్థానిక పోలీసులను వారికి సంబంధం లేని ప్రాంతాలకు కేటాయించనున్నారు. ఈ అంశంపై సోమవారం ప్రధాన ఎన్నికల అధికారులకు (సీఈవో), డీజీపీలకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. 'గతంలో పోలీసుల కేటాయింపును జిల్లాల ఎస్పీలు చేపట్టేవారు. ఇక నుంచి దానిని కేంద్ర పరిశీలకుల ఆధ్వర్యంలో చేయాల్సి ఉంటుంది' అని ఈసీ అధికారి ఒకరు తెలిపారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లలో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

మార్చి 13 నుంచి 15 వరకు ఆరెస్సెస్ కీలక సమావేశాలు

దిల్లీ: ఆరెస్సెస్‌లో కీలక నిర్ణయాలు తీసుకునే అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్) సమావేశాలు వచ్చే నెల జరగనున్నాయి. రానున్న ఏడాది పాటు చేపట్టాల్సిన కార్యక్రమాల రూపకల్పనతో పాటు అనేక అంశాలపై ఇందులో చర్చించనున్నారు. హరియాణాలోని సమల్‌ఖాలో మార్చి 13 నుంచి 15 వరకు ఈ సమావేశాలు జరుగుతాయని, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె అధ్యక్షత వహిస్తారని సంస్థ అధికార ప్రతినిధి సునీల్ అంబేకర్ వెల్లడించారు. 'ఈ సమావేశాలకు 1489 ఆరెస్సెస్ కార్యకర్తలు, ప్రతినిధులు, ప్రాంతీయ కార్యాలయాల పదాధికారులు, భాజపా సహా 32 ఆరెస్సెస్ అనుబంధ సంస్థల ప్రతినిధులు హాజరవుతారు' అని వివరించారు.

మేరఠ్‌లో భారీ అగ్నిప్రమాదం

ఐదుగురు చిన్నారులు సహా ఆరుగురి మృతి

మేరఠ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఓ ఇంట్లో సోమవారం రాత్రి ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతిచెందారు. వారిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల్లో నాలుగు నెలల కవలలు ఉన్నారు. ప్రమాదంలో ఓ మహిళ గాయపడ్డారు. వ్యాపారం నిమిత్తం ఇంట్లో దుస్తులను భారీఎత్తున నిల్వ చేయడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని పోలీసులు తెలిపారు.

ఏఐ సదస్సు నిరసనల కేసులో

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి అరెస్టు



దిల్లీ: ఏఐ సదస్సులో చొక్కాలు విప్పి నిరసన చేపట్టిన వ్యవహారంలో భారతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను పోలీసులు అరెస్టుచేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారిసంఖ్య ఎనిమిదికి చేరింది. నిరసనలపై దాదాపు 20 గంటల పాటు విచారించిన తర్వాత చిబ్‌ను అరెస్టు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఈ నెల 20న కొందరు యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు చొక్కాలు విప్పి, కేంద్ర ప్రభుత్వానికి, అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. నిరసన ప్రణాళికల్లో చిబ్ కీలక పాత్ర పోషించారనే ఆధారాలను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు అనంతరం ఆయనను పటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. వారం రోజుల కస్టడీకి ఇవ్వాల్సిందిగా కోర్టును పోలీసులు కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం చిబ్‌ను నాలుగురోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. వాస్తవాలను ప్రజల ముందుకు తెచ్చిన చిబ్, పార్టీ ఇతర కార్యకర్తలను అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ పిరికితనానికి, నియంతృత్వ ధోరణులకు నిదర్శనమని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తలవంచిన ప్రధాని మోదీ తమని, తమ పార్టీ యువ నేతలను అరెస్టులతో బెదిరించేందుకు యత్నిస్తున్నారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మరోవైపు, ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే సిగ్గు మాలిన చర్య అని, ఈ నిరసనల ప్రధాన సూత్రధారి రాహుల్ గాంధీ అని భాజపా ఆరోపించింది. యువజన కాంగ్రెస్ చర్య క్షమించరానిదంటూ మాజీ న్యాయవాదులు సహా 277 మంది ప్రముఖులు సంయుక్త ప్రకటనను విడుదల చేశారు.

అవినీతి, పెండింగ్ కేసులు న్యాయవ్యవస్థకు సవాళ్లు

- ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకంలో కొత్త అధ్యాయాలు


దిల్లీ: భారీస్థాయిలో అపరిష్కృతంగా ఉన్న వ్యాజ్యాలు, అవినీతి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉండటం వంటి అంశాలు భారత న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లుగా ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకం పేర్కొంది. ఎనిమిదో తరగతి కోసం రూపొందించిన కొత్త సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో ఈ విషయాలను చేర్చింది. పాత సిలబస్‌లో ఎక్కువగా కోర్టుల నిర్మాణం, అవి నిర్వహించే విధుల గురించే ఉండేది. 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే విభాగంలో న్యాయమూర్తులు కోర్టులోనే కాదు దాని వెలుపల కూడా ఒక నైతిక నియమావళికి కట్టుబడి ఉండాలని తెలిపింది. 'మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర' అనే శీర్షికతో సవరించిన అధ్యాయంలో.. కోర్టుల సోపాన క్రమం, న్యాయం పొందడం గురించే కాకుండా న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించింది. 'న్యాయవ్యవస్థలో వివిధ స్థాయిలలో ప్రజలు అవినీతిని ఎదుర్కొంటున్నారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచడం పారదర్శకతను మెరుగుపరచడం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో సాంకేతికతను కూడా వినియోగిస్తున్నాయి' అని ఆ అధ్యాయం వివరించింది. సుప్రీంకోర్టులో సుమారు 81 వేలు, హైకోర్టుల్లో 62.40 లక్షలు, జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 4.70 కోట్ల వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయని పాఠ్యపుస్తకం తెలిపింది.

ల్యాండింగ్‌కు ముందు.. సముద్రంలో పడిన హెలికాప్టర్


- ఇద్దరు సిబ్బంది, ఐదుగురు ప్రయాణికులు సురక్షితం



శ్రీవిజయపురం: ఓ హెలికాప్టర్ మరికాసేపట్లో ల్యాండ్ అవుతుందనగా సముద్రంలో పడిపోయిన ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఉన్న ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఇద్దరు సిబ్బంది, ఐదుగురు ప్రయాణికులతో పవన్ హాన్స్ హెలికాప్టర్ అండమాన్‌లోని పోర్ట్‌బ్లెయిర్ నుంచి బయలుదేరింది. మాయాబందర్ రన్‌వేకి దాదాపు 300 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాన్ని పైలట్ సముద్రంలో క్రాష్ ల్యాండింగ్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. హెలికాప్టర్‌లో ఉన్న ఏడుగురిని రక్షించామని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పౌర విమానయాన అధికారులు పేర్కొన్నారు.



ఈనాడు



విజయవాడ 25-2-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 196 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 16 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

SYNDICATE FINANCE

www.syndicatefinance.in

LICENSED
LICENSED
ENTITY

Estd. 1977

BUSINESS LOAN

Against mortgage of immovable property

Long Term & Easy Instalment Facilities.

Pioneering a New Era of
Smart Lending for Corporates & MSMEs



Scan For Details

(022) 6581 0001 / 3565 7754 / 3565 7941

E-mail : info@syndicatefinance.in

428, Rawal Bldg. No. 1,
1st Floor Lamington Road,
Mumbai-400 004

Contact : 11 am to 5 pm

ఈనాడు

విజయవాడ 25-2-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 196
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కల్తీ పాల ఘటనలో బాలుడి మృతి

రాజమహేంద్రవరంలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య!

ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

ఆ పాలు ప్రమాదకరమని బంధువు చెప్పినా పట్టించుకోని వ్యాపారి

నిందితుడు గణేష్‌కు రిమాండ్

12లో

స్పీకర్.. డిప్యూటీ స్పీకర్ 'టగ్ ఆఫ్ వార్'

ఉత్సాహంగా ప్రారంభమైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు

తొలి రోజు నాలుగు విభాగాల్లో తలపడిన ప్రజాప్రతినిధులు

12లో

శ్రీవారి ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర

కల్తీ నెయ్యి సహా మరెన్నో దుర్మార్గాలు

రాజశేఖరరెడ్డి హయాంలోనే కుట్ర మొదలు

జగన్ హయాంలో మరింత అరాచకం

వారు తప్పుచేసి మమ్మల్ని క్షమాపణ చెప్పాలంటున్నారు

తితిదేలో ప్రక్షాళన చేపట్టాం ● భక్తుల సేవకే పెద్దపీట

శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



2017లో శ్రీవారి దర్శనానికి వచ్చిన జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేయలేదు. పార్టీ అధినేత కాబట్టి.. నా ఇష్టం అనే అహంభావంతో, దౌర్జన్యంగా వ్యవహరించారు.

వైకాపా హయాంలో తితిదే ఛైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి భార్య బైబిల్ చేతపట్టుకుని తిరిగారు. మెదక్ చర్చిలో కుమార్తెకు వివాహం చేసిన కరుణాకరరెడ్డికీ ఛైర్మన్ పదవి ఇచ్చారు. ఇదంతా శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలో భాగమే. - చంద్రబాబు

ఈనాడు – అమరావతి

వైకాపా ఐదేళ్ల పాలనలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కృత్రిమ నెయ్యి లాంటి పదార్థాన్ని ఉపయోగించి వేంకటేశ్వరస్వామి పవిత్రతనే దెబ్బతీశారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో జంతుకొవ్వు కలిసిందని న్యాయస్థానంలో సిట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని వివరించారు. 'నెయ్యే కాని నెయ్యి వినియోగించడం అనేది ఒక అంశమే. దీని వెనుక శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే పెద్ద కుట్రకోణమే ఉంది. రాజశేఖరరెడ్డి హయాం నుంచే ఇది మొదలైంది. వైకాపా పాలనలో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ నుంచి నేతల వరకు ఆ అరాచకాలను కొనసాగించారు' అని దుయ్యబట్టారు. 'సిట్ నివేదికకు అనుగుణంగా అధికారులపై చర్యలు తీసుకున్నాక ప్రభుత్వం మౌనంగా ఉంది. అయితే తప్పు చేసిన వైకాపా నేతలు.. మమ్మల్నే క్షమాపణ చెప్పాలంటున్నారు. నీతి, నిజాయతీ కలిగిన మమ్మల్ని దోషులుగా చూపాలని తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. నాలుగు రోజులు శాసనమండలిలో గొడవ చేశారు. రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనపైనా చర్చించకుండా అడ్డుపడ్డారు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంగళవారం కల్తీ నెయ్యి వ్యవహారంపై లఘుచర్చలో చంద్రబాబు మాట్లాడారు. దీనిపై సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. 'చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నాటకాలు ఆపండి, పవిత్రత కాపాడండి. దేవాలయాల జోలికి రావద్దు.. హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు' అని (మిగతా 11లో)

వైకాపా నేతల 'మహాపాపం'

నెయ్యిలో జంతుకొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ నివేదికలో ఉంది

భగవంతుడే ఆ విషయాన్ని నా నోటితో చెప్పించారు 11లో

సిట్ సిఫారసులకు అనుగుణంగానే ఏకసభ్య కమిషన్ వేశాం

అసెంబ్లీలో ప్రజంటేషన్ ద్వారా వివరించిన చంద్రబాబు

దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందే

నాటి తితిదే పాలకమండలిదే బాధ్యత

- వారిని వెనకేసుకొస్తే గత ప్రభుత్వ ముఖ్యుడూ బాధ్యుడే
- దేవుడి సొమ్ము దోచేసినవారి తరాలే లేచిపోతాయ్
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఉపముఖ్యమంత్రి

గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడారని అన్ని నివేదికల్లో తేలినా, అందుకు బాధ్యులను గత ప్రభుత్వ ముఖ్యుడు ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్థం కావట్లేదని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. భగవంతుడి సొమ్ముతో ఆడుకున్న (మిగతా 11లో)

దర్యాప్తు అధికారి ముందు వెంటనే లొంగిపోండి

- అరెస్ట్ నుంచి రక్షణ కుదరదు
- ఎయిర్‌పోర్టులో మీకు రెడ్‌కార్పెట్ వేయలేం
- మద్యం కేసులో నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, విదేశాల్లో దాక్కున్న ముప్పిడి అవినాష్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. వెంటనే వచ్చి దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించడానికి నిరాకరించింది. మద్యం కుంభకోణంలో ఏ7గా ఉన్న తనకు ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు జనవరి 29న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిల నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. ఈ కేసులో తొలుత పిటిషనర్ అవినాష్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. ఈ కేసులో ఇప్పటికే పిటిషనర్ సోదరుడు జైల్లో ఉన్నారని, ఛార్జిషీట్ కూడా దాఖలైందని, విదేశాల నుంచి తిరిగి రావాలని నిర్దేశిస్తూ ఎల్వోసీ కూడా జారీచేశారని (మిగతా 2లో)



అవినాష్‌రెడ్డి




డబ్బున్న వాళ్లు సొంత భద్రత ఏర్పాటుచేసుకోండి

- వైకాపా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి సుప్రీంకోర్టు సూచన
- పోలీసు భద్రత హోదాగా మారిందని, దాని కోసం ప్రభుత్వ ధనం ఎందుకని వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: 'మీరు డబ్బున్నవాళ్లు.. ప్రైవేటు భద్రత ఏర్పాటుచేసుకోండి' అని వైకాపా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఈ రోజుల్లో పోలీసు భద్రత అన్నది హోదాగా మారిందని, దానికోసం ప్రభుత్వధనం ఎందుకు ఖర్చుపెట్టాలని ప్రశ్నించింది. తనకు రాష్ట్రప్రభుత్వం 2+2 భద్రతను తొలగించడాన్ని సవాల్‌చేస్తూ కాటసాని దాఖలుచేసిన పిటిషన్‌పై మంగళవారం విచారించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది. తొలుత పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పరమేశ్వర్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ కుటుంబసభ్యుల్లో ఆరుగురు హత్యకు గురైన విషయాన్ని విస్మరించి.. రాష్ట్రప్రభుత్వం తన ప్రత్యర్థులకు భద్రత కల్పించి తనకు తీసేసిందని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. గత ఏప్రిల్‌లో కాటసాని ప్రాణాలకు ముప్పు ఉందని చెప్పి పోలీసులు గృహనిర్బంధం చేశారని, అందుకే రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. (మిగతా 2లో)



రాంభూపాల్‌రెడ్డి



కేరళ ఇక.. కేరళం

ప్రజా సాధికారతకు కేంద్రం సేవా తీర్థ్

జనపనార మద్దతు ధర రూ.275 పెంపు

కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

దిల్లీ: దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరును 'కేరళం'గా మార్చేదిశగా కీలక అడుగుపడింది. సుదీర్ఘకాలం పెండింగులో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి కార్యాలయం కొత్త భవనం 'సేవాతీర్థ్'లో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తీసుకుంటారు. తర్వాత బిల్లును కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెడుతుంది. ఆమోదానికి సాధారణ ఆధిక్యం సరిపోతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో అధికారికంగా పేరు మారుతుంది. (మిగతా 2లో)

పెట్టుబడులకు రైట్ రైట్

ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం

'నీరు-చెట్టు' పనులు చేసినవారిపై కేసుల ఉపసంహరణ

వైకాపా హయాంలో కక్షసాధింపుతో పెట్టిన కేసులూ..

ఉన్నతవిద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖల పునర్వ్యవస్థీకరణ

మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

దివ్యాంగులకూ ఉచిత బస్సు ప్రయాణం



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ప్రతిపాదనలతో వచ్చిన సంస్థలకు భూకేటాయింపులు, రాయితీలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇందుకు సంబంధించి ఈ నెల 18న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను ఆమోదించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద లిథియం అయాన్ సెల్ గిగా పరిశ్రమ, నాయుడుపేట వద్ద లిథియం అయాన్ బ్యాటరీ ప్రాసెసింగ్ పరిశ్రమ, విశాఖ జిల్లా తర్లువాడలో అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ ఫెసిలిటీ వంటి సంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపు, పెట్టుబడులకు సమ్మతి తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. 2014-19 మధ్య చేసిన నీరు- చెట్టు పనులకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సిఫారసుల మేరకు అటవీశాఖ అధికారులపై చేపట్టిన క్రమశిక్షణ చర్యలు, కొందరు జలవనరులశాఖ ఇంజినీర్లు, జన్మభూమి-మాఊరు కమిటీ సభ్యులు, (మిగతా 2లో)

జ్యోతిష్కుడికి 200 ఏళ్ల జైలుశిక్ష

ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన కేసులో కోర్టు తీర్పు



రామకృష్ణన్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన కేసులో జ్యోతిష్కుడికి 200 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తమిళనాడులోని శివగంగై పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. 2021 నవంబరులో ఓ మహిళ తన 14, 17 ఏళ్ల వయసున్న కుమార్తెలు సరిగా చదవడం లేదని శివగంగై జిల్లా కారైక్కుడికి చెందిన జ్యోతిష్కుడు రామకృష్ణన్(52) వద్దకు తీసుకెళ్లారు. వారికి పరిహారం చేయాలని మహిళకు చెప్పి, ఆమె ఇద్దరు కుమార్తెలను ఓ గదిలోకి తీసుకెళ్లి నిందితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే తల్లిదండ్రులు చనిపోతారని బెదిరించడంతో బాలికలు మిన్నకుండిపోయారు. కొద్దిరోజులకు ఇద్దరూ అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వారికి లైంగిక సంక్రమణ వ్యాధి (మిగతా 2లో)



తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దామోదర్, రాజిరెడ్డి, దేవ్‌జీ, గంగన్న (తెల్లచొక్కాలు ధరించిన వారు)

ఆ నలుగురూ వచ్చేశారు

- దేవ్‌జీ సహా అగ్రనేతల లొంగుబాటు
- మావోయిస్టు పార్టీ చరిత్రలో కీలక పరిణామం
- ఇక పొలిట్‌బ్యూరోలో మిగిలింది ఒక్కరే
- లొంగిపోయిన నలుగురిదీ ఆర్ఎస్‌యూ నేపథ్యమే..

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ చరిత్రలో అత్యంత కీలక లొంగుబాటు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్ముదాదా (62), కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ (76), తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (47), రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న (62) మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతి, ఆపరేషన్స్ అదనపు డీజీపీ అనిల్‌కుమార్, గ్రేహౌండ్స్ ఎస్పీ రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సుదీర్ఘ ప్రస్థానం

దేవ్‌జీ 44 ఏళ్లు, సంగ్రామ్ 46 ఏళ్లు, దామోదర్ 28 ఏళ్లు, గంగన్న 36 ఏళ్లు పార్టీతో కొనసాగించిన అనుబంధం.. ఈ లొంగుబాటుతో ముగిసింది. ఈ సందర్భంగా ఎలాంటి ఆయుధాల్ని ప్రదర్శించకపోవడం గమనార్హం. పార్టీలో ప్రస్తుతం ఒకే ఒక్క పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్‌బెస్రా అలియాస్ సునిర్‌మాల్ మాత్రమే మిగిలారు. తెలంగాణ నుంచి అజ్ఞాతంలో ఉన్నవారు 11 మంది మాత్రమే. (మిగతా 2లో)

7.85 లక్షల ఎకరాలకు ఫ్రీహోల్డ్

పచ్చజెండా ఊపిన జీవోఎం 3లో

ఇదీ సంగతి!



పరీక్ష ఓ ఆట గెలుపు మన బాట!

పరీక్షలంటే పాస్, ఫెయిల్ లెక్కలు కాదు...
జీవన్మరణ సమస్యగా చూస్తున్న రోజులివి.
తల్లిదండ్రుల ఆశలు, టీచర్ల టార్గెట్లు...
వెరసి విద్యార్థి మెదడును ప్రెషర్ కుక్కర్‌లా మార్చేస్తున్నాయి.
ఫలితం.. నిద్ర లేని రాత్రులు, తెలియని భయాలు.
అయితే 'పరీక్ష అనేది ఒక ఆట మాత్రమే..
సరైన ప్రణాళిక ఉంటే ఒత్తిడిని చిత్తు చేసి
విజయాన్ని అలవోకగా సాధించొచ్చు' అంటున్నారు
తిరుపతి రుయాలో మానసిక వైద్యులు డాక్టర్ మానస.
పరీక్షల్లో రాణించాలంటే విద్యార్థులు,
తల్లిదండ్రులు తక్షణం పాటించాల్సిన సూచనలు ఇవిగో..

ప్రస్తుతం 14 నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో (తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు) సుమారు 30 నుంచి 40 శాతం మంది తీవ్రమైన ఆందోళనతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రులు, టీచర్లు విధిస్తున్న అవాస్తవిక లక్ష్యాలే. 'నీకు ర్యాంకు రావాలి.. లేకపోతే వేస్ట్' అనే మాటలు పిల్లలను మానసికంగా కుంగదీస్తున్నాయి. దీనివల్ల పిల్లలు పరీక్షలంటేనే భయపడిపోతున్నారు. పరీక్ష గదిలోకి వెళ్లగానే చదివిందంతా మర్చిపోవడం, గుండెదడ లాంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ధోరణిని మార్చాల్సిందే తల్లిదండ్రులే...



● **7డే- రూల్:** పరీక్షల కోసం గంటల తరబడి చదవడం కాదు.. 'స్మార్ట్'గా చదవడం ముఖ్యం. సరైన ప్రణాళిక, వ్యూహం ఉంటే సులువుగా విజయాన్ని చేరుకోవచ్చు. రెండు నెలల టైం టేబుల్ ఒకేసారి వేసుకుంటే ఎవరూ పాటించలేరు. కేవలం ఒక వారం (సోమవారం నుంచి శనివారం వరకు) షెడ్యూల్ వేసుకోండి. అందులో కష్టమైన సబ్జెక్టును (గణితం లేదా సైన్స్) ఎంచుకోండి. ఆ టార్గెట్ పూర్తయ్యాకే.. తర్వాత వారం ప్లాన్ చేయండి..

● **నిద్రే మీ బలం:** ఏడాదంతా చదివి, పరీక్ష ముందు రోజు నిద్రపోకపోతే బ్రెయిన్ మొరాయిస్తుంది. కనీసం 7- 8 గంటల నిద్ర తప్పనిసరి. నిద్రలోనే మన బ్రెయిన్ రిపేర్ అవుతుంది.

● **పొమిడారో టెక్నిక్:** గంటల తరబడి చదవడం కాదు.. 25 నిమిషాలు చదివితే.. 5 నిమిషాల బ్రేక్ తీసుకోవాలి. అలా సుదీర్ఘంగా చదివాక, 15 నుంచి 20 నిమిషాలు విరామం ఇవ్వాలి. దీనివల్ల ఎక్కువ సేపు ఏకాగ్రత ఉంటుంది.

● **గుర్తుంచుకోడానికో మార్గం:** 'నాకు గుర్తుండటం లేదు' అని భయపడేవారి కోసం ఒక టెక్నిక్ ఉంది. చదివిన దాన్ని ఫ్లో-చార్ట్ రూపంలో లేదా కీ పాయింట్ల రూపంలో పేపర్‌పై పెట్టండి. సినిమా చూసినట్లు కాకుండా, రాస్తూ.. చదివితే మెదడులో నిక్షిప్తం అవుతుంది.

అమ్మా, నాన్నా.. మీకోసం!

పిల్లలు పరీక్షల్లో గెలవాలంటే.. ముందు ఇంట్లో వాతావరణం బాగుండాలి. వారిలో స్థైర్యం పెంచేలా తల్లిదండ్రులే ఊతం ఇవ్వాలి.

● **ఆ ప్రశ్న అడగొద్దు:** సాయంత్రం ఇంటికి రాగానే 'ఈరోజు ఎన్ని పాఠాలు చదివావ్' అని అడగకండి. 'ఈరోజు స్కూల్లో ఎలా గడిచింది.? ఫ్రెండ్స్‌తో ఆడుకున్నావా..? భోజనం చేశావా..?' అని అడగండి.. దీనివల్ల వారికి 'మా అమ్మానాన్నలకు నా చదువు కంటే నేనే ముఖ్యం' అనే భరోసా వస్తుంది.

● **పోలిక వద్దు:** పక్కింటి పిల్లలతో మీవాళ్లను పోల్చకండి. ప్రతి విద్యార్థీ యూనిక్ అని గుర్తుంచుకోండి.

● **జీవితంలో గెలవాలి:** మార్కులు జీవితాన్ని నిర్ణయించలేవు. కేవలం సీటు కోసమే పనికొస్తాయి తప్ప, జీవితంలో గెలిచేందుకు కాదు. ఫెయిలైనా పర్లేదు, మళ్లీ రాసుకోవచ్చు ఆ ధైర్యాన్ని మీ పిల్లలకు ఇవ్వండి.. ఓటమి దరిచేరకుండా ఊతమివ్వండి.. ఆ ధైర్యమే వారిని విజేతలుగా నిలబెడుతుంది.

చివరిగా.. పరీక్ష అనేది మీ సామర్థ్యాన్ని కొలిచే సాధనం మాత్రమే.. అదే మీ జీవితం కాదని గుర్తుంచుకోండి.. ఆల్ ది బెస్ట్..!

-ఈనాడు డిజిటల్, తిరుపతి



బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

త్వరలో ప్రారంభించనున్న కేంద్రం

దిల్లీ: మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తోపాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టేందుకు కేంద్రం నడుం బిగించింది. త్వరలో దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఇందులో భాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనుంది. (మిగతా 2లో)

దర్యాప్తు అధికారి ముందు వెంటనే లొంగిపోండి

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తును దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ అవినాష్‌రెడ్డి విదేశాలకు ఎప్పుడు వెళ్లారని ప్రశ్నించారు. 2025 ఫిబ్రవరిలో వెళ్లారని, ఛార్జిషీట్ జులై 19న దాఖలుచేశారని సిద్ధార్థ దవే చెప్పారు. 2024 ఆగస్టు నుంచి 2025 జనవరి వరకూ ఆయన దర్యాప్తునకు సహకరించారని పేర్కొన్నారు. సీజేఐ సూర్యకాంత్ స్పందిస్తూ 'దాదాపు ఏడాది నుంచి పరారీలో ఉన్నారు కదా? విదేశాలకు వెళ్లడానికి మీకు ఏ కోర్టు అనుమతి ఇచ్చింది? ఇప్పుడు ఏ దేశంలో ఉన్నారు' అని ప్రశ్నించారు. పిటిషనర్ విదేశాలకు వెళ్లేటప్పటికి నిందితుడిగా లేడని, ఆయన్ను 2025 ఏప్రిల్ 22న నిందితుడిగా చేర్చారని, ప్రస్తుతం ఆయన శ్రీలంకలో ఉన్నారని దవే వెల్లడించారు.

చట్టాన్ని ఏమార్చడానికి ప్రయత్నించే మీకెందుకు రక్షణ ఇవ్వాలి?

అవినాష్‌రెడ్డి కస్టోడియల్ విచారణ అవసరమన్న కారణంతో హైకోర్టు ముందస్తు బెయిలును నిరాకరించిందని, అయితే ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైనందున కస్టోడియల్ విచారణ అవసరం లేదని దవే పేర్కొన్నారు. సీజేఐ స్పందిస్తూ 'మీరు (అవినాష్‌రెడ్డి) ఇలా చట్టాన్ని ఏమార్చడానికి ప్రయత్నించినప్పుడు మేమెందుకు రక్షణ కల్పించాలి? మీ సోదరుడు ఇప్పటికే అరెస్టయిన విషయం మీకు తెలుసు. మిమ్మల్ని కూడా నిందితుడిగా చేర్చారని తెలిసిన వెంటనే పారిపోయారు' అని పేర్కొన్నారు. సిద్ధార్థ దవే స్పందిస్తూ పిటిషనర్ 26వ తేదీన విదేశాల నుంచి రావడానికి సిద్ధంగా ఉన్నారని, అందువల్ల దర్యాప్తు అధికారులు ఎల్‌ఓసీని సస్పెండ్ చేయాలని కోరారు. అందుకు సీజేఐ నిరాకరించారు. ఎయిర్‌పోర్టులో మీకు రెడ్ కార్పెట్ పరవడం కుదరదు, వెంటనే లొంగిపోండి అని తేల్చిచెప్పారు. పిటిషనర్ లొంగిపోయేందుకు అవకాశం ఉండదని, ఎయిర్‌పోర్టులోనే అరెస్ట్ చేస్తారని ఆయన న్యాయవాది అన్నారు. 'అరెస్ట్ చేయనివ్వండి' అని సీజేఐ స్పష్టం చేశారు. పిటిషనర్ వచ్చి కోర్టు ముందు లొంగిపోతారని న్యాయవాది కోరినా సీజేఐ తిరస్కరించారు. అతనికి అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించడం లేదని స్పష్టం చేశారు. అవినాష్‌రెడ్డి భారత్‌కు తిరిగి వచ్చిన వెంటనే దర్యాప్తు అధికారి ముందు లొంగిపోవాలని ఆదేశించారు. ఆ తర్వాత అతని రెగ్యులర్/ మధ్యంతర బెయిల్‌ను చట్టప్రకారం పరిశీలిస్తామని స్పష్టం చేశారు. కేసు తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేశారు.

జ్యోతిష్కుడికి 200 ఏళ్ల జైలుశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

సోకినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కుమార్తెలను గట్టిగా అడగ్గా.. జ్యోతిష్కుడు అత్యాచారం చేసినట్లు చెప్పారు. అనంతరం తల్లి ఫిర్యాదు మేరకు తిరుపత్తూర్ ఆల్ ఉమెన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామకృష్ణన్‌ని అరెస్టుచేశారు. ఈ కేసు విచారణ శివగంగై పోక్సో కోర్టులో సోమవారం ముగిసింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి 200 ఏళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానాతో పాటు బాధితులకు రూ.10లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని జడ్జి ఉత్తర్వులు జారీచేశారు.

ఆ నలుగురూ వచ్చేశారు

(మొదటి పేజీ తరువాయి)

తాజా లొంగుబాటు.. మావోయిస్టులపై లభించిన ప్రధాన విజయమని తెలంగాణ పోలీసులు ప్రకటించారు. దీంతో మావోయిస్టు పార్టీ శకం చివరి దశకు చేరినట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీకి ఏడాది కాలంగా సారథ్యం కరవైందని తేలింది. గత ఏడాది పార్టీ చీఫ్ బస్వరాజ్ మృతిచెందిన అనంతరం.. దేవ్‌జీ చీఫ్‌గా వ్యవహరించారనే ప్రచారం జరిగినా, అది వాస్తవం కాదని డీజీపీ వెల్లడించారు.

జగిత్యాల జైత్రయాత్ర ప్రభావంతో..


దేవ్‌జీ

జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన తిరుపతి.. ఇంటర్ చదువుతున్నప్పుడే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ)లో చేరి.. టౌన్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1978 నాటి జగిత్యాల జైత్రయాత్ర ప్రభావంతో 1982లో 'పీపుల్స్‌వార్'లో చేరారు. పార్టీ అగ్రనేత గణపతి సూచనల మేరకు సంగ్రామ్‌తో కలిసి దండకారణ్యానికి వెళ్లారు. 1984-87లో గడ్చిరోలి జిల్లా సిరోంచ దళానికి, 1987-89లో పెరిమిలి దళానికి కమాండర్‌గా పనిచేశారు. 1989లో గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 1991లో పెరిమిలి దళ సభ్యురాలు అరికె జైనీ అలియాస్ సృజనను వివాహం చేసుకున్నారు. 1993లో ఉత్తర గడ్చిరోలి సబ్‌డివిజన్ కార్యదర్శిగా.. 1995లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2001లో కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి కీలకమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) సభ్యుడిగా కొనసాగారు. 2017లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు.

జైలు నుంచి పారిపోయి అజ్ఞాతవాసం..


రాజిరెడ్డి


పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రులపల్లెకు చెందిన రాజిరెడ్డి 1974లో ఆర్‌ఎస్‌యూలో చేరారు. 1976లో కోరుట్ల, జగిత్యాల ప్రాంతాల్లో నిర్మాణ కేసుల్లో అరెస్టయి ఏడాది తర్వాత విడుదలయ్యారు. 1980లోనే పీపుల్స్‌వార్‌లో చేరారు.. 1982లో ఆయన భార్య రత్నమ్మ కూడా ఉద్యమ బాట పట్టారు. రాజిరెడ్డి గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడిగా, కార్యదర్శిగా పనిచేశారు. 1987లో దండకారణ్య కమిటీ తొలి కార్యదర్శిగా నియమితులయ్యారు. ఓ కేసులో అరెస్టయ్యారు.. 1988 ఆగస్టులో ఆదిలాబాద్ సబ్‌జైలు నుంచి పారిపోయి అడవి బాట పట్టారు. 1990లో కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమితుడయ్యారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ), మహారాష్ట్ర కమిటీలకు మార్గనిర్దేశకుడిగా వ్యవహరించారు. 2001లో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళలతో కూడిన సౌతెన్ట్ రీజనల్ బ్యూరోకు ఇన్‌ఛార్జి అయ్యారు. 2007లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నియమితులయ్యాక కేరళలో అరెస్టయ్యారు. రెండేళ్ల తర్వాత విడుదలై అజ్ఞాతంలోకి వెళ్లారు. 2022 నుంచి డీకేఎస్‌జెడ్‌సీ ఇన్‌ఛార్జిగా కొనసాగారు.

పదో తరగతిలోనే ఆర్‌ఎస్‌యూలోకి..


దామోదర్

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన దామోదర్ 1996లో రాయినిగూడెం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సమయంలోనే ఆర్‌ఎస్‌యూలో చేరారు. రెండేళ్ల అనంతరం సమీప బంధువు బడే నాగేశ్వర్‌రావు ప్రోద్బలంతో పీపుల్స్‌వార్‌లో చేరి ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ దళ సభ్యుడిగా పనిచేశారు. 2000లో ఏటూరునాగారం దళ డిప్యూటీ కమాండర్‌గా, 2001లో కొత్తగూడెం-పాల్వంచ ఏరియా కమిటీ కమాండర్‌గా, 2005లో ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ కమిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2006లో ఖమ్మం-కరీంనగర్-వరంగల్ (కేకేడబ్ల్యూ) కమిటీ సభ్యుడిగా, తర్వాత కార్యదర్శిగా పనిచేశారు. 2015లో తెలంగాణ కమిటీ సభ్యుడిగా, 2019లో మిలిటరీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. గత ఏడాది నుంచి తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగారు.

మావోయిస్టులకు రాజకీయ శిక్షణ


గంగన్న

ఏపీలోని ఉమ్మడి గుంటూరు జిల్లా కాకుమాను మండలం వల్లూరుకు చెందిన గంగన్న.. నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ చదువుతున్న సమయంలో 1987లో ఆర్‌ఎస్‌యూలో చేరారు. 1990లో పీపుల్స్‌వార్ దుర్గి దళానికి ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. 1995లో సౌత్ కోస్టల్ బెల్ట్ కమిటీకి బదిలీ అయి మూడేళ్లు పనిచేశారు. అనంతరం గుంటూరు డివిజనల్ కమిటీ సభ్యుడిగా 2001 వరకు పనిచేశారు. 2002 ఫిబ్రవరిలో విజయవాడలో అరెస్టయ్యి రెండేళ్ల అనంతరం విడుదలయ్యారు. 2005లో ఏపీఎస్‌జెడ్‌సీకి బదిలీ అయి రాజకీయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. 2008లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 2010లో కోల్‌కతాలో అరెస్టయి నాలుగేళ్ల తర్వాత విడుదలై అడవిబాట పట్టారు. 2020లో ఏఓబీ ఎస్‌జెడ్‌సీకి బదిలీ అయ్యారు.. అక్కడి కేడర్‌కు రాజకీయ శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది మే నెలలో తెలంగాణ రాష్ట్ర కమిటీకి బదిలీ అయ్యారు.

పెట్టుబడులకు రైట్ రైట్

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలపై వైకాపా ప్రభుత్వం పెట్టిన కక్షసాధింపు కేసులను ఉపసంహరిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఉన్నతవిద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. కొత్తగా సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆ రంగానికి చెందిన నిపుణుడిని కార్యదర్శిగా నియమించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న పర్యావరణం, అటవీ, శాస్త్ర, సాంకేతికశాఖ పేరు 'పర్యావరణం అటవీశాఖ'గా మార్పు చేసింది. ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్నుల (సవరణ) బిల్లు-2026ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. మోటార్ వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించే లైఫ్ ట్యాక్స్‌పై 10 శాతం అదనపు పన్నును 'రోడ్డు సేఫ్టీ సెస్' పేరుతో విధించేందుకు వీలుగా చట్ట సవరణకు బిల్లు ప్రవేశపెట్టనున్నారు. జాతీయ వన్యప్రాణి బోర్డు సిఫారసుల మేరకు కొల్లేరు వన్యప్రాణి అభయారణ్య సరిహద్దుల్ని క్రమబద్ధీకరించేందుకు కేంద్ర సాధికార కమిటీ అనుమతి కోరాలన్న ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన బడ్జెట్ ప్రసంగానికి ఆమోదం తెలిపింది.

వారికీ ఐదు రకాల బస్సుల్లో ఉచితం

దివ్యాంగులకూ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు... ప్రస్తుతం స్త్రీశక్తి పథకం అమలు చేస్తున్న ఐదు రకాల బస్సు సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తారు. మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ప్రస్తుతం 50 శాతం రాయితీ ఇస్తుండగా... ఇకపై ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తారు. సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఇప్పటికే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నారు. స్త్రీశక్తి పథకం వర్తించని నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో దివ్యాంగులకు ఇస్తున్న 50 శాతం రాయితీ యథావిధిగా కొనసాగుతుంది. దీంతోపాటు మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలివీ..

రాంబిల్లిలో రూ.8,175 కోట్లతో లిథియం అయాన్ సెల్ గిగా ఫ్యాక్టరీ

ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- విశాఖలో ఏర్పాటు చేయనున్న 1000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌కు సంబంధించి అదానీ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్‌ను ఆథరైజ్డ్ నోటిఫైడ్ భాగస్వామిగా పరిగణించాలని గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చేసిన విజ్ఞప్తికి కేబినెట్ ఆమోదం. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు భూములు, ప్రోత్సాహకాల వంటి అంశాలపై ప్రభుత్వంతో ఇకపై అదానీ ఇన్‌ఫ్రా సంస్థ సంప్రదింపులు జరుపుతుంది. ఈ ప్రాజెక్టు కోసం అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని మూడు చోట్ల 601.4 ఎకరాల్ని... వైజాగ్ హైపర్‌స్కేల్, వైజాగ్ మెగా, వైజాగ్ రాంబిల్లి డేటా సెంటర్ పార్క్ పేరుతో ఏర్పాటు చేసే మూడు ఎస్పీవీలకు ప్రభుత్వం బదలాయిస్తుంది.
- అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద 16 గిగావాట్స్ పర్ హవర్ (జీడబ్ల్యూహెచ్‌ఆర్) సామర్థ్యంతో లిథియం అయాన్ సెల్ గిగాఫ్యాక్టరీ ఏర్పాటుకు.. వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 300 ఎకరాల కేటాయింపు. రూ.8,175 కోట్లు పెట్టుబడి పెట్టనున్న సంస్థ. 3 వేల మందికి ఉపాధి. ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేసేందుకు క్యాబినెట్ నిర్ణయం.
- నాయుడుపేట వద్ద లిథియం అయాన్ బ్యాటరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు.. ఎన్ఏఎన్ గ్రీన్‌మెట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 21.36 ఎకరాల కేటాయింపు. ప్రత్యేక ప్రోత్సాహకాలు. రూ.1,366 కోట్ల పెట్టుబడితో 340 మందికి ఉపాధి కల్పించనున్న సంస్థ.
- రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్కులో ఎండీఎఫ్, పార్టికల్ బోర్డు ప్రొడక్షన్ లైన్ ఏర్పాటుకు బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ (యాక్షన్ టెసా) సంస్థకు గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాల్ని పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం. ఆ సంస్థ రూ.1,233 కోట్ల పెట్టుబడితో 1,500 మందికి ఉపాధి కల్పించనుంది.
- ఓర్వకల్లు మండలంలోని గుత్తపాడు క్లస్టర్‌లో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్, ఏపీఐల తయారీ యూనిట్ ఏర్పాటుకు.. సిగాచి ఇండస్ట్రీస్ సంస్థకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఆమోదం.
- విశాఖ జిల్లా తర్లువాడలో అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ ఫెసిలిటీ ఏర్పాటుకు అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ సంస్థకు ఆమోదం. రూ.2,387.81 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించిన సంస్థ. వెయ్యి ఉద్యోగాల కల్పన. ఆ సంస్థకు 30 ఎకరాలు కేటాయిస్తూ, ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పిస్తూ నిర్ణయం.
- సిరిబయోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్, స్కై స్టోరేజ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలకు భూమి కేటాయిస్తూ నిర్ణయం.

తితిదే పోటులో కొత్తగా 18 సూపర్‌వైజర్ పోస్టులు

తితిదేలో లడ్డూ తయారీ కేంద్రం (పోటు)లో 18 సూపర్‌వైజర్ పోస్టులకు అనుమతి. 18 పోర్టు వర్కర్ (సీనియర్) పోస్టుల్ని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఈ పోస్టుల్ని సృష్టిస్తారు.

మరిన్ని వివరాలు: https://epaper.eenadu.netలో

కొత్తగా ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి-శిక్షణ కమిషనరేట్లు

- సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్ రద్దు
- ఉన్నతవిద్యలోకి పాలిటెక్నిక్ కళాశాలలు
- కీలక నిర్ణయాలకు మంత్రిమండలి ఆమోదం

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యాశాఖలో కీలక నిర్ణయానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యాశాఖను పూర్తిగా పునర్వ్యవస్థీకరించింది. ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్, నైపుణ్యాభివృద్ధి- శిక్షణ శాఖ కమిషనరేట్‌లను కొత్తగా ఏర్పాటుచేసింది. ఇప్పటి వరకు ఉన్న సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్‌ను రద్దు చేసింది. సాంకేతిక విద్యాశాఖ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్‌కు అప్పగించింది. ఐటీఐ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, నాక్, సీ డాప్‌లను కలిపి కొత్తగా ఏర్పాటుచేసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణశాఖ కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చింది.

ఉన్నత విద్యామండలి అధికారాలకు కత్తెర

రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఇప్పటివరకు ఉన్న పరిపాలన అధికారాలను తొలగించి ఉన్నతవిద్యా కమిషనరేట్‌కు అప్పగించింది. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ కళాశాలలు ఈ కమిషనరేట్ పరిధిలోకి వస్తాయి. కళాశాలలకు అనుమతులు, నిరభ్యంతర పత్రాల జారీ, పాలనాపరమైన నిర్ణయాలను ఈ కమిషనరేట్ తీసుకుంటుంది. ఉమ్మడి ప్రవేశపరీక్షల ద్వారా నిర్వహించే ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ లాంటి అన్ని కోర్సుల ప్రవేశాల ప్రక్రియను పూర్తిగా ఉన్నతవిద్య కమిషనరేట్ పర్యవేక్షిస్తుంది. ఇప్పటివరకు ఉన్నత విద్యామండలి ఈ బాధ్యతలు చూస్తుండగా.. తాజాగా వీటిని కమిషనరేట్ పరిధికి మార్చుచేసింది. దీనివల్ల డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా కోర్సుల కౌన్సెలింగ్ ప్రక్రియలు ఒకేసారి జరుగుతాయి. దీనివల్ల వేర్వేరు విభాగాలు కౌన్సెలింగ్ నిర్వహించడం లాంటి సమస్యలకు తెరపడుతుంది.

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి పరిధిని ప్రభుత్వం కుదించింది. ఇకపై విద్యా ప్రమాణాలు, పరిశోధనలు, ప్రణాళికలపై దృష్టిసారించేలా అధికారాలను క్రమబద్ధీకరించింది.
- విద్యార్థి చదువు పూర్తికాగానే ఉద్యోగావకాశాలు కల్పించేలా 'విద్యార్థి-ఉద్యోగి' డేటా మేనేజ్‌మెంట్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేయనుంది.

ఎంప్లాయిమెంట్ అధికారి పేరు మార్పు

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులను ఇకపై జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి (డీఈఎస్‌వో)గా పేరు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ శిక్షణ కార్యక్రమాలు సైతం డీఈఎస్‌వో పర్యవేక్షిస్తారు.

బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాక్సిన్ 4 రకాల గర్భాశయ క్యాన్సర్లను నిరోధిస్తుంది. క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నిర్వహించే సార్వజనీన టీకాల కార్యక్రమంలో భాగంగా కాకుండా ఇందుకోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపడతారని అధికారులు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచ స్థాయి వ్యూహంలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ లభిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. 15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డసిల్-4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర.3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మూడు డోసులు తీసుకోవాలి.

గర్భాశయ క్యాన్సర్లు గణనీయంగా తగ్గుముఖం

ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసుగా అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

సంపద సృష్టికి చిట్కా



సంపద సృష్టికి గొప్ప చిట్కా ఉంది. అదేమిటంటే..మీకు దక్కే ప్రతి అదనపు ఆదాయాన్ని పెట్టుబడులుగా మలచడం. ఉదాహరణకు ఉద్యోగంలో మీకు లభించే బోనస్ వంటి వాటిని మదుపులోకి మళ్లించడం. ఇలా క్రమం తప్పక కొనసాగిస్తే.. పదవీ విరమణ నాటికి గొప్ప ఆర్థిక నిధి సమకూరుతుందనడంలో సందేహంలేదు.

– డామ్, ఇన్వెస్టర్

డబ్బున్న వాళ్లు సొంత భద్రత ఏర్పాటుచేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

రెండు ఫ్యాక్షన్ గ్రూప్‌లు ఉన్నప్పుడు ఒకదానికే భద్రత కల్పించకూడదన్నారు. ఆ వాదనలతో న్యాయమూర్తులు ఏకీభవించలేదు. "ప్రస్తుత రోజుల్లో పోలీసుల కంటే ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలే సమర్థ భద్రత కల్పిస్తున్నాయి. అందువల్ల ఖాకీ భద్రత ఉండాలన్న మత్తు నుంచి బయటపడండి. మీరు డబ్బు దృష్ట్యా శక్తిమంతులు. అందువల్ల భద్రత కోసం మీ డబ్బు శక్తిని ఉపయోగించండి. మీ బాధంతా మీకు భద్రత పోయిందని కాదు. మీ ప్రత్యర్థులకు ఇచ్చారన్నదే. ప్రత్యర్థులు నాలుక కోస్తామని బెదిరించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాంటి వ్యాఖ్యలు సాధారణం. అంతమాత్రాన భౌతికంగా కోస్తారని అర్థం కాదు" అని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి పదాలను సాధారణంగా వాడుతుంటారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. 'భద్రత అన్నది పాలసీకి సంబంధించింది కాదు. అది ముప్పును బట్టి కల్పించేది. ప్రతి పౌరుడి స్వేచ్ఛ, ప్రాణాలకు రక్షణ కల్పించడం రాజ్యం బాధ్యత. దానికి మీరైనా, ఇతర పౌరులైనా ఒక్కటే. మీరు ఎవరికీ ముప్పు తలపెట్టకపోతే, మీకెవ్వరూ ముప్పు కారు. భద్రత కోసం ప్రభుత్వ ధనం ఎందుకు ఖర్చుపెట్టాలి" అని ప్రశ్నించారు. మీరు దానికి సొంత డబ్బు పెట్టుకోవడానికి సిద్ధమైతే ప్రైవేటు సెక్యూరిటీని పెట్టుకోండి. మీ భద్రత కోసం ప్రైవేటు ఏజెన్సీని నియమించుకోవడానికి వచ్చిన అడ్డంకి ఏంటి" అని సీజేఐ ప్రశ్నించారు. ముప్పుపేరుతో పోలీసులు పిటిషనర్‌ను గృహనిర్బంధం చేశారన్న వాదనలనూ జస్టిస్ బాగ్చి తోసిపుచ్చారు. మీరు ఆ రోజు కార్యక్రమానికి వెళితే అక్కడ మళ్లీ హింసను ప్రేరేపిస్తారన్న ఉద్దేశంతో పోలీసులు గృహనిర్బంధం చేశారని గుర్తుచేశారు. పిటిషనర్ ప్రతిపక్షపార్టీ సభ్యుడని న్యాయవాది పేర్కొనగా "మీరేమీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కాదు. 2024 ఎన్నికల్లో ఓడిపోయారు. గెలిచి ఉంటే భద్రత వచ్చేది" అని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. తర్వాత సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ "రూ.500-1000 పెట్టి ఎవరైనా రాజకీయపార్టీ సభ్యత్వం తీసుకోవచ్చు. తర్వాత నేను ప్రతిపక్ష పార్టీ సభ్యుడిని కాబట్టి భద్రత కల్పించాలని అడగొచ్చు" అని అన్నారు. ముప్పును అంచనా వేయడానికి ప్రభుత్వంలో నిఘాసంస్థలు ఉంటాయని, అవి ఇచ్చిన సమాచారం ఆధారంగా ముప్పును శాస్త్రీయంగా నిర్ధారిస్తారని, అందుకు స్పష్టమైన విధివిధానాలు ఉన్నాయని గుర్తుచేస్తూ దానిపై అవసరాన్ని బట్టి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి వదిలిపెడుతూ ఉత్తర్వులు జారీచేశారు.

కేరళ ఇక.. కేరళం

(మొదటి పేజీ తరువాయి)

పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసింది. ఏప్రిల్‌లో కేరళ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.


అది అధికారాన్ని ప్రదర్శించే స్థానం కాదు

సేవాతీర్థ్ భవనమంటే దేశంలో ప్రతిఒక్క పౌరుడి సాధికారతకు కేంద్రమని, అధికారాన్ని ప్రదర్శించే స్థానం మాత్రం కాదని క్యాబినెట్ పేర్కొంది. ఈ మేరకు ప్రత్యేకంగా 'సేవా సంకల్ప్ తీర్మానా'న్ని ఆమోదించింది. ఈ ప్రాంగణంలో తీసుకునే ప్రతిఒక్క నిర్ణయానికి.. 'నాగరిక్ దేవో భవ' (పౌరులే దేవుళ్లు) అనే నమ్మిక స్ఫూర్తినిస్తుందని పేర్కొంది. భారత వృద్ధి ప్రస్థానానికి ఇది సరికొత్త ఆరంభమని, 140 కోట్ల మంది భారతీయుల కోసం దేశాన్ని సరికొత్తగా పునర్నిర్మించే సంకల్పానికిది ప్రేరణనిస్తుందని క్యాబినెట్ ఉద్ఘాటించింది. ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా, పారదర్శకంగా, వివేకంగా పాలనను బలోపేతం చేయాలనేదే ప్రభుత్వ దార్శనికత అని పేర్కొంది. దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్ కేంద్రంగా కొనసాగిన ప్రధాన మంత్రి కార్యాలయం ఇకపై దేశీయ ఆలోచనలు, ఆధునిక భావాలు, అపరిమిత సామర్థ్యాలతో, ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి అనే భావనను పెంచేలా సేవలందిస్తుందని తెలిపింది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దడానికి, 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి క్యాబినెట్ అంకితభావంతో పనిచేస్తుందని వెల్లడించింది. ◆ ముడి జనపనార కనీస మద్దతుధరను గత సీజన్ కంటే రూ.275 పెంచి క్వింటాలుకు రూ.5,925 చొప్పున చెల్లించడానికి ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదించింది.

◆ టెర్మినల్ భవనం విస్తరణ సహా కశ్మీర్‌లోని శ్రీనగర్ విమానాశ్రయంలో రూ.1,677 కోట్లతో అదనపు పనులు చేపట్టడానికి కూడా సీసీఈఏ ఆమోదించింది.

◆ గుజరాత్ మెట్రోను గిఫ్ట్‌సిటీ నుంచి షాపూర్ వరకు పొడిగించడానికి, నాలుగు (బిహార్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) రాష్ట్రాల్లో రూ.9,072 కోట్లతో మూడు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదించింది.

ఎన్నికల దృష్టితో కాదు: వైష్ణవ్



కేరళ పేరు మార్పునకు, ఆ రాష్ట్ర ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. ఎన్నికల దృష్టితో కాకుండా క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంటూ వస్తోందని చెప్పారు. ఏ ఎన్నికలూ లేని సమయంలో కేరళలో కొత్త రైలు నడవాలు, వందేభారత్‌లపై నిర్ణయాలు జరిగాయని గుర్తుచేశారు. దేశ ప్రయోజనాల దృష్టితోనే అన్నీ ఉంటాయని చెప్పారు.

గ్రహం అనుగ్రహం

25–2–2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
నవమి: రా 2-57 తదుపరి దశమి
రోహిణి: మ. 2-09 తదుపరి మృగశిర
వర్జ్యం: ఉ. 6-45 నుంచి 8-13 వరకు
తిరిగి రా. 7-24 నుంచి 8-54 వరకు
అమృత ఘడియలు: ఉ.11-11 నుంచి 12-40 వరకు
తిరిగి తె 4-23 నుంచి 5-53 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-50 నుంచి 12-36 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.26; **సూర్యాస్తమయం:** సా.6.01

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	15.7	32.8
విజయనగరం	16.0	30.0
గుంటూరు	21.0	29.0
కడప	21.0	31.0
తాడేపల్లిగూడెం	21.0	32.0
అనంతపురం	21.0	35.4
తిరుపతి	21.6	33.7
శ్రీకాకుళం	22.0	29.0
విజయవాడ	22.0	30.1
రాజమహేంద్రవరం	23.0	35.0
ఒంగోలు	23.5	30.9
కర్నూలు	23.6	36.5
విశాఖపట్నం	24.0	31.4
నెల్లూరు	24.3	32.7
నరసాపురం	25.0	32.1

పీఏసీఎస్ ఉద్యోగుల జీతాలు 20% పెంపు

- గ్రాట్యుటీ రూ.2లక్షల నుంచి రూ.4లక్షలకు
- సంఘం నేతలతో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారుల చర్చలు
- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన



ఆందోళన విరమించిన ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులకు 20% మేర జీతాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రాట్యుటీ రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచనుంది. ప్రతి ఉద్యోగికి రూ.5లక్షల కవరేజీతో కూడిన సమగ్ర గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు పీఏసీఎస్ సంఘాల నేతలు ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో పీఏసీఎస్ సంఘాల నేతలతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆర్‌సీఎస్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ రామకృష్ణ తదితరులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లపై చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, పెంచిన ప్రయోజనాల అమలును ఉన్నతస్థాయి కమిటీ త్వరలో ప్రకటిస్తుందని వివరించారు. పీఏసీఎస్ ఉద్యోగుల ఇతర డిమాండ్లను కూడా కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని చెప్పారు. పీఏసీఎస్ కంప్యూటరీకరణ, ఈఆర్‌పీలో రియల్‌టైమ్ లావాదేవీలు, డైనమిక్ ఈవోడీ ప్రక్రియలు, హెచ్ఆర్ఎంఎస్ ద్వారా జీతాల చెల్లింపు తదితర కీలక బాధ్యతల్ని ఉద్యోగులు నిబద్ధతతో నిర్వహిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగులు విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి సత్కరించారు.

తొమ్మిది జూనియర్ కళాశాలలు మంజూరు: లోకేశ్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'ఉమ్మడి అనంతపురం జిల్లాకు 9 జూనియర్ కళాశాలలు మంజూరు చేసి.. 9 బోధన, 5 బోధనేతర సిబ్బంది పోస్టులు మంజూరు చేశాం. జిల్లా (విద్యా, శిక్షణ సంస్థ) డైట్ కళాశాలల్లో ఉన్న ఖాళీలను డిప్యుటేషన్ విధానంలో భర్తీచేస్తున్నాం' అని పేర్కొన్నారు.

చిట్టి బుర్రలు.. వినూత్న ఆవిష్కరణలు

- విశాఖలో 'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన
- 77 ప్రాజెక్టులు రూపొందించిన 153 మంది విద్యార్థులు

ఈనాడు, విశాఖపట్నం: పిల్లల ఆలోచనలు మెరిశాయి. వినూత్న ఆవిష్కరణల్లో విరిశాయి. నిత్యజీవితంలో మనం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం దిశగా ఆలోచనలకు పదునుపెట్టాయి. 'ఈనాడు', గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సంయుక్తంగా మంగళవారం విశాఖపట్నంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ హాల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 153 మంది విద్యార్థులు 77 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ప్రారంభించారు. డీఈవో ఎన్.ప్రేమకుమార్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విశాఖ బ్రాంచి మేనేజర్ వీవీఎస్ రామచంద్రరావు, ఈనాడు విశాఖపట్నం యూనిట్ ఇన్‌ఛార్జి కేవీ రామారావు పాల్గొన్నారు. ముగింపు వేడుకకు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ హాజరై ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు.



వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్. చిత్రంలో విశాఖ డీఈవో ఎన్.ప్రేమకుమార్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విశాఖ బ్రాంచ్ మేనేజర్ వీవీఎస్ రామచంద్రరావు



ఎగ్జిబిట్లను చూస్తున్న విద్యార్థులు

పునరుత్పాదక విద్యుత్‌తో మేలెంతో!

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం సంస్థలి గ్లోబల్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు జతిన్ చౌదరి, అష్మాన్‌సిద్ధ్ రూపొందించిన పునరుత్పాదక విద్యుత్ నమూనాకు ద్వితీయ బహుమతి లభించింది. అత్యాధునిక సాంకేతికత సహకారంతో పునరుత్పాదక విద్యుత్‌ను సమర్థంగా వాడుకుంటే కలిగే ప్రయోజనాలను ఈ ప్రాజెక్టులో చూపారు.

స్మార్ట్ హెల్మెట్

నడుపూరు జడ్పీహెచ్ఎస్ తొమ్మిదో తరగతి విద్యార్థి టి.ఉదయ్‌కిరణ్ రూపొందించిన స్మార్ట్ హెల్మెట్ ఎగ్జిబిట్‌కు తృతీయ బహుమతి లభించింది.


హెల్మెట్ పెట్టుకుంటేనే ద్విచక్రవాహనం స్టార్ట్ అయ్యేలా ఈ విద్యార్థి ఒక్కడే ప్రాజెక్టును తీర్చిదిద్దాడు.

ఆవిష్కరణలకు సైన్స్, గణితం కీలకం

విద్యార్థులు సైన్స్, గణితం సబ్జెక్టులను ఆసక్తిగా నేర్చుకుంటే ఏ పోటీ పరీక్షలోనైనా విజయం సాధించగలరని కలెక్టర్ హరేందిరప్రసాద్ పేర్కొన్నారు. 'విద్యార్థులు ప్రయోగాత్మక దృక్పథంతో సబ్జెక్టును సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈ తరహా సృజనాత్మక ప్రాజెక్టుల తయారీని అలవాటుగా కొనసాగించాలి. ఒకసారి మంచి ర్యాంకు సాధిస్తే, అదే ప్రేరణతో నిరంతరం శ్రమిస్తూ, సిలబస్‌లోని సమయం వృథా చేసుకోవద్దు' అని సూచించారు. 'మన చుట్టూ జరిగే ప్రతిపనిలో సైన్స్ దాగి ఉంది. వాటిని గమనిస్తూ, ప్రశ్నించే తత్వంతో ఆలోచిస్తేనే జ్ఞానవికాసం కలుగుతుంద'ని సీపీ శంఖబ్రత బాగ్చీ సూచించారు. 'విద్యార్థులు ఉత్సుకతతో ప్రశ్నలు అడిగి, జవాబులు తెలుసుకోవాలి. సైన్స్ వంటి ఆసక్తికర సబ్జెక్టులను సరదాగా నేర్చుకోవాలి. కృత్రిమ మేధపై ఇప్పటినుంచే దృష్టి సారించాలి' అని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలేనని రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ స్ఫూర్తినింపారు. 'ఒలింపిక్స్ పరుగు పందెంలో విజేతకు, ఆఖర్లో గమ్యం చేరిన ఆటగాడికి మధ్య సమయం.. క్షణాల తేడా మాత్రమే ఉంటుంది. పిల్లలు సృజనాత్మకతను మేళవించి అద్భుత ప్రాజెక్టులు రూపొందించార'ని కితాబిచ్చారు.

పరిమిత వనరులతో సుస్థిర నగరాలు

'సుస్థిరాభివృద్ధి నగరం'పై లేజర్ ఫెన్సింగ్, ఆక్వాపోనిక్స్, సోలార్ ట్రాక్ తదితర అంశాలతో రూపొందించిన నమూనాకు మొదటి బహుమతి లభించింది. పీఎంపాలెం మాలతాంబ విద్యానికేతన్ తొమ్మిదో తరగతి విద్యార్థులు హర్షిత్, రామ్ దీన్ని రూపొందించారు. వనరులను పరిమితంగా వాడుకోవడం ఎలాగో ఈ ప్రాజెక్టులో వివరించారు.



మొదటి బహుమతి గెలుచుకున్న విద్యార్థులు హర్షిత్, రామ్‌లకు బహుమతి అందజేస్తున్న రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ బాలకృష్ణ

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు హైకోర్టు ప్రశంస

- విద్యార్థినులను ఎలుకలు కొరికిన వ్యవహారంపై వెంటనే స్పందించారని కితాబు
- మంత్రి ఇలా పనిచేస్తుంటే కొందరి నిర్లక్ష్యం
- ప్రభుత్వానికి, మంత్రికి చెడ్డపేరు తెస్తున్నారని వ్యాఖ్యలు
- సర్వశిక్షాభియాన్ పీడీ శ్రీనివాసరావుపై మండిపాటు

ఈనాడు, అమరావతి: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను హైకోర్టు ప్రశంసించింది. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి లోకేశ్ వెంటనే స్పందించారని కితాబిచ్చింది. దాంతో జిల్లా యంత్రాంగమంతా వెళ్లి విద్యార్థినులను ఆదుకున్నారని తెలిపింది. కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన సిబ్బందికి జీతభత్యాలు పెంచడంతో పాటు.. కేంద్రంతో చర్చించి శాశ్వత ప్రాతిపదికన పోస్టులను భర్తీచేస్తున్నట్లు మంత్రి లోకేశ్ శాసనసభలో ప్రకటించిన విషయాన్ని తాము పత్రికల్లో చూశామని తెలిపింది. మంత్రి ఈ స్థాయిలో పనిచేస్తుండగా.. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వానికి, మంత్రికి చెడ్డపేరు తెస్తున్నారని వ్యాఖ్యానించింది.

✦ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) పార్ట్‌టైం పీజీ టీచర్ల(పీజీటీ)/పిటిషనర్ల సేవలను కొనసాగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చి.. దాన్ని ఉల్లంఘించినందుకు సుమోటోగా నమోదుచేసిన కోర్టుధిక్కరణ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కోర్టు ఆదేశాలు అమలుచేయని దిగువస్థాయి సిబ్బందిని రక్షించేలా సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తీరు ఉందని మండిపడింది. గత విచారణకు తమముందు హాజరైన శ్రీనివాసరావు.. బాధ్యులైన అధికారులకు నోటీసు ఇచ్చినట్లు చెప్పారని, తాజా అఫిడవిట్‌లో మాత్రం కోర్టు విచారణ తర్వాత నోటీసులు జారీచేసినట్లుందని గుర్తుచేసింది. ఆయన కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని, ఈ నేపథ్యంలో క్రిమినల్ కోర్టుధిక్కరణ కేసు నమోదు చేస్తామని, తగిన చర్యలు తీసుకునేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ మంత్రిత్వశాఖకు రాస్తామని హెచ్చరించింది. ప్రస్తుత అఫిడవిట్‌తో తాము సంతృప్తిగా లేమని, తాజాగా వేయాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

✦ కేజీబీవీల్లో పీజీటీలుగా పనిచేస్తున్న తమను తొలగించారంటూ పలువురు 2023లో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. వారి తొలగింపును తప్పుపడుతూ సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులపై అధికారులు అప్పీల్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా.. పిటిషనర్లను కొనసాగిస్తామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. ఆ మేరకు వ్యవహరించకపోవడంతో పీడీపై హైకోర్టు కోర్టుధిక్కరణ కేసు నమోదుచేసి విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో పీడీ మంగళవారం ధర్మాసనం ముందు హాజరయ్యారు. మరోవైపు కేజీబీవీల్లో శాశ్వత ప్రాతిపదికన పోస్టులను భర్తీచేసే వ్యవహారంపై వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

సునీల్‌నాయక్‌ను తీసుకొచ్చేవరకూ పట్నాలోనే..

- ఎస్పీ దామోదర్ బృందం నిర్ణయం

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-గుంటూరు లీగల్: బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి ఎం.సునీల్‌నాయక్‌ను మళ్లీ అరెస్టు చేసి, ఆంధ్రప్రదేశ్‌కు తరలించే వరకూ పట్నాలోనే ఉండాలని దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్ నేతృత్వంలోని బృందం నిర్ణయించుకుంది. వైకాపా హయాంలో నరసాపురం ఎంపీ (ప్రస్తుత శాసనసభ ఉపసభాపతి) కె.రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నమోదైన కేసులో నిందితుడైన సునీల్‌నాయక్‌ను సోమవారం పట్నాలో అరెస్టుచేసినా ఏపీకి తరలించేందుకు అక్కడి కోర్టు ట్రాన్సిట్ వారంట్ నిరాకరించిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన్ను బిహార్ పోలీసు అధికారులు ఏపీ పోలీసుల అదుపులో నుంచి విడిపించుకుని తీసుకెళ్లిపోయారు. ఈ వివరాలన్నింటినీ దర్యాప్తు అధికారి దామోదర్ ఏపీ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు మరికొందరు పోలీసు సిబ్బంది, న్యాయనిపుణులతో కూడిన బృందాన్ని మంగళవారం సాయంత్రానికల్లా పట్నాకు పంపించారు. ఈసారి బిహార్ పోలీసులు, సునీల్‌నాయక్ తరఫు వారు ఎన్ని చిక్కులు, అడ్డంకులు కల్పించినా సరే వాటన్నింటినీ చట్టప్రకారమే అధిగమించేందుకు సిద్ధమయ్యారు. ఏపీ పోలీసు ఉన్నతాధికారులు.. బిహార్ పోలీసు ఉన్నతాధికారులతోనూ మాట్లాడినట్లు సమాచారం.

అరెస్ట్ వారంట్ కోసం పిటిషన్ దాఖలు

సునీల్‌నాయక్‌కు అరెస్ట్ వారంట్ జారీ చేయాలంటూ పోలీసులు దాఖలుచేసిన పిటిషన్‌పై గుంటూరులోని ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం వాదనలు ముగిశాయి. అధికారిక ఉత్తర్వులు వెలువడగానే ఆయన్ను మరోమారు అదుపులోకి తీసుకోనున్నారు. ప్రస్తుతం సునీల్‌నాయక్ ఎవరికీ అందుబాటులో లేరని, ఫోన్లు స్విచాఫ్ చేసేసి.. అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని దర్యాప్తు బృందం ప్రాథమికంగా గుర్తించింది.

జీవిత సూత్రం



జీవితంలో తెలుసుకోవలసిన మొదటి సూత్రం..మీరేం కోరుకుంటున్నారో దాని కోసం తపించకపోతే అది మీకు ఎప్పటికీ సొంతం కాదు. అది ఉద్యోగం కావొచ్చు..ఆదాయం కావొచ్చు.. కెరీర్ కావొచ్చు. ఆఖరికి మీ వ్యక్తిగత జీవితమైనా సరే. మౌనంగా కోరుకుంటూ ఏమీ చేయకుంటే చివరికి పశ్చాత్తాపమే మిగులుతుంది.

– జులియె గర్నర్, ఇన్‌ఫ్లుయెన్సర్

దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని..

మండలిలో కూర్చోబెడతారా?

- అప్పటి ప్రతిపక్ష నేత ఇంటిపై దాడికి వచ్చిన ఎమ్మెల్యేకు.. మంత్రి పదవా?
- తెదేపా కార్యాలయంపై దాడి చేస్తే.. కార్యకర్తలకు బీపీ పెరిగిందని జగన్ అన్నారు
- రాష్ట్రంలో సమర్థ పోలీసింగ్ ఉంది
- అందుకే నేరాల సంఖ్య 6.6 శాతం తగ్గింది
- మండలిలో శాంతిభద్రతల అంశంపై హోంమంత్రి అనిత సమాధానం

ఈనాడు, అమరావతి: 'దళితుడిని చంపి..డోర్ డెలివరీ చేసి కేసు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఇదే సభలో కూర్చోబెట్టడం ద్వారా వైకాపా ఎలాంటి సందేశాన్ని ప్రజలకు ఇస్తున్నట్లు? అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన ఎమ్మెల్యేను శిక్షించడం మానేసి.. ఆయనకు అప్పటి సీఎం జగన్ మంత్రిపదవిని కట్టబెట్టారు. పట్టాభి ఒక పదాన్ని ఉపయోగిస్తే తెదేపా రాష్ట్ర కార్యాలయంపై వైకాపావారు దాడి చేశారు.. మా కార్యకర్తలకు బీపీ వచ్చింది కాబట్టి దాడి చేశారని జగన్ దీనిని సమర్థించుకున్నారు.



కానీ వైకాపాకు చెందిన మాజీమంత్రి ఇంటిపై ఇటీవల జరిగిన దాడి తర్వాత.. చట్టానికి లోబడి వ్యవహరించాలని సీఎం చంద్రబాబు మమ్మల్ని కఠినంగా హెచ్చరించారు' అని హోంమంత్రి అనిత అన్నారు. శాసనమండలిలో శాంతిభద్రతల అంశంపై మంగళవారం నిర్వహించిన లఘుచర్చకు హోంమంత్రి సమాధానమిస్తూ 'వైకాపాకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తపై కేసులు పెట్టామంటూ ఆ పార్టీ సభ్యులు ఇప్పుడు ప్రస్తావించారు. ఆ కార్యకర్త పెట్టిన పోస్ట్‌లను.. మమ్మల్ని విమర్శించిన ఆ ఎమ్మెల్సీ భార్య, తల్లి చదివి అందులో ఎలాంటి తప్పు లేదని వారు చెబితే ఆ కేసును ఉపసంహరిస్తాం' అని ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా వైకాపా కార్యకర్తలు మహిళలను తీవ్రంగా వేధించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై నేరాలు 4% తగ్గటానికి చంద్రబాబు నేతృత్వంలో పోలీసు శాఖ బలంగా ఉండటం వల్లనే సాధ్యమైందన్నారు.

శాంతిభద్రతలు ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి

పాదయాత్ర సందర్భంగా తెదేపా నేత లోకేశ్ రెడ్‌బుక్ చూపిస్తూ చెప్పిన మాటలను నమ్మి ప్రజలు ఎన్నికల్లో కూటమికి 164 స్థానాలు కట్టబెట్టారని అనిత పేర్కొన్నారు. 'అన్యాయాలు చేసిన వారిని జైలుకు పంపుతామనే ప్రజలు నమ్మారు. నేరాల నియంత్రణ కోసం ట్రిపుల్-టి (ట్రైనింగ్.. టెక్నాలజీ.. టైమ్‌లీ రెస్పాన్స్) విధానాన్ని అనుసరిస్తున్నాం. శాంతిభద్రతలు ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయి. వైకాపా ప్రభుత్వంలో అది లోపించి పారిశ్రామికవేత్తలు పారిపోయారు' అని వెల్లడించారు.

నేర నిరూపణలో సాంకేతికత

నేర పరిశోధనకు ఇన్వెస్టిగేషన్ టూల్స్, సాంకేతిక మౌలిక సదుపాయాలు అవసరమని హోంమంత్రి పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వం 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాలకు యాక్షన్ ప్లాన్ పంపకపోవడం వల్ల రూ.180 కోట్లు పోలీసుశాఖ నష్టపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక పాత బకాయిలు రూ.60 కోట్లు చెల్లించాం. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వైకాపా నిరుపయోగంగా మార్చింది. అమరావతిపై కోపంతో ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణాన్ని నిలిపేసింది. మేము మళ్లీ లక్షకు పైగా సీసీ కెమెరాలు, డ్రోన్లను వినియోగించి నిఘా పెంచడంతో నేరాల సంఖ్య 6.6 శాతం తగ్గింది' అని తెలిపారు.

నిందితులు.. వైకాపా వారే

ఇటీవల ఒక ఎమ్మెల్యే ఇంట్లో జరిగిన చోరీ కేసులో వైకాపా సర్పంచిని నిందితుడిగా గుర్తించామని.. వారం క్రితం గంజాయి కేసులోనూ వైకాపాకు చెందిన మరో ఎంపీటీసీ సభ్యుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

● ఇన్వెస్టిగేషన్ విత్ ఇంటెలిజెన్స్‌లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. గంజాయి సాగును పూర్తిగా నియంత్రించే విషయంలో ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు కేంద్రం సూచించిన విషయాన్ని గుర్తించాలి.

అభినందించిన మంత్రి లోకేశ్

ప్రభుత్వం తరఫున మంత్రి అనిత సమాధానం ఇవ్వడం పూర్తయిన తర్వాత మంత్రి లోకేశ్ తాను కూర్చున్న స్థానం నుంచి లేచి వెళ్లి.. బాగా సమాధానం ఇచ్చారంటూ ఆమెను అభినందించారు.

రప్పా..రప్పా అనే వారిని జగన్ వెనకేసుకొస్తారా?

'వైకాపా కార్యకర్తలు కత్తులు పట్టుకుని రోడ్లపైకి వస్తాం.. నరుకుతాం.. చంపుతామంటే మా ప్రభుత్వం చూస్తూ కూర్చోదు. రప్పా..రప్పా అంటూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేస్తే తప్పేంటి? రప్పా..రప్పా అంటే తప్పేమిటని జగన్ అంటున్నారు. రోడ్డుపైకి వచ్చి సినిమా డైలాగులు చెబుతాం.. నరుకుతాం.. అంటూ వీడియో పోస్టులు పెడితే చూస్తూ ఊరుకోడానికి ఇక్కడున్నది జగన్ కాదు.. సీఎం చంద్రబాబు చట్టపరంగా చర్యలు తీసుకుంటారు' అని అనిత హెచ్చరించారు. వైకాపా సభ్యులు ఎవరికో ముడుపులు ముడుతున్నాయంటూ ఆధారాల్లేకుండా మాట్లాడటం భావ్యం కాదని ఆమె అన్నారు. 'అలాంటి అంశాలు మేం ఆధారాలతో మాట్లాడాల్సినవి చాలా ఉన్నాయి. ఒక దళిత వ్యక్తిని చంపి డోర్‌డెలివరీ చేసిన వైకాపా సభ్యుడు ఇదే సభలో కూర్చున్నారు. శిరోముండనం చేసిన సభ్యుడూ ఇక్కడే ఉన్నారు. ఆ అంశాల గురించి కూడా మేం మాట్లాడొచ్చు. వైకాపా ఎమ్మెల్సీ చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి' అని ఆమె అన్నారు.

పట్టిసీమ జలాలు ఎలా లెక్కలోకి తీసుకుంటారు?

- బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

ఈనాడు, అమరావతి: 'పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా తీసుకున్న జలాలను కృష్ణాడెల్టా నీటి అవసరాలకు కలిపి లెక్కించడం సాధ్యం కాదు. అది కేవలం వరద జలాల ఆధారిత ఎత్తిపోతల పథకం. కృష్ణా డెల్టాకు నీటి కేటాయింపులు తగ్గించాలంటూ తెలంగాణ లేవనెత్తుతున్న అంశాలు చట్టవిరుద్ధం' అని బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్‌గుప్తా వాదనలు వినిపించారు. జస్టిస్ బ్రిజేష్‌కుమార్, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్రల ముందు మంగళవారం ఆయన వాదనలు కొనసాగించారు. సీనియర్ న్యాయవాది ఉమాపతి, న్యాయవాదులు శరత్‌చంద్ర, సంజయ్‌లు సహకరించారు. తదుపరి వాదనలు మార్చి 23 నుంచి 25 వరకు ఉంటాయి. మరిన్ని వివరాలు **https://epaper.eenadu.net లో**

7.85 లక్షల ఎకరాలకు ఫ్రీహోల్డ్

- పచ్చజెండా ఊపిన జీవోఎం
- 5.74 లక్షల ఎకరాలపై సమగ్రంగా చర్చించాలని నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఫ్రీహోల్డ్ భూముల సమస్యపై మంత్రివర్గ ఉపసంఘం (జీవోఎం) కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్లు నిలిపేసిన 13.59 లక్షల ఎకరాల్లో.. 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలని నిర్ణయించింది. నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించాకే నిర్ణయం తీసుకోనుంది. నెలల తరబడి ఎదురుచూస్తున్న లక్షలమంది రైతులకు ఇది ఊరట కలిగించే అంశం. సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం ఫ్రీహోల్డ్ భూములు, 22ఎ, ఈనాం తదితర భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల సమస్య పరిష్కారం ఇప్పటికే ఆలస్యమైందని.. త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సీఎం ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా ఫ్రీహోల్డ్ ఉత్తర్వులు ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు నేడో, రేపో విడుదలయ్యే అవకాశం ఉంది.

● పేదలకు కేటాయించిన వ్యవసాయ భూములను.. 20 ఏళ్లు నిండాక అమ్ముకోవచ్చని 2023లో వైకాపా ప్రభుత్వం ఫ్రీహోల్డ్ ఆదేశాలు ఇచ్చింది. దీంతో వైకాపా నేతలు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ముందుగానే పేదల నుంచి తక్కువ ధరకు ఆ భూములను కొని.. ప్రభుత్వ ఆదేశాలు వచ్చాక ఫ్రీహోల్డ్‌గా మార్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిపై విచారణ చేయించింది. 13.60 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించింది. వీటి రిజిస్ట్రేషన్లను నిలిపేస్తూ 2024 ఆగస్టు 10న ఆదేశాలు ఇచ్చింది. ప్రతి ఆరు నెలలకోసారి వీటిని పొడిగించింది. ఇందులో 7.85 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్‌కు ఇప్పుడు అవకాశం కల్పించనున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాక కలెక్టర్లు వీటికి సంబంధించి రిజిస్ట్రార్లకు ఆదేశాలు ఇస్తారు. ఇందులో అర్హత కలిగిన ఎసైన్డ్ భూములు, చుక్కల భూములు తదితరాలు ఉన్నాయి.

* మొత్తం 5.74 లక్షల ఎకరాల్ని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్‌గా మార్చినట్లు జిల్లాల నుంచి నివేదికలు అందాయి. ఇందులో ఎసైనీలు అర్హులే అయినా కలెక్టర్లు ప్రొసీడింగ్స్ ఇవ్వని భూములు 56,619 ఎకరాలు ఉన్నాయి. ఎసైన్ చేసి 20 ఏళ్లు పూర్తికాని భూములు 26,975 ఎకరాలుగా గుర్తించారు. అయినా వీటిని కూడా ఫ్రీహోల్డ్‌గా మార్చేశారు. అభ్యంతరం గల 26,990 ఎకరాల పోరంబోకు భూముల్ని కూడా ఫ్రీహోల్డ్ చేశారు. అన్‌సెటిల్డ్ ఈనాం, కోర్టు కేసుల్లోనివీ ఇందులో ఉన్నాయి. వీటన్నిటిపై మరో రెండు జీవోఎం సమావేశాల్లో చర్చించాక.. నిర్ణయాలు వెల్లడిస్తారు.

ఈనాడు

ప్రజారోగ్యానికి శాపాలు!

ఏయే ప్రాంతాల్లో ఎవరి భోజన అలవాట్లు ఎలా ఉన్నప్పటికీ పాల విషయంలో ఆ తేడాలేవీ కనపడవు. పుష్టికరమని చెప్పి పొద్దున్నే పిల్లలకు పట్టించడం, రాత్రి పడుకునే ముందు పెద్దవారు గ్లాసు పాలు తాగడం వంటివి దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ సర్వసాధారణ దృశ్యాలే. ఇక టీ, కాఫీ, పెరుగు, మజ్జిగ, నెయ్యి తదితరాలకు దూరంగా ఉండేవారు అరుదే! పాలతో తయారయ్యే రకరకాల స్వీట్ల సంగతి సరేసరి! ఇలా కోట్ల మంది రోజూ తీసుకునే పాలూ పాలపదార్థాల్లో నాణ్యత గురించి తెలిస్తే, కడుపులో దేవేసినట్టవుతుంది! రాష్ట్రీయ గోకుల్ మిషన్ వంటి పథకాల పుణ్యమా అని దేశీయంగా 2014-15లో 14.63 కోట్ల టన్నులుగా ఉన్న పాల ఉత్పత్తి 2023-24 నాటికి 23.93 కోట్ల టన్నులకు చేరింది. కానీ, పాడి పరిశ్రమ ఎక్కువగా అసంఘటిత రంగంలోనే ఉండటంతో కల్తీ పాపాలూ పెరిగిపోతున్నాయి. తాజాగా రాజమహేంద్రవరంలో అనధికార డెయిరీ నుంచి సరఫరా అయిన పాలు గరళమై అయిదు ప్రాణాలు పోయాయి. నెత్తుటికూడుకు లొట్టలేసే కొందరి స్వార్థానికి వ్యవస్థాగత అలక్ష్యం తోడుకావడంతోనే సమతులాహారమైన పాలు ప్రాణాంతకమవుతున్నాయి. ఈమేరకు దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న దారుణోదంతాలు- ప్రజారోగ్య సంరక్షణలో మన వెనకబాటుతనాన్ని పట్టిచూపిస్తున్నాయి!

కార్లు, ట్రక్కులు, కర్మాగారాల్లో కూలెంట్‌గా వాడే ఇథలీన్ గ్లైకాల్ చాలా ప్రమాదకరమైనది. కాబట్టి డెయిరీలు ఆహార శుద్ధి పరిశ్రమల్లో ఫుడ్‌గ్రేడ్‌కు చెందిన ప్రొపైలీన్ గ్లైకాల్‌ను మాత్రమే వాడాలి. చవగ్గా దొరుకుతుందని చెప్పి కక్కుర్తిపరులు కొందరు కొన్ని డెయిరీల్లోని శీతలీకరణ యంత్రాల్లో కూలెంట్‌గా ఇథలీన్ గ్లైకాల్‌ను వినియోగిస్తూ జనం ప్రాణాల పైకి తెస్తున్నారు. రాజమహేంద్రవరంలోనూ ఇలాగే జరిగిందని అధికారులు భావిస్తున్నారు. అధిక ఉత్పత్తికోసం ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లతో పితకడానికంటే ముందే క్షీరాన్ని కలుషితం చేయడం మొదలు కాలంచెల్లిన పాలపొడికి పామాయిల్, యూరియా, నీళ్లు కలిపి కల్తీ పాలు తయారుచేయడం దాకా జరుగుతున్న పాతకాలు అనేకం! గంజిపొడి, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంటసోడా, డిటర్జెంట్లు, మెలమైన్, మాల్టోడెక్స్‌ట్రిన్ వంటివాటిని పాలల్లో కలిపేసి యథేచ్ఛగా విక్రయిస్తున్న కల్తీరాయళ్ల కారణంగా అజీర్ణ, కడుపునొప్పి సమస్యలు తలెత్తడంతోపాటు మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. కాలేయం, నాడీసంబంధిత వ్యాధులూ క్యాన్సర్లు కూడా కోరసాస్తున్నాయి!

పాలూ పాలపదార్థాల కల్తీపై 2022-25 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 35,968 కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వాటిలో 24,845 కేసుల్లో నిందితులకు శిక్షలు పడటమో, జరిమానాలు వసూలుచేయడమో జరిగినట్లు సర్కారీ దస్త్రాలు చెబుతున్నాయి. కానీ, అరకొర దండనల మూలంగా పాపాల భైరవుల్లో బెరుకు ఉండటం లేదు. భావితరాలనూ దుర్బలం చేసే కల్తీపాలను కట్టడిచేయాలంటే సంబంధిత నేరగాళ్లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షలు విధించాలన్న న్యాయపాలిక సూచన అమలులోకి రావాలి. తెల్లనివన్నీ పాలు కావన్న స్పృహతో ప్రజలూ కాస్త జాగ్రత్త వహించాలి. ఎక్కడపడితే అక్కడ ఏవి పడితే అవి కొనుగోలు చేయకపోవడం, రంగూ రుచీ చిక్కదనాల్లో కొద్దిపాటి తేడా కనిపించినా సందేహించడం ప్రాణావసరం. ఆహార కల్తీల కారణంగా ముసురుకుంటున్న రోగాలతో దేశంలో ఏటా 1.20 లక్షల మంది చనిపోతున్నారని, వైద్యవ్యయ భారాలూ ఉత్పాదకత నష్టంతో భారతావని ఏడాదికి రూ.1.36 లక్షల కోట్లు కోల్పోతోందని అంచనా. ఫుడ్‌సేఫ్టీ విభాగాల్లో ఖాళీలను భర్తీచేసి, ప్రయోగశాలలను పెంచి, విష వ్యాపారులపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపితేనే ఈ విషాదపర్వాలు ఆగుతాయి!




భయం ఉన్నచోట న్యాయం ఉండలేదు. విధేయమైన న్యాయవ్యవస్థ, అంతరాత్మను అణచి పెట్టుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్న సమాజం... నియంతృత్వానికి సూచనలు. న్యాయస్థానాలు సత్యానికి కట్టుబడి తమ గౌరవాన్ని నిలబెట్టుకోవాలి. రూల్ ఆఫ్ లాని పణంగా పెట్టకూడదు.

– జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా

మహా వాక్యాలు

మనిషి ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసేటప్పుడు 'నేనెవరిని? ఎక్కడి నుంచి వచ్చాను?' అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. అసలు మనిషి ఎవరు? భౌతికంగా కనిపించే శరీరమా? లేక లోపల ఉన్న మనసా? వీటన్నిటికన్నా అతీతమైన రూపమేదైనా ఉందా? వంటి ప్రశ్నలకు సమాధానాలుగా మన ఆత్మస్వరూపానికి వెలుగునిచ్చే నాలుగు మహా వాక్యాలు ఉన్నాయి. వాటి ద్వారా తెలుసుకునే తత్వజ్ఞానం మనల్ని జీవితమంతా అనేక కష్టాల నుంచి కాపాడుతుంది.

మొదటిది 'ప్రజ్ఞానం బ్రహ్మ'. ఐతరేయోపనిషత్తులోని ఈ వాక్యానికి అర్థం ప్రపంచాన్ని తెలుసుకునే చైతన్యమే పరమ సత్యం. అదే బ్రహ్మజ్ఞానం. ఆ సత్యం నీలోనే ఉంది. జీవుడు ఏ శక్తివల్ల కంటితో రూపాన్ని, చెవితో శబ్దాన్ని, ముక్కుతో వాసనను, నాలుకతో రుచిని, చర్మంతో స్పర్శను గ్రహిస్తూ ఉన్నాడో ఆ చైతన్య శక్తే ప్రజ్ఞానం. ప్రాణులన్నిటిలో వ్యాపించి ఉన్న చైతన్యమే నేను. ఆ నేనే బ్రహ్మం. రెండోదైన 'అహం బ్రహ్మాస్మి'కి నేనే బ్రహ్మను అని అర్థం. బృహదారణ్యక ఉపనిషత్తు నుంచి వచ్చిన ఈ వాక్యం చాలా ప్రసిద్ధం. మూడోదైన 'తత్వమసి'... 'ఛాందోగ్యోపనిషత్తు' నుంచి వచ్చింది. 'నువ్వే బ్రహ్మ స్వరూపం. నీలోని ఆత్మే బ్రహ్మం. జీవుడు, దేవుడు వేరు కాదు ఒకటే'నని ఈ ఉపదేశ వాక్యాన్ని గురువు శిష్యుడికి బోధిస్తాడు. జీవం బ్రహ్మం అభేదాలు అంటుందీ వాక్యం. నాలుగోదైన 'అయం ఆత్మ బ్రహ్మ' అనే సాక్షాత్కార వాక్యం 'మాండుక్యోపనిషత్తు' నుంచి వచ్చింది. 'నేను' అన్న భావమే పరబ్రహ్మస్వరూపం. దైవం ఎక్కడో లేదు, మన అంతరంగంలోనే ఉంది. ఆ బ్రహ్మాన్ని బయట వెతకనవసరం లేదు. సమస్త ప్రపంచానికీ అధిష్ఠానమైన ఆ బ్రహ్మమే ప్రకాశవంతమైనది... అనేది ఈ వాక్యానికి అర్థం.



అంతర్యామి

ఈ నాలుగు వాక్యాలు ధార్మిక ఉపదేశాలు కావు. మామూలు మనుషులకు వచ్చే ఎన్నో సందేహాలకు సమాధానాలు. అసలు మనిషి ఎవరు? జీవాత్మ పరమాత్మల సంబంధమేంటి? వంటి గంభీరమైన ఆధ్యాత్మిక ప్రశ్నలకు ఇవి జవాబులు. నాలుగు వేదాలకు ఉపనిషత్తులు శిరస్సు వంటివి. వాటి సారమే ఈ మహావాక్యాలు. ధర్మానికి అంతిమ లక్ష్యం ఆత్మజ్ఞానం. ఈ వాక్యాలు జీవాత్మ, పరమాత్మ వేరు కాదనే విషయాన్ని స్పష్టంగా ప్రకటించాయి. ఈ అద్వైత వేదాంతాన్ని శంకర భగవత్పాదులు 'నిర్వాణ షట్కం'లో అద్భుతంగా ఆవిష్కరించారు.

నువ్వు వెతుకుతున్న దేవుడు నీలోనే ఉన్నాడంటూ అన్నమయ్య 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే..' అన్న కీర్తనలో విశదీకరించాడు. ఈ పరబ్రహ్మ తత్వాన్ని అనేకమంది కవులు, సాధువులు తమ రచనల్లో తెలియజేశారు. ఈ సత్యాన్ని గుర్తించగలిగితే ప్రతి మనిషిలోనూ దైవాన్ని చూడటం అలవాటు చేసుకుంటాం. ఎవరికీ హాని తలపెట్టకుండా సన్మార్గంలో జీవితాన్ని గడిపే విధంగా మనల్ని మనమే మార్చుకుంటాం.

– గంటి ఉషాబాల

చైనా గెలుపు మంత్రమేంటి?

ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగిన చైనా విజయ రహస్యం ఏంటి? వాణిజ్య రంగంలో దూసుకెళ్లడానికి అనుసరించే గెలుపు సూత్రమేంటి?

చైనా కంపెనీలు స్టార్టప్‌ల స్థాయి నుంచి టెక్ దిగ్గజాలుగా శరవేగంగా ఎలా ఎదుగుతున్నాయి?

ఈ విశేషాలను తెలుసుకోవడం ఆసక్తికరమే కాదు, అవసరం కూడా!

షాంఘైలోని చైనా యూరప్ ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్(సీఈఐబీఎస్)కు ఆసియాలో అత్యుత్తమ వాణిజ్య విద్యాసంస్థగా పేరుంది. అందులో నా పూర్వ సహోద్యోగి ఆచార్య లియాంగ్ నెంగ్, అమెరికాలోని వార్టన్ బిజినెస్ స్కూల్‌కు చెందిన హర్బీర్ సింగ్, పీటర్ కాపెలి, మైఖేల్ యూసీమ్‌లతో కలిసి 'ద ఫార్చ్యూన్ మేకర్స్' పుస్తకాన్ని వెలువరించారు. ఆసియా వ్యాపారాలపై ఉన్న సాధారణ అభిప్రాయాలను పటాపంచలు చేసే భిన్నమైన విశ్లేషణను ఆ గ్రంథంలో అందించారు. చైనా పారిశ్రామిక వ్యవస్థాపకుల విజయాలకు అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం అందిస్తున్న అండదండలే కారణమనుకోవడం సరికాదని స్పష్టంచేశారు. అటువంటి అండ లేకపోయినా వారు రాణిస్తున్నారని తేల్చారు. వ్యాపార స్థాపన, అభివృద్ధికి అన్ని వేళలా వ్యవస్థాగతమైన



మద్దతు లభించకపోవచ్చు. మార్కెట్‌లో పోటీ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నా స్వశక్తితో తట్టుకుని నిలబడి వ్యాపారాన్ని విజయవంతం చేసుకోవాల్సి ఉంటుంది. తమకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు దూసుకెళ్లాల్సిందే. వ్యాపార పరంగా వివిధ పక్షాలతో సంబంధాలను వృద్ధి చేసుకుంటూ పురోగమించాల్సిన అవసరం ఉంటుంది.

నిరంతర తపన

అంతా బాగుంటే సమస్యలూ ఉండవు, వాటిని అధిగమించడానికి కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరమూ ఉండదు. వనరుల సమృద్ధికంటే కొరతలు, ప్రతిబంధకాలే నవీకరణను సాధించాలనే తపనను పుట్టిస్తాయి. చైనీయులు పాశ్చాత్య వ్యాపార నమూనాలపై పూర్తిగా ఆధారపడకుండా స్థానిక పరిస్థితులకు తగినట్లుగా మార్పుచేర్పులు చేసుకున్న నమూనాలనే అనుసరిస్తారు. ఈ క్రమంలోనే కొత్తదనాన్ని అన్వేషించి, ఆవిష్కరిస్తారు. మార్కెట్ గురించి పూర్తి సమాచారం కోసం ఎదురు చూడకుండా, తక్షణం రంగంలోకి దిగి తప్పులను సరిదిద్దుకుంటూ కొత్త ఆలోచనలతో, సరికొత్త పద్ధతులతో ముందుకు సాగుతారు. నవీకరణ కొరత నుంచి పుడుతుందే తప్ప సమృద్ధి నుంచి పుట్టదని నిరూపిస్తారు. బీవైడీ తదితర సంస్థలు ఈ పంథాలోనే ముందుకుసాగి ప్రపంచ దిగ్గజాలుగా వెలుగుతున్నాయి. పోటీ తీవ్రంగా ఉండి, పరిస్థితులు మారిపోయే అస్థిర మార్కెట్‌లో మనుగడ సాగించాలంటే, వైఫల్యం ఎదురయ్యే లోపే సరైన పాఠాలు నేర్చుకుంటూ, విజయం వైపు దూసుకెళ్లాలి. ఈ నేర్పు శిక్షణ ద్వారా మాత్రమే సిద్ధించదు. ఎదుటివారి అత్యుత్తమ నిర్వహణ పద్ధతులను గమనిస్తూ, నిరంతర అభ్యాసంపై మక్కువతో పురోగమించడం ద్వారా మాత్రమే ఒంటబడుతుంది. అనుభవాన్ని, దాని నుంచి నేర్చుకున్న పాఠాలను సంస్థలో అంతర్గత జ్ఞానంగా మార్చి, సిబ్బందితో పంచుకోవడం ద్వారానే అలీబాబా వంటి కంపెనీలు ప్రపంచంలో మేటిగా ఎదిగాయి. ఎప్పటికప్పుడు మారిపోయే అస్థిర మార్కెట్లలో భవిష్యత్తును అంచనా వేయడంకన్నా వేగంగా స్పందించగల, పరిస్థితులకు అనుగుణంగా మారగల సామర్థ్యానికే విజయం లభిస్తుంది. వ్యవస్థాపకులు వేగంగా తీసుకునే నిర్ణయాలు, వనరులను అవసరమైన చోటికి తక్షణం మళ్లించే విధానాలే వ్యాపార విజయానికి కీలకాలు. షావోమీ తన కొత్త మోడళ్లను నెలల వ్యవధిలోనే విడుదల చేస్తుంటుంది. విజయవంతమైన మోడళ్లనూ అదే పనిగా కొనసాగించదు. వ్యాపార వ్యూహమనేది సజీవ నిరంతర ప్రవాహమనే సూత్రమే షావోమీ విజయానికి మూలం.

చైనా కంపెనీలు అనునిత్యం అభివృద్ధినే జపిస్తాయి, పరితపిస్తాయి. నిరంతర ప్రగతి లేనిదే మనుగడే లేదన్నట్లుగా వ్యవహరిస్తాయి. వ్యాపారంలో ఎంత ఎత్తుకు ఎదిగితే అంతగా పోటీ నుంచి రక్షణ లభిస్తుందని, ప్రభుత్వ విధానాల్లో మార్పులను తట్టుకునే సత్తా లభిస్తుందని భావిస్తాయి. అందుకే వినియోగదారుల సంఖ్యను పెంచుకోవడానికి, కొత్త మార్కెట్లలోకి విస్తరించడానికి అహోరాత్రులు శ్రమిస్తాయి. అంతర్జాతీయీకరణను రక్షాకవచంగా భావిస్తూ ఎదుగుతాయి. బయటి ప్రపంచంలో పోటీ, సర్కారీ విధానాల్లో మార్పులు, అనూహ్య పరిస్థితులు సర్వసాధారణం. ఇలాంటి అస్థిరతను ఏ కంపెనీ అయినా బలమైన అంతర్గత సంస్కృతితోనే అధిగమించగలదు. లోతైన క్రమశిక్షణ కంపెనీ సంస్కృతిలో విడదీయరాని భాగం కావాలి. నిర్వహణా పద్ధతుల్లో లోపాలున్నా క్రమశిక్షణతో వాటిని అధిగమించి ముందుకు సాగవచ్చు. వ్యాపారమంటే అమ్మడం, కొనడంతో ముగిసిపోయే లావాదేవీల సంస్కృతి కాదని, అంతకు మించినదని గ్రహించాలి. అగ్రశ్రేణి చైనా కంపెనీలు ఈ గ్రహింపుతోనే దినదినాభివృద్ధి చెందుతున్నాయి.

వేగంగా కార్యనిర్వహణ

చైనాలో రాజకీయాల మాదిరిగానే వ్యాపారాలూ అగ్ర నాయకుడు(బిగ్‌బాస్), అంటే వ్యవస్థాపకుడి ఆధ్వర్యంలో నడుస్తాయి. నాయకుడంటే కేవలం అలంకారప్రాయంగా పదవిలో ఉండే వ్యక్తి కాదు. ప్రతి సాహసోపేతమైన నిర్ణయానికీ వ్యవస్థాపకుడే బాధ్యుడు. ఆ నిర్ణయాన్ని చురుగ్గా ఆచరణలో పెట్టే క్రియాశీల రూపశిల్పి కూడా. పాశ్చాత్య దేశాలకు ఇది నిరంకుశ కార్యశైలిగా కనిపించవచ్చు. కానీ, బిగ్‌బాస్ వ్యవస్థ అద్భుతమైన వేగంతో కార్యనిర్వహణ సాధిస్తుంది. వనరుల సమీకరణకు సమర్థ మార్గదర్శిగా పనిచేస్తుంది. అలాగని నాయకుడే అన్నీ చేయాలని కాదు, వ్యాపారాన్ని విస్తరించడానికి వృత్తిపరమైన నైపుణ్యాన్ని ఎప్పుడు, ఎలా నియోగించాలో కూడా ఉత్తమ నాయకులకు బాగా తెలుసు.

చివరగా, చైనాలో బుద్ధిగా నిబంధనలు పాటించినంత మాత్రాన వ్యాపారంలో విజయం దక్కదు. దాంతోపాటు బ్యాంకులు, స్థానిక అధికారులు, సరఫరాదారులతో ఉన్న సంబంధాలు, భాగస్వామ్యాల నెట్‌వర్కే కీలకం. దీని సాయంతో ఎంతటి క్లిష్ట పరిస్థితుల నుంచయినా గట్టెక్కగలుగుతారు. 'ద ఫార్చ్యూన్ మేకర్స్'లో వివరించిన విజయ సూత్రాలు కేవలం చైనాకే వర్తించే లక్షణాలు కావు. ప్రపంచంలో ఎక్కడైనాసరే వ్యాపార నిర్వహణలో అనిశ్చితిని, అస్థిరతను ఎదుర్కొనే ఏ నాయకుడికైనా మార్గదర్శిలా పనికొస్తాయి. కేవలం అధిక వనరులు లేదా పరిపూర్ణమైన సంస్థలు ఉన్నంత మాత్రాన విజయం లభించదు. మన చుట్టూ ఉన్నవారికన్నా వేగంగా మార్పుచేర్పులకు స్పందించే మనస్తత్వాన్ని అలవర్చుకోవడమే విజయానికి దగ్గరి దారి!



ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణ వేలమూరి

సీఈఐబీఎస్‌లో పూర్వ ఆచార్యులు, ఐఈఎస్ఈ (స్పెయిన్), ఎస్ఎస్ఈ (స్వీడన్), ఐఐఎం-ఏ, ఐఎస్‌బీ తదితరాల్లో విజిటింగ్ ప్రొఫెసర్



రేడియో ముచ్చట్లు!

కొన్ని మాధ్యమాలు కేవలం సమాచారాన్ని అందించవు, అవి సమాజాల గుండెచప్పుడుగా మారతాయి. అలాంటివాటిలో రేడియో ఒకటి. ఇది మన సామూహిక వినికిడి సంస్కృతికి నిదర్శనం. ఒకప్పుడు ఒకే రేడియో గ్రామపంచాయతీ నుంచి మైక్ ద్వారా ఊరంతా వినిపించేది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 93 శాతం ప్రజలను చేరగల సామర్థ్యం ఉన్న ఈ మాధ్యమం, నేటి డిజిటల్ యుగంలో కూడా తన స్థానాన్ని కోల్పోలేదు. అన్ని తరాలవారినీ అలరించగలగడం రేడియో ప్రత్యేకత.

చాలామంది దినచర్యలో రేడియో ఒక భాగం. టెలివిజన్‌లో 24 గంటల ప్రసారాలు మొదలయ్యేవరకూ రేడియోది ఏకచత్రాధిపత్యమంటే అతిశయోక్తి కాదు. అందులో ప్రసారమయ్యే కార్యక్రమాల సమయాన్ని బట్టి పనులు చేసుకునే అలవాటు ఎందరికో ఉండేది. టీవీ, ఆ తర్వాత మొబైల్ వచ్చి ఈ షెడ్యూల్‌ను దెబ్బతీసినా ఇప్పటికీ కారులో వెళ్తూ రేడియో వినేవాళ్లకు కొదవ లేదు. ప్రసార మాధ్యమాలు ఎన్ని ఉన్నా రేడియో శ్రోతలకు ఒకలాంటి అంతర్గత శాంతినిస్తుంది. సమయాన్ని గౌరవించడం, ప్రశాంతంగా వినడం నేర్పిస్తుంది. మాట్లాడే ముందు వినడం ముఖ్యమని చెబుతుంది. వినడమంటే అర్థం చేసుకోవడం, విభిన్న స్వరాలకు స్థానం ఇవ్వడం. ఈ వినికిడి సంస్కృతి బలంగా ఉన్నప్పుడే, సామాజిక సంభాషణలు ఆరోగ్యంగా ఉంటాయి. అంతేకాదు, దేన్నయినా చూసేటప్పుడు మనిషి నిష్క్రియాపరుడవుతాడు. కళ్లప్పగించి చూడటం తప్ప మరేమీ చేయలేడు. అదే వినేటప్పుడు చురుగ్గా, అప్రమత్తంగా ఉంటాడు. తన పని తాను చేసుకుంటూనే వింటున్న సమాచారానికి దృశ్యాన్ని ఊహించుకుంటాడు. ఈ స్వేచ్ఛే రేడియోను ప్రత్యేకంగా నిలబెడుతుంది.

రేడియో ఒక సమానత్వ వేదిక. చదువు, సంపద, వయసు... ఇవేవీ శ్రోతగా మారడానికి అడ్డంకులు కావు. ఎన్ని ఇంచులు, ఎంత క్లారిటీ, ఏ కంపెనీ... ఇవన్నీ అప్రస్తుతం. రిక్షావాలాకైనా, లగ్జరీ కారులో అయినా అదే రేడియో. అదే ఆనందం. అదే నమ్మకం. ఒకప్పుడు వాతావరణ సమాచారానికి, పాడీ పంటా తాలూకు సలహాలకు, మార్కెట్ ధరలు తెలుసుకోవడానికి... పల్లెటూళ్లలో రేడియోపైనే ఆధారపడేవాళ్లు. పొలంలో ఓ చెట్టుకింద పెట్టో, వెదురు గుంజకు కట్టో రేడియో వింటూ పొలం పనులు చేసుకునే రైతుల దృశ్యం సుపరిచితం. ఉరుకుల పరుగుల నగరజీవితంలోనూ రేడియో ఒక నిదానాన్ని నేర్పుతుంది. అది మనల్ని తొందరపెట్టదు, మనమూ దాన్ని తొందరపెట్టలేం. రేడియోలో మాటకి విలువెక్కువ. ఎందుకంటే దాంట్లో ముఖాలు కనిపించవు. అందుకే ఆచితూచి పదాలను వాడతారు. హాస్యం సున్నితంగా ఉండాలి, విమర్శ సమతూకంగా ఉండాలి, సమాచారం కచ్చితంగా ఉండాలి. ఈ నైతిక క్రమశిక్షణే రేడియోను నమ్మదగిన మాధ్యమంగా నిలబెట్టింది. సంగీత ప్రసారాల్లో కూడా ఇదే లోతు కనిపిస్తుంది. రేడియోలో మనకు నచ్చిన ప్లేలిస్ట్ ఉండదు, వాళ్లు వేసిన పాటలే వినాలి. అయినా సరే, లేటెస్ట్ హిట్స్ మధ్యలో అనుకోకుండా ఒక ఆపాత మధురం వినిపిస్తుంది. మనసును ఆనందడోలికల్లో విహరింపజేస్తుంది. అందుకే చాలా మందికి రేడియో ఒక నోస్టాల్జియా!

– డాక్టర్ నూకరాజు బెందుకుర్తి

ఆ ఎనిమిది...

పారిశ్రామిక రంగ ప్రగతి దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది. పెద్ద సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి అక్కరకొస్తుంది. అత్యవసర వస్తువులూ సరకుల ఉత్పత్తి ద్వారా జనజీవన ప్రమాణాల మెరుగుకు సహకరిస్తుంది. మన దేశంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఎక్కువగా భారీ పరిశ్రమలు నెలకొని ఉన్నాయి. దేశీయంగా సంఘటిత తయారీ రంగంలో మొత్తం కొలువుల్లో 60శాతం ఎనిమిది రకాలైన పరిశ్రమల నుంచే లభిస్తున్నాయి. ఆ పరిశ్రమలు, ఉపాధి కల్పనలో వాటి వాటా (శాతాల్లో)...

ఆహారోత్పత్తులు	11
వస్త్రాలు	9
ముడి ఖనిజాల వెలికితీత, శుద్ధి	8
మోటర్ వెహికిల్స్, సరకు రవాణా ట్రెయిలర్లు	7
ధరించడానికి సిద్ధమైన దుస్తులు	7
యంత్రాలు, యంత్ర పరికరాలు	6
రసాయనాలు, రసాయన ఉత్పత్తులు	6
ఇతర అలోహ ఖనిజ ఉత్పత్తులు	6

(ఆధారం: ఏఎస్ఐ నివేదిక)

కుటుంబం అండగా... ఆత్మవిశ్వాసం మెండుగా!

చదువు, విజ్ఞానం, మార్కులు, ర్యాంకులు, ఆర్థిక, సాంఘిక స్థోమత ఉన్నా- ఆత్మస్థైర్యం లేక, సమస్యలను ఎదుర్కోలేక సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతే వైఫల్యం తప్పదు. యువత జీవితంలో ముందడుగు వేయడానికి, ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి, కష్టనష్టాల్ని ధైర్యంగా ఎదుర్కోవడానికి... జీవన నైపుణ్యాలే ఆధారం. వీటిని సహజ రీతిలో కుటుంబం, సమాజం అందించడమే మేలు.

ప్రస్తుత కాలంలో సున్నితంగా పెరుగుతున్న పిల్లల్లో పరిపక్వత కొరవడుతోంది. చిన్నపాటి సమస్యను కూడా భరించలేకపోతున్నారు. పరీక్షల్లో తప్పినా, ఒక్కమార్కు తగ్గినా, మిత్రులు మాట్లాడకపోయినా, తల్లిదండ్రులతో విభేదించినా తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఏదో కోల్పోయామనే భావనతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఉద్వేగభరిత సందర్భాల్లో అవలంబించాల్సిన వ్యూహాలు, నైపుణ్యాలు తెలియక చిక్కులపాలవుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ యువత ఎదుగుదలలో ప్రత్యేకంగా పది జీవన నైపుణ్యాలు ముఖ్యమని పేర్కొంది. స్వీయజాగృతి అంటే తన సామర్థ్య పరిమితులు ఇష్టాయిష్టాలు ఆకాంక్షలను గుర్తించే నైపుణ్యం అందులో మొదటిది. సహానుభూతి, సమస్యా పరిష్కారం, నిర్ణయం తీసుకునే సామర్థ్యం, భావ వ్యక్తీకరణ, విమర్శనాత్మక ఆలోచనాశైలి, సృజనాత్మకత, వ్యక్తిగత సంబంధాల నిర్వహణ, భావోద్వేగాల నియంత్రణ, ఒత్తిడిని తట్టుకునే శక్తి వంటి జీవన నైపుణ్యాలను పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవడేలా చూడాలి. పాఠశాలలు, తల్లిదండ్రులు, సమాజం దీన్నొక బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన విద్యార్థులు సఫలీకృతమవుతారు. కనీసం పన్నెండో ఏట నుంచే పిల్లలకు జీవన నైపుణ్యాలను అలవరిచేలా తల్లిదండ్రులు, పాఠశాలలు కృషి సాగించాలి.

పెంపకంలో భాగం కావాలి!

పిల్లలకు వయసును బట్టి తరగతుల వారీగా కరికులం ఉన్నట్లుగానే, వయసువారీగా జీవన నైపుణ్య సాధనను పెంపకంలో భాగంగా చేర్చాలి. కౌమారంలో ప్రవేశించే పిల్లలు చదువులతోపాటు కుటుంబం, సమాజం నుంచి సహజసిద్ధంగా అలవరచుకోవాల్సిన అంశాలెన్నో ఉన్నాయి. కుటుంబ సభ్యులతో గడపడం, కుటుంబ కార్యకలాపాల్లో భాగస్వామ్యం కావడం, ఉమ్మడి కుటుంబాల నేపథ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించడం, సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడం వంటివి యువతకు తప్పనిసరి. పాఠశాలల్లో చదువులు, మార్కులే కాదు, మెరుగైన జీవితానికి అవసరమైన మెలకువలను కూడా అందించాలి. ప్రస్తుతం బడుల్లో నైతిక విలువలపై అవగాహన కల్పించడం, జీవన నైపుణ్యాలపై సలహాలు ఇవ్వడం వంటివి కొరవడ్డాయి.



పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబమే నిలువెత్తు పరిశోధన విశ్వవిద్యాలయంగా ప్రతి సమస్యకూ ప్రత్యక్షానుభవాల ప్రయోగశాలగా ఉండేది. జీవితాన్ని తీర్చిదిద్దుకునే నైపుణ్యాలను పాఠ్యాంశాలుగా చదవకున్నా, మానసిక పరిణతితో పటిష్ఠ పునాది పడేది. ప్రస్తుత కాలంలో చిన్నారులు అనునిత్యం మొబైల్, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల్లో గడపడంతోనే సరిపోతోంది. ప్రత్యక్షంగా మిత్రులు, బంధువులు, ఇరుగుపొరుగుతో సంభాషించే అవకాశమే లేకుండా పోయింది. అంతర్జాల అనుసంధానిత అనుబంధాలే అధికమయ్యాయి. ఇవి యువతను లోలోపలే కబళించి వేస్తున్నాయి. కంటి జబ్బులు, మానసిక ఒత్తిడి, సామాజిక రుగ్మతలు వంటివి ముప్పుగా పరిణమిస్తున్నాయి.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎదుగుతున్న పిల్లలకు ముఖ్యంగా కౌమార దశలో ఉన్న పిల్లలకు తల్లిదండ్రులు శారీరక, మానసిక, సామాజిక మార్పులపట్ల అవగాహన కల్పించాలి. ప్రతి విషయాన్నీ స్నేహపూర్వకంగా చర్చించాలి. అనుమానాలను నివృత్తి చేయాలి. భయాందోళనలను పారదోలాలి. స్వీయ సామర్థ్యాలను గుర్తించగలిగేలా ప్రేరణ ఇవ్వాలి. ఆలోచనలు, అభిప్రాయాలను సంకోచం లేకుండా వ్యక్తీకరించేలా వెన్నుతట్టాలి. విమర్శనాత్మక విశ్లేషణ, సృజనాత్మక ఆలోచన, వ్యక్తిగత సంబంధాలను మెరుగుపరచుకునే నైపుణ్యాల్ని పెంపొందించాలి. ఒత్తిడిని, భావోద్రేకాలను సంయమనంతో ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలి. తోటివారితో ప్రేమగా వ్యవహరించడం, శత్రుత్వ భావనలూ ప్రతికూల ఆలోచనల నుంచి బయటపడి విశ్లేషణాత్మక నిర్ణయాలు తీసుకునేలా పిల్లల్ని తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులదే.

మరెక్కడా నేర్పని విషయాలివి!

కుటుంబ భారాన్ని, సామాజిక బాధ్యతలను, ఆర్థిక అంశాలను తాము ఎలా సమన్వయం చేస్తున్నామనే విషయంపై పిల్లలకు అమ్మానాన్నలు లోతైన అవగాహన కల్పించాలి. కుటుంబాన్ని చక్కదిద్దడం, బంధువులూ స్నేహితులతో మాట్లాడటం, వారితో వ్యవహరించే తీరుతెన్నులు, సాటివారిని ఆప్యాయంగా పలకరించే విధానం వంటి ఎన్నో విషయాలు ఏ బడిలోనూ, వర్సిటీలోనూ బోధించలేరు. అందుకని, కుటుంబమే ఒక కళాశాల. జీవన నైపుణ్య శిక్షణలో కుటుంబం, సమాజం క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించే వేదికలు. కుటుంబం కోసం ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించాలి. ఆ కొద్ది సమయమే పిల్లల భవిష్యత్తును బంగారుమయం చేస్తుంది. విలువలతో కూడిన జీవన నైపుణ్యాలే జీవితాలకు సుస్థిర పునాదులవుతాయి. ఇళ్లలో తల్లిదండ్రులు రోజుకొక్కసారైనా గంటసేపు టీవీ, మొబైల్ పక్కనపెట్టి పిల్లలతో గడపడం, చర్చించడం, బంధువులూ స్నేహితులతో వారు కలిసిమెలిసి ఉండేలా చూడటం ముఖ్యం. తద్వారా యువత జీవన నైపుణ్యాలు అలవరచుకోవడంలో కొత్త ఒరవడికి నాంది పలకాలి.




మల్లాడి శ్రీనగేష్

విద్యారంగ సాంకేతిక సలహాదారులు, బాల రక్షా భారత్-సౌత్ ఇండియా

నాన్న సలహా...

రాకేశ్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. త్వరలో తనకు ఫైనల్ ఎగ్జామ్స్ రాబోతున్నాయి. కానీ ఎంత చదివినా.. ఒక్కోసారి సరిగ్గా గుర్తుండటం లేదు. దాంతో కాస్త భయంలో పడిపోయాడు. రోజు రోజుకు తనలో టెన్షన్ పెరిగిపోతోంది. అసలు చదవడం ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో అర్థంకావట్లేదు. కొన్నిరోజుల నుంచి రాకేశ్‌ను గమనించిన వాళ్ల నాన్న.. 'ఏంటీ ఏమైందీ? ఎందుకలా దిగులుగా ఉంటున్నావు?' అని అడిగారు. అప్పుడు తను ఎందుకు అలా ఉన్నాడో అంతా వివరంగా చెప్పాడు. అప్పుడాయన చిన్నగా నవ్వి.. 'దీనికే ఇంత భయపడుతున్నావా! సరైన ప్లాన్ లేకపోతే ఇలాగే ఇబ్బందిగా అనిపిస్తుంది. నేను చెప్పే చిన్న ట్రిక్ ఫాలో అవ్వు.. నీకు ఇక ఇంత గందరగోళం ఉండదు' అన్నారు. 'అవునా! ఏంటో తొందరగా చెప్పండి నాన్నా!' అన్నాడు రాకేశ్. 'ముందు ఏమేం చదవాలనుకుంటున్నావో వాటికి సంబంధించిన పాఠాల పేర్లతో ఒక టైం టేబుల్ తయారుచేసుకో. తరవాత బ్లూ, రెడ్, గ్రీన్ రంగు పెన్నులు నీ దగ్గర పెట్టుకో. ఒక పాఠం చదవడం పూర్తయ్యాక.. బ్లూపెన్‌తో టిక్ చేసుకో. రెండోసారి చదివాక రెడ్ పెన్‌తో మరో గీత పెట్టు. చూడకుండా ఓసారి మోడల్ పేపర్ రాశాక గ్రీన్‌పెన్‌తో మళ్లీ టిక్ చేసుకో అంతే! ఆ కాగితం మీద టిక్స్ పెడుతున్న ప్రతిసారీ.. నీలో భయం ఎగిరిపోయి.. 'నేను ఎగ్జామ్‌కి రెడీ!' అనే ధైర్యం వస్తుంది. ఇది నమ్మాలనిపించకపోతే.. ఒకసారి ప్రయత్నించి చూడు నీకే అర్థమౌతుంది' అన్నారు నాన్న. ఆయన సలహాని పాటించడం మొదలుపెట్టాడు రాకేశ్. ఆ పద్ధతిలో చదువుతున్నకొద్దీ మెల్లగా తన టెన్షన్ తగ్గిపోసాగింది. దాంతో అదే ట్రిక్‌ని తన స్నేహితులకూ చెప్పాడు రాకేశ్. ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా పరీక్షలు పూర్తి చేసుకున్నాడు. మంచి మార్కులు సాధించి తనే క్లాస్‌లో మొదటి స్థానంలో నిలిచాడు.




– కరణం హరికిషన్

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలు రాయండి. అన్నీ 'ర' అక్షరంతోనే ముగుస్తాయి. ఓసారి ప్రయత్నించండి.

1. నీటిలో పూచే పువ్వు
2. దూరం కాదు..
3. పంచదార
4. రోడ్డు వేయడానికి వాడేది
5. తిరునాళ్లు అంటే..
6. చేదుగా ఉండే కూరగాయ
7. మొదటకు వ్యతిరేకం..
8. --- సంక్రాంతి



జవాబు: 1.తామర 2.దగ్గర 3.చక్కెర 4.కంకర 5.జాతర 6.కాకర 7.చివర 8.మకర

పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?

- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి అవకాశం
- 'ఈనాడు-ఈటీవీ-విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ నేడు

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీపడుతూ ఎవరికి వారు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వం కూడా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తూ వారికి ప్రత్యేకంగా బోధిస్తోంది. అయితే పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయో.. మంచి మార్కులు వస్తాయో లేదో అన్న ఆందోళన అందరిలోనూ ఉంటుంది. తల్లిదండ్రులకు కూడా అనేక సందేహాలు ఉంటాయి. ఎలా చదివితే మంచి మార్కులు వస్తాయి.ఏయే సబ్జెక్టులకు ఎంత సమయం కేటాయించాలి.ఏయే చాప్టర్లలో ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నల సరళి ఎలా ఉంటుంది.సిలబస్ బయట ప్రశ్నలు కూడా అడిగే అవకాశం ఉంటుందా? మంచి మార్కులు సాధించడం ఎలా? ఇలాంటి అనేక సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఈనాడు కల్పిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా విద్యాశాఖాధికారితో పాటు ఆయా సబ్జెక్టుల నిపుణులు అందరినీ ఒకే వేదికపైకి తీసుకొస్తోంది. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఉపాధ్యాయుడు	సబ్జెక్టు	ఫోన్ నంబరు
కె.బాలకృష్ణ	తెలుగు	99492 77148
జె.ఝాన్సీ	హిందీ	92929 09954
పీఆర్ సీతాకుమారి	ఇంగ్లిష్	92904 50064
కె.వాహిని	గణితం	94417 63640
కె.అంకాలరావు	భౌతికశాస్త్రం	93904 31368
వీఎస్ మల్లేశ్వరరావు	జీవశాస్త్రం	98495 01067
షాజహాబేగం	సాంఘికశాస్త్రం	92939 45076
బి.దుర్గాదీప్తి	సంస్కృతం	98494 58556
ఎండీ హనీఫ్	ఉర్దూ	89786 77336

ఫోన్ చేయాల్సిన సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తేదీ: ఫిబ్రవరి 25, బుధవారం

28 వరకే జీవన ప్రమాణ ధ్రువీకరణ

ఎన్టీఆర్ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాల (లైఫ్ సర్టిఫికెట్) నమోదు గడువు ఈ నెల 28 వరకే ఉందని, ఇంకా దాఖలు చేయని వారు సత్వరమే అందజేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ ఐకాస అమరావతి అనుబంధం) నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సూర్యారావు, కె.ఎస్.హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

కుదిరితే బేరం.. కదిలేను దస్త్రం!

- రెవెన్యూలో పని కావాలంటే చెయ్యి తడపాల్సిందే
- తహసీల్దార నుంచి సర్వేయర్ల వరకు వసూళ్లు...

ఈనాడు, అమరావతి

రెవెన్యూ శాఖలో పని జరగాలంటే చేయి తడపాల్సిందే. పాస్‌పుస్తకం మొదలు సర్వే వరకు ఏ పత్రం కావాలన్నా ఇవ్వాల్సిందే. రైతులు ఎక్కడ వీరి కోరికలు తీర్చకపోతే కొర్రీలు పెట్టి వేధిస్తున్నారు. తహసీల్దార్లు తెర వెనుక ఉండి.. వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, రెవెన్యూ కార్యాలయాల్లో కథ నడిపిస్తున్నారు.

ఆ అధికారి లెక్కే వేరు..

★ తిరువూరు డివిజన్‌లో అనువంశిక భూముల ఆన్‌లైన్ ప్రక్రియలో భారీగా దండుకుంటున్నారు. గతంలో రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో వారసుల విభేదాలను సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో దరఖాస్తుకు ఆన్‌లైన్ చేసి.. పాస్‌పుస్తకం తెప్పించేందుకు రూ.50 వేలపైనే బాదేస్తున్నారు. ఓ రెవెన్యూ ఉన్నతాధికారి భారీగా మామూళ్లు వెనకేస్తున్నారు. కొన్నాళ్ల కిందట ఆయన ఓ ఉద్యోగిని ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. తన ఉద్యోగం పోతుందని వేడుకున్నా వినకపోవడంతో ఆమె సెలవుపై వెళ్లిపోయారు.

★ ఎకరం పాస్‌పుస్తకం ఇవ్వాలంటే.. రూ.5-10 వేలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు రూ.10-15 వేలు, సర్వేకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. కాదూకూడదంటే దరఖాస్తు చెత్తబుట్టలోకే.. రైతులు కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోరు. చేసేది లేక ఇచ్చేస్తున్నారు.

వీరంతే.. మారరింతే..

★ నందిగామ రెవెన్యూలో... కొన్ని గ్రామాల్లో పాస్‌పుస్తకం దరఖాస్తు ముందే రూ.5 వేలు ఇవ్వాలి. సర్వేయరుకు రావాల్సిన వాటా రూ.3-5 వేలు ఇస్తేనే సర్వే చేస్తారు. గతంలో నందిగామ రెవెన్యూ కార్యాలయంలో అనిశా తనిఖీల్లో దస్త్రాలు, వివిధ ధ్రువపత్రాల్లో అవకతవకలు, ముఖ్యంగా పాస్‌పుస్తకాల జారీలో అక్రమాలు గుర్తించారు. ఏకంగా 23 మందిపై క్రమశిక్షణ చర్యలకు ఉత్తర్వులు ఇచ్చినా మార్పు లేదు.

ప్రైవేటుగా పిలిచి బేరాలు..

★ ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ అధికారుల దందా హద్దు మీరుతోంది. ఒక్కో ప్రైవేటు వ్యక్తిని ఒక రేటు పెట్టి గుంజుతున్నారు. అర్జీదారులను సాయంత్రం ఆఫీసు తర్వాత ప్రైవేటుగా పిలిచి బేరమాడుతున్నారు. ఈ కథలో వీఆర్వోలు, ఆర్‌ఐలు, సర్వేయర్లు కీలకం. కొందరు అధికారులకు వాటాలున్నా.. తెర వెనక ఉండి ఆమ్యామ్యా తీసుకుంటున్నారు.

★ ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం మంజూరు చేసే ఏ పత్రానికి లంచం ఇవ్వొద్దు. అధికారులు, సిబ్బంది అడిగినా ఇబ్బంది పెట్టినా నా దృష్టికి తెస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

పసిగడితే లోపాలు.. కావండీ శాపాలు!

- రాజమహేంద్రవరం ఘటనతో ఉలిక్కిపడిన ఉమ్మడి కృష్ణా
- కల్తీ పాల విషయంలో అవగాహన ఎంతైనా అవసరం...

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో ఐదుగురి ప్రాణాలు పోవడంతో ఉమ్మడి జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. పాల వినియోగంలో మనమెంత భద్రం అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జీవన విధానంలో భాగమైన పాలను కొందరు అక్రమార్కులు కాసుల కక్కుర్తితో కల్తీ చేస్తున్నారు. వారి నుంచి మనల్ని కాపాడుకునేందుకు అవగాహన, అప్రమత్తత అవసరం. రాజమహేంద్రవరం ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం విజయవాడ నగరంలో 13 ప్రాంతాల్లో పాల నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు..
- ★ పాలిచ్చే పశువులు: 3,18,274
- ★ పాడి రైతులు: 95,000
- ✪ పాల దిగుబడి: 21,50,182
- ✪ గృహావసరాలకు: 9,00,000
- ✪ వ్యాపార, ఇతరాలు: 12,50,000
- (రోజుకు లీటర్లలో)



కృష్ణలంక శ్రీనివాస్ టవర్స్ వద్ద పాల తనిఖీ

సులభంగా కనుక్కోవచ్చు మిత్రమా..!

★ జిల్లాకు ఒంగోలు నుంచి కూడా పాలు వస్తుంటాయి. కర్ణాటక నుంచి ఇక్కడికి పాల పొడి పౌడర్ తయారు చేస్తున్నారు. పాలు తీశాక 4 గంటలకు మించి నిల్వ ఉండవు. ఐదే నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలుపుతున్నారు. దీంతో అనేక అనారోగ్య సమస్యలు వచ్చే వీలుందని నిపుణులు చెబుతున్నారు.

★ పాలు చిక్కగా ఉండేందుకు మొక్కజొన్న పిండి, వెన్న శాతం ఎక్కువ ఉండేందుకు వంట నూనెలు, నురగ కోసం డిటర్జెంట్, యూరియా కలుపుతున్నారు. కొన్ని రసాయనాలతో సింథటిక్ పాలు తయారు చేస్తారు. నూనె కలిపిన పాలు సాధారణంగా పాలలో ఉండే వెన్న శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. పాలు, పెరుగు జిగటగా ఉంటాయి.


★ పిండి కలిపిన పాలను గుర్తించేందుకు కొంచెం పాలు చేతిలో వేసుకుని నలిపితే పిండి ఉంటే పాలు వస్తుగా కనిపిస్తాయి. 3 మి.లీ. పాలను అంతే మొత్తం నీటితో మరగబెట్టి చల్లార్చక అందులో 5 చుక్కల అయోడిన్ ద్రావణం వేస్తే పాలు నీలం రంగులోకి మారితే పిండితో కల్తీ చేసినట్లే లెక్క. పాల రుచి చేదుగా ఉంటే కల్తీ జరిగినట్లే.

★ ఎక్కువ సమయం నిల్వ ఉంటే కల్తీ పాలు అని అర్థం. పాలను స్టీల్ పాత్రలోనే ఉంచాలి..ప్లాస్టిక్, అల్యూమినియం వాడకూడదు. కానీ జిల్లాలో 80 శాతంపైగా ప్లాస్టిక్ బాటిల్స్‌లోనే అమ్ముతున్నారు.

★ కొండపల్లి పాలలో 20 శాతం పైగా నీరు కలిపి విక్రయిస్తున్నారు. కొంత కాలం కిందట ఉమ్మడి జిల్లాలో ఆహార భద్రత అధికారులు 12 ప్రాంతాల్లో నమూనాలు సేకరించగా 7 నమూనాల్లో నీరు కలిపినట్లు నిర్ధారణ అయింది.

★ స్వచ్ఛమైన పాలు 0.55 డిగ్రీల దగ్గర గడ్డ కడతాయి. ఈ ఉష్ణోగ్రత మారితే నీరు కలిపినట్లే. మందుల దుకాణంలో యూరియా స్ట్రిప్స్‌పై పాల చుక్కలు వేయగానే గీతలు కనిపిస్తే యూరియా కలిపినట్లే. మిల్క్ అడల్ట్రేషన్ టెస్టింగ్ కిట్ ద్వారా కల్తీని గుర్తించవచ్చు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్: (బుధవారం) సాయంత్రం: 6.17
సహరి: (గురువారం) ఉదయం: 5.10

వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళికలు

కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో కుళాయిలపై నివేదిక

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో వచ్చే వేసవికి ఎక్కడా తాగునీటికి కొరత లేకుండా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. నాణ్యమైన తాగునీరు నిరంతరం సరఫరా జరిగేలా చూడాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా జల, పారిశుద్ధ్య మిషన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జల జీవన్ మిషన్ (జేజేఎం) పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి, సదరు పథకం ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. ఎ.కొండూరు మండలంలోని మూత్రపిండ వ్యాధి (సీకేడీ) ప్రభావిత ప్రాంతాల్లో ఇంటి కుళాయి కనెక్షన్ల భౌతికస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. నూరు శాతం కనెక్షన్లు కల్పించేందుకు డీపీవోకు ఆదేశాలిచ్చారు. గొల్లమండల తండా, జమలగడ్డ, దీప్లానగర్ వంటి గిరిజన ఆవాసాలకు అవసరమైన క్లియర్ వాటర్ సంప్ నిర్మాణం పూర్తి చేసి, మార్చి నాటికి తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)- ఓడీఎఫ్ ప్లస్, ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, నిఘా తదితరాలపై చర్చించారు. చేతి పంపులు, బోర్ల మరమ్మతులు, పైపు లైన్ల లీకేజీలు, కలుషిత నీటి నివారణ వంటి పనులు జరిగేలా చూడాలన్నారు. నీటి వనరుల నమూనాలను పరీక్షించి, ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ రామకృష్ణారావు, డీపీవో లావణ్య కుమారి, డ్వామా పీడీ ఎ.రాము, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి విజయకుమారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా సంరంభం







'ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ – 2026'కు మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధుల క్రీడా పోటీల సంరంభానికి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికైంది. ప్రజాప్రతినిధుల మధ్య స్నేహభావం.. క్రీడాస్ఫూర్తిని పెంచేలా నిర్వహించిన ఆటల పోటీలు ఆద్యంతం సందడిగా సాగాయి. - ఈనాడు, అమరావతి

చెన్నై చరవాణి.. చిక్కని చోర బాణీ!

- అద్దె ఖాతాల విశ్లేషణలో నయా వ్యవహారాలు...
- ప్రాథమిక వడపోతలో రూ.3.50 కోట్లుగా అంచనా

ఈనాడు, అమరావతి: తమ చట్టవ్యతిరేక వ్యవహారాలు బయటకు రాకుండా చెన్నై నుంచి వచ్చిన ఫోన్‌ను రవికుమార్ గుట్టుగా ఉపయోగించాడు. ఇతర మొబైళ్లను సంభాషణలు, చాట్స్‌కు ఉపయోగించకుండా కట్టడి చేసేందుకే కీలక సూత్రధారి సుబ్రమణి వెంకట్ ఈ ఎత్తుగడ వేశాడు. చెన్నైలో ఒక ఫోన్ కొని.. అక్కడే సిమ్ తీసుకుని యాక్టివేట్ చేశాడు. మొబైల్‌లో కాంటాక్ట్‌లు, వాట్సాప్‌లో గ్రూప్‌లను క్రియేట్ చేశాక దానిని కొరియర్‌లో విజయవాడకు పంపాడు. ఇందులో వాట్సాప్ ద్వారానే రవికుమార్, స్టీవెన్‌లు సమాచారాన్ని చెన్నై పంపేవారు. ఆయా ఖాతాలకు వచ్చే ఓటీపీలు, నగదు లావాదేవీల సమాచారాన్ని పంపేందుకు ఈ ఫోన్‌ను వాడారు.

ఆకాశ్ ఆచూకీ దొరకలేదు... ఏ అంచెలో ఎవరున్నారు? వారి వివరాలు తెలియకుండా ఈ పద్ధతి అవలంబించారు. ఒక అంచెలో వారు పోలీసులకు పట్టుబడినా.. మిగిలిన వారి సమాచారం తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రెండో రోజు కస్టడీలో నలుగురు నిందితుల నుంచి పోలీసులు పలు సమాధానాలు రాబట్టారు. చెన్నై నుంచి పంపిన మొబైల్‌లోని కాంటాక్ట్ లిస్టులో ఆకాశ్ పేరుంది. అతనెవరో తమకు తెలియదని రవికుమార్, స్టీవెన్‌లు చెప్పారు. సుబ్రమణి వెంకట్‌కు తెలుసని చెప్పారు. దీంతో ఇతని పాత్ర తేలలేదు.

వినియోగంలోకి రాని 23 ఖాతాలు... అమాయకుల నుంచి తీసుకున్న అద్దె ఖాతాల్లో రూ.కోట్లలో లావాదేవీలు సాగాయి. విజయవాడలో నిందితులు తీసిన 37 ఖాతాలను తెరిపించారు. ఇందులో రెండు ఎకౌంట్లు మూసేశారు. వీటిలోనూ 23 ఖాతాలను లావాదేవీల కోసం సిద్ధం చేసుకున్నారు. ఇంకా వినియోగంలోకి రాలేదు. 13 ఖాతాల ప్రాథమిక విశ్లేషణలో దాదాపు రూ.3.50 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు తేలింది. వీటి స్టేట్‌మెంట్లను సంబంధిత బ్యాంకుల నుంచి పోలీసులు తెప్పించారు. ఇతర రాష్ట్రాల్లో తెరిచిన వాటి వివరాలు ఇంకా బ్యాంకుల నుంచి రాలేదు.

వచ్చిందెంత? పోయిందెంత?...

ఖాతాల్లో నగదు లావాదేవీల తీరును పోలీసులు వడపోస్తున్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో లావాదేవీల చిట్టా ఉంది. ఇంటరాగేషన్‌లో ఈ వివరాలను రవికుమార్, స్టీవెన్ ముందుంచి ఆరా తీశారు. ఏ లావాదేవీ.. ఏ ఖాతాకు పంపారు? ఆ మొత్తం ఎవరికి చేరిందనే వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. ఏ ఖాతా ఎప్పుడు తెరిచారు? ఎప్పుడు మూసేశారు. లావాదేవీలు ఎన్ని? అని పోలీసులు సమగ్రంగా విశ్లేషిస్తున్నారు.

మిత్రమా... ప్రాణం విలువైంది!

- ★ నాసిరకం హెల్మెట్లతో ప్రమాదమే
- ★ ధర తక్కువని కొని తల్లడిల్లవద్దు

ఈనాడు, అమరావతి



జిల్లాలో రహదారి ప్రమాద మరణాల్లో అధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనాల కారణంగానే జరుగుతున్నాయి. ఇందులోనూ తలకు గాయమైనవే అధికం. హెల్మెట్ వినియోగించక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల తనిఖీలు కొంత తగ్గేసరికి.. శిరస్త్రాణం వాడకాన్ని తగ్గించారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ల వాడకంపై పోలీసులు దృష్టిపెట్టారు. నాసిరకం శిరస్త్రాణాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ద్విచక్ర వాహనదారులకు సూచిస్తున్నారు.

శిరస్త్రాణం లేకనే బలి...

నిత్యం నమోదవుతున్న ఉల్లంఘనల్లో ఎక్కువ భాగం హెల్మెట్ లేనివే. హెల్మెట్ ధరించకనే నగరంలో జరిగే ప్రమాదాలలో మరణాలు సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనం నడిపే వారు హెల్మెట్ వినియోగిస్తే.. ప్రాణం దక్కించుకోవచ్చు.

2025లో ఏ వాహన ప్రమాదాలు ఎన్నంటే..
- ★ రహదారి ప్రమాదాలు: 369
- ★ ద్విచక్ర వాహనాలు: 138
- ★ భారీ వాహనాలు: 102
- ★ కార్లు, నాలుగు చక్రాలు: 69
- ★ ఆటోలు 27 ★ ఇతర: 33
- మృతులు: 106 మంది

తలకు గాయంతో అధిక మరణాలు

★ నగరంలో రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ నాసిరకం శిరస్త్రాణాలను విక్రయిస్తున్నారు. ★ రూ.400లకే అమ్ముతూ.. కంపెనీవి అని అంటగడుతున్నారు. ★ తనిఖీలు తప్పించుకోవడానికి ఏదో ఒకటని కొంటే అసలుకే మోసం వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ★ షోరూమ్‌లలో ప్రామాణికమైనవే కొనాలి. ★ నాణ్యమైన అయితేనే.. ప్రమాదాల వేళ ప్రాణాపాయం నుంచి రక్షిస్తుంది. ★ వీటి తయారీవేళనే కఠిన పరీక్షలను తట్టుకునేలా తయారు చేస్తారు. నాణ్యమైనవి రూ.800-1000 ఉంటున్నాయి. ధర ఎక్కువైనా విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. ★ ప్రధానంగా తలకు గాయం కాకుండా కాపాడి.. మెదడుకు హాని జరగకుండా ఉంటుంది. ★ నాసివి అయితే ప్రమాద వేళ పగలడంతోపాటు తలకు గుచ్చుకుని ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది.

రహదారులపై ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు ఎక్కువగా ఉన్నప్పుడు ధరించడం, లేనప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. హెల్మెట్ ధరించేది మీ ప్రాణరక్షణ కోసమే గానీ పోలీసుల కోసం కాదు అని గమనించాలి.

అపోహలు వీడాలి - వైద్య నిపుణులు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు. జుట్టు రాలడం.. స్పాండిలైటిస్ వస్తుందనే వాదన ఎంతమాత్రం సరికాదు. దీని బరువు చాలా తక్కువ. 800-850 గ్రాములు ఉంటుంది. ఈ మాత్రానికే నరాలపై ప్రభావం చూపుతుందనే అపోహలను వీడాలి. స్పాండిలైటిస్ ఉన్న వారూ నిరభ్యంతరంగా వాడవచ్చు. నాణ్యమైనవి వాడితే ప్రమాదాల వేళ పగలవు. తలకు గాయమైతే చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయి. పక్షవాతం రావొచ్చు.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

రైతుల ఆశల్ని చిదిమేసిన గాలివాన

గంపలగూడెం, మైలవరం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: గాలివాన రైతుల ఆశలను చిదిమేసింది. గంపలగూడెం, మైలవరం, ఎ.కొండూరు మండలాల్లో సోమవారం అర్ధరాత్రి కురిసిన నాలుగైదు సెం.మీల వాన మొక్కజొన్న, మామిడి, మిరప రైతులను కన్నీటిపాలు చేసింది. మరో రెండు మూడు వారాల్లో చేతికందనున్న మొక్కజొన్న పంట వందల ఎకరాల్లో నేలవాలింది. పాలుపోసుకునే దశలో ఉన్న కండెల్లోకి నీరుచేరి బూజుపట్టే అవకాశం ఉందని రైతులు వాపోయారు. నేలవాలిన మొక్కలను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మామిడి పూత గుట్టలుగా రాలిపోవడంతో దిగుబడులపై గణనీయ ప్రభావం పడనుందని రైతులు వాపోయారు.



ఎ. కొండూరులో పడిపోయిన మొక్కజొన్న పంటను సరిచేస్తున్న మహిళా రైతు

కల్లాల్లో ఆరబెట్టిన మిరపకాయలు తడిసి బూజుపట్టనున్నాయని, తాలు కాయ ఎక్కువ వస్తుందంటున్నారు. ప్రభుత్వం సకాలంలో పంట నష్టం అంచనాలు వేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

మీరితే ఆపద.. క్షేమంగా పద..





బండిపై ముగ్గురు ఆడపిల్లలను కూర్చోపెట్టుకుని జాతీయ రహదారిపై ఒకరు వెళ్తుంటే.. మైనర్‌తోనే బండి నడిపిస్తున్నారు ఇంకొకరు.. పిల్లలపై ప్రేమ మంచిదే కానీ.. ట్రాఫిక్ నియమాలు పాటించకపోయినా.. వాహనాలపై ఎదురుగా వచ్చే వారు తప్పు చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. తస్మాత్ జాగ్రత్త. -ఈనాడు, అమరావతి

సేంద్రియ రామయ్య.. సేవలు భేషయ్య..

కూరగాయలు, పండ్లు పండిస్తూ.. ఉచితంగా పంచేస్తూ..

కంకిపాడు(మంతెన), న్యూస్‌టుడే

ఎనిమిది పదుల వయసులో.. మనుమలు.. మనుమరాళ్లతో సరదాగా గడిపే సమయంలో మండలంలోని మంతెనకు చెందిన పెండ్యాల రామారావు మాత్రం గ్రామానికి సేవ చేసేందుకు సంకల్పించారు. ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. కుమార్తె, కుమారుడు విదేశాల్లో స్థిరపడ్డారు. కానీ ఈయన మాత్రం పుట్టిపెరిగిన పల్లె, కుటుంబ ఉన్నత స్థితికి సహకరించిన పాఠశాల, తోటి గ్రామస్థుల సేవలో చరమాంకం గడపాలని నిశ్చయించుకున్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా శక్తిమేర ఆదుకుంటున్నారు. గత ఐదేళ్లుగా 40సెంట్ల స్థలంలో సేంద్రియ విధానంలో కూరగాయలు, పండ్లు స్వయంగా పండిస్తూ, ప్రతి రోజూ స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

సస్యరక్షణతో..: ఆరేళ్ల కిందట మొత్తం స్థలాన్ని లోతు దుక్కి చేయించి వానపాములు, మాగిన పశువుల ఎరువుతో కలగలిపారు. చీడపీడల నివారణకు పచ్చిమిర్చి, వెల్లుల్లి, వేపాకు, పొగాకు నుంచి తీసిన కషాయాన్ని పిచికారీ చేస్తున్నారు. 10 రకాల ఆకు కూరలు, 15 రకాల కాయగూరలు, ఐదు రకాల దుంపలు పండిస్తున్నారు. మరో 10 రకాల పండ్ల మొక్కలు దిగుబడి ఇస్తున్నాయి. రోజుకి సరాసరిన 10 కిలోల కూరగాయలు, మూడు కిలోల పండ్లు చేతికి వస్తున్నాయి.



తోటలో కూరగాయలు, పండ్ల మొక్కలు

అందరికీ సమంగా..: ఆరోజు కోతకు వచ్చిన కూరగాయలను సాయంత్రం 5 గంటలకు స్థానిక రెండు కూడళ్లలో ఉంచుతారు. అందరికీ సమంగా అందేలా భార్య విజయలక్ష్మి, మహిళా మండలి సభ్యులు పర్యవేక్షిస్తారు. పండ్లను రామారావు స్వయంగా ద్విచక్రవాహనంపై ఇంటింటికీ, స్థానిక జడ్పీ, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు సమంగా పంపిణీ చేస్తారు. పది సెంట్లలో విత్తనం వేసిన ముల్లంగి దిగుబడి అనూహ్యంగా రావడంతో వారం పాటు దాదాపు 500 కిలోల పంటను ఊరంతా పంచేశారు. ఇవేకాక గ్రామంలో పేదలకు వైద్య శిబిరాలు, పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేత లాంటి సాయం చేస్తున్నారు.



అన్నీ ఇచ్చిన గ్రామం రుణం తీసుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. దీనికి నా తండ్రి స్ఫూర్తి కాగా కుటుంబసభ్యులు, గ్రామస్థుల సహకారం అందిస్తున్నారు. శరీరం సహకరించినంతవరకు సేవలు అందిస్తా.
- పెండ్యాల రామారావు

మార్చి 6 నుంచి 8 వరకు మహాకుంభాభిషేకం



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్. పక్కన కలెక్టర్ సీపీ, దుర్గగుడి ఛైర్మన్, ఈవో తదితరులు

ఇంద్రకీలాద్రి: మార్చి 6 నుంచి 8 వరకు కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, ఈవో శీనానాయక్‌లతో కలిసి ఎంపీ కుంభాభిషేక మహోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం వైదిక కమిటీ, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. కనకదుర్గమ్మ ప్రధాన ఆలయ శిఖ విమాన గోపురాన్ని అభిమంత్రించిన అనేక పుష్కర మహా జీవనదులు, సముద్రోదకాలతో 12 ఏళ్లకు ఒకసారి కుంభాభిషేకం చేయడం ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయమని చెప్పారు. దేశవిదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తుల సమక్షంలో వేదపండితుల ఆధ్వర్యంలో క్రతువు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. కుంభాభిషేక మహోత్సవాలకు టీమ్ ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. కుంభాభిషేక మహోత్సవాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తామన్నారు. ఆలయ ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు స్థానాచార్య శివప్రసాదశర్మ, షణ్ముఖశాస్త్రి మహాకుంభాభిషేక కార్యక్రమ వివరాలను తెలియజేశారు.

తప్పించుకు తిరుగుతున్న అద్విక ఏజెంట్లకు నోటీసులు

ఈనాడు - అమరావతి

అద్విక ట్రేడింగ్ మోసం కేసులో దక్కాల్సిన దాని కంటే ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్ల నుంచి రికవరీపై పోలీసులు దృష్టి సారించారు. ఎక్కువ దక్కించుకున్న ఏజెంట్లు.. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. పదే పదే పిలిపించి గడువు ఇచ్చినా స్పందన కొరవడింది. తక్కువ మొత్తం చెల్లించాల్సిన వారే స్పందిస్తున్నారు. ప్రత్యేక ఖాతాలో ఆ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ఏజెంట్ల చిరునామాలకు వెళ్లి నోటీసులు ఇస్తున్నారు. హైదరాబాద్, ఒంగోలు, భీమవరం, గుంటూరు, తదితర ప్రాంతాల్లో ఉన్న వీరి ఇళ్లకు వెళ్లి తాఖీదులను ఇస్తున్నారు.

చెల్లిస్తే సరి.. లేకుంటే అరెస్టు...: హైదరాబాద్ సహా పలు జిల్లాల పరిధిలో దాదాపు రూ.413 కోట్లు వసూలు చేసి.. అద్విక ట్రేడింగ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఆదిత్య, ఆయన భార్య సుజాత కలసి.. హైదరాబాద్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 60 మందిపైగా ఏజెంట్లను నియమించుకున్నారు. దాదాపు 1,450 మంది నుంచి రూ.413 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేశారు. 1,139 మంది డిపాజిటర్లు రూ.255 కోట్లు పెట్టుబడి పెట్టగా.. ఇందులో రూ.120 కోట్లు మాత్రమే వచ్చింది. రూ.135 కోట్లు మేర పెట్టుబడిదారులు నష్టపోయారు. రూ.35 కోట్లు డిపాజిట్ చేసిన 204 మంది.. రావాల్సిన దాని కంటే అదనంగా రూ.21 కోట్లు అనుచిత లబ్ధి పొందారు. 32 మంది ఏజెంట్లు రావాల్సిన కమీషన్ కంటే అదనంగా రూ.49 కోట్లు తీసుకున్నారు. 30 మంది ఏజెంట్లు రూ.9 కోట్లు వరకు నష్టపోయారు. వెరసి డిపాజిటర్లు, ఏజెంట్లు కలిపి రూ.144 కోట్లు నష్టపోయినట్లు పోలీసులు తేల్చారు. ఇంకా చెల్లించాల్సిన ఏజెంట్లకు నోటీసుల్లో గడువు నిర్దేశించారు. ఆ సమయంలోగా చెల్లించకుంటే.. నిందితులుగా చేర్చి, అరెస్టు చేయనున్నట్లు హెచ్చరిస్తున్నారు. త్వరలోనే కేసును కొలిక్కి తెచ్చి అభియోగపత్రం దాఖలు చేసే యోచనలో ఉన్నారు.

కార్మికుల జీతాల విడుదలకు రాజీలేని పోరాటం



ఐక్యత చాటుతున్న శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, నూకరాజు, వెంకట్రావు, బలరామ్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికుల జీతాల కోసం రాజీలేని పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జీవో నంబరు 1615 ప్రకారం పీఆర్సీ జీతాలు, డీఏ, బకాయిలు, 12వ వేతన కమిషన్‌ను నియమించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాచౌక్‌లో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. గత సమ్మె కాలంలో 17 రోజుల ఒప్పందాలపై జీవో జారీ చేయకుండా కాలయాపన చేయడం విచారకరమన్నారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. మహిళా కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.నూకరాజు, ధనాల వెంకట్రావు, ఎన్.బలరామ్, ఎం.ఎల్.ఎన్.ఎల్లారావు, ఎస్.జ్యోతిబసు, సునీల్, కె.శ్రీనివాసరావు, వి.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు అదాలత్‌కు స్పందన



వినియోగదారుడి సమస్య వింటున్న విక్టర్ ఇమ్మానియేల్. వేదికపై రవీంద్రబాబు, కృష్ణనాయక్, కృష్ణ, సునీత

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు మంగళవారం ఉదయం విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్తు అదాలత్‌కు 12 ఫిర్యాదులు వచ్చాయి. వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్మన్, పూర్వ జిల్లా జడ్జి ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ ఫిర్యాదులు స్వీకరించారు. గన్నవరానికి చెందిన కె.గుప్తా, జి.శివ, తారాపేటకు చెందిన ఎల్.మధులు. స్మార్ట్ మీటరు పెట్టాక బిల్లు ఎక్కువగా వస్తోందని ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్మార్ట్ మీటర్ల పని తీరును ప్రత్యక్షంగా చూపిస్తామని చెప్పారు. బిల్ కట్టినా మీటర్ తొలగించారంటూ కొండపల్లికి చెందిన అలీ ఫిర్యాదు చేశారు.

లో ఓల్టేజీతో తప్పని ఇబ్బందులు

మహాత్మా గాంధీ రోడ్డుకు చెందిన కె.వెంకటప్పయ్య లోఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. గుణదలకు చెందిన కె.వెంకటేశ్వరరావు.. లైను మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కృష్ణలంకకు చెందిన పుణ్యవతి తమ పెంట్ హౌస్‌కు కొత్త విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలని కోరారు. మాజీ కార్పొరేటర్ బహదూర్.. విద్యుత్తు వైర్లు లూజుగా ఉండి ప్రమాదభరితంగా ఉన్నాయని అదాలత్ దృష్టికి తీసుకురాగా.. వాటిని వెంటనే సరి చేయిస్తామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. పటమట జేడీనగర్‌కు చెందిన ఎ.కృష్ణప్రసాద్.. నెట్ మీటరింగ్ లాభాలు తక్కువగా వస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై ఆయనకు ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ.. వినియోగదారులు ఏ సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకువస్తే, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక సభ్యుడు డి.కృష్ణనాయక్, ఆర్థిక సభ్యుడు కె.కృష్ణ, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈ యు.హనుమయ్య, టౌన్ ఈఈ పి.రవీంద్రబాబు, ఏడీఈలు, 16 విద్యుత్తు సెక్షన్లకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

ఆధునికంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక: ఎంపీ



అధికారులతో సమావేశమైన ఎంపీ శివనాథ్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఆధునిక నగరంగా విజయవాడను తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నగరాభివృద్ధిపై కమిషనర్ ధ్యానచంద్ర, ఇంజినీరింగ్ అధికారులతో ఎంపీ సమీక్ష నిర్వహించారు. స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు నగరపాలక సంస్థ తయారు చేసిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)పై సమీక్షించారు. ఎంపీ మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం పంట కాలువ డ్రెయిన్ వెడల్పు 2.5 మీటర్లు ఉండగా.. డీపీఆర్ ప్రకారం 8 మీటర్లకు పెంచడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోతుందన్నారు. వర్షపు నీటి డ్రెయిన్ల పూర్తి, కొండ ప్రాంతాల్లో వాన నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్లు నిర్మించేలా డీపీఆర్ తయారు చేశామని వెల్లడించారు. తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మరో డీపీఆర్ తయారు చేయాలని సూచించినట్లు తెలిపారు. పార్కుల అభివృద్ధిపై నివేదిక ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. కృష్ణలంకలో మరో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కొత్త వంతెనల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కోరినట్లు వెల్లడించారు. రైల్వే, ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ అధికారుల సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలని సూచించినట్లు పేర్కొన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధిపై నివేదిక సమర్పిస్తామని, మార్చికల్లా మంచినీటి పైపులైన్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీపై డీపీఆర్ అందిస్తామని తెలిపారు. ఫుడ్ కోర్టు విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్ర దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ పి.సత్యకుమారి, ఎస్ఈ(వర్క్స్) వి.చంద్రశేఖర్, ఈఈలు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణ పనులపై ఎంపీ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ ఆలయానికి భక్తులు సమర్పించే రూ.కోట్ల ఆదాయంతో నిర్మిస్తున్న అన్నదాన భవనం కేవలం రెండు అంతస్తులతో సరిపెట్టి ఎలివేషన్ పనులు చేయడమేమిటని అధికారులపై ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకదుర్గానగర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లతో కలిసి మంగళవారం పరిశీలించారు. దుర్గగుడి ప్రాంగణంలో అత్యంత విలువైన కనకదుర్గానగర్‌లో నిర్మాణం చేస్తున్న అన్నదాన భవన నిర్మాణం రెండు అంతస్తులకు పరిమితం చేయడం సరికాదన్నారు. ఇంత విలువైన స్థలం సరిగా ఉపయోగించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో నాలుగు అంతస్తులు నిర్మించి భక్తులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అవసరమైతే కేంద్రప్రభుత్వం ప్రసాద్ పథకం కింద నిధులు మంజూరు చేయిస్తానని ఎంపీ పేర్కొన్నారు. కారణాలు చెప్పకుండా వెంటనే నాలుగు అంతస్తులకు స్లాబ్ వేసే పనులు ప్రారంభించాలని సూచించారు.

పాల విక్రయ.. సేకరణ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పాల విక్రయ, సేకరణ కేంద్రాల్లో సమగ్ర తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిషేధిత మందులు (డ్రగ్స్), గడువు తీరిన వాటి విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మెడికల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తిస్తే వెంటనే సరుకు స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో నగరంలోని కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తూర్పు గోదావరి జిల్లాలో కల్తీ పాల విషాద ఘటన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, మిఠాయి దుకాణాలు, బేకరీలు తదితరాల్లో పరిశుభ్రత, గడువు తేదీలు, నిల్వ విధానం, నాణ్యతా ప్రమాణాలపై తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే పదార్థాలు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అనుమానాస్పద పాలు, ఆహార పదార్థాలు, మందులు వంటి వాటిపై అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సహకారంతోనే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

13 దుకాణాల్లో నమూనాల సేకరణ



పటమటలోని ఓ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో కొందరు మృతి చెందడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న పాల మొబైల్ కేంద్రాలు, పాల అమ్మకాల కేంద్రాల్లో జిల్లా ఆహార నియంత్రణ అధికారి శ్రీనివాస్ సారథ్యంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 13 దుకాణాల్లో పాలను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార నియంత్రణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామని, మరో వారం రోజుల్లో ఫలితాలు వస్తాయన్నారు. ఆ తర్వాత అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాతబస్తీ, విద్యాధరపురం, కృష్ణలంక, కొత్తపేట, గాంధీనగర్, కరెన్సీ నగర్, ఏలూరు రోడ్డు, గురునానక్ నగర్ తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశామని చెప్పారు.

28 నుంచి నెమలి ఆలయ బ్రహ్మోత్సవాలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. 28న వేణుగోపాలస్వామిని పెండ్లి కుమారునిగా అలంకరించి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 1న సాయంత్రం శేషవాహన మహోత్సవం, రాత్రి ఎదురుకోలు ఉత్సవం, 2న రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దివ్య కల్యాణం నిర్వహిస్తారు. 3న చంద్ర గ్రహణంతో ఆలయం మూసివేస్తారు. 4న రథోత్సవం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, పల్లకి ఉత్సవం, రాత్రి కోనేరులో తెప్పోత్సవం, 5న శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఆలయ ఉప ప్రధానార్చకులు తిరునఘరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికుల బృందం బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ పర్యవేక్షణలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు (కేజీ రూపాయల్లో)



ఎన్ఈసీసీ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, 152, 163 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను మంగళవారం బదిలీ చేశారు. కొద్ది నెలల క్రితం పలువురు తహసీల్దార్లు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి పోస్టింగులు ఇచ్చారు. విజయవాడ ఎన్టీఆర్ కలెక్టరేట్ కేఆర్సీ విభాగ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా వి.సుస్వాగతంను నియమించారు. ప్రస్తుత కేఆర్సీ విభాగ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబును విజయవాడ ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి (ఎఫ్.ఎస్.ఒ.)గా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఎఫ్.ఎస్.ఒ. ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన.. ఇక పూర్తి స్థాయిలో కొనసాగనున్నారు. విజయవాడ ఉత్తర (అజిత్‌సింగ్‌నగర్) తహసీల్దార్ ఎం.సూర్యారావును డిప్యూటీ కలెక్టర్ హోదాలో మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో సహాయ కార్యదర్శిగా బదిలీ చేశారు. పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్‌కు పీఏగా ఉన్న ఆర్.రమేష్‌బాబును ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా, మచిలీపట్నం ఆర్డీవోగా కె.సాంబశివరావును నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో అకాల వర్షం

తెలంగాణ సరిహద్దులో అధికంగా నమోదు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. తెలంగాణ సరిహద్దు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వత్సవాయిలో అత్యధికంగా 56.2 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. మైలవరం 40, నందిగామ 32.2, జగ్గయ్యపేట 26.4, జి.కొండూరు 18.4, పెనుగంచిప్రోలు 17.2, వీరులపాడు 16.2, ఎ.కొండూరు 15, చందర్లపాడు 13, ఇబ్రహీంపట్నం 10.4, విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమ 8.4, తిరువూరు 8.2, విజయవాడ పటమట 8, విజయవాడ ఉత్తరం 7.8, గంపలగూడెం 3.4, విస్సన్నపేట, కంచికచర్ల 2.6, రెడ్డిగూడెం 2.4, విజయవాడ గ్రామీణం మండలంలో 1.2 మి.మీ. మేర వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 14.90 మి.మీ.గా ఉంది.

ఇంధన సామర్థ్య రంగాన్ని బలోపేతం చేయాలి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఇంధన సామర్థ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రాజెక్టుల అమలు వేగవంతం చేయాలని ఏపీ జెన్‌కో ఇన్‌ఛార్జి ఎండీ, ఏపీ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ బజార్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నిర్వహించిన అయిదు ఇన్వెస్ట్‌మెంట్ బజార్ల ద్వారా సుమారు రూ.408 కోట్ల విలువైన ఇంధన ప్రాజెక్టులు గుర్తించామని తెలిపారు. వీటిని ఫైనాన్షియల్ క్లోజర్ త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఎనర్జీ ఎఫిషియెన్సీ పాలసీ 2024-2028 ప్రకారం 123 స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)-2017 అమలును తప్పనిసరి చేశామన్నారు. ఇప్పటి వరకు 1800 కంటే ఎక్కువ ఈసీబీసీ భవనాలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పరిశ్రమలు విద్యుత్తును పొదుపు చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ఈ పథకం కింద సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు 5 శాతం, మధ్య తరహా పరిశ్రమలకు 3 శాతం వడ్డీ రాయితీగా అందిస్తామన్నారు. 14 ప్రధాన రంగాలకు ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఆధ్వర్యంలో 59 పరిశ్రమలు పెద్ద మొత్తంలో ఇంధన పొదుపు సాధించాయన్నారు. ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించేందుకు 11 బ్యాంకులు, 2 నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెడ్‌క్యాప్ వైస్ ఛైర్మన్, ఎండీ ఎం.కమలాకర్‌బాబు, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ డైరెక్టర్ పి.శ్యామ్‌సుందర్, సుమారు 50 పరిశ్రమలు, ఆర్థిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదని మహిళా కండక్టర్ దుశ్చర్య

సహచర ఉద్యోగి కొడుకు, కూతురు ఫొటోలు అసభ్యంగా చిత్రీకరణ

విజయవాడ నేరవార్తలు: సహచర ఉద్యోగి తన వద్ద తీసుకున్న అప్పులు తీర్చలేదని ఆర్టీసీ మహిళా కండక్టర్ దుశ్చర్యకు పాల్పడింది. అతని కుమారుడు, కూతురు ఫొటోలను అసభ్యంగా చిత్రీకరించి వేధింపులకు పాల్పడడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. భార్య 20 సంవత్సరాల క్రితం విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి కొడుకు, కూతురుతో కలిసి ఉంటున్నారు. నరసరావుపేట డిపోలో పని చేసే సమయంలో.. అక్కడే కండక్టర్‌గా పని చేస్తున్న సైదాబి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నారు. కొంత తిరిగి చెల్లించారు. ఆరోగ్యం సరిగా లేక.. మిగతావి చెల్లించలేకపోయారు. ఈ క్రమంలో గన్నవరం బదిలీ అయ్యారు. సైదాబి అక్కడకు వచ్చి.. ఆయనతో గొడవపడింది. అధికారులకు ఫిర్యాదు చేసి ఉద్యోగం ఊడగొట్టింది. అతని కొడుకు, కూతురు ఫొటోలను ఏఐతో అసభ్యంగా చిత్రీకరించి.. అతనికే వాట్సాప్ చేసింది. ఆ ఫొటోలతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు తెరిచి.. అందరినీ డబ్బులు అడుగుతోంది. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరింపులకు దిగడంతో.. బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి ఫిర్యాదు చేయగా.. ఆమెపై కేసు నమోదైంది.

బాలుడిపై వీధి కుక్కల దాడి



గాయాలతో బాలుడు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: వీధి కుక్కలు బాలుడిపై దాడి చేసి విచక్షణారహితంగా కరిచాయి. సేకరించిన కథనం మేరకు.. విజయవాడ ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన రాచకొండ శివ, చిన్ని దంపతులు నివాసం ఉంటున్నారు. కొత్తపేట చేపల మార్కెట్ వద్ద పాత దుస్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు రిషి(9) 2వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్థానిక బాల భక్త సమాజం కల్యాణ మండపం ప్రాంతంలో సైకిల్ తొక్కుతూ ఉండగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా ఆ బాలుడిపై దాడి చేశాయి. ముక్కుపై తీవ్రంగా గాయమైంది. బాలుడు పెద్దగా ఏడుస్తుండడంతో స్థానికులు వచ్చి రక్షించారు. వెంటనే తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని బాలుడిని కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ వైద్యశాలకు తీసుకుని వెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలుడిని పరీక్షించి సర్జరీ చేయాలని సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. వీధి కుక్కల విషయమై పలుమార్లు వీఎంసీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని 48వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

సెంథిల్ కస్టడీ పిటిషన్‌పై విచారణ 26కు వాయిదా

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో సెంథిల్ (ఏ22) కస్టడీ కోసం ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్ మంగళవారం ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని వాదనల నిమిత్తం ఈనెల 26కు వాయిదా పడింది. నిందితుడి బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు జరిగాయి. తదుపరి విచారణ వచ్చే నెల 2కు కోర్టు వాయిదా వేసింది. ● ఇదే కేసులో జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ ఏడో ఏడీజే కోర్టులో వచ్చింది. నిందితులకు నోటీసులను కోర్టు ద్వారా రిజిస్టర్డ్ పోస్టులో పంపించారు. అనంతరం ఈనెల 26కు వాయిదా పడింది.

వాసుదేవరెడ్డి కస్టడీ కోరుతూ సిట్ పిటిషన్

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు వాసుదేవరెడ్డి (ఏ2)ని వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో 21న నిందితుడిని సిట్ అరెస్టు చేసింది. అప్పటి నుంచి గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. మంగళవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన కస్టడీ పిటిషన్.. బుధవారం విచారణకు వచ్చే వీలుంది. నిందితుడి తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేయనున్నారు.

పాన్ దుకాణాల్లో మెరుపు దాడులు

విజయవాడ నేరవార్తలు: విద్యా సంస్థలకు 100 మీటర్ల లోపు దూరంలో ఉన్న పాన్ దుకాణాలపై మంగళవారం ఈగల్ సెల్ మెరుపుదాడులు చేసింది. విద్యా సంస్థల పరిసరాల్లో మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తుల నివారణే లక్ష్యంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈగల్ ఐజీ ఆకె.రవికృష్ణ ఆదేశాల మేరకు సీఐ ఎం.రవీంద్ర, ఎస్సైలు ఎం.వీరాంజనేయులు, పి.రాంబాబు ఇతర సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ దంత వైద్య కళాశాల, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, పీబీ సిద్ధార్థ కళాశాల, ఎస్‌ఆర్ఎం చెన్నై హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిసరాల్లో తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న దుకాణాలపై జరిమానాలు విధించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే, చర్యలు తీసుకుంటామన్నారు.

అడ్డగోలు దర్శనాలపై ఛైర్మన్ ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడిలో అడ్డగోలు దర్శనాలపై పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. మాజీ స్పీకర్‌గా ఆయనకు ప్రొటోకాల్ దర్శనం చేయించేందుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వెంట వచ్చారు. స్పీకర్ కుటుంబంతోపాటు మరో పది మంది వీఐపీ మార్గంలో వెళ్తుండటంతో స్కానింగ్ పాయింట్ వద్ద ఉన్న ఛైర్మన్ రాధాకృష్ణ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పిలిపించారు. ఇరవై మందిని ఎందుకు తీసుకు వెళ్తున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ కుటుంబ సభ్యులు ఎనిమిది మంది మాత్రమే ఉన్నారని, మిగతా వారు తనకు తెలియదని వివరణ ఇచ్చారు. ఈ వివాదంతో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ఆశీర్వచన మండపానికి రాకుండా వెళ్లిపోయారు.

భవిత కేంద్రం సందర్శన

రెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ కె.నాగరాజు మంగళవారం సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, పరికరాలను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా పిల్లలను భవిత కేంద్రానికి తీసుకురావాలన్నారు.

అసెంబ్లీ ముట్టడిస్తాం

మైలవరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాల పెంపు అంశాన్ని వెంటనే తేల్చకపోతే, అసెంబ్లీ ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పుష్పకుమారి, శారద, సరోజిని, ఉష, అప్పల్, కవిత తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నైపుణ్యాలు పెంచుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యలో చేరిన దగ్గర్నుంచి విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని మైక్రోలింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ ఎండీ ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నచ్చిన కోర్సులను ఎంచుకుని, ఇష్టంగా చదవాలని సూచించారు. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్‌ను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ..., ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ నాగిరెడ్డి, రిసోర్స్ పర్సన్ మేకా శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

ఎ.కొండూరు: కంభంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు మంగళవారం ఒక్కో రైతుకు 2 బస్తాలు చొప్పున 540 బస్తాలు అందజేశామని సంఘం ప్రెసిడెంట్ కృష్ణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన.. జి.కొండూరు: వెలగలేరు రజక బజార్‌లో చేతి పంపు విషయమై పంచాయతీ కార్యదర్శి సరోజ దృష్టికి తీసుకురాగా ఆమె స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి పునరుద్ధరించారు.

తిరువూరు: పట్టణంలోని 8, 15వ వార్డుల్లోని కాలువల్లో దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సులేమాన్, అరుణకుమార్ సమస్యను మేమున్నాం మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ సిబ్బందితో దోమల మందు ఫాగింగ్ చేయించారు. పిచ్చి మొక్కలు తీయించారు.

? వేమిరెడ్డిపల్లిలో ప్రధాన రోడ్డులో విద్యుత్తు నియంత్రిక ఎత్తు తక్కువలో ఉండి ప్రమాదకరంగా ఉంది. - గ్రామస్థులు

✔ త్వరలో నియంత్రిక ఎత్తు పెంచుతాం. - ఎస్.విజయ్ భాస్కర్, ఏఈ, విస్సన్నపేట - విస్సన్నపేట, న్యూస్‌టుడే

గాలివాన బీభత్సం





గంపలగూడెం: తునికిపాడులో మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న ఏవో హరీష్‌కుమార్ ★ చల్లగుండ్లవారిపాలెంలో తడిసిన మిరపకాయలను ఆరబెడుతున్న రైతులు ★ గట్టు చెరువులో పూత రాలిన మామిడి కాయలను చూపిస్తున్న రైతు

గంపలగూడెం, మైలవరం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం అర్ధరాత్రి బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన అకాలవర్షం మొక్కజొన్న, మామిడి, మిరప పంటల్ని దెబ్బతీసింది. గంపలగూడెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి మంగళవారం వేకువజాము వరకు 5 సెం.మీ వర్షం కురిసింది. గంపలగూడెం మండలం తునికిపాడు, దుందిరాలపాడు, రాజవరం తదితర గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న ఈదురు గాలులకు నేలమట్టమైందని వ్యవసాయాధికారి వి.హరీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కండెలు పాలు పోసుకుంటున్న దశలో కురిసిన వానకు ఏపుగా పెరిగిన పంట పాడైపోయిందన్నారు. మామిడి తోటల్లో పిందెలు, లేత పూత గుట్టలుగా రాలిపోయింది. పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిరప కాయలకు అడుగున నీరు చేరి కొంత పంట తడిసింది.

ఎ.కొండూరులో తండాల్లో, రేపూడి, పోలిశెట్టిపాడు, వల్లంపట్ల, పాత రేపూడి గ్రామాల్లో ఈదురు గాలుల బీభత్సానికి మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. ... మిర్చిని టార్పాలిన్ పట్టలతో కాపాడుకునే ప్రయత్నం చేయగా, మరికొన్ని చోట్ల బస్తాల్లో నింపిన కాయలు తడిచాయని రైతులు వాపోయారు.

పొందుగల, మొర్సుమిల్లి పంచాయతీల పరిధిలో కొంత నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారు 28 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలినట్లు ప్రాథమిక అంచనా వేశామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు.

వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలో అత్యధికంగా 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కొన్ని గ్రామాల్లో గాలులకు మొక్కజొన్న పంట నేలవాలింది.

వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ ప్రసాదరావు, పక్కన ఎస్సై అనిల్

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించి బందోబస్తుపై అధికారులతో చర్చించారు. క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, కల్యాణ మండపం వద్ద గ్యాలరీలు, భక్తుల ప్రవేశం, దంపతులు తలంబ్రాలు పోయడం, కల్యాణం జరిగేటప్పుడు, భక్తుల రాకపోకల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. 28 నుంచి ఆలయం వద్ద పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. గుడి ప్రాంగణంలో సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, ఎస్సై జి.అనిల్, తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు వి.రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ ఎ.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె మగువకు చేరువైన మగ్గం వర్కు

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



బ్లౌజ్ క్లాత్‌కు డిజైన్ వేస్తున్న కార్మికుడు

వివాహాలు ప్రారంభం కావడంతో బ్లౌజ్‌లు, చీరలపై రకరకాల డిజైన్లు వేసే మగ్గం వర్క్ దుకాణాలు మహిళలతో కళకళలాడుతున్నాయి. నాడు పట్టణాలకే పరిమితమైన ఈ కళ నేడు గ్రామాలకు చేరింది. గ్రామీణ మహిళలను ఆకర్షిస్తోంది. కొండపల్లి పురపాలికతో పాటు ఆయా మండల కేంద్రాల్లో సుమారు 150కి పైగా మగ్గం దుకాణాలు వెలిశాయి. వీటిలో పని చేసేవారు అత్యధికులు ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన వారే. దశాబ్ద కాలంగా వారు మగ్గం వర్క్ చేస్తున్నారు. వేడుక ఏదైనా అలంకరణకు ప్రాధాన్యమిస్తున్న మగువలు బ్లౌజ్‌లపై డిజైన్లు వేయించుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో ఖర్చుకు వెనకాడటం లేదు. చీరలకు కూడా మగ్గం వర్క్ చేయించుకుంటున్నారు. సాధారణంగా ఒక్కో బ్లౌజ్‌పై డిజైన్ వర్కు చేసేందుకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు తీసుకుంటున్నారు. ఎక్కువ డిజైన్లు ఉంటే రూ.10 వేల వరకు తీసుకుంటున్నారు. మహిళలు తమ ఆర్థిక స్థితి, అభిరుచుల మేరకు డిజైన్లను ఎంచుకుంటున్నారు. బ్లౌజ్ కుట్టు కూలీ ధర కంటే డిజైన్ వర్క్‌కు నాలుగైదు రెట్లు ఎక్కువ ఖర్చు అవుతున్నా వెనుకాడటం లేదు.



వర్కు పూర్తయిన బ్లౌజ్

ఆదరణ పెరిగింది: ఐదేళ్ల కిందట సంపన్న వర్గాలకు చెందిన మహిళలే మగ్గం వర్క్ చేయించుకునేవారు. నాడు ఒకటి రెండు దుకాణాలే ఉండేవి. నేడు అన్ని వర్గాల మహిళలు ఈ కళ పట్ల మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మరింత డిమాండ్ పెరిగింది. యూపీ నుంచి పనివారిని తెప్పించి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. దీంతో ఖర్చు ఎక్కువ అవుతోంది. స్థానికులు కూడా ఈ కళ నేర్చుకుంటే ఖర్చు తగ్గుతుంది. -వెంకటేశ్వరరావు, మగ్గం వర్క్ షాపు నిర్వాహకుడు, ఇబ్రహీంపట్నం

పడిపోయిన మల్లెల ధర



చంద్రగూడెం మార్కెట్‌కు వచ్చిన మల్లెపూలు

మైలవరం, న్యూస్‌టుడే: నెల రోజులపాటు రైతుల్లో ఆశలు నింపిన మల్లెపూల ధర ఒక్కసారిగా పడిపోయింది. మొన్నటి వరకు కిలో సరాసరి రూ.600 వరకు పలికిన ధర మంగళవారం రూ.120కి పడిపోయింది. ఎప్పుడైతే దిగుబడులు పెరుగుతుంటాయో అప్పుడే మార్కెట్‌లో ధర పతనం మొదలై రైతులు వాపోతున్నారు. మల్లెసాగు మార్కెట్‌కు ప్రధాన కేంద్రంగా ఉన్న చంద్రగూడెంలో వారం పది రోజులుగా పూల సరఫరా పెరిగింది. రోజుకి నాలుగైదు టన్నులకు పైగా వస్తుండటం, స్థానికంగా ఉన్న వ్యాపారులే వాటిని కొని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వివాహాది శుభకార్యాలు మొదలైనా ధర తగ్గిపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. కోత ఖర్చులకే రాదని ఆందోళన చెందుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ కార్మికుల సమావేశం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో కార్మిక వ్యతిరేక విధానాలను ... ఎన్‌ఎంయూఏ(నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం డిపోలో గేటు మీటింగ్‌ను మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వం ఆలోచన దుర్మార్గమన్నారు. విద్యాధరపురం డిపోలో సిబ్బందిని పంపివేయడం, దానిని ఇతర సంస్థలకు అప్పగించడం హేయమని పేర్కొన్నారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకోవడానికి యూనియన్ ఆధ్వర్యంలో ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలకు అపార నష్టం



ముద్దగా మారిన పచ్చి ఇటుకలు

మైలవరం, న్యూస్‌టుడే: సోమవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఇటుక బట్టీలపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. నియోజకవర్గ పరిధిలో సుమారు 250 వరకు ఉన్న ఈ బట్టీల్లో కాల్చటానికి సిద్ధంగా ఉన్న సుమారు 5 లక్షల ఇటుకలు వర్షానికి తడిసి ముద్దగా మారి పనికిరాకుండా పోయాయి. మంగళవారం తెల్లవారుజామున బట్టీలను చూసిన నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. ఒక్కో ఇటుక మీద ఖర్చు చేసిన సుమారు రూ.3 నుంచి రూ.5 వరకు నష్టం వాటిల్లినట్లేనని, మరో 15 రోజులపాటు కార్మికులతో ఎటువంటి పనిచేయించలేని పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోయామని బట్టీల నిర్వాహకులు వాపోతున్నారు.

శిరస్త్రాణంపై అవగాహన ప్రదర్శన



జి.కొండూరులో శిరస్త్రాణంపై అవగాహన ప్రదర్శన చేస్తున్న ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు కోరారు. కట్టుబడిపాలెం, పినపాక, జి.కొండూరు గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ద్విచక్ర వాహనాలపై అవగాహన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్, వాహనదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన రహదారులు



పెనుగొలను ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మురుగు

గంపలగూడెం, న్యూస్‌టుడే: సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో పలు గ్రామాల్లో రహదారులపై బురద పేరుకుపోయింది. గంపలగూడెం, పెనుగొలను తదితర గ్రామాల్లో మురుగు రహదారులపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. సిమెంట్ రోడ్లు మురుగుతో నల్లగా మారాయి.

వైభవంగా గ్రామోత్సవం



సత్యాలపాడు గ్రామోత్సవంలో దేవతా మూర్తుల విగ్రహాలు

సత్యాలపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే: సత్యాలపాడు సమీప చెన్నవరం క్రాస్ రోడ్డులో విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠించనున్న దేవతా మూర్తుల విగ్రహాలకు మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం కుంకుమ పూజలు, హోమం, ధాన్యాధివాసం చేసి అనంతరం చెన్నవరం, సత్యాలపాడులో మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు. బుధవారం ఉదయం 10.14 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో గంగా పార్వతీ సమేత కాశీ విశ్వనాథ శివలింగం, గణపతి, ద్వారపాలకులు, నందీశ్వరుడు, నవగ్రహాలు, శిఖరం, దక్షిణామూర్తి, ఈశ్వరీదేవి, మత్స్య యంత్రం, కాలభైరవుడు, చండీశ్వరుడు, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, జంట నాగుల విగ్రహాలు, ధ్వజస్తంభం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠిస్తారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ వార్షికోత్సవం



మెట్టగుట్టలో కల్యాణం నిర్వహించిన ఉత్సవమూర్తులతో కమిటీ సభ్యులు

గంపలగూడెం: మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ 13వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్యామ్‌సుందర్ శ్రీనివాసాచార్యులు, యోగానందాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని శాంతికల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, ఉత్సవ నిర్వాహకులు ఎన్.నారాయణరావు, ఎం.నరసింహమూర్తి, పి.లక్ష్మణరావు, ఆర్.వెంకటసుబ్బారెడ్డి తదితరులు కల్యాణ వేడుకలో పాల్గొన్నారు.

భద్రావతిదేవి కల్యాణమహోత్సవం

తిరువూరు: తిరువూరు శ్రీ భక్తమార్కండేయ నగర్ పద్మశాలీ కమ్యూనిటీ భవనంలో భక్తులతో కిటకిటలాడింది. వేద మంత్రోచ్ఛరణల నడుమ భద్రావతి సమేత భావనారుషి స్వామివారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో వెంకటాచల స్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ పర్వతం శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

కంభంపాడులో.. శివాలయం

ఎ. కొండూరు: కంభంపాడులో మంగళవారం శ్రీ గంగా విజయదుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి వారి దేవాలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణను 2000 మందికి చేశారు.

బారికేడ్లను గుర్తించక.. మృత్యువుకు చేరిక

న్యూస్‌టుడే, కొండపల్లి

★ ఈ నెల 6న కొండపల్లి నుంచి ఇబ్రహీంపట్నం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లే బాలుడు ఎన్‌హెచ్‌ఏ(30) రహదారిపై ఉంచిన బారికేడ్‌ను ఢీకొని మృతిచెందాడు.

★ మూలపాడు కూడలి జాతీయ రహదారి (ఎన్‌హెచ్‌ఏ 65)పై ఈ నెల 14న బారికేడును ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు గాయాలపాలయ్యారు.

★ ఎన్టీటీపీఎస్ విశ్రాంత ఉద్యోగి ఏసుబాబు ఆదివారం సాయంత్రం కొండపల్లి డీఏవీ పాఠశాల జాతీయ రహదారిపై ఉంచిన బారికేడును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



రహదారిపై ఉంచిన బారికేడ్లు

వాహనాల వేగ నియంత్రణకు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద ద్విచక్ర వాహనదార్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారులైన 30, 65లపై ఈ ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి. బారికేడ్లను గుర్తించి వాటిని తప్పించే సమయానికే ప్రమాదాలు జరిగిపోతున్నాయి. కొందరు మృత్యువాత పడుతుంటే అనేక మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

మితిమీరిన వేగమే కారణమా : వరుసగా సంభవిస్తున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ద్విచక్ర వాహనదార్లు అందరూ అతివేగంతో వెళ్లడమే కారణంగా కనిపిస్తోంది. మద్యం తాగి వాహనాలు నడిపే క్రమంలో కూడా మత్తులో బారికేడ్ల వద్ద వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. వీటితో పాటు కంకర, ఇసుక కూడా ద్విచక్ర వాహనదార్లకు శాపంగా మారింది. బారికేడ్ల వద్ద మలుపు తిరిగే చోట ఇసుక, కంకర వాహనాల నుంచి రహదారిపై కంకర, ఇసుక పడిపోతున్నాయి. ఈక్రమంలో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనాలు వాటి మీదుగా వెళ్లినప్పుడు జారి ప్రమాదాలకు గురవుతున్నారు.

నిబంధనలపై అవగాహన లేకనే.. : ప్రమాదాల నివారణకు నిర్వహిస్తున్న కార్యక్రమాలతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై వాహనదార్లకు అవగాహన లేక పోవడమే ప్రమాదాలకు తావిస్తోంది. ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి వేగం పాటించాల్సిన సూచిక బోర్డులను, రాత్రి వేళ బ్లింకింగ్‌ను, జాతీయ రహదారిపై యల్లో రంగుల్లో తంబుల్ స్టిక్స్‌ను ఏర్పాటు చేశాం. బ్లాక్ స్పాట్స్‌లో బారికేడ్లను ఏర్పాటు చేశాం. రెండు బారికేడ్ల మధ్య నుంచి భారీ కంటెయినర్ సైతం వెళ్లే వీలున్నా వాటిని పట్టించుకోకుండా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. - ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ

పెన్నులు, అట్టల వితరణ

తిరువూరు, న్యూస్‌టుడే: మునుకుళ్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2013-14 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం పరీక్ష అట్టలు, కలాలు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు భారతి పూర్వ విద్యార్థులను అభినందించారు.

సమస్య పరిష్కరించరూ..

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ప్రసాద్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే పోరాటాలు తప్పవంటూ ఆ ప్రాంత వాసి, ఆర్‌ఎంపీ దాస్ మంగళవారం రాత్రి మురుగు నీటిలో కూర్చొని నిరసన తెలిపారు. మురుగు నీటి పారుదల వ్యవస్థ సరిగ్గా ఏర్పాటు చేయకుండా కాలువపై దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం సరైంది కాదన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తిపై హర్షం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామంలో ఇటీవల రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తెదేపా ప్రజా ప్రతినిధులు, అధికారులకూ ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంతంగా సీనియర్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు



విస్సన్నపేటలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం నాలుగు కేంద్రాల్లో 1501 మందికి గాను 1463 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని కస్టోడియన్ అధికారి రెబ్బ మురళీకృష్ణ తెలిపారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కంభంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు మెత్తం 133 మంది గాను 129 మంది హాజరయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: పెదకొమిర ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో మంగళవారం ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఐదు ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఉదయం 8 గంటలకే కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రం లోపలకు అనుమతించారు.

మైలవరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష మంగళవారం ప్రారంభమవగా, మైలవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 218 మందికి, ముగ్గురు, స్థానిక ఎస్వీఆర్‌జీ కళాశాలలో 261 మందికి నలుగురు గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు.

నిర్లక్ష్యాలను సహించేది లేదు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ షరీనా బేగం, ఏడీసీపీ రామకృష్ణ, ఎస్సైలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే సహించేది లేదని ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం అన్నారు. ఇబ్రహీంపట్నం కూడలిలో ద్విచక్ర వాహనదార్లకు మంగళవారం రాత్రి ప్రత్యేక డ్రైవ్‌పై నిర్వహించారు. శిరస్త్రాణం ధరించని వారిని, మద్యం తాగి వాహనం నడిపేవారిని, వ్యతిరేక మార్గాల్లో ద్విచక్ర వాహనంతో వెళ్లే వారిని స్థానిక స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి పలు హెచ్చరికలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి చేయరూ..



రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు పంట పొలాలకు వెళ్లే రహదారిపై రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. రుద్రవరం గ్రామం కొత్తూరు నుంచి తూర్పు వైపు ఉన్న పంట పొలాకు వెళ్లే మట్టి రోడ్డు బురదకయ్యగా మారి అవస్థలు పడుతున్నారు. పంటలకు ఎరువులు, మందులు తరలించాలంటే కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. తారు రహదారిగా అభివృద్ధి చేసి పండించిన పంటలు గృహాలకు తరలించుకొనే సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

క్రీడాకారులకు అభినందనలు



అభినందిస్తున్న ఛైర్మన్ కొల్లి రవికుమార్

జి.కొండూరు: విజయవాడ సిద్ధార్థ కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ ఫెస్ట్‌లో జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలోని శ్రీవాణి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫార్మసీ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 22 క్రికెట్ టీములు పాల్గొనగా శ్రీవాణి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫైనల్‌కు చేరుకుని కప్ చేజిక్కించుకున్నారు. ప్రతిభ చాటిన వారిని మంగళవారం కళాశాలలో ఛైర్మన్ కొల్లి రవికుమార్, ప్రిన్సిపల్ ఎన్.ఉషారాణి అభినందించారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పౌరుల సహకారం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : మాదకద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి పౌర సమాజం సహకారం అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల కట్టడిపై మంగళవారం ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్. పరిమి మాట్లాడుతూ.. పోలీస్ యంత్రాంగం, రాజకీయ ప్రమేయం లేకుండా విద్యాసంస్థల పరిసరాల్లోకి గంజాయి ఎలా ప్రవేశిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గమనించాలని సూచించారు. ప్రముఖ వైద్యుడు ఎస్.సుధాకర్ మాట్లాడుతూ.. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా సామ్రాజ్యవాదం ఆఫ్గానిస్తాన్‌లో రైతులను అధిక ఆదాయం ప్రలోభంతో గంజాయి పండించేలా ప్రోత్సహించిందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపేలా ప్రజా ఉద్యమం చేయాలని పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మానవ జాతి అంతరించేలా మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది మొత్తంలో కేసులు పట్టుకునే పోలీసులు.. టన్నుల కొద్దీ సరఫరాను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మాదకద్రవ్యాల అంశంపై ప్రభుత్వం పాలసీని ప్రకటించాలని కోరారు.

వైద్యురాలికి వరకట్న వేధింపులు

మధురానగర్, న్యూస్‌టుడే : పెళ్లై నాలుగు సంవత్సరాలు అవుతున్నా.. అదనపు కట్నం కోసం వైద్యురాలిని వేధిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. రామలింగేశ్వరపేటకు చెందిన ఓ యువతి ఎంబీబీఎస్ చదివారు. 2022, మే నెలలో సాయి గణేష్‌తో ఆమెకు వివాహమైంది. కట్నం కింద రూ.15 లక్షల నగదు, 30 గ్రాముల బంగారం ఇచ్చారు. ఆ తర్వాత భర్త రోజూ తాగివచ్చి వేధిస్తున్నాడు. ఇంకా కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో.. బాధితురాలు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు మూర్ఖులు

జస్టిస్ జీఆర్ స్వామినాథన్

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువులను దైవస్వరూపాలుగా చూడనివారు దుర్మార్గులు, మూర్ఖులు, ఆటవికులని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు. తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దర్గావద్ద ఉన్న రాతిస్తంభంపై మురుగన్ భక్తులు కార్తికదీపం వెలిగించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించి, అమలుచేయలేదు. డీఎంకే నేతలు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ స్వామినాథన్ మాట్లాడుతూ... గురువు అంటే భగవంతుని స్వరూపమన్నారు. భగవంతుని పాదాలు తాకలేమని, అయితే గురువు పాదాలను తాకడం సులభమని చెప్పారు. తమిళనాడులో హేతువాదులు గురువును భగవంతునిగా చూస్తున్న మనల్ని దుర్మార్గులు, మూర్ఖులు, ఆటవికులుగా భావిస్తున్నారన్నారు. కానీ నిజమైన దుర్మార్గులు, మూర్ఖులు, ఆటవికులు వారేనని తెలిపారు. గురువు అనుగ్రహం వల్ల ధైర్యం, సాంత్వన లభిస్తాయన్నారు. గురువుల దగ్గరకు వెళ్లినప్పుడు వారి ప్రకాశం భక్తుల బలహీనతలను తొలగించడానికి సహాయపడుతుందని చెప్పారు. తన పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉందని, మరింత ధైర్యంతో పనిచేయాలని అనుకుంటున్నట్లు జస్టిస్ స్వామినాథన్ వ్యాఖ్యానించారు.

పులివెందుల చేరుకున్న జగన్



ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: మూడురోజుల పర్యటనలో భాగంగా వైకాపా అధ్యక్షుడు జగన్ వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల చేరుకున్నారు. మంగళవారం ఆయన బెంగళూరు నుంచి పులివెందుల సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు స్వాగతం పలికారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సాయంత్రం జగన్ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. గతంలో కార్యకర్తల మధ్య తోపులాట జరిగిన నేపథ్యంలో గోడలపైనా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజాదర్బార్ అనంతరం జగన్ తన స్వగృహానికి వెళ్లారు. బుధవారం ఉదయం వేంపల్లె మండలం నందిపల్లెలోని నందీశ్వరాలయం ప్రారంభోత్సవానికి ఆయన హాజరు కానున్నారు.

అదానీ గంగవరం పోర్టులో ఐరన్ ఓర్ బ్లెండింగ్ సదుపాయం

- ప్రత్యేక సెజ్ ఏర్పాటు
- ఇండియా-బ్రెజిల్ బిజినెస్ ఫోరమ్‌లో కుదిరిన ఒప్పందం..

ఈనాడు, అమరావతి: అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీ సెజ్) అనుబంధ సంస్థ అయిన అదానీ గంగవరం పోర్టు, ఎన్ఎండీసీ, బ్రెజిల్‌కు చెందిన వేల్ ఎస్ఏ సంస్థల మధ్య మంగళవారం కీలక ఒప్పందం కుదిరింది. దిల్లీలో జరిగిన ఇండియా-బ్రెజిల్ బిజినెస్ ఫోరమ్‌లో ఈ ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా అదానీ సంస్థ గంగవరం పోర్టులో ఐరన్ ఓర్ బ్లెండింగ్ సదుపాయాన్ని కల్పించనుంది. ప్రత్యేకసెజ్ ఏర్పాటుచేయనుంది. వీటివల్ల పోర్టు సామర్థ్యం 75 ఎంఎంటీకి చేరనుంది. ఈ ఒప్పందం వల్ల ఐరన్ ఓర్ ఎగుమతుల్లో భారత్ స్థానం మరింత బలోపేతం కానుంది.

వర్చువల్ డిజిటల్ ఆస్తుల దర్యాప్తుపై శిక్షణ

ఈనాడు, అమరావతి: అవినీతి అధికారులు డిజిటల్ ఆస్తులు, షెల్ రూపంలో దాచుకుంటున్న అక్రమాస్తులను గుర్తించేందుకు వీలుగా ఏసీబీ వర్చువల్ డిజిటల్ ఆస్తుల దర్యాప్తుపై తమ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)తో కలిసి నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ ఇచ్చింది. వర్చువల్ డిజిటల్ ఆస్తుల్లో తాజా ధోరణులు, క్రిప్టోకరెన్సీ లావాదేవీలు, బ్లాక్‌చెయిన్ విశ్లేషణ, క్రిప్టో వాలెట్ ట్రేసింగ్, స్వాధీన విధానాలు, డిజిటల్ సాక్ష్యాల సంరక్షణ, చట్టపరమైన అంశాలపై సాంకేతిక శిక్షణ అందించినట్లు ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ నుంచి అవార్డు అందుకుంటున్న డా.శిరీష్ కుమార్ చవాన్

ఉత్తమ బోధనాసుపత్రిగా సనత్‌నగర్ ఈఎస్ఐసీకి అవార్డు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉత్తమ బోధనాసుపత్రిగా హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆసుపత్రికి అవార్డు దక్కింది. ఈఎస్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, యువజన సర్వీసుల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చేతులమీదుగా డీన్ డా.శిరీష్ కుమార్ చవాన్ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఉత్తమ ఈఎస్ఐసీ బోధనాసుపత్రుల జాబితాలో సనత్‌నగర్ ఈఎస్ఐసీ మొదటి స్థానంలో, హర్యానా ఫరీదాబాద్‌లోని ఈఎస్ఐసీ బోధనాసుపత్రి రెండో స్థానంలో నిలిచాయి.

అక్రమ మైనింగ్‌తో ఖజానాకు ఎంత నష్టం జరిగిందో చెప్పండి

- జస్టిస్ సుధాంశు ధులియా కమిటీకి సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్-కర్ణాటక సరిహద్దుల్లోని ఏపీ భూభాగంలో ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి ఇచ్చిన ఇనప గనులు, అక్కడి అటవీప్రాంత హద్దులను ఖరారు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నాలుగు విషయాలను తన నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. ఏపీ ప్రభుత్వం అనుమతి పొందిన సంస్థలు రిజర్వ్ ఫారెస్టును ఆక్రమించాయా? లేదా? అక్రమ మైనింగ్, ఇతర అనధికార కార్యకలాపాల తీవ్రత ఎంతమేర ఉంది? ప్రభుత్వ ఖజానాకు ఎంతమేర నష్టం జరిగిందన్నది చెప్పాలని నిర్దేశించారు. ఓఎంసీ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నట్లు 2009 నవంబరు 19న సమ్మిరెడ్డి కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గనుల లీజులను సస్పెండ్ చేయగా, ఆ ఉత్తర్వును కొట్టేస్తూ ఏపీ హైకోర్టు 2010 ఫిబ్రవరి 26న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలుచేసింది. దానిపై మంగళవారం జస్టిస్ జోయ్‌మల్య బాగ్చితో కలిసి విచారించిన సందర్భంగా సీజేఐ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. గత ఏడాది సెప్టెంబరు 19న జస్టిస్ సుధాంశు ధులియా ఆధ్వర్యంలో సుప్రీం ధర్మాసనం ఏర్పాటుచేసిన కమిటీ మరో ఆరువారాల గడువు అడగడంతో మంగళవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అందుకు అంగీకరించారు.

సీఈసీ నుంచి ఏం ఆశించగలం?

కర్ణాటకకు చెందిన సమాజ పరివర్తన సముదాయ తరఫు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వాదనలు వినిపిస్తూ 'అంతర్రాష్ట్ర సరిహద్దులో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరిగింది. దీనిపై దర్యాప్తు జరిపిన సీఈసీ 2014 వరకే రిపోర్టు దాఖలుచేసింది. తర్వాత జరిగిన దర్యాప్తు ఏమైందో తెలియదు. ఇక్కడ ఆరు గనుల లీజుదారులు సరిహద్దులు, కొండలు, ఆలయాలను ధ్వంసం చేశారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ 'సరిహద్దుల అంశం చాలా సున్నితమైనది. దురదృష్టవశాత్తు 11 ఏళ్లుగా ఏమీచేయని సీఈసీ నుంచి మనం ఇప్పటికిప్పుడు ఏం ఆశించగలం? ఇప్పుడు జస్టిస్ సుధాంశు ధులియా కమిటీ సరిహద్దుల ఆవల మైనింగ్ జరిగినట్లు చెబితే సీబీఐ దర్యాప్తు మళ్లీ మొదలుపెట్టవచ్చు' అని పేర్కొన్నారు. కర్ణాటకలోని మైనింగ్ సంస్థల తరఫు న్యాయవాది బసవప్రభు పాటిల్ వాదనలు వినిపిస్తూ 'ఇప్పుడు లీజు హద్దులను ఖరారుచేయడం ఒక్కటే మిగిలింది. ఆ బాధ్యతలనే జస్టిస్ ధులియా కమిటీకి అప్పగించారు' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సీజేఐ స్పందిస్తూ అక్రమంగా దండుకున్నవారి సంగతేంటని ప్రశ్నించారు. 'ఉదాహరణకు మీరు ఆంధ్రప్రదేశ్‌లో లీజు ఇచ్చారు. కానీ లీజు పొందిన వ్యక్తి అది కర్ణాటక కిందికి వస్తుందని చెప్పి తవ్వకాలు చేపట్టి ఉండొచ్చు. అలాగే కర్ణాటక వైపు లీజులు ఉంటే అది ఆంధ్రా వైపుని చెప్పి తవ్వి ఉండొచ్చు. వాళ్లు తమ పని చక్కబెట్టుకుని వెళ్లిపోయారు' అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా జవాబిస్తూ 'నిజాలు బయటికి రావాలన్న ఉద్దేశంతో స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని మేం కోరాం. ఆ కమిటీ ఆరు వారాల సమయం అడిగినందున అంత వరకు వేచిచూడటం మంచిది' అన్నారు. దీంతో సీజేఐ ఆ కమిటీకి ఆ గడువునిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీకాకుళంలో విజృంభిస్తున్న అతిసారం

- 3 రోజుల్లో 76 కేసులు, ఒకరి మృతి
- మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేత



శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అతిసారం ప్రబలుతోంది. మూడు రోజుల్లో 76 కేసులు నమోదయ్యాయి. దీంతో సీఎం చంద్రబాబు మంగళవారం రెండుసార్లు జిల్లా అధికారులతో సమీక్షించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక బృందాలు నియమించారు. బాధితుల్లో మొండేటివారి వీధికి చెందిన ఎం.సురేష్(43) మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబానికి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే శంకర్ రూ.10 లక్షల పరిహారం అందజేశారు. మరొకరు కూడా ప్రాణాలు కోల్పోగా అతిసారంతోనా లేక మరేదైనా కారణం ఉందా అనే విషయంపై స్పష్టత లేదు.

కలుషిత నీరే కారణమా?

అతిసారం ప్రబలడానికి తాగునీరు కలుషితం కావడమే కారణమని అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని వీధుల్లో రోడ్డువిస్తరణ పనులు చేపట్టారు. పైపులైన్లు పగలడంతో వాటిలోకి మురుగు నీరు చేరిందని భావిస్తున్నారు. ఎక్కువగా దమ్మల వీధి, గుడి వీధి, మంగువారితోట, కాకివీధి ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీంతో మురుగునీటి కాలువల్లో పైపులైన్లు, లీకేజీల గుర్తింపునకు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య బృందాలను రంగంలోకి దించారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు విశాఖలోని ల్యాబ్‌కు పంపారు. ప్రభావిత ప్రాంతాల్లో రెండురోజులుగా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు.

ప్రజారోగ్య రక్షణలో వైఫల్యం: జగన్

ఈనాడు, అమరావతి: ప్రజల ప్రాణాలపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. శ్రీకాకుళంలో అతిసారం వ్యాప్తితో పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటనపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రక్షణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు.

తమిళనాట కొత్త పార్టీ ప్రారంభించిన శశికళ



పార్టీ జెండాను చూపుతున్న శశికళ

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు, దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త పార్టీని ప్రారంభించారు. రామనాథపురం జిల్లా కముదిలో మంగళవారం రాత్రి జరిగిన జయలలిత జయంతి వేడుకల్లో ఆమె పార్టీ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జయలలిత మరణం తర్వాత పార్టీలో చాలా సమస్యలు తలెత్తాయని, తాను ముఖ్యమంత్రిగా నియమించిన వ్యక్తి తనకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తొమ్మిదేళ్లు మౌనంగా ఉన్నానని, ఇకపై ఉండటం కుదరదని, ఇంకా మౌనంగా ఉంటే కార్యకర్తలకు, ప్రజలకు ద్రోహం చేసినట్లు అవుతుందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా మధ్యలో అన్నా, ఎంజీఆర్, జయలలిత చిత్రాలున్నాయి. పార్టీ పేరు తర్వాత ప్రకటిస్తామని శశికళ పేర్కొన్నారు.



వాటికి మించింది లేదు

మీ మానసిక, శారీరక ఆరోగ్యం కంటే మీకు ముఖ్యమైంది ఏదీ లేదు. ఈ విషయంలో డబ్బు, స్నేహితులు, అఖరికి మీ కుటుంబం కూడా తర్వాతే. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడుకునేందుకు సూర్యరశ్మి, పౌష్టికాహారం, వ్యాయామాన్ని వదలకండి.

– స్టీవ్, కంటెంట్ క్రియేటర్

ఏఐ సునామీ ముంచుకొస్తోంది

- సమాజమే సిద్ధంగా లేదు
- ఉద్యోగాలు కోల్పోయేలా చేయం
- ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్

ఈనాడు, బిజినెస్‌బ్యూరో: కృత్రిమ మేధ (ఏఐ) ఒక సునామీలా ప్రపంచం మీదికి దూసుకొస్తోందని, కానీ, దానిని ఎదుర్కొనేందుకు సమాజం ఇంకా సిద్ధం కాలేదని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఏఐ భవిష్యత్తు, భారత ఐటీ రంగం, స్టార్టప్‌లు, కొత్త నైపుణ్యాలు, బయోటెక్నాలజీ వంటి అంశాలపై డారియో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యాంశాలివీ..

ఏఐని సురక్షితంగా మార్చేందుకే

'అయిదేళ్ల క్రితం కంప్యూటర్‌తో సొంతంగా ఒక వ్యాసం రాయించడం/వీడియోను విశ్లేషించడం దాదాపు అసాధ్యం. ఇప్పుడు ఏఐ మోడల్స్ మానవ మేధస్సుకు సరిసమాన స్థాయికి చేరుకుంటున్నాయి. ఏఐ ఒక రసాయన చర్యలాంటిది. ఒక రసాయన చర్యకు ముడి పదార్థాలు అవసరమైనట్లే.. డేటా, కంప్యూటింగ్ శక్తి అనే ముడిపదార్థాల అందుబాటు పెరిగే కొద్దీ, ఏఐ సామర్థ్యం అద్భుతంగా మారుతుంది. ఈ అనూహ్య మార్పుల వల్ల రాబోయే ఆర్థిక, భౌగోళిక, భద్రతాపరమైన పరిణామాలపై ప్రభుత్వాలు - ప్రజలకు ఇంకా పూర్తి అవగాహన రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏఐని అత్యంత సురక్షితంగా, బాధ్యతాయుతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే నేను ఓపెన్ ఏఐ నుంచి బయటకు వచ్చి, ఆంథ్రోపిక్‌ను స్థాపించాను.

భారత్ మాకు భాగస్వామి

చాలా బహుళజాతి సంస్థలు భారతదేశాన్ని వినియోగదారుల మార్కెట్‌గానే చూస్తుంటాయి. కానీ, భారతీయ ఐటీ, కన్సల్టింగ్ కంపెనీలతో మేము (ఆంథ్రోపిక్) కలిసి పనిచేయాలనుకుంటున్నాం. భారతీయ కంపెనీలకు మా ఏఐ టూల్స్ అందించి, వారి సేవలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. ఇందువల్ల వారి సంస్థాగత సామర్థ్యాన్ని, మార్కెట్ నైపుణ్యాలను అద్భుతంగా పెంచొచ్చు. అంతేకానీ, ఉద్యోగులను తొలగించాల్సిన పని ఉండదు. గత అక్టోబరులో తొలిసారి భారత్‌ను సందర్శించినప్పటితో పోలిస్తే.. ఇప్పుడు ఇక్కడ మా వినియోగదారుల సంఖ్య, రాబడి రెట్టింపు అయ్యింది. ఏపీఐ మోడల్స్ ద్వారా భారత్‌లో ఎంతోమంది సొంత పరిష్కారాలను నిర్మించుకుంటున్నారు.

కోడింగ్‌కు కాలదోషం

ఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల స్వరూపం మారుతుంది. కోడింగ్ వంటి పనులను ఏఐ పూర్తిస్థాయిలో ఆక్రమిస్తుంది. భవిష్యత్తులో యాంత్రికం కాని 'మానవ సంబంధిత నైపుణ్యాలు', భౌతిక ప్రపంచంతో ముడిపడి ఉన్న పనులు, సంస్థల మధ్య సంబంధాలను నిర్వహించే నైపుణ్యాలకు భారీ గిరాకీ ఉండబోతోంది. ఏఐ సృష్టించే ఫేక్ కంటెంట్‌ను, మోసాలను పసిగట్టేందుకు యువతకు క్రిటికల్ థింకింగ్ నైపుణ్యాలు అవసరం.

అనుకరణ సాధ్యం కాకుండా..

భారతీయ స్టార్టప్‌లు ఏపీఐలను ఉపయోగించుకుని, అప్లికేషన్ లేయర్‌లో కొత్త టూల్స్ నిర్మించొచ్చు. ప్రతి రెండు, మూడు నెలలకు వచ్చే కొత్త ఏఐ మోడల్స్ వాడుకుంటూ, ఇంతకుముందు సాధ్యం కాని కొత్త పరిష్కారాలను కనుక్కోవాలి. ఏఐ మోడల్స్ చుట్టూ ఒక చిన్న యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ), ర్యాపర్‌లాంటి సాధారణ అప్లికేషన్లు చేయకూడదు. ఫైనాన్స్, బయాలజీ వంటి రంగాలపై దృష్టి పెట్టి, సులభంగా అనుకరించలేని బలమైన నమూనాలతో స్టార్టప్‌లను నిర్మించుకోవాలి.

సింథటిక్ డేటాతో..

ఏఐ మోడల్స్ మరింత సంక్లిష్టంగా అభివృద్ధి చెందే కొద్దీ, మనుషుల్లాగే నిర్ణయాలు తీసుకునే స్థాయి వస్తుందని నేను నమ్ముతున్నాను. ఓపెన్ వెబ్‌లో దొరికే సమాచారం కంటే, ఏఐ తనంతట తాను నేర్చుకునే సింథటిక్ డేటా ప్రాముఖ్యం భవిష్యత్తులో పెరుగుతుంది. ఏఐ సాంకేతికత భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రభుత్వాలు, ప్రజల పాత్ర కచ్చితంగా ఉండాలి. అభివృద్ధి వేగం నెమ్మదించకుండా, అర్థవంతంగా, చురుకైన నియంత్రణ అవసరం.

బయోటెక్నాలజీలోనూ..

నేను బయాలజిస్టును. 15 ఏళ్ల క్రితం న్యూరల్ నెట్‌వర్క్స్ పనితీరు చూశాక, జీవశాస్త్రంలోని అత్యంత క్లిష్టమైన సమస్యలకు ఏఐ ద్వారా పరిష్కారం కనుగొనగలమని నమ్మాను. భవిష్యత్తులో ఏఐ సాయంతో బయోటెక్నాలజీ ద్వారా ఎన్నో మొండి వ్యాధులకు చికిత్స అందుబాటులోకి వస్తుంది. శరీరంలో అవసరమైన చోటే మార్పులు చేయగల ప్రోగ్రామబుల్ 'పెప్టైడ్-ఆధారిత థెరపీ'లూ అభివృద్ధి చెందుతాయి. శరీరం నుంచి కణాలను బయటకు తీసి, క్యాన్సర్‌లాంటి నిర్దిష్ట వ్యాధులపై పోరాడేలా, జన్యుపరంగా మార్పులు చేసి, తిరిగి శరీరంలోకి ప్రవేశపెట్టే సెల్-ఆధారిత (కార్-టి) థెరపీలు, ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లూ వస్తాయని నమ్ముతున్నా.

రుణ వేధింపులకు మహిళ బలి

- అప్పులిచ్చిన వారు వెంబడించడంతో కాలువలో దూకి ఆత్మహత్య
- జగిత్యాల జిల్లాలో ఘటన



అనూష

మల్యాల, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు చెల్లించాలంటూ వెంటపడి వేధించడంతో వారి కళ్లముందే మహిళ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలంగాణలోని జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం ఏపీలోని కృష్ణా జిల్లా కంకిపాడులోని బందరు రోడ్డుకు చెందిన శిరీష వద్ద గతంలో అదే ప్రాంతానికి చెందిన కనగల అనూష(39) రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. అందులో దాదాపు రూ.50 వేల వరకు తిరిగి చెల్లించారు. అనూష కుటుంబ సభ్యులతో కలిసి మూడేళ్ల కిందట జగిత్యాల జిల్లాకేంద్రానికి వచ్చి అక్కడే టైలరింగ్ పని చేస్తుండగా, భర్త లక్ష్మణ్‌బాబు వెల్డింగ్ పనితో కుటుంబాన్ని పోషిస్తున్నారు. అనంతరం వీరి కుటుంబం మల్యాల మండలం నూకపల్లి అర్బన్ కాలనీలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయానికి మారింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. మంగళవారం శిరీషతో పాటు నౌషిత, ఓంకార్, సతీశ్‌లు కారులో నూకపల్లి అర్బన్ కాలనీలోని అనూష ఇంటికి వచ్చారు. బాకీ డబ్బులు చెల్లించాలంటూ గొడవకు దిగారు. అప్పు కట్టకుంటే చావాలంటూ అనూషను దూషించారు. వారి వేధింపులు భరించలేక ఆమె ఆటోలో జగిత్యాలకు బయల్దేరారు. వెనకాలే కారులో పై నలుగురు వెంబడించారు. ఈ క్రమంలో అనూష మార్గంమధ్యలో రాజారం గ్రామ శివారులోని కాకతీయ కాలువ వద్ద ఆటో నుంచి దిగి నీటిలో దూకారు. వెనకే వచ్చిన నలుగురు ఆమెను కాపాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి కాలువలో నుంచి అనూషను బయటకు తీయగా అప్పటికే మృతి చెందారు. బాకీ డబ్బుల కోసం నలుగురు వ్యక్తులు దూషించడంతోపాటు వెంటపడి వేధించడం వల్లే తన భార్య ఆత్మహత్య చేసుకుందని లక్ష్మణ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శిరీష, నౌషిత, ఓంకార్, సతీశ్‌లపై కేసు నమోదు చేశారు.

బడ్జెట్ సమావేశాలు లడ్డూ చుట్టూ తిరగడం దురదృష్టకరం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



ఈనాడు, దిల్లీ: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాలు ఆర్థికాంశాలను విస్మరించి లడ్డూ చుట్టూనే చర్చలను పరిమితం చేయడం దురదృష్టకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ ఏపీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'అధికార, ప్రతిపక్షాలకు ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలు, సంక్షేమ కార్యక్రమాలు పట్టకపోవడం విచారకరం. లడ్డూలో కల్తీ జరిగిందని, అందులో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయని అందరికీ తెలుసు. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలైనా చర్యలు తీసుకోకుండా మాటలకే పరిమితం కావడం సరికాదు. ఎంత పెద్దవారైనా నెయ్యి కల్తీకి బాధ్యులైతే కేసులు నమోదు చేసి జైలుకు పంపాలి. లడ్డూ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టి ప్రజల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలి' అని సూచించారు.

7 వేల ఆయా పోస్టులు భర్తీ చేస్తాం

మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు కొత్తగా 7 వేల ఆయా పోస్టులు భర్తీ చేయనున్నట్లు మంత్రి సంధ్యారాణి సభ్యుల ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. 'రాష్ట్రంలో 257 ఐసీడీఎస్ ప్రాజెక్టులు.. 55,746 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నాం. గత ఐదేళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు 70 శాతంగా ఉందని.. ప్రస్తుతం అది 96 శాతానికి పెరిగింది' అని మంత్రి వెల్లడించారు.

విచారణార్హతపై వాదనలు వింటాం

చంద్రబాబు ముందస్తు బెయిలు రద్దుపై వేసిన పిటిషన్ విషయంలో ఆళ్లకు స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు వ్యవహారంపై నమోదుచేసిన కేసులో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంజూరుచేసిన ముందస్తు బెయిలును రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్ విచారణార్హతపై వాదనలు వింటామని పిటిషనర్, వైకాపా మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి హైకోర్టు చెప్పింది. సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది మాధవ్ ఖురానా వాదనలు వినిపిస్తూ.. పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. అభ్యంతరం ఉంటే ఏసీబీ కోర్టులో పిటిషనర్ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలుచేసుకోవాలి తప్ప.. బెయిలు రద్దు కోసం హైకోర్టును ఆశ్రయించడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. మొదట వ్యాజ్య విచారణార్హతపై వాదనలు వింటామని స్పష్టం చేస్తూ మార్చి 10కి వాయిదా వేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడి హత్య

ఒడిశాలో ఓ బాలిక ఘాతుకం



అనుష్క పరిడా



అహిం పరిడా

జయపురం, న్యూస్‌టుడే: తన ప్రేమ వివాహానికి అంగీకరించలేదని తల్లి, సోదరుడిని ఓ బాలిక హత్యచేసింది. ఈ ఘటన ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బొరిగుమ్మలో చోటుచేసుకుంది. ఎస్‌డీపీవో సత్యబ్రత లెంకా తెలిపిన వివరాల ప్రకారం.. సదరు సమితికి చెందిన 16 ఏళ్ల బాలిక తన ప్రేమను అంగీకరించలేదని తల్లి అనుష్క పరిడా(45), సోదరుడు అహిం పరిడా(14)లను ప్రియుడితో కలిసి కాళ్లు, చేతులు కట్టేసి కడుపులో కత్తితో పొడిచి హత్య చేసింది. అనంతరం స్థానిక కాలువలో పడేసింది. సోమవారం ఈ ఘటన జరగ్గా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అహిం మృతదేహాన్ని కాలువ ఒడ్డున గుర్తించగా, అనుష్క మృతదేహం కోసం పోలీసులు, అగ్నిమాపక శాఖ గాలింపులు ప్రారంభించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వైకాపా పాపాన్ని వైఎస్‌కు చుట్టడం తగదు

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: తిరుమల పవిత్రత విషయంలో వైకాపా చేసిన పాపాన్ని వైఎస్ఆర్‌కు చుట్టడం కూటమి ప్రభుత్వానికి భావ్యం కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. వైకాపా కల్తీ పనులు వైఎస్ హయాం నుంచే ప్రారంభమయ్యాయని అనడం సీఎం చంద్రబాబుకు ఎంతమాత్రం సబబు కాదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అసెంబ్లీ వేదికగా వైఎస్‌పై చేసిన ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. ఆ వ్యాఖ్యలు సభ రికార్డుల నుంచి తొలగించి, చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి. వైఎస్ ఏడు కొండలను రెండు కొండలు చేయాలని ఏనాడూ అనుకోలేదు. ఏడుకొండలూ వేంకటేశ్వరస్వామివేనని 2007లో శాశ్వత జీవో ఇచ్చింది వైఎస్సే. వైకాపా అరాచకాలకు ఆయనకు ఎలాంటి సంబంధం లేదు' అని షర్మిల అన్నారు.

అఖిలభారత పోలీసు సౌత్‌జోన్ టీ-20 విజేత పుదుచ్చేరి



విజేతగా నిలిచిన పుదుచ్చేరి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: అఖిలభారత పోలీసు సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పుదుచ్చేరి పోలీసు జట్టు నిలిచింది. అండమాన్-నికోబార్ దీవుల జట్టు రన్నరప్‌గా మిగిలింది. ఐదు రోజులుగా మూలపాడులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మైదానంలో జరుగుతున్న ఈ టోర్నీలో వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర భద్రతా బలగాలకు చెందిన 10 జట్లు పోటీపడ్డాయి. సెమీఫైనల్స్‌లో పుదుచ్చేరి పోలీసు జట్టు తమిళనాడును, అండమాన్-నికోబార్ పోలీసు జట్టు తెలంగాణను ఓడించి ఫైనల్స్‌కు చేరాయి. మంగళవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అండమాన్-నికోబార్ దీవుల జట్టుపై.. పుదుచ్చేరి 43 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 192 పరుగులు చేసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన అండమాన్ జట్టు 18.3 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మంగళగిరిలోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పుదుచ్చేరి జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు.

జగన్ కంపెనీల్లా హెరిటేజ్ అక్రమంగా పుట్టింది కాదు: ఎంపీ కలిశెట్టి

ఈనాడు, దిల్లీ: కల్తీ నెయ్యి వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన జగన్ అండ్ కో హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. హెరిటేజ్ ఏమీ జగన్ కంపెనీల్లా అక్రమంగా పుట్టింది కాదని ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం ఇక్కడ ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. నారా భువనేశ్వరి నేతృత్వంలో ఆ సంస్థ ముందుకెళ్తు ఎంతోమంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుంటే ఓర్చుకోలేక జగన్ అండ్ కో ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నారు. అవినీతితో పోగేసుకున్న డబ్బు తప్పితే ఇంకేం అంశంపైనా ధ్యాసలేని జగన్‌కి క్రికెట్ లాంటి క్రీడలు ఆస్వాదించే గుణం ఉందనుకుంటే పొరపాటే అన్నారు.

నకిలీ పత్రాలతో భూ కబ్జా చేశారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ఫోర్జరీ డాక్యుమెంట్లతో తమ భూమి కబ్జా చేసిన వారిపై అధికారులకు ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోలేదని నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన నూర్జహాన్ వాపోయారు. ఈ మేరకు తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావినతుల కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. మరికొన్ని జిల్లాలకు చెందిన బాధితులు కూడా పలు సమస్యలపై వినతిపత్రాలను అందించారు. గతంలో అప్పుగా తీసుకున్న రూ.70 వేలను.. వడ్డీ వ్యాపారి దౌర్జన్యంగా రూ.3 లక్షలుగా మార్చారని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన విజయకుమారి ఫిర్యాదుచేశారు. తన పేరిట ఉన్న 5 ఎకరాల భూమికి సర్వే పూర్తిచేసి.. సర్టిఫికెట్ ఇచ్చేందుకు సర్వేయర్ నిరాకరిస్తున్నారని పల్నాడు జిల్లా మాచర్ల మండలానికి చెందిన ముత్యాలమ్మ వినతి ఇచ్చారు.

ఒంటరిగా ప్రయాణించాలంటే భయం..!

నేనో ప్రైవేటు ఉద్యోగిని. మూడునెలల క్రితం పదోన్నతి వచ్చింది. ఉద్యోగరీత్యా భారత్‌లోని అన్ని బ్రాంచ్ ఆఫీస్‌లకు ప్రయాణిస్తూ ఉండాలి. కానీ, ఇదివరకు నేను సోలో ట్రావెలింగ్ చేసింది అరుదు. దాంతో ప్రయాణాల్లో భయం ఆవరిస్తోంది. అది పోయేదెలా?

– ఓ సోదరి

విమానాశ్రయాలూ, రైల్వేస్టేషన్లలో ఇప్పుడు ఎక్కడ చూసినా మహిళా ప్రయాణికులే ఎక్కువగా కనిపిస్తున్నారు. ముఖ్యంగా అంత్రప్రెన్యూర్లు, ఉద్యోగరీత్యా మహిళలూ మగవారితో సమానంగా ప్రయాణాలు చేస్తున్నారు. వాళ్లకి అనుకూలంగానే రవాణా వ్యవస్థలోనూ మార్పులూ చేర్పులూ వస్తున్నాయి. అయితే, ఇంకా కొన్నిచోట్ల పూర్తిగా అందుబాటులో లేవు. కాబట్టి స్వీయ రక్షణ మీ బాధ్యతే. అందుకే ఒంటరిగా ప్రయాణించేటప్పుడు ఈ క్రింది విషయాల్ని గమనించుకోండి.

1. హ్యాండ్ లగేజ్ ఎప్పుడూ అనుకూలంగా, బరువు తక్కువగా ఉండేట్లు చూసుకోండి. బ్యాగులో క్రెడిట్, డెబిట్ కార్డులు ఉంచుకోండి. వీలైనంత వరకూ నగదు తక్కువగా ఉండేట్లు చూసుకోండి.

2. మీరు ఒంటరిగా ప్రయాణిస్తున్నట్లు, మొదటిసారి సంబంధిత ప్రాంతాన్ని సందర్శిస్తున్నట్లు ఎవరికీ తెలియకపోతేనే మంచిది. చాలాసార్లు తోటి ప్రయాణికుల నుంచి ఒక్కరే వెళుతున్నారా? మొదటిసారా? లాంటి ప్రశ్నలు ఎదురవుతూ ఉంటాయి. వాళ్లు అపాయం చేసేవాళ్లు కాకపోయినా రక్షణ రీత్యా ఇలాంటి ప్రశ్నలకు సమాధానాల్ని దాటవేయడమే మేలు.

3. ఇంటి నుంచి బయలుదేరేముందే మీ ప్రయాణ ప్రణాళికని పూర్తిగా సిద్ధం చేసుకోండి. ఎక్కడికి వెళ్లాలి, ఆ రూట్ ఎలా ఉంటుంది, చుట్టుపక్కల హస్పిటల్స్, పోలీస్ స్టేషన్లు వంటి వాటి గురించి తెలుసుకోండి. ఆఫీస్ క్యాబ్‌లో వెళ్లినా సరే జీపీఎస్ ఆన్ చేసుకోవడం మరచిపోకండి.

4. ప్రయాణానికి ఇంకా సమయం ఉంది, చుట్టూ ఉండే ప్రాంతాల్ని చూసి వద్దాం, క్యాబ్ ఇంకా రాలేదు అంటూ బయటకు వెళ్లడమో, కంగారు పడుతూ ఒకే చోట ఉండిపోవడమో చేయకండి. దీనివల్ల అపరిచితులకు అవకాశం ఇచ్చిన వాళ్లం అవుతాం. జనాలు తిరుగుతున్న ప్రాంతంలోనే ఉండండి. అలానే, ఖరీదైన బ్యాగులూ, వస్త్రాలూ, అలంకరణ వస్తువులూ ధరించకుండా సాదాగా ఉండేందుకు ప్రాధాన్యం ఇవ్వండి.

5. హోటల్, గెస్ట్‌హౌజ్‌ల్లో రూమ్ తీసుకునేటప్పుడు మీ గది వివరాలు మీ వరకే పరిమితం అయ్యేలా చూసుకోండి. మహిళా సిబ్బందే మిమ్మల్ని గైడ్ చేసేలా జాగ్రత్తలు తీసుకోండి. రూమ్‌లోకి వెళ్లాక కూడా, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని అప్పుడే లాక్ చేయండి.

ఒంటరి ప్రయాణాల్లో చాలా జాగ్రత్తలు అవసరం. మీకోసం మీరే ఇవన్నీ చేసుకోవాలి. అప్పుడే సురక్షిత భావన కలుగుతుంది. వెళ్లిన పనీ సకాలంలో పూర్తిచేసుకుని రాగలుగుతారు.

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

వసుంధర

vasundhara@eenadu.in

నగుమోము చూడాలని!

పెన్సిల్ తిన్నగా పట్టుకోవడమైనా రాదు... ఆ పిచ్చి గీతల్లోనూ ఎన్నెన్ని బొమ్మలు చూపేవాళ్లమో! నెమ్మదిగా పిట్ట, ఇల్లు, హరివిల్లు అని మొదలుపెట్టి... మన సృజనాత్మకతకి రెక్కలిచ్చేవాళ్లం. ఆ అందమైన ఊహాలోకం తరవాత హాబీ, టైమ్‌పాస్‌గా మారి... ఎప్పుడు కనుమరుగవుతోందో కూడా తెలీదు. చాగంటి సాధనకీ ఇది అనుభవమే! అందుకే చిన్ననాటి ఆ అనుభూతిని 'నగుమోము'తో అందరికీ తిరిగి పరిచయం చేస్తూ ఆర్ట్‌ప్రెన్యూర్‌గా మారారీమె. అదెలాగో మనతో పంచుకున్నారిలా...



మాది హైదరాబాద్. చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడమంటే నాకెంతో ఇష్టం. కానీ, పెద్దయ్యాక... చదువు, కెరియర్‌లే నా ప్రాధాన్యం అయిపోయాయి. మధ్యతరగతి కుటుంబం కదా! నాన్న లేకపోవడంతో అమ్మ ఇంకా గట్టిగా నా చదువు మీద దృష్టిపెట్టారు. ఏ ఇబ్బందీ లేకుండా త్వరగా సెటిల్ అవ్వాలనేది ఆవిడ తాపత్రయం. అందుకే, నేను మొదట డాక్టర్ కావాలనుకున్నా. ఆపై బ్యాచిలర్స్, మాస్టర్స్, యూపీఎస్సీ ప్రిపరేషన్... ఇలా సాగిపోయా. చదువుల్లో టాపర్‌గా అమ్మని సంతోషపెట్టాను. కానీ, నేను మాత్రం సంతోషంగా ఉండలేకపోయాను. ఒక్కసారి జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే... నా సంతోషం ఆర్ట్‌లోనే ఉందనిపించింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో పీజీ, పీహెచ్‌డీ చేశా. ప్రస్తుతం ఇండో-జర్మన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్‌లో క్లైమేట్ చేంజ్ అడ్వైజర్‌గానూ పనిచేస్తున్నా.

ప్రజలకు చేర్చాలనే...

ఈ రోజుల్లో ఆర్ట్ అంటే అక్రిలిక్స్, డిజిటల్. డిజైన్లు మాత్రమే అనుకునే పరిస్థితి. ప్రకృతికి హాని చేయని హస్తకళలకు ప్రాధాన్యం ఇవ్వాలనేదే నా లక్ష్యం. అందుకే 'నగుమోము'ని స్థాపించి ప్రజల్లో సస్టైనబుల్ ఆర్ట్స్‌పై అవగాహన కల్పిస్తున్నా. ప్రధానంగా కలంకారీ, చెరియల్, బాతిక్... వంటి భారతీయ సంప్రదాయ హస్తకళలకు పూర్వ వైభవాన్ని తేవాలనేది నా కోరిక. గ్రామీణ కళాకారులకు, ముఖ్యంగా మహిళలకు ఆదాయం కల్పించడం, వీధికుక్కలకోసం నిధులు సేకరించడం... వంటివెన్నో చేస్తున్నా. ఇందుకోసం కళాకారులు, స్వచ్ఛంద, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నా.

నిపుణుల సాయంతో...



పట్టణ, నగర ప్రాంతాల్లో మా నగుమోము నిర్వహించే వర్క్‌షాప్‌ల కోసం ఆయా కళలకు ప్రసిద్ధమైన ప్రాంతాల నుంచి మెటీరియల్స్ తెప్పిస్తూనే, అందులో నిపుణులైన కళాకారులను రప్పిస్తాం. మా వర్క్‌షాప్‌కి హాజరైన ఔత్సాహికులు... ఏంటి? ఇక్కడ రంగులూ, బ్రష్‌లూ లేవు. పేపర్ ఇవ్వలేదు... ఆర్ట్ ఎలా వేయాలని అడుగుతారు. కానీ, తర్వాత చింతగింజల పొడితో బొమ్మలు వేయడం, పాలల్లో ముంచిన వస్త్రం మీద రస్టెడ్ ఐరన్‌తో పెయింటింగ్ వేయడం చూసి ఆశ్చర్యపోతుంటారు. ఆ ఆశ్చర్యమే నా విజయం. ఈ కళలు మ్యూజియంలో కాదు, మన జీవితాల్లో ఉండాలి. యువతులు, మహిళా కళాకారిణులు, పిల్లలు.. ఇలా అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తాను. కాఫీషాప్‌లు, రిక్రియేషన్ కమ్యూనిటీలు, కల్చరల్ క్లబ్స్, ఎగ్జిబిషన్లు, కాన్ఫరెన్స్‌లు... ఇలా ఒకటేమిటి ఎక్కడ వేదిక ఉన్నా... ఈ కళల్ని నేర్పించడానికి ప్రయత్నిస్తా. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో వందల మంది ఔత్సాహికులకు నేర్పించగలిగా. తాజాగా జరిగిన ఇంటర్నేషనల్ యూత్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌లోనూ వర్క్‌షాప్ నిర్వహించా.

కష్టాలెన్నో దాటి...

ఈ ప్రయాణంలో కష్టాలు లేకపోలేదు. మెటీరియల్స్ 21 రోజుల ముందు నుంచే ప్రిపేర్ చేయాలి. కళ అసలు స్వరూపం మార్చకుండా నేర్పించాలి. ఈజీ అక్రిలిక్స్‌కి అలవాటు పడిపోయారు కాబట్టి ప్రజల మైండ్ సెట్ మార్చాలి. ఓ పక్క పీహెచ్‌డీ, మరో పక్క కెరియర్‌నీ సమన్వయం చేసుకుంటూ ఈ అభిరుచినీ కొనసాగించడం అంత సులువేం కాదు. నా కుటుంబ సహకారంతోనే చేయగలుగుతున్నా. ఎవరైనా ఒకరు బాగుందండీ, థ్యాంక్స్ అని చెప్పినప్పుడు... ఆ కష్టమంతా మర్చిపోతాను. ఈ రోజుల్లో పని ఒత్తిడి, జీవనశైలి... కారణం ఏదైనా చాలా మంది ముఖాలపై చిరునవ్వు కనిపించడం లేదు. ఈ కళ ద్వారా అందరినీ నగుమోముతో చూడాలనుకుంటున్నా.

కూర్చొని నిల్చోగలిగితే... ఫిట్!



నేటి జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే అనారోగ్యాలు పలకరిస్తున్నాయి. ప్రతి చిన్న మార్పునీ గమనించుకోవాల్సిందే. అయితే మనం ఆరోగ్యంగా ఉన్నామా లేదా అన్న విషయాన్ని ఒక చిన్న యాక్టివిటీతో నిర్ధారించుకోవచ్చు అంటున్నారు పరిశోధకులు. నేల మీద కూర్చొని ఏ ఇబ్బందీ లేకుండా సులభంగా లేచి నిల్చొంటే... ఆరోగ్యంగా ఉన్నట్టని చెబుతున్నారు. బ్రెజిల్, ఫిన్లాండ్, కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఉమ్మడిగా చేసిన అధ్యయనం ఇది. 46-75 ఏళ్ల మధ్య వయసులో ఉన్న 4200 మంది ఈ పరిశోధనలో భాగమయ్యారు. వీళ్లను 12 ఏళ్లపాటు పరిశీలనలో ఉంచారు. కూర్చొన్న చోటునుంచి ఏ ఊతమూ లేకుండా, ఇబ్బంది పడకుండా నిల్చున్న వాళ్లకు ఆయుర్దాయం ఎక్కువని చెబుతున్నారు. అలా లేవలేనివారికి గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువట. ఈ చిన్న యాక్టివిటీద్వారా ఏరోబిక్ ఫిట్‌నెస్, ఫ్లెక్సిబిలిటీ, ఒంటికాలిమీద నిల్చోవడం, గ్రిప్ స్ట్రెంత్ వంటి వాటన్నింటినీ పరీక్షించవచ్చు అంటున్నారు. లేవడానికి ఇబ్బంది పడేవాళ్లు వ్యాయామాలు చేయడం, మెట్లు ఎక్కడం, ఇంట్లోపని చేయడం లాంటివి అలవాటు చేసుకోవాలి. పెద్దవాళ్లు మనవలూ, మనవరాళ్లతో ఆడుకుంటూ కింద కూర్చొని లేస్తుంటే శరీరంలో ఫ్లెక్సిబిలిటీ, బలం పెరుగుతాయని చెబుతున్నారు వైద్యులు.

ఎలిఫెంట్ పేరెంటింగ్ పాటిస్తారా!

పిల్లల పెంపక విధానాలు ఎన్నో రకాలు. తాజాగా 'ఎలిఫెంట్ పేరెంటింగ్' అంటూ ఓ కొత్త విధానం చర్చలోకి వచ్చింది. దీన్లో ఏం ఉంటుందంటే....



టైగర్ పేరెంటింగ్... లక్ష్య సాధన దిశగా సూటిగా సాగే విధానం ఇది. దీన్లో తల్లిదండ్రులదే పైచేయి. హెలికాప్టర్ పేరెంటింగ్‌లో తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలపై ఓ కన్నేసి ఉంచుతారు. దీనివల్ల వాళ్లను తప్పులు, పొరపాట్లు చేయకుండా, రిస్కు తీసుకోనీయకుండా నియంత్రిస్తుంటారు. దాంతో పిల్లలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేరు. అదే, జెల్లీఫిష్ పేరెంటింగ్‌లో పిల్లలపైన తల్లిదండ్రులకు నియంత్రణ తక్కువగా ఉంటుంది. వాళ్లు ఆడిందే ఆట, పాడిందే పాటలా సాగుతుంది. ఎలిఫెంట్ పేరెంటింగ్‌లో ఫ్లెక్సిబిలిటీ ఎక్కువ. పిల్లలపై సహానుభూతి, ప్రేమను చూపడం, వాళ్ల అవసరాలకు తగ్గట్టు ఆ క్షణంలో స్పందించడం దీన్లో ప్రధానం. వాళ్లను స్వతంత్రంగా ఎదగనిస్తూనే అవసరమైనప్పుడు తల్లిదండ్రుల మార్గనిర్దేశం అందేలా ఉంటుంది. దీనివల్ల పిల్లలకు భావోద్వేగపరమైన మద్దతు లభిస్తుంది. అలానే వాళ్ల వేగానికి తగ్గట్టుగా నేర్చుకునే స్వేచ్ఛనిస్తారు. చదువులూ, క్రీడల్లో భాగం కావడం వరకే కానీ ర్యాంకులూ, విజేతలుగా నిలవడం గురించి ఒత్తిడి చేయరు. అదే సమయంలో తల్లిదండ్రుల నుంచి అందే భద్రత, ప్రోత్సాహం వాళ్లను వివిధ అంశాల్ని నేర్చుకునేలా చేస్తుంది. ఈ వాతావరణంలో పిల్లలు తమ ఆలోచనల్ని స్వేచ్ఛగా పంచుకుంటారు. పిల్లల సమస్యల్ని తాము పరిష్కరించడంకంటే వాటిని తెలుసుకోవడం, సలహాలు, సూచనలు ఇవ్వడం దీన్లో ముఖ్యం. పిల్లలూ, తల్లిదండ్రుల మధ్య మంచి కమ్యూనికేషన్ ఉంటుంది. ఆత్మవిశ్వాసంతో, భావోద్వేగ నియంత్రణతో పిల్లలు పెరుగుతారు. ఎలిఫెంట్ పేరెంటింగ్ విధానంలో మంచి విషయాలెన్నో ఉన్నా, ఇదే సరైనదని కచ్చితంగా చెప్పలేమంటారు నిపుణులు. పిల్లలు ఎవరికి వాళ్లు ప్రత్యేకమని... వాళ్ల వయసు, స్పందించే తీరునిబట్టి పేరెంటింగ్ విధానాల్ని ఎంపికచేసుకోవాలంటారు.

గుర్తించడమే అసలు సమస్య!

నేటితరం ఉద్యోగినుల్లోనే కాదు విద్యార్థినులూ, గృహిణుల్లోనూ ఒత్తిడి ఎక్కువేనంటున్నాయి పలు అధ్యయనాలు. కాకపోతే దాన్నసలు కొందరు పని ఒత్తిడిగానే గుర్తించరట. అది పెరిగి తీవ్ర రూపం దాల్చకముందే గుర్తించి అదుపులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. మీలో ఈ లక్షణాలేమైనా ఉన్నాయేమో గమనించుకోండి.

- ఒత్తిడెక్కువైతే నిద్రపట్టదంటారు చాలామంది. కానీ, మితిమీరిన అలసటతో త్వరగానే నిద్రపోయినా అంతే త్వరగా మెలకువ వచ్చేస్తుందట. లేదంటే తరచూ పీడకలలతో కలత నిద్రకు గురవుతున్నా... మీలో ఏదో ఆందోళన, ఒత్తిడి ఉన్నట్లేనని గుర్తించండి. ఆందోళన చెందకుండా పని విభజన చేసుకోవడం, రోజూ కాసేపు ధ్యానం చేయడం వంటివి చేస్తే ప్రాథమిక దశలోనే మీరు దాని బారిన పడకుండా ఉంటారు.
- మహిళల్లో ఒత్తిడి పెరిగే కొద్దీ ఆహారం.. అందులోనూ తీపి పదార్థాలు ఎక్కువగా తినాలనే ఆలోచన కలుగుతుందని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు చెప్పాయి. కానీ, అదే సమయంలో కొందరు ఆకలినీ కోల్పోతుంటారు. అతిగా ఆకలి వేస్తే స్వీట్లకు బదులు ఖర్జూరం, ఎండు ఫలాలు, పండ్ల ముక్కలు, మంచినీళ్లు వంటివి తీసుకోండి. ఆకలి లోపిస్తే వ్యాయామంపై దృష్టిపెట్టండి. కనీసం ఓ ఇరవై నిమిషాలైనా రోజూ శ్రమ చేయగలిగితే అన్ని సమస్యలూ అదుపులోకి వస్తాయి.
- ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో కోపం రావడం సహజమే. అందులోనూ నెలసరి వేళల్లోనూ, మెనోపాజ్ దశలోనూ ఈ ఇబ్బంది కాస్త ఎక్కువగా ఉంటుంది. వాటితో పాటు మామూలు సందర్భాల్లోనూ చిన్న విషయానికీ కోపం వచ్చేస్తోందా? ప్రతి విమర్శనూ తీవ్రంగా తీసుకుంటున్నారా? అయితే ఇది ఒత్తిడి లక్షణమే కావొచ్చు. అలా ఎప్పుడైనా అనిపిస్తుంటే వెంటనే పక్కకు వెళ్లండి. దాన్ని ప్రదర్శించడానికి ముందు ఓ పుస్తకంలో రాయండి. ఈ స్ట్రెస్ నుంచి బయటపడాలంటే కాసేపు చెప్పుల్లేకుండా ఇసుక, నీళ్లు, గడ్డి... ఇలా ఎక్కడైనా నడవండి. దీర్ఘంగా శ్వాస తీసుకోండి. ఇవన్నీ చేసినా ఫలితం లేదంటే కచ్చితంగా సైకాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్‌ని కలవడానికి సందేహించకండి. వాళ్లు మీకు సాయం చేస్తారు.



ఉపాధి వెలుగుల పుట్టగొడుగుల రాణి!



శోభాదేవి

కొన్నేళ్ల క్రితం వరకూ ఆమె సాధారణ గృహిణి... కానీ, ఇప్పుడు అగ్రిప్రెన్యూర్‌గా మారి తాను ఆదాయం అందుకోవడమే కాదు... వందల మంది రైతులకు మార్గదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆమే పుట్టగొడుగుల రాణిగా పేరొందిన శోభాదేవి.

శోభాదేవిది బిహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలోని టిక్వా. భర్త రాజ్ కిషోర్ మహతో ఉపాధికోసం సౌదీ అరేబియాకు వెళ్లారు. వారికి ముగ్గురు సంతానం. పిల్లల పెంపకం, అత్తమామల సంరక్షణతోనే ఆమె జీవితంలో ఏళ్లు గడిచిపోయాయి. భర్త పంపించే అరకొర సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. తనూ ఏదైనా పని చేస్తే కుటుంబానికి ఆసరాగా ఉండొచ్చని అనుకున్నారామె. కానీ, చిన్న వ్యాపారం ప్రారంభించాలన్నా కనీస పెట్టుబడి చేతిలో లేదు. దాంతో ఆలోచనల్లో పడ్డారు. అదే సమయంలో ఆ రాష్ట్రప్రభుత్వం స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేయడం ఆరంభించింది. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వివిధ నైపుణ్యాల్లో శిక్షణ అందించింది. ఇందుకోసం తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేసింది. అందులో చేరారు శోభా. ఓ రోజు గ్రూప్ లీడర్ ఈమెను పిలిచి జీవిక యోజన స్కీమ్‌లో భాగంగా అగ్రికల్చర్ ఆంత్రప్రెన్యూర్ (ఏఈ) ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారని చెప్పారు. ఆసక్తి ఉంటే అందులో చేరాలని సూచించారు. అందుకు శోభ అంగీకరించారు. ఈ నిర్ణయమే ఆమె భవిష్యత్తును మార్చింది.

ఈటీవీ భారత్

మారిన ఆలోచన...

శోభాదేవి అగ్రికల్చర్ ఆంత్రప్రెన్యూర్ ప్రోగ్రామ్‌లో 21 రోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆధునిక వ్యవసాయం, వ్యాపార నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణ, నర్సరీ నిర్వహణ, పుట్టగొడుగుల పెంపకం, వర్మీ కంపోస్టింగ్, మల్చింగ్ పద్ధతులు, ధాన్యం వ్యాపారం వంటి వాటిపై నిపుణులు అవగాహన కల్పించారు. వీటితోపాటు ఖర్చు నిర్వహణ, లాభాలను పెంచుకోవడం, రైతులతో కమ్యూనికేషన్ వంటి అంశాలనూ నేర్పించారు. ఇవన్నీ శోభాదేవి ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చాయి. ఆమె ప్రపంచాన్ని చూసే కోణాన్ని మార్చాయి. అదయ్యాక వర్మీకంపోస్ట్ తయారీ చేపట్టారు. అమ్మకాలతో వచ్చిన ఆదాయంతో ఆమెలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మరో పక్క పుట్టగొడుగుల పెంపకం ఆరంభించారు. దీని ద్వారా వచ్చే లాభాలను తిరిగి అందులోకే పెట్టుబడి పెట్టి వ్యాపారాన్ని విస్తరించారు. ఆ ప్రయాణం సాగుతుండగానే మరొక లోన్ తీసుకొని వ్యవసాయ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సరైన అవగాహన లేక రైతులు అతిగా ఎరువులు వేయడం, తప్పుడు రకాల్ని వాడటం వంటివి చేసేవారు. దీనివల్లే పంట నష్టం జరిగేది. అలా జరగకుండా తన వ్యవసాయ సేవా కేంద్రం ద్వారా నేల నిర్వహణ, పంట సాగు మెలకువలు, తెగుళ్ల సంబంధిత సమస్యలపై రైతులకు కచ్చితమైన సలహాలను అందించడం మొదలుపెట్టారు. సుమారు 400 మంది రైతులు శోభ ఖాతాదారులుగా ఉన్నారు. ఈ నెట్‌వర్క్ సాయంతో పుట్టగొడుగుల్ని మార్కెటింగ్ చేయడం ఆరంభించారామె. వీటితో నెలకు సుమారు రూ.15-20 వేల వరకూ స్థిరమైన ఆదాయాన్ని అందుకుంటున్నారు. ఆమె జీవితంలో వచ్చిన మార్పు వల్ల కలిగిన ప్రయోజనం తనతోనే ఆగలేదు. పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతుల వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది. అందుకే శోభను పుట్టగొడుగుల రాణిగా పిలుస్తారు.



మీకు తెలుసా!

రుతువిరతి తర్వాత మహిళలకు హృదయ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందట. ఈస్ట్రోజన్ స్థాయిలు తగ్గడం వల్ల గుండె ధమనుల్లో కొవ్వు, కాల్షియం, ఇతర పదార్థాలన్నీ పేరుకోవడమే ఇందుకు కారణమని అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ తమ నివేదికలో వెల్లడించింది.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091191కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి



24న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,62,590	1,48,700	2,65,962
విజయవాడ	1,59,080	1,48,300	2,75,000
ప్రొద్దుటూరు	1,57,600	1,44,990	2,73,200
రాజమహేంద్రవరం	1,61,780	1,48,300	2,90,000
విశాఖపట్నం	1,61,800	1,48,300	2,75,000
తమిళనాడు	-----	1,48,900	2,90,000

చిన్నవే కానీ... పని సులభం చేస్తాయి!

వంటింట్లో వాడే కొన్ని వస్తువులు ఆకారంలో చిన్నగానే కనిపిస్తాయి. కానీ, ఎన్ని పనులు సులభంగా చేయడానికి సహకరిస్తాయో. ఈ గ్యాడ్జెట్లు కూడా ఆ కోవకు చెందినవే.

ట్రెండీ కాఫీ...



రెస్టారంట్లలో కాఫీలు ఎంతగా ఆకట్టుకుంటాయో కదా! వేడివేడి పొగలు కక్కుతున్న కాఫీపైన హార్ట్, ఫ్లవర్ అంటూ నచ్చిన ఆకారాల్ని గీసి ఇస్తారు. చూస్తూనే మనసు నిండిపోతుంది. ఇంట్లోనే అలా తయారుచేసుకోగలిగితే ఎంత బాగుంటుందో. కానీ వాళ్లలా మనం ఎక్కడ వాటిని గీయగలం అంటూ నిట్టూరుస్తాం. ఈ 'ఎలక్ట్రిక్ లాటే ఆర్ట్ పెన్'తో అది సాధ్యం అవుతుంది. కాఫీ, చక్కెర, దాల్చిన చెక్క వంటి పొడుల్ని పెన్‌లో నింపి... బటన్ నొక్కితే చాలు. పొడి కిందకు పడుతూ ఉంటుంది. దాన్ని ఉపయోగించి కాఫీ మీద నచ్చిన ఆకారాన్ని గీయొచ్చు.




నిమిషాల్లో రెడీ...

ప్యాన్ కేకులు, కప్ కేకులు, వాఫెల్స్ నచ్చని పిల్లలు ఉంటారా? ఎన్నిసార్లు పెట్టినా కాదనకుండా తింటారు. కానీ వాటిని చేయాలంటేనే శ్రమ. పిండి కలిపేటప్పుడు ఏ కాస్త అజాగ్రత్తగా ఉన్నా అయితే పలుచన అయిపోతుంది. లేదా గట్టిగా మారుతుంది. అలా కాకుండా పక్కా కొలతలతో మిశ్రమాన్ని తయారుచేయాలంటే ఈ 'మాన్యువల్ బ్యాటర్ మిక్సర్'ను తెచ్చుకోవాల్సిందే. మిక్సీ జార్‌లా ఉంటుంది ఇది. నీళ్లు, పిండి కొలతలు తెలుసుకునే విధంగా స్కేల్ కూడా అమర్చి ఉంటుంది. దాన్ని అనుసరించి నీళ్లు, పిండి, చక్కెర వంటివి జార్‌లో వేసి కప్పుతో మూసేయాలి. కప్పు పైన హ్యాండిల్, కింద కొన్ని బ్లేడ్లు ఉంటాయి. హ్యాండిల్‌ని తిప్పితే మిశ్రమం కలుస్తుంది. దాంతో నచ్చిన ఆహారాన్ని తయారుచేసుకోవచ్చు.


తొక్కలు ఒలిచేస్తుంది...

పోషకాల గనులుగా చెబుతారు తృణధాన్యాల్ని. పొద్దుతిరుగుడు గింజలూ ఆ కోవలోకే వస్తాయి. కానీ వీటిని వలిచి తినాలంటేనే బద్ధకిస్తుంటాం. ఈ 'ఎలక్ట్రికల్ షెల్ రిమూవర్' ఆ శ్రమను తగ్గిస్తుంది. పైన ఖాళీ భాగంలో గింజల్ని వేసి... బోర్డుకు కనెక్ట్ చేసి, స్విచ్ ఆన్ చేస్తే సరి. దానికదే ఒలిచి ఇస్తుంది.



క్యాన్సర్ విజేతల కోసమే ఈ శాయిషా..!

చికిత్స సమయంలోనే కాదు, క్యాన్సర్‌ని జయించాక కూడా వాళ్లలో ఆత్మస్థైర్యం నింపడం ముఖ్యమంటారు ముంబయికి చెందిన జయశ్రీ రతన్. అనడమే కాదు, క్యాన్సర్ విజేతల కోసం క్రోషె ప్రాస్థసిస్‌ను తయారుచేసి, 'శాయిషా ఇండియా ఫౌండేషన్' ద్వారా ఉచితంగా అందిస్తున్నారు.



క్యాన్సర్ బారిన పడి కోలుకున్న వారి జీవితాలు క్యాన్సర్‌కి ముందు క్యాన్సర్ తర్వాత అన్నట్లు ఉంటాయి. అందులోనూ రొమ్ము క్యాన్సర్... మహిళల్ని వేధించే వాటిలో ముఖ్యమైనది. మన దేశంలో ఏటా దీని బారిన పడేవాళ్ల సంఖ్యా ఎక్కువే. అయితే దీన్ని ఓడించి గెలిచిన విజేతలు మాత్రం తర్వాతే ఎక్కువ ఇబ్బంది పడుతున్నారంటారు జయశ్రీ. క్యాన్సర్‌తో పోరాడటం ఒకెత్తయితే, దాని వల్ల రొమ్ము కోల్పోవడం మహిళల్ని మానసికంగా కుంగదీస్తుంది. అలాంటి వారికి చేతితో అల్లిన కృత్రిమ వక్షోజాలను ఫ్రీగా అందిస్తున్నారు జయశ్రీ. 'చిన్నప్పటి నుంచి సేవ చేయడమంటే నాకిష్టం. అందుకే అత్తయ్యతో కలిసి చెన్నైలో మెర్సీ హోమ్ లాంటి వృద్ధాశ్రమాలకు నావంతు సాయం చేసేదాన్ని. ఒకసారి మా కోడలి బంధువుల్ని కలవడానికి వెళ్లాం. ఆ ఇంటి యజమాని క్యాన్సర్ నుంచి కోలుకోవడానికి మాస్టెక్టమీ చేయించుకున్నారు. దాంతో ఆమె పడ్డ ఇబ్బందులు పంచుకున్నారు. అప్పుడే క్రోషె బ్రెస్ట్ ప్రాస్థసిస్ గుర్తుకొచ్చాయి. అమెరికాలో ఉన్నప్పుడు ఒక ఎన్‌జీవోకి వీటిని అల్లి పంపేదాన్ని. అలాంటివే కొన్ని తయారుచేసి పంపా. వీటిని నూలుతో బ్రా కప్పు సైజులో తయారుచేస్తాం. వీటివల్ల చర్మానికి ఎలాంటి అలర్జీలూ ఉండవు. పైగా 18 నెలలపాటు వాడుకోవచ్చు. అవగాహన ఉన్నవాళ్లు, సిలికాన్ బ్రెస్ట్ ప్రాస్థసిస్‌ని ఉపయోగిస్తారు. కానీ, వాటి ధర ఎక్కువ. దాంతో చాలామంది కాటన్ బాల్స్, చేతి రుమాళ్లను వాడుతుంటారు. వాటివల్ల చర్మ సమస్యలు వస్తాయి. కానీ, ఈ క్రోషె ప్రాస్థసిస్ వాటి నుంచి ఉపశమనాన్నిస్తాయి. నేను పంపిన ప్రాస్థసిస్ వాడిన ఆమె 'ఇవి చాలా సౌకర్యంగా ఉన్నాయి. మాస్టెక్టమీ వల్ల నాలా చాలామంది ఆత్మవిశ్వాసం కోల్పోతున్నారనీ వాళ్లందరికీ ఇవి అందిస్తే బాగుంటుంది' అన్నారామె. అప్పుడే ఈ శాయిషా ఇండియా ఫౌండేషన్‌కి మొదటి అడుగు పడింది' అంటారు జయశ్రీ.



జయశ్రీ

వాళ్లే మొదటి ప్రాధాన్యం...

ముగ్గురు స్నేహితులం కలిసి నాకర్స్ ప్రొవైడర్ పేరుతో దీన్ని నమోదుచేశాం. ఆర్థిక పరిస్థితి సరిగాలేనివాళ్లకే తొలి ప్రాధాన్యం. మొదట్లో చాలా సవాళ్లే ఎదుర్కొన్నాం. వీటి తయారీకి స్వచ్ఛమైన కాటన్, నూలు వినియోగించాలి. అంతేకాదు, ఆంకాలజిస్టులు, రేడియాలజిస్టులు, బ్రెస్ట్ సర్జన్లకు అవగాహన కల్పించాలి. అసలు సమస్య అప్పుడే మొదలైంది. వీటి తయారీకి వాలంటీర్లు దొరకలేదు. అన్ని కష్టాలు దాటుకుని ముందుకు వెళ్తుంటే ఈ ప్రాస్థసిస్‌ను ఉచితంగా ఇవ్వడం కొన్ని వాణిజ్య సంస్థలకు నచ్చలేదు. అయినా వెనకడుగు వేయలేదు మా ఫౌండేషన్. మొదట వెయ్యిమందికి వీటిని అందించాం. ఈ ప్రయత్నంలో సాయం కోసం అమెరికాలోని నిట్టెడ్ నాకర్స్ సాయం తీసుకున్నాం. ఇప్పటివరకూ ఇరవైవేల మందికి పైగా ప్రాస్థసిస్ అందించాం. ఇప్పుడు మా దగ్గర 450 మందికి పైగా వాలంటీర్లు ఉన్నారు. వీళ్లలో చాలామంది క్యాన్సర్ నుంచి కోలుకున్నవాళ్లే. సింగపూర్, కువైట్, ఒమన్‌లో కూడా వాలంటీర్లు ఉన్నారు. అక్కడ అల్లిన నాకర్లను మాకు పంపుతారు. నాణ్యత, కొలతల్లో ఏకరూపత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రాస్థసిస్‌ను తయారుచేయడానికి అయ్యే నూలు ఖర్చులు, ప్యాకేజింగ్, పోస్టేజ్ ఖర్చులను మా వాలంటీర్లు కొంతమంది స్వచ్ఛందంగా భరిస్తారు. అలా చేయలేనివారికి మా శాయిషా సాయం చేస్తుంది. అంతేకాదు https://saaishaindia.org/ మా వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థుల్ని గుర్తించి సేవలు అందిస్తా' అంటారు జయశ్రీ.



ఛాంపియన్

ఇంగ్లాండ్ అదరగొట్టింది. సూపర్ 8లో వరుసగా రెండో విజయంలో టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. కెప్టెన్ బ్రూక్ సూపర్ శతకం సాధించిన వేళ.. ఆసక్తికర పోరులో పాకిస్థాన్‌ను ఇంగ్లాండ్ మట్టికరిపించింది. ఈ ఓటమితో టోర్నీలో పాక్ కథ దాదాపుగా ముగిసినట్లే. గ్రూపులో టాప్-2లో స్థానం ఖాయం కావడంతో ఇంగ్లాండ్ సెమీస్ చేరుకుంది.

సెమీస్‌లో ఇంగ్లాండ్

- పాకిస్థాన్‌పై విజయం
- బ్రూక్ సెంచరీ



పల్లెకెలె

బ్రూక్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో ఇంగ్లాండ్ టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఫర్హాన్ (63; 45 బంతుల్లో 7×4, 2×6) మెరవడంతో మొదట పాకిస్థాన్ 9 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. డాసన్ (3/24), ఒవర్టన్ (2/26), ఆర్చర్ (2/32) పాక్‌ను కట్టడి చేశాడు. బ్రూక్ (100; 51 బంతుల్లో 10×4, 4×6) అద్భుత శతకం సాధించడంతో లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లాండ్ తన తొలి సూపర్ 8 పోరులో శ్రీలంకపై గెలిచిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరడం ఇంగ్లాండ్‌కు ఇది వరుసగా అయిదోసారి.

అతడొక్కడు..: ఛేదనలో బ్రూక్ ఆట అద్భుతం. అతడి పోరాటమే ఇంగ్లాండ్‌ను విజయతీరాలకు చేర్చింది. ఆ జట్టుకు ఆరంభం పెద్ద షాక్. తొలి బంతికే సాల్ట్ ఔటయ్యాడు. ఆ తర్వాత బట్లర్ (2), బెతెల్ (8) కూడా ఎక్కువసేపు నిలువలేదు. ఇంగ్లాండ్ 35/3తో చిక్కుల్లో పడింది. అయితే మరో వైపు నుంచి వికెట్లు పోతున్నా బ్రూక్ ధాటిగా బ్యాటింగ్ చేస్తూ పరుగుల వేటను కొనసాగించాడు. ఎనిమిదో ఓవర్లో జట్టు స్కోరు 58 వద్ద బ్యాంటన్ (2) కూడా ఔట్ కావడంతో ఇంగ్లాండ్‌పై ఒత్తిడి పెరిగింది. అయినా బ్రూక్ పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. సామ్ కరన్ (16)తో కలిసి జట్టు స్కోరును 100 దాటించాడు. కానీ 12వ ఓవర్లో కరన్‌ను తారిఖ్ ఔట్ చేయడంతో భాగస్వామ్యం విడిపోయింది. పాకిస్థాన్‌కూ మంచి అవకాశమున్న దశ అది. కానీ బ్రూక్‌కు తోడు జాక్స్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఇంగ్లాండ్ వేగంగా లక్ష్యం దిశగా సాగింది. 48 బంతుల్లో 61 పరుగులు చేయాల్సిన స్థితి నుంచి ఆఖరి నాలుగు ఓవర్లలో 27 పరుగులు చేయాల్సిన స్థితికి చేరుకుంది. ఆపై 17వ ఓవర్లో జాక్స్ ఓ ఫోర్ బాదగా.. బ్రూక్ వరుసగా 6, 4 దంచేసి శతకం (50 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. 19 బంతుల్లో 10 పరుగులు చేయాల్సిన స్థితిలో ఇంగ్లాండ్ గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ ఆ జట్టు అనూహ్యంగా తడబడింది. 17వ ఓవర్ ఆఖరి బంతికి బ్రూక్ వెనుదిరగడం, 18వ ఓవర్లో మీర్జా 5 పరుగులే ఇవ్వడం, 19వ ఓవర్లో నవాజ్.. 2 పరుగులే ఇచ్చి జాక్స్, ఒవర్టన్‌లను ఔట్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. ఆఖరి ఓవర్లో ఇంగ్లాండ్ మూడు పరుగులే చేయాల్సివున్నా.. చేతిలో ఉన్నది రెండు వికెట్లే. ఆ స్థితిలో 20వ ఓవర్ తొలి బంతికి ఫోర్ కొట్టి.. ఆర్చర్ ఇంగ్లాండ్‌ను సంబరాల్లో ముంచెత్తాడు.

నిలిచిన ఫర్హాన్: ఓపెనర్ ఫర్హాన్ కీలక ఇన్నింగ్స్ ఆడడంతో అంతకుముందు పాకిస్థాన్ పోటీ ఇవ్వదగ్గ లక్ష్యాన్ని నిర్దేశించింది. సూపర్ ఫామ్‌ను కొనసాగించిన ఫర్హాన్.. మరో అర్ధ శతకం సాధించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్‌కు ఆరంభంలో గట్టి దెబ్బే తగిలింది. ఇంగ్లాండ్ పేసర్ల ధాటికి ఆ జట్టు 27 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ సయిమ్ అయూబ్ (7)ను ఆర్చర్.. కెప్టెన్ సల్మాన్ ఆఘా (5)ను ఒవర్టన్ వెనక్కి పంపారు. ఆ దశలో ఫర్హాన్ నిలబడ్డాడు. బాబర్ అజామ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. కానీ తొలి పది ఓవర్లలో అతడు తన దూకుడును నియంత్రించుకోవాల్సి వచ్చింది. మరోవైపు బాబర్ నిలిచినా.. మరోసారి దూకుడుగా ఆడడంలో విఫలమయ్యాడు. 11వ ఓవర్లో ఒవర్టన్ బౌలింగ్‌లో అతడు బౌల్డయ్యే సమయానికి పాకిస్థాన్ స్కోరు 73 మాత్రమే. ఫర్హాన్‌తో మూడో వికెట్‌కు అతడు 7.2 ఓవర్లలో 46 పరుగులు మాత్రమే జోడించాడు. అయితే ఫకార్ జమాన్ వచ్చాక ఇన్నింగ్స్‌కు ఊపొచ్చింది. అతడు వస్తూనే.. జాక్స్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. ఫర్హాన్ కూడా జోరందుకున్నాడు. జాక్స్ బౌలింగ్‌లో బ్యాటర్లిద్దరూ చెరో సిక్స్ బాదేశారు. 16వ ఓవర్లో ఫర్హాన్ వరుసగా 6, 4 కొట్టాడు. అయితే అదే ఓవర్లో ఫర్హాన్, తర్వాతి ఓవర్లో జమాన్ వెనుదిరిగారు. 30 బంతుల్లోనే 49 పరుగులు జోడించిన బ్యాటర్లు వెంటవెంటనే నిష్క్రమించడంతో ఇన్నింగ్స్ నెమ్మదించింది. పాక్ ఆఖరి మూడు ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 24 పరుగులు మాత్రమే చేసింది. దాసన్, ఆర్చర్, సామ్ కరన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు.

ఇంగ్లాండ్.. ముందుకు ఇలా

టీ20 ప్రపంచకప్‌లో చాలా ముందుగానే ఒక సెమీస్ బెర్తు ఖరారైపోయింది. గ్రూప్-2 నుంచి ఇంగ్లాండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి 4 పాయింట్లు సాధించింది. గ్రూప్‌లో మరో జట్టుకు మాత్రమే 4 అంతకంటే ఎక్కువ పాయింట్లు సాధించే అవకాశం ఉండడంతో ఇంగ్లాండ్ ముందంజ వేసింది. ఆ జట్టు తన చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో ఓడినా ఇంగ్లాండ్ కనీసం రెండో స్థానంలో నిలుస్తుంది. గెలిస్తే అగ్రస్థానం సాధిస్తుంది. బుధవారం న్యూజిలాండ్, శ్రీలంక తలపడనున్నాయి. ఇందులో లంక నెగ్గితే దాంతో పాటు కివీస్, పాక్ కూడా పోటీలో ఉంటాయి. కివీస్-ఇంగ్లాండ్, పాక్-లంక మ్యాచ్‌ల ఫలితాలను బట్టి.. ఒక జట్టు ముందంజ వేస్తుంది. కివీస్ చేతిలో ఓడితే లంక టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. గ్రూప్‌లో చివరి రెండు మ్యాచ్‌ల ఫలితాలను బట్టి కివీస్, పాక్‌ల్లో ఒకటి సెమీస్‌కు వెళ్తుంది. ఫలితాలు ఎలా ఉన్నా కివీస్, పాక్, లంక జట్లలో ఒకటి మాత్రమే 4 అంతకంటే ఎక్కువ పాయింట్లు సాధించగలవు కాబట్టి ఇంగ్లాండ్‌కు ముందే బెర్తు ఖరారైపోయింది.



పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ ఎల్బీ (బి) ఒవర్టన్ 63; సయిమ్ అయూబ్ (సి) బెతెల్ (బి) ఆర్చర్ 7; సల్మాన్ ఆఘా (సి) ఒవర్టన్ (బి) డాసన్ 5; బాబర్ అజామ్ (బి) ఒవర్టన్ 25; ఫకార్ జమాన్ (సి) డాసన్ (బి) అడిల్ రషీద్ 25; షాదాబ్ ఖాన్ రనౌట్ 23; ఉస్మాన్ ఖాన్ (సి) ఒవర్టన్ (బి) డాసన్ 8; నవాజ్ ఎల్బీ (బి) డాసన్ 0; షహీన్ షా అఫ్రిది (సి) కరన్ (బి) ఆర్చర్ 2; సల్మాన్ మీర్జా నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **164; వికెట్ల పతనం:** 1-14, 2-27, 3-73, 4-122, 5-132, 6-146, 7-146, 8-149, 9-164; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-32-2; ఒవర్టన్ 3-0-26-2; డాసన్ 4-0-24-3; సామ్ కరన్ 3-0-24-0; అడిల్ రషీద్ 4-0-31-1; జాక్స్ 2-0-27-0

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) ఉస్మాన్ ఖాన్ (బి) షహీన్ అఫ్రిది 0; బట్లర్ (సి) ఉస్మాన్ ఖాన్ (బి) షహీన్ అఫ్రిది 2; బ్రూక్ (బి) షహీన్ అఫ్రిది 100; బెతెల్ (సి) ఫర్హాన్ (బి) షహీన్ అఫ్రిది 8; బ్యాంటన్ (సి) ఉస్మాన్ ఖాన్ (బి) తారిఖ్ 2; సామ్ కరన్ (సి) నవాజ్ (బి) తారిఖ్ 16; జాక్స్ (బి) నవాజ్ 28; ఒవర్టన్ (స్టంప్డ్) ఉస్మాన్ ఖాన్ (బి) నవాజ్ 0; డాసన్ నాటౌట్ 1; ఆర్చర్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (19.1 ఓవర్లలో 8 వికెట్లకు) **166; వికెట్ల పతనం:** 1-0, 2-17, 3-35, 4-58, 5-103, 6-155, 7-160, 8-161; **బౌలింగ్:** షహీన్ షా అఫ్రిది 4-0-30-4; సల్మాన్ మీర్జా 3.1-0-26-0; సయిమ్ అయూబ్ 2-0-21-0; నవాజ్ 3-0-26-2; షాదాబ్ ఖాన్ 3-0-31-0; ఉస్మాన్ తారిఖ్ 4-0-31-2

జట్టును వీడిన రింకు!



చెన్నై: టీమ్‌ఇండియా మిడిలార్డర్ బ్యాటర్ రింకు సింగ్ గురువారం జింబాబ్వేతో టీ20 ప్రపంచకప్ సూపర్-8 మ్యాచ్‌కు అనుమానంగా మారాడు. కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా అతడు జట్టును వీడినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. మంగళవారం చిదంబరం స్టేడియంలో జరిగిన నెట్ ప్రాక్టీస్‌కు కూడా రింకు హాజరు కాలేదు. రింకు తండ్రి కంచన్‌చంద్ సింగ్ అనారోగ్యంతో గ్రేటర్ నోయిడాలోని ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. రింకు స్థానంలో తుది జట్టులోకి బ్యాటర్‌ను తీసుకోవాలనుకుంటే, సంజు శాంసన్ అవకాశం దక్కుతుంది. బౌలర్‌ను ఎంచుకోవాలనుకుంటే కుల్‌దీప్ యాదవ్ తుది జట్టులోకి వస్తాడు. సూపర్-8తో కలిపి ప్రస్తుత ప్రపంచకప్‌లో రింకు అయిదు మ్యాచ్‌లు ఆడాడు. దక్షిణాఫ్రికాపై డకౌట్ అయిన అతడు.. నెదర్లాండ్స్‌పై 6, పాకిస్థాన్‌పై 11, నమీబియాపై 1, అమెరికాపై 6 పరుగులే చేశాడు.

జూన్ 14న పాక్‌తో భారత్ ఢీ

మహిళల టీ20 ప్రపంచకప్ షెడ్యూలు విడుదల



లండన్: జూన్ 14న పాకిస్థాన్‌తో పోరుతో భారత జట్టు మహిళల టీ20 ప్రపంచకప్ టైటిల్ వేటను ఆరంభించనుంది. ఇంగ్లాండ్ ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీ షెడ్యూలును ఐసీసీ.. మంగళవారం ప్రకటించింది. జూన్ 12 నుంచి జులై 5 వరకు జరిగే ప్రపంచకప్‌లో 12 జట్లు పోటీపడనున్నాయి. పాకిస్థాన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్‌లతో పాటు భారత్ గ్రూప్-1లో ఉంది. వెస్టిండీస్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు గ్రూప్-2లో పోటీపడతాయి. టోర్నీ తొలి మ్యాచ్‌లో జూన్ 12న ఎడ్జ్‌బాస్టన్‌లో శ్రీలంకతో ఆతిథ్య ఇంగ్లాండ్ తలపడుతుంది. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ కూడా ఎడ్జ్‌బాస్టన్‌లోనే జరుగుతుంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ల్లో జూన్ 17న నెదర్లాండ్స్‌తో, 21న దక్షిణాఫ్రికాతో, 25న బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. తన చివరి గ్రూప్ మ్యాచ్‌లో 28న ఆస్ట్రేలియాను ఢీకొంటుంది. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశిస్తాయి. జూన్ 30, జులై 2న సెమీఫైనల్స్ జరుగుతాయి. జులై 5న ఫైనల్‌కు లార్డ్స్ ఆతిథ్యమిస్తుంది.

భారత్‌కే పంచ్

- తొలి వన్డేలో ఆస్ట్రేలియా విజయం
- మెరిసిన మూనీ, అలీసా, గార్డ్‌నర్



బ్రిస్బేన్

ఆస్ట్రేలియాలో టీ20 సిరీస్ సాధించిన ఉత్సాహంలో వన్డేల్లోనూ బోణీ కొట్టాలనుకున్న భారత మహిళల జట్టుకు పంచ్! మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో విఫలమైన హర్మన్‌ప్రీత్ బృందం.. కంగారూల చేతిలో 6 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. మొదట ఆష్లీ గార్డ్‌నర్ (3/33), మెగాన్ షట్ (2/42) విజృంభించడంతో భారత్ 48.3 ఓవర్లలో 214 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధాన (58; 68 బంతుల్లో 7×4), హర్మన్‌ప్రీత్ (53; 84 బంతుల్లో 3×4), కశ్వీ గౌతమ్ (43; 44 బంతుల్లో 3×4, 3×6) మాత్రమే రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెత్ మూనీ (76; 79 బంతుల్లో 5×4, 2×6), అలీసా హీలీ (50; 70 బంతుల్లో 4×4), అనాబెల్ సదర్లాండ్ (48 నాటౌట్; 44 బంతుల్లో 4×4, 1×6) సత్తా చాటడంతో ఆసీస్ 38.2 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. శుక్రవారం హోబర్ట్‌లో రెండో వన్డే జరుగుతుంది.

ఆసీస్ అలవోకగా..: మొదట భారత్ పరుగుల కోసం కష్టపడిన పిచ్‌పై ఛేదనలో ఆస్ట్రేలియా స్వేచ్ఛగా ఆడింది. ఓపెనర్లు అలీసా హీలీ, లిచ్‌ఫీల్డ్ (32) ప్రణాళిక ప్రకారం ఆడుతూ పరుగులు రాబట్టారు. తొలి వికెట్‌కు 50 పరుగులు జత చేసి శుభారంభం ఇచ్చారు. 11వ ఓవర్లో స్పిన్నర్ శ్రీచరణి వరుస బంతుల్లో లిచ్‌ఫీల్డ్, జార్జియా వోల్ (0)లను ఔట్ చేసి.. కంగారూ జట్టును దెబ్బ కొట్టింది. ఈ స్థితిలో అలీసాకు బెత్ మూనీ అండగా నిలిచింది. ఈ జంట బౌండరీల వేటలో సాగడంతో 22 ఓవర్లకు 109/2తో ఆసీస్ విజయం దిశగా సాగింది. అర్ధసెంచరీ చేసిన అలీసాను క్రాంతి ఔట్ చేసినా.. అనాబెల్ సదర్లాండ్‌తో కలిసి మూనీ జోరు కొనసాగించింది. 51 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన మూనీ విజయం ముంగిట ఔటైనా.. అనాబెల్, ఆష్లీ గార్డ్‌నర్ (5 నాటౌట్) పని పూర్తి చేశారు. అంతకుముందు ఆసీస్ బౌలర్లు విజృంభించడంతో భారత్ ఇన్నింగ్స్ చాలా పేలవంగా సాగింది. గత ఏడాది వన్డే ప్రపంచకప్‌లో గాయపడిన తర్వాత తొలి వన్డే ఆడుతున్న ప్రతీక రావల్ (0) ఇన్నింగ్స్ రెండో బంతికే ఔటైంది. షెఫాలి (4), జెమీమా (8) సైతం నిలవలేదు. ఈ దశలో స్మృతి మంధాన జట్టును ఆదుకుంది. టీ20 సిరీస్ ఫామ్‌ను కొనసాగిస్తూ స్కోరు పెంచింది. హర్మన్‌ప్రీత్ నుంచి స్మృతికి చక్కటి సహకారం అందింది. 23.1 ఓవర్లకు 100/3తో భారత్ మెరుగైన స్థితిలో నిలిచింది. ఈ క్రమంలోనే స్మృతి 56 బంతుల్లో అర్ధసెంచరీ అందుకుంది. కానీ స్వల్ప వ్యవధిలో స్మృతి, దీప్తి (2) వికెట్లు పడిపోయాయి. ఆ తర్వాత రిచా (23)తో పాటు హర్మన్‌ప్రీత్ ఔట్ కావడంతో భారత్ స్కోరింగ్ రేట్ పడిపోయింది. కశ్వీ గౌతమ్ ధాటిగా ఆడి స్కోరును 200 దాటించింది.

హర్మన్‌ప్రీత్‌కు గాయం



ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల జట్టును కలవరపరిచే విషయం. గాయం కారణంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ శుక్రవారం రెండో వన్డేకు అనుమానంగా మారింది. మంగళవారం తొలి వన్డేలో బ్యాటింగ్ చేస్తుండగా హర్మన్ మోకాలికి గాయమైంది. 38వ ఓవర్ చివర్లో గాయానికి ప్రథమ చికిత్స చేయించుకున్న హర్మన్.. 44వ ఓవర్లో ఔటైంది. ఆ తర్వాత ఆసీస్ బ్యాటింగ్ చేసే సమయంలో ఆమె మైదానంలోకి రాలేదు. "కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు గాయమైంది. అందుకే ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో ఆమె ఫీల్డింగ్ చేయలేదు. హర్మన్ పరిస్థితిని వైద్య బృందం పర్యవేక్షిస్తోంది" అని బీసీసీఐ తెలిపింది.

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక రావల్ ఎల్బీ (బి) మెగాన్ షట్ 0; స్మృతి (సి) అలానా (బి) తాలియా 58; షెఫాలి (సి) అండ్ (బి) డార్సీ బ్రౌన్ 4; జెమీమా (సి) బెత్ మూనీ (బి) ఆష్లీ గార్డ్‌నర్ 8; హర్మన్‌ప్రీత్ (సి) వోల్ (బి) ఆష్లీ గార్డ్‌నర్ 53; దీప్తి (సి) మోలనూ (బి) అలానా 2; రిచా (సి) వోల్ (బి) మోలనూ 23; కశ్వీ గౌతమ్ రనౌట్ 43; క్రాంతి గౌడ్ (సి) మోలనూ (బి) ఆష్లీ గార్డ్‌నర్ 2; శ్రీచరణి (సి) వోల్ (బి) మెగాన్ షట్ 2; రేణుక నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 19 **మొత్తం:** (48.3 ఓవర్లలో ఆలౌట్) **214; వికెట్ల పతనం:** 1-0, 2-25, 3-52, 4-100, 5-103, 6-140, 7-193, 8-196, 9-203; **బౌలింగ్:** మెగాన్ షట్ 9-1-42-2; డార్సీ బ్రౌన్ 5-0-24-1; అనాబెల్ సదర్లాండ్ 8.3-1-32-0; ఆష్లీ గార్డ్‌నర్ 7-0-33-3; అలానా కింగ్ 10-0-43-1; తాలియా మెక్‌గ్రాత్ 4-0-16-1; సోఫీ మోలనూ 5-1-17-1

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలీసా హీలీ (సి) జెమీమా (బి) క్రాంతి 50; లిచ్‌ఫీల్డ్ (స్టంప్డ్) రిచా (బి) శ్రీచరణి 32; జార్జియా వోల్ (సి) స్మృతి (బి) శ్రీచరణి 0; బెత్ మూనీ (సి) స్మృతి (బి) దీప్తి 76; అనాబెల్ సదర్లాండ్ నాటౌట్ 48; ఆష్లీ గార్డ్‌నర్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (38.2 ఓవర్లలో 4 వికెట్లకు) 217; **వికెట్ల పతనం:** 1-55, 2-55, 3-119, 4-204; **బౌలింగ్:** రేణుక 6-1-35-0; క్రాంతి గౌడ్ 6-0-32-1; కశ్వీ గౌతమ్ 5-0-32-0; శ్రీచరణి 9-0-41-2; దీప్తి 7.2-0-49-1; షెఫాలి 5-0-25-0

అక్షర్ ఆడుతున్నట్లే..



చెన్నై: దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్‌కు ఫామ్‌లో ఉన్న స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న భారత జట్టు యాజమాన్యం.. జింబాబ్వేతో తర్వాతి పోరుకు అతణ్ని తుది జట్టులోకి తీసుకోవడం లాంఛనంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్ ముంగిట చెపాక్ స్టేడియంలో టీమ్‌ఇండియా ముమ్మర సాధన చేస్తుండగా.. అక్షర్ కూడా చెమటోడుస్తున్నాడు. మంగళవారం అక్షర్ చాలాసేపు ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యాడు. జట్టు సభ్యుల్లో అత్యధిక సమయం సాధన చేసిన వాళ్లలో అతనొకడు. కెప్టెన్ సూర్య కుమార్‌తో కలిసి అక్షర్ ప్రాక్టీస్ చేశాడు. అతడి స్థానంలో ఆడిన వాషింగ్టన్ సుందర్ సత్తా చాటని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుందర్‌పై వేటు వేసి అక్షర్‌ను ఆడించడం ఖాయంగా కనిపిస్తోంది.

జమ్మూకశ్మీర్ 284/2



హుబ్లీ: కర్ణాటకతో రంజీ ట్రోఫీ ఫైనల్లో జమ్మూకశ్మీర్ అదరగొడుతోంది. మంగళవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో మొదటి రోజు జమ్మూకశ్మీర్ సంపూర్ణ ఆధిపత్యం కనబరిచింది. శుభమ్ పుందిర్ (117 బ్యాటింగ్; 221 బంతుల్లో 12×4, 2×6) అజేయ శతకంతో సత్తాచాటడంతో ఆ జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన జమ్మూకశ్మీర్.. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో రెండు వికెట్లకు 284 పరుగులు సాధించింది. 18 పరుగులకే ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (6) వికెట్ కోల్పోయిన ఆ జట్టును యావర్ హసన్ (88; 150 బంతుల్లో 13×4), శుభమ్ ఆదుకున్నారు. వీళ్లిద్దరూ రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను గాడినపెట్టారు. హసన్ ఔటయ్యాక కెప్టెన్ పరాస్ డోగ్రా (9 రిటైర్డ్ హర్ట్) గాయంతో వెనుదిరిగాడు. అనంతరం శుభమ్, అబ్దుల్ సమద్ (52 బ్యాటింగ్; 67 బంతుల్లో 5×4, 1×6) మూడో వికెట్‌కు అజేయంగా 105 పరుగులు జతచేసి జట్టుకు భారీ స్కోరుకు బాటలు వేశారు. కర్ణాటక బౌలర్లలో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ (2/36) ఒక్కడే ప్రభావం చూపగలిగాడు. మరో నాలుగు రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ భారీ స్కోరు సాధిస్తే రంజీ ట్రోఫీ చరిత్రలోనే అతి పెద్ద సంచలనం నమోదవ్వొచ్చు.





రాత్రి 7 నుంచి

బోణీ ఎవరిదో?

నేడు లంకతో కివీస్ సూపర్-8 పోరు

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో ఆసక్తికర సమరానికి వేళైంది. సూపర్-8లో ఇంకా గెలుపు ఖాతా తెరవని శ్రీలంక, న్యూజిలాండ్ బుధవారం అమీతుమీ తేల్చుకోనున్నాయి. సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ పోరులో గెలవడం శ్రీలంకకు తప్పనిసరి. నెగ్గాలంటే స్పిన్ బౌలింగ్‌లో ఆ జట్టు బ్యాటింగ్ చాలా మెరుగుపడాలి. స్పిన్‌కు సహకరించిన పల్లెకెలె పిచ్‌పై గత మ్యాచ్‌లో లంక.. ఇంగ్లాండ్‌పై 147 పరుగుల లక్ష్యాన్ని కూడా ఛేదించలేపోయింది. ఇంగ్లాండ్ స్పిన్నర్లు ఆ జట్టును దెబ్బతీశారు. కెప్టెన్ శాంట్నర్ సహా న్యూజిలాండ్‌కు కూడా మెరుగైన స్పిన్నర్లున్నారు. వాళ్లను ఎదుర్కోవడం లంకకు సవాలే. పాకిస్థాన్‌తో సూపర్ 8 మ్యాచ్ రద్దు కావడంతో కివీస్ ఖాతాలో ప్రస్తుతం ఒక పాయింట్ ఉంది. ఆ జట్టుకు కూడా ఈ మ్యాచ్ గెలవడం చాలా అవసరం. సీఫర్ట్, అలెన్, రవీన్, ఫిలిప్స్, మిచెల్‌లతో కివీస్‌కు బలమైన బ్యాటింగ్ లైనప్ ఉంది.



సచిన్‌ను ఔటివ్వడం తప్పే

దిల్లీ: అది భారత్, ఆస్ట్రేలియా మధ్య టెస్టు మ్యాచ్. ఆసీస్ ఫాస్ట్ బౌలర్ జేసన్ గిలెస్పీ బంతి సచిన్ తెందుల్కర్ ప్యాడ్లకు చాలా ఎత్తులో తగిలింది. గిలెస్పీ, అతడి సహచరులు గట్టిగా అప్పీలు చేయడంతో దిగ్గజ అంపైర్ స్టీవ్ బక్నర్.. సచిన్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔటిచ్చాడు. దాంతో అప్పట్లో పెద్ద వివాదమే చెలరేగింది. ఎందుకంటే బంతి.. స్పష్టంగా స్టంప్స్ పైనుంచి వెళ్తున్నట్లు రీప్లేల్లో తేలింది. వ్యాఖ్యాత టోనీ గ్రెగ్ అది ఘోరమైన నిర్ణయమని అన్నాడు. అతడొక్కడే కాదు.. చాలా మంది ఆ నిర్ణయాన్ని తప్పుబట్టారు. 2003లో జరిగిన ఆ పోరుకు వేదిక బ్రిస్బేన్. రెండు దశాబ్దాల తర్వాత ఇప్పుడు బక్నర్.. తన నిర్ణయంపై స్పందించాడు. అది తప్పేనని అంగీకరించాడు. "సచిన్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔటివ్వడం తప్పే. దాని గురించి జనం ఇప్పటికీ మాట్లాడుతున్నారు. జీవితంలో తప్పులు జరుగుతుంటాయి. నా తప్పును నేను అంగీకరించాను. జీవితం సాగుతూ ఉంటుంది" అని బక్నర్ అన్నాడు. అతడు మరో సందర్భంలో కూడా సచిన్‌ను తప్పుగా ఔటివ్వడం వివాదాస్పదమైంది. 79 ఏళ్ల బక్నర్.. 1989 నుంచి 2009 వరకు 128 టెస్టుల్లో విధులు నిర్వర్తించాడు. 1992-2007 మధ్య రికార్డు స్థాయిలో వరుసగా అయిదు వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌లో అంపైర్‌గా వ్యవహరించాడు.

అఫ్గాన్‌కు ట్రాట్ టాటా



కాబుల్: అఫ్గానిస్థాన్ క్రికెట్ ఎదుగుదలలో కీలకపాత్ర పోషించిన కోచ్ జొనాథన్ ట్రాట్ (ఇంగ్లాండ్) ఆ జట్టుకు వీడ్కోలు పలికాడు. టీ20 ప్రపంచకప్‌లో అఫ్గాన్ జట్టు సూపర్-8కు అర్హత సాధించకపోవడంతో అతడు కోచ్ పదవి నుంచి తప్పుకున్నాడు. ట్రాట్ స్థానంలో ఇంగ్లాండ్‌కే చెందిన రిచర్డ్ పైబస్ నూతన కోచ్‌గా నియమితుడయ్యాడు. 2022లో అఫ్గాన్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ట్రాట్.. మెరుగైన ఫలితాలు రాబట్టాడు. అతడి హయాంలో 2023 వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, ఇంగ్లాండ్‌లకు షాక్ ఇచ్చిన అఫ్గాన్.. ఆస్ట్రేలియాపైనా అదిరే ప్రదర్శన చేసింది. కానీ మ్యాక్స్‌వెల్ అసాధారణ ఇన్నింగ్స్‌తో ఆసీస్ ఓటమి నుంచి తప్పించుకుంది. 2024 టీ20 ప్రపంచకప్‌లో అఫ్గాన్ సెమీఫైనల్ చేరింది. ట్రాట్ స్థానంలో అఫ్గాన్ శిక్షణ బాధ్యతలు అందుకున్న పైబస్.. 1999 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన పాకిస్థాన్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. 2013లో అతడు బంగ్లాదేశ్‌కు మార్గనిర్దేశకుడిగా పని చేశాడు.

భారత్ పరాజయం

హోబర్ట్: ఎఫ్ఐహెచ్ పురుషుల ప్రో లీగ్ హాకీలో భారత్ వైఫల్యం కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-4 (షూటౌట్)తో స్పెయిన్ చేతిలో పరాజయం చవిచూసింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో మ్యాచ్ డ్రా అయింది. అనంతరం షూటౌట్‌లో భారత్‌పై స్పెయిన్ పైచేయి సాధించింది. భారత్ తరఫున మణిందర్ సింగ్ గోల్ రాబట్టగా.. స్పెయిన్ ఆటగాడు బ్రూనో ఫాంట్ స్కోరును సమం చేశాడు. షూటౌట్‌లో అభిషేక్, హార్దిక్ సింగ్ విఫలమవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. బుధవారం జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. భారత్ తన తొలి రెండు మ్యాచ్‌ల్లో 0-2తో స్పెయిన్ చేతిలో, 4-5 (షూటౌట్)తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయాలు చవిచూసింది. 9 జట్లు బరిలో ఉన్న ఈ లీగ్‌లో ప్రస్తుతం 2 పాయింట్లతో భారత్ ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది.





సభా సమయం

వైకాపా నేతల 'మహాపాపం'

- నెయ్యిలో జంతుకొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ నివేదికలో ఉంది
- కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో ప్రజంటేషన్ ద్వారా వివరించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ నివేదిక ఆధారంగానే తాను మాట్లాడానని.. భగవంతుడే తన నోటితో ఆ విషయాన్ని చెప్పించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సీబీఐ ఆధ్వర్యంలోని సిట్.. కల్తీ నెయ్యిపై కోర్టులో ఛార్జిషీట్, అనుబంధ ఛార్జిషీట్లు దాఖలు చేసింది. తప్పు చేసిన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఒక నివేదిక, తితిదేలో చేపట్టాల్సిన దిద్దుబాటు చర్యలపై మరో నివేదిక అందించింది. వాటి ప్రకారం చర్యలు తీసుకునేందుకే ఏకసభ్య కమిషన్ వేశాం. ఇదేదో మేం సొంతంగా చేస్తోంది కాదు' అని స్పష్టం చేశారు. తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారంపై శాసనసభలో మంగళవారం ఆయన 'మహాపాపం' పేరుతో ప్రజంటేషన్ ఇచ్చారు. కృత్రిమ నెయ్యి తయారీకి వినియోగించిన పదార్థాలు, సిట్ స్వాధీనం చేసుకున్న రసాయనాల డ్రమ్ములు, లంచాల వివరాలు రాసుకున్న డెయిరీ తదితర ఆధారాలతో కూడిన ఫొటోలు ప్రదర్శించారు.


మెదక్‌లో క్రైస్తవ సంప్రదాయంలో జరిగిన భూమన కరుణాకరరెడ్డి కుమార్తె వివాహం ఫొటోను చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి బైబిల్ పట్టుకున్న చిత్రాన్ని చూపిస్తున్న చంద్రబాబు

అప్పటి ఈవో, ఛైర్మన్‌కు తెలియకుండా సాధ్యమా? జగన్ బాధ్యత తీసుకోరా?

'ఛైర్మన్, ఈవోకు తెలియకుండా లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేయగలరా?' అని చంద్రబాబు నిలదీశారు. 'నెయ్యి కల్తీ జరిగిందని సిట్ ఛార్జిషీట్‌లో చెప్పిందని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి చెప్పారు. దానికి అనుగుణంగా రిపోర్టులు, ఫోరెన్సిక్ నివేదికలు ఉన్నాయి. అయినా బాధ్యత తీసుకుని క్షమాపణ చెప్పాల్సిన జగన్.. తిరిగి మమ్మల్నే క్షమాపణ చెప్పాలనడం దుర్మార్గం' అని దుయ్యబట్టారు. 'నెయ్యి నమూనాలో బీటా సిటోస్టెరాల్ ఉందని సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) నివేదిక ఇచ్చినప్పుడే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చర్యలు తీసుకుంటే కల్తీ కొనసాగేది కాదు. వ్యవస్థీకృత నేరంతో లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారు, అధికారులు, నిపుణులు, సిండికేట్ కలిసి కుట్ర చేశారు. దేవుడి దగ్గర అపచారం జరిగినప్పుడు ఏ రాజకీయ పార్టీ అయినా తప్పు ఒప్పుకోవాల్సిందే. కానీ వైకాపా నేతలు బుకాయిస్తున్నారు' అని మండిపడ్డారు.

నాడు సిట్, నిన్నటి ఏకసభ్య కమిషన్‌పైనా సుప్రీంకోర్టుకెళ్లారు..

'లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం విషయం ప్రభుత్వం దృష్టికి రాగానే సిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దాన్ని సవాల్ చేస్తూ వైకాపా నేతలు కోర్టుకెళ్లారు. రాజకీయ వివాదం ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ద్వారా విచారణ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సిట్ సిఫారసులపై చర్యలకు ఏకసభ్య కమిషన్ నియమించాం. దీనిపై వైకాపా మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. అది నంబరింగ్ కాలేదు. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి ద్వారా రిట్ పిటిషన్ వేయించారు. దాన్ని విచారించిన సుప్రీంకోర్టు కూడా కమిషన్ ఏర్పాటులో తప్పులేదని చెప్పింది. రిట్ డిస్పోజ్ చేస్తూ, ప్రభుత్వం ముందుకు వెళ్లేందుకు అనుమతించింది' అని చంద్రబాబు పేర్కొన్నారు. సీఎం ప్రజంటేషన్‌లోని ముఖ్యాంశాలు..

ప్రధాన సూత్రధారులు: పొమిల్ జైన్, విపిన్ జైన్, భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ

నెయ్యి సరఫరా చేసిన షెల్ కంపెనీలు: ఏఆర్ డెయిరీ ఫుడ్స్ (దిండిగల్), శ్రీవైష్ణవి డెయిరీ (పునబాక), మల్‌గంగా మిల్క్, ఆగ్రో పొడక్ట్స్

కల్తీ నెయ్యికి రసాయనాల సరఫరా: అజయ్‌కుమార్ సుగంధ్, మహేశ్‌కుమార్ రోహిరా, ఆశిష్ అగర్వాల్.. షెల్ కంపెనీలు, భోలేబాబా డెయిరీకి సహకారం

చిన్నప్పన్న సహకారం: బ్యాంకు ఖాతాలో రూ.4.69 కోట్ల లంచం డబ్బుతో దొరికిన వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న. కల్తీ నెయ్యి సరఫరాదారులకు సహకారం అందించింది ఆయనే.

తప్పుడు ధ్రువపత్రాలు.. ప్రధాన సంస్థల నెయ్యితో దొంగ రిపోర్టులు


- తప్పుడు ధ్రువపత్రాలతో భోలేబాబా నెయ్యి సరఫరా బిడ్లు వేసింది.
- అనర్హత ఉన్నా ఏ1, ఏ6, ఏ19లను ముందు పెట్టి నెయ్యి సరఫరా.
- తప్పుడు రిటర్నులతో తితిదేను మోసం చేశారు. సమర్పించిన ఆన్‌లైన్, ఫిజికల్ రిటర్న్‌లలోనూ వ్యత్యాసాలున్నాయి.
- ల్యాబ్ నివేదికల్ని ఫోర్జరీ చేశారు. మల్‌గంగా డెయిరీ సంస్థ అపెక్స్ ల్యాబ్ పేరుతో నమూనాలు ఇవ్వకుండానే దొంగ రిపోర్టు తెచ్చి సమర్పించింది.
- శ్రీవైష్ణవి డెయిరీ ప్రముఖ సంస్థల నెయ్యి నమూనాలు పంపి, కల్తీ నెయ్యికి ధ్రువీకరణ పత్రాలు పొందింది.

ఖరీదైన ఫోన్లు.. కిలోకు ఇంతని కమీషన్లు

- గేట్ కీపర్లకు ఎరవేశారు.
- తితిదేలో సాంకేతిక నిపుణులకు ఖరీదైన ఫోన్లు, బంగారు/వెండి కాయిన్లు ఇచ్చారు. దీంతో వారు ప్లాంట్ తనిఖీల్లో అనుకూల నివేదికలు ఇచ్చారు
- బత్తుల సురేంద్రనాథ్, డాక్టర్ కులకర్ణి జయరాజారావులకు లంచాలు ఎర చూపారు.
- కిలో నెయ్యికి రూ.25 చొప్పున కమిషన్ డిమాండ్ చేసిన సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న
- కల్తీ నెయ్యి అన్‌లోడింగ్‌లో సిబ్బందికి లంచాలు
- నెగెటివ్ రిపోర్టులు తొక్కిపెట్టిన గోదాము సిబ్బంది.. ముడుపులు తీసుకుని కల్తీకి యథేచ్ఛగా సహకారం
- కల్తీ నెయ్యి సరఫరాదారులతో చేతులు కలిపిన సిబ్బంది.. ప్రొటోకాల్ దర్శనాలు కల్పించారు.

సిట్ స్వాధీనం చేసుకున్న ఆధారాలు

- మోనోగ్లిజరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ డ్రమ్ములు
- వాట్సప్ చాట్‌లు, ఫేక్ ఇన్వాయిస్‌లు, ఖాళీ రసీదులు
- లంచాల వివరాలతో కూడిన డెయిరీ సీజ్
- లంచంగా ఇచ్చిన ఖరీదైన ఫోన్లు.


2017లో జగన్ తిరుమల దర్శనానికి వచ్చినప్పుడు డిక్లరేషన్‌పై సంతకం చేయకపోవడంతో అధికారులు క్యాన్సిల్డ్ అని రాసిన పత్రం


నెయ్యి సరఫరాలో నిబంధనలకు ఇలా నీళ్లొదిలారు

1. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలనే నిబంధన తొలగించారు.
2. నెయ్యి ఉత్పత్తిలో అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి కుదించారు.
3. రోజుకు 12 టన్నులుగా ఉండాల్సిన వెన్న తయారీని.. 8 టన్నులకు తగ్గించారు.
4. డెయిరీల వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పరిమితం చేశారు.
5. సాంకేతిక అధ్యయనం, క్షేత్ర పరిశీలనలకు పూర్తిగా మినహాయింపు ఇచ్చారు.
6. ఆహార భద్రత ప్రమాణ నిబంధనల్ని నీరుగార్చారు.

కల్తీ నెయ్యి ఎలా తయారు చేశారంటే..

- రిఫైన్డ్ పామోలిన్ ఆయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ తీసుకున్నారు.
- మోనో గ్లిజరైడ్స్, లాక్టిక్ యాసిడ్ (వీటిని జంతుకొవ్వు/వెజిటబుల్ ఫ్యాట్ నుంచి చేస్తారు)
- బీటాకెరాటిన్ (రంగు కోసం)
- ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ (వాసన కోసం)
- సింథటిక్ ఫ్లేవర్ (నెయ్యిలా కనిపించేందుకు)
- లబ్సా యాసిడ్
- రసాయనాల రంగు కనిపించకుండా మాస్కింగ్ ఏజంట్లు వినియోగించారు.
- రసాయనాల్ని కలిపి ఉంచడానికి ఎమల్సిఫయర్లు వాడారు.
- అగ్‌మార్క్ పరీక్షలో ఆర్ఎం వ్యాల్యూ కోసం ప్రమాదకర రసాయనాలు కలిపారు.






కల్తీ నెయ్యి అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రజంటేషన్‌లోని ఓ స్లైడ్

లాలూచీతో పద్ధతి ప్రకారం లూటీ

- 2021 నవంబరు: 20.5 లక్షల కిలోల నెయ్యికి తితిదే టెండర్లు
- 2022 మార్చి: కిలోకు రూ.329 చొప్పున భోలేబాబాకు సరఫరా ఆర్డర్
- 2022 మే: భోలేబాబా డెయిరీని లంచం అడిగిన చిన్నప్పన్న. అంగీకరించని భోలేబాబా. తనిఖీ చేయాలంటూ తితిదే జీఎంపై ఒత్తిడి తెచ్చిన చిన్నప్పన్న
- 2022 జూన్: ఫతేపూర్‌లోని భోలేబాబా డెయిరీ ప్లాంట్ తనిఖీ. భోలేబాబాపై అనర్హత వేటు
- 2022 ఆగస్టు: భోలేబాబా, శ్రీ వైష్ణవి, ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు చెందిన నెయ్యి నమూనాలు కల్తీ అని నివేదిక ఇచ్చిన సీఎఫ్‌టీఆర్ఐ. దాన్ని తొక్కిపట్టిన తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి.
- 2022 అక్టోబరు: బ్లాక్‌లిస్టులో పడటంతో నేరుగా నెయ్యి సరఫరా నిలిపేసిన భోలేబాబా డెయిరీ. శ్రీవైష్ణవి, మల్‌గంగా వంటి షెల్ కంపెనీలతో కలిసి తితిదేకు నెయ్యి సరఫరా
- 2022 అక్టోబరు: ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌తో డీల్ కుదుర్చుకున్న చిన్నప్పన్న. సిట్ విచారణలో వెలుగు చూసిన మనీ ట్రయల్. ఆయన అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పీఏ.
- 2023 ఏప్రిల్– అక్టోబరు: శ్రీవైష్ణవి డెయిరీని కొనుగోలు చేసిన భోలేబాబా. ఏఆర్ డెయిరీని సంప్రదించిన భోలేబాబా. టెండర్లలో పాల్గొనాలని, కిలోకు రూ.3 చొప్పున ఇస్తామని ఆఫర్
- 2023 అక్టోబరు, నవంబరు: ఏఆర్ డెయిరీ, శ్రీవైష్ణవి డెయిరీల్లో లోపాలున్నా అనుమతుల మంజూరు
- 2024 ఫిబ్రవరి: 10 లక్షల కిలోల ఆవు నెయ్యి కోసం తితిదే టెండర్లు
- 2024 మార్చి: నకిలీ డాక్యుమెంట్లతో తక్కువ ధరకే అధికారుల సహకారంతో టెండరు దక్కించుకున్న ఏఆర్ డెయిరీ
- 2024 మే: కిలో రూ.319.80 చొప్పున 10 లక్షల కిలోల నెయ్యికి ఏఆర్ డెయిరీకి సరఫరా ఆర్డర్



2019-24 మధ్య కల్తీ నెయ్యి అక్రమాలు

కల్తీ నెయ్యి వినియోగం	: 59.71 లక్షల కిలోలు
తయారు చేసిన లడ్డూలు	: 20.01 కోట్లు
అక్రమంగా ఖర్చు చేసిన నిధులు	: రూ.234.51 కోట్లు
ఛార్జిషీట్‌లో పేర్కొన్న నిందితులు	: 36 మంది

శ్రీవారి ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

వైకాపా నేతల్ని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం 94% స్ట్రైక్‌రేట్‌తో గెలిచి అధికారంలోకి వచ్చిందంటే దానికి వేంకటేశ్వరస్వామి కృపే కారణమని చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

హిందూ ధర్మాన్ని హేళన చేశారు

- 2019-24 మధ్య వైకాపా నేతలు ఎన్నో కుట్రలు చేశారు. రాష్ట్రంలో 2,032 దేవాలయాలపై దాడులు జరిగాయి. 32 విగ్రహాలను అపవిత్రం చేశారు. 59 విగ్రహాలు చోరీ అయ్యాయి. అయినా కేసులు నమోదుచేయలేదు. పిచ్చివాళ్ల చేష్టలు, వీధి కుక్కలు చేశాయి, గుప్తనిధుల వేట అని తేలిగ్గా తీసుకున్నారు. విగ్రహమే కదా.. ఏముంది అంటూ చులకనగా మాట్లాడారు.
- వైకాపా హయాంలో తిరుమల-తిరుపతి బస్సు టికెట్లపై 'తక్కువ ఖర్చు, అన్ని సౌకర్యాలతో క్రైస్తవులకు పవిత్ర జెరూసలెం యాత్ర' అని ముద్రించి అన్యమత ప్రచారానికి పాల్పడ్డారు.
- 2018లో పింక్ డైమండ్ చోరీ అయిందని, అది మా ఇంట్లో ఉందని ప్రచారం చేశారు. అప్పుడే వారిని పట్టుకొచ్చి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. కానీ మేం ప్రజాస్వామ్యయుతంగా వెళ్లాలని రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేశాం. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆ కేసు విత్‌డ్రా చేసుకున్నారు. మళ్లీ మేం వ్యక్తిగతంగా ఇంప్లీడ్ అయి పోరాడుతున్నాం.
- తితిదే బోర్డును రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. వైకాపా హయాంలో 2021లో 50 మంది ప్రత్యేక ఆహ్వానితుల్ని నియమించారు. మొత్తం 85 మందితో జంబో బోర్డు ఏర్పాటుచేశారు. హైకోర్టు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. (నేనే ఫైట్ చేశాను అని సభాపతి స్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చెప్పగా.. చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు)
- పవిత్రమైన పరకామణిలో చోరీ జరిగితే లోక్‌అదాలత్‌కు పంపి రాజీ చేశారు. చాలా చిన్న నేరమని.. తీసుకున్నదానికంటే ఎక్కువ మొత్తం, తన సొంత సొమ్మును శ్రీవారికి దానం చేశారని జగన్ చులకనగా మాట్లాడారు.

> 'భక్తులంతా ఏడుకొండలవాడా అని స్మరిస్తూ కొండెక్కుతారు. కానీ రాజశేఖరరెడ్డి తిరుమల రెండు కొండలే అని ఉత్తర్వులిప్పించారు. అప్పుడు పంచాయతీరాజ్ కార్యదర్శి శామ్యూల్.. దేశవ్యాప్తంగా ఆందోళన రావడంతో మళ్లీ ఏడుకొండలుగా మార్చారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడే ఎస్వీ యూనివర్సిటీ కాలేజీకి దేవ సంగీతం అనే వ్యక్తిని ప్రిన్సిపల్‌గా నియమిస్తే.. ఆయన అక్కడ శ్రీవారి విగ్రహానికి రోజూ పూలమాలలు వేయడం నిలిపేశారు. పద్మావతి విశ్వవిద్యాలయ వీసీగా నియమితులైన వీణా నోబుల్‌దాస్ అక్కడ వేంకటేశ్వరస్వామి ఫొటో తీసేసి జీసస్ ఫొటో పెట్టుకున్నారు. ఈ సంస్థలకు తితిదే నిధులిస్తుంది.'
> – సీఎం చంద్రబాబు

ఇందాపూర్, హెరిటేజ్ మధ్య.. నెయ్యి సంబంధమే లేదు

- హెరిటేజ్ రోజూ 20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలైనా, దేవాలయాలైనా హెరిటేజ్ నుంచి ఉత్పత్తులు సరఫరా చేయడానికి వీల్లేదని గతంలో నిర్ణయించుకున్నాం. అదే అమలుచేస్తున్నాం.
- ఇందాపూర్ డెయిరీ దేశంలో వివిధ సంస్థలకు ఉత్పత్తులు తయారుచేసి ఇస్తుంది. మదర్ డెయిరీ, బ్రిటానియా, హిందూస్థాన్ యునిలీవర్, ఆయుర్వేద ఘీ, పతంజలి, డీమార్ట్, రిలయన్స్, దొడ్ల, హెట్సన్, టాటా, జీఆర్‌బీ, అమూల్, హెరిటేజ్ తదితర సంస్థలు ఇందులో ఉన్నాయి.
- హెరిటేజ్‌కు చీజ్, యూహెచ్‌టీ, ఎస్ఎన్‌పీ ఉత్పత్తులు మాత్రమే ఇందాపూర్ డెయిరీ తయారు చేస్తోంది. నెయ్యితో సంబంధం లేదు. కానీ తిరుమల నెయ్యికి హెరిటేజ్‌కు ముడిపెట్టి వైకాపా దుష్ప్రచారం చేస్తోంది.

తిరుమలలో ప్రక్షాళన మొదలు పెట్టాం

- కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో లడ్డూ, ఆహారపదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువీకరించిన ఉత్పత్తులు సేకరిస్తున్నాం. నాణ్యత దెబ్బతినకుండా చూస్తున్నాం. ఇందుకు ఏఐని కూడా ఉపయోగిస్తున్నాం.
- అన్నప్రసాదం తయారీలో పాతదిట్టం వ్యవస్థను తిరిగి అమల్లోకి తెస్తున్నాం. నాణ్యత, రుచిపై ప్రత్యేకదృష్టి పెట్టాం. దీనిపై భక్తులూ సంతోషంగా ఉన్నారు
- క్యూలైన్ల సమీపంలో 24 గంటలూ భక్తులకు పాలు అందిస్తున్నాం. అదనంగా 23 ఆహార కౌంటర్లు ఏర్పాటుచేశాం. ఆధునిక వసతులతో వంటశాల అందుబాటులోకి తెచ్చాం.
- బ్రేక్ దర్శనాల నియంత్రణతో సాధారణ భక్తులకు దర్శన సమయం పెంచాం.
- ప్రతి 25 మంది పోటు కార్మికులకు ఒక సూపర్‌వైజర్ చొప్పున పోస్టులు మంజూరు చేస్తున్నాం.

ఏ కష్టమొచ్చినా వెంకన్నకే చెప్పుకొంటా

48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. 2028 నాటికి 50 ఏళ్లు అవుతుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి మా కులదైవం. నాకు ఏ కష్టం ఉన్నా ఆయనకు చెప్పి ముందుకు సాగుతా. మంచి మనసివ్వాలని, మంచి పని చేసేలా ఆశీర్వదించాలని రోజూ 2 నిమిషాలు స్వామివారి పటం ముందు ప్రార్థిస్తా.

పాదరక్షలు విడిచి ప్రసంగించిన చంద్రబాబు

కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో మాట్లాడే ముందు సీఎం చంద్రబాబు పాదరక్షలు విడిచారు. తర్వాతే ప్రజంటేషన్‌పై మాట్లాడారు. ప్రసంగం పూర్తయ్యాక మళ్లీ పాదరక్షలు ధరించారు.

ఐదు రోజుల తర్వాత మండలిలో చర్చ

ఈనాడు, అమరావతి: వైకాపా సభ్యుల నిరసనలతో ఐదురోజుల పాటు వాయిదా పడుతూ వచ్చిన శాసనమండలిలో మంగళవారం చర్చ జరిగింది. సభలో చేపట్టాల్సిన ప్రశ్నోత్తరాలు, బిల్లులు, ప్రత్యేక ప్రస్తావనలు, శాంతిభద్రతలపై స్వల్పకాలిక చర్చ లాంటి అంశాలు మొత్తం పూర్తయ్యేవరకు ఛైర్మన్ మోషేనురాజు సభ నిర్వహించారు. శాంతిభద్రతల అంశంపై సభలో జరుగుతున్న చర్చలో 'చినబాబు.. పెదబాబు'కు వాటాలు అందుతున్నాయంటూ వైకాపా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ చేసిన ఆరోపణలపై కూటమి ఎమ్మెల్సీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి.. ఛైర్మన్ పోడియం ఎదుట నిరసన తెలిపారు. దీంతో ఛైర్మన్ కొద్దిసేపు సభ వాయిదా వేశారు. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్సీల మధ్య మాటల యుద్ధం జరిగింది. చర్చలో భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో చిలకలూరిపేటలో ప్రధాని సభకు బందోబస్తు నిర్వహించడంలో విఫలమయ్యారని ప్రస్తావించారు.

అనర్హులుంటే పింఛన్లు తొలగించేలా కలెక్టర్లకు అధికారాలు

- శాసనసభలో మంత్రి కొండపల్లి



ఈనాడు, అమరావతి: సామాజిక భద్రత పింఛన్లు తీసుకుంటున్న వారిలో అనర్హులుంటే కలెక్టర్లకు ఫిర్యాదు చేయవచ్చని, విచారణలో నిజమని తేలితే అలాంటివారిని తొలగించేలా కలెక్టర్లకు అధికారాలిచ్చామని రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ఎంఎస్ఎంఈ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో 3వేల మంది దివ్యాంగుల పింఛన్లపై వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ విచారించి అనర్హులైన 70% మందిని తొలగించారని వివరించారు. శాసనసభలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో సామాజిక భద్రత పింఛన్లపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీనివాసరావు సమాధానమిచ్చారు. 'దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే అత్యధికంగా వయోవృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు ఇస్తున్నాం. 29,86,023 మంది వయోవృద్ధులకు నెలకు రూ.4వేల చొప్పున రూ.1,194.41 కోట్లు, 7,65,820 మంది దివ్యాంగులకు రూ.6వేల చొప్పున రూ.459.49 కోట్లు, 17,35,963 మంది వితంతువులకు రూ.4వేల చొప్పున రూ.694.39 కోట్లు ఇస్తున్నాం. రాష్ట్రజనాభాలో 12.88% ప్రజలకు పింఛన్లు ఇస్తున్నాం' అని మంత్రి శ్రీనివాసరావు వివరించారు.

అనర్హులకు పింఛన్లు ఇవ్వడం తప్పు: సభాపతి అయ్యన్నపాత్రుడు

'పింఛన్లు ఇవ్వాలనేది ప్రభుత్వం పాలసీ..ఓకే. అనర్హులకు పింఛన్లు ఇవ్వడం తప్పు. అనర్హులు ఎక్కడెక్కడ ఉన్నారో మీ అందరికీ (సభలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి) తెలుసు. ఎందుకు చెప్పలేకపోతున్నాం? అలాంటివారిని తొలగించే ప్రయత్నం చేయండి. ఇందులో తప్పేముంది' అని పింఛన్లపై చర్చ సందర్భంగా సభాపతి అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఆ సొమ్ము దోచుకున్నా, వారి తరాలు కూడా లేచిపోతాయని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇప్పటికైనా కల్తీని ఒప్పుకోవాలని, అలాకాకుండా దిల్లీ వెళ్లి కోర్టుల్లో కేసులు వేసేకొద్దీ మీ పాపం పెరిగి నాశనం త్వరగా వస్తుందే తప్ప, తగ్గదని వ్యాఖ్యానించారు. శాసనసభలో మంగళవారం కల్తీనెయ్యిపై లఘుచర్చలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో తితిదేలో 68 లక్షల కేజీల కల్తీనెయ్యి వాడారు. అందులో పందికొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో వచ్చింది. సీబీఐ సిట్ కూడా రసాయనాలు, పామాయిల్‌తో నెయ్యి లేకుండా నెయ్యి తయారుచేశారని పేర్కొంది. అలాంటప్పుడు ఆ ముఖ్యనేత.. 'నాకు సంబంధం లేదు, తితిదే బోర్డు అంతా చేసింది. దానిపై కమిటీ వేసి, నిష్పాక్షికంగా విచారణ జరిపి, శిక్షపడేలా చేయండి' అని సింపుల్‌గా తేల్చేయవచ్చు. కానీ సిట్ నివేదిక వచ్చాక కూడా కల్తీ లేదంటున్నారని మండిపడ్డారు. దీనికి నాటి తితిదే పాలకమండలితో పాటు గత ప్రభుత్వాన్ని నడిపిన వ్యక్తి కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందేనని స్పష్టంచేశారు. పవన్‌కల్యాణ్ ఇంకా ఏమన్నారంటే..

కుట్రలో భాగమే.. నిబంధనల సడలింపు

నెయ్యి సరఫరాదారులైన భోలేబాబా, మాల్‌గంగా, వైష్ణవీ డెయిరీలు ఒక్క లీటర్ పాలు కూడా లేకుండా పామాయిల్‌లో రసాయనాలు కలిపి నెయ్యి తయారు చేసినట్లు సిట్ చెప్పింది. ఆ రసాయనాల్లో ఏమున్నాయో పెరుమాళ్లకు ఎరుక. 36 మందిని నిందితులుగా సిట్ తేల్చింది. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళిక ప్రకారం కుట్ర జరిగింది. నెయ్యి సరఫరా టెండర్లు వారికి నచ్చిన సంస్థలకు దక్కేలా నాటి తితిదే పెద్దలు ప్రణాళిక వేశారు. నిబంధనలన్నీ సడలించారు. 2019-24 మధ్య 11 కోట్ల మంది శ్రీవారిని దర్శించుకోగా, 48 కోట్ల లడ్డూలు అందించారు. వాటిలో 20 కోట్ల లడ్డూలు నకిలీనెయ్యితో తయారైనవేనని తితిదే రికార్డులు చెబుతున్నాయి.

ముఖ్యవ్యక్తే చేశారని అనలేదే!: నేనెక్కడా గత ప్రభుత్వాన్ని నడిపిన ముఖ్యవ్యక్తే ఇదంతా చేశారనలేదు. ఆ ప్రభుత్వం నియమించిన తితిదే పాలకమండలిది బాధ్యత అని చెప్పాను. వాళ్లను ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్థం కావడంలేదు.

పశ్చాత్తాపంతో దీక్ష చేశా

కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఎన్డీఏ సమావేశంలో చంద్రబాబు ఎన్‌డీడీబీ నివేదికను చదివారు. నెయ్యిలో పందికొవ్వు కలిసినట్లు నివేదిక వచ్చిందన్నారు. దానిపై మీరెవరూ మాట్లాడరా అంటూ చాలామంది నన్ను ట్యాగ్ చేస్తూ మెసేజ్‌లు చేశారు. మరునాడు 'సనాతన ధర్మరక్షణ బోర్డు లాంటిది ఉంటే బాగుంటుంది' అని ట్వీట్ చేశాను. ప్రజాజీవితంలో ఉన్నందున ఒకరిని నిందించాలంటే చాలా ఆలోచించాను. గతంలో తిరుమలకు వెళ్లినప్పుడు ప్రసాదంలో నాణ్యతలేమిపై భక్తులు నాతో పంచుకున్న విషయాలు గుర్తుకొచ్చాయి. పశ్చాత్తాపంతో దీక్ష చేశాను" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

– ఈనాడు, అమరావతి

> **రాయలవారు ఆనాడే హెచ్చరించారు**
>
> 'రాజు కోసం డబ్బు వసూలు చేసేవాడికి దేవాలయంపై అధికారమివ్వకు. అలాంటివాడు వసూళ్లలో నష్టం వచ్చినప్పుడల్లా, దేవుడి ధనాన్ని రాజు ఖజానాకు చేరుస్తాడు. అది తప్పుడు పని. అందుకే ఎలాంటి మమకారాలు లేని ఒంటరివాడే ఆలయ అధికారిగా ఉండాలి. వాడు దేవుడి సొత్తు తింటే, ఆ పాపానికి వాడే పోతాడు. కానీ, వాడు ఆ సొమ్ము తెచ్చి రాజుకు ఇవ్వడం వల్ల ఆ రాజ్యమే నాశనమవుతుందని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలోని 218వ పద్యంలో రాశారు. దేవుడి సేవలో ఎలాంటివారిని నియమించాలో రాజుకు కర్తవ్యబోధ చేశారు' అంటూ..
>
> ..ఆ పద్యాన్ని శాసనసభలో పవన్ చదివి విన్పించారు

పశు వైద్యుల ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

- మంత్రి అచ్చెన్నాయుడు



ఈనాడు, అమరావతి: పశు వైద్యుల ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఆర్థికశాఖ అనుమతి కోసం దస్త్రం పంపినట్లు వెల్లడించారు. పశువైద్య భవనాల మరమ్మతులకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించిందని చెప్పారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో పశు వైద్యశాలల్లో మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కె.మురళీమోహన్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'వైకాపా హయాంలో దేనికీ నిధులివ్వకుండా నాశనం చేశారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో ఏటా పశువైద్య శిబిరాలు నిర్వహించేవాళ్లం. నేను మంత్రి అయ్యే సమయానికి పశు వైద్యశాలల్లో మందులు, సిబ్బంది, వైద్య పరికరాల కొరత ఉంది. అస్తవ్యస్తమైన పరిస్థితిని చక్కదిద్దుకుంటూ వస్తున్నాం' అని అచ్చెన్నాయుడు వివరించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయి

- మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడితప్పాయని కేంద్ర హోంశాఖ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'శాంతిభద్రతల అంశంపై సభలో చర్చిద్దామని కోరితే, ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నిస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. అందుకే వాకౌట్ చేశాం. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉంటే కూటమి నాయకులు మంచి ప్రభుత్వం అంటూ భజన చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు చనిపోయి, పలువురు ఆసుపత్రుల్లో చేరినా ఒక్క అధికారిపైనా చర్యలు తీసుకోలేదు. తప్పుచేస్తే ప్రభుత్వం శిక్షిస్తుందన్న భయం వ్యవస్థల్లో లేదు. సభలో రాజశేఖరరెడ్డిని కించపరిచి మాట్లాడడం సరికాదు' అని అన్నారు.

కల్తీ పాల ఘటనలో బాలుడి మృతి

- రాజమహేంద్రవరంలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య!
- ఇంకా విషమంగానే 8 మంది ఆరోగ్య పరిస్థితి

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రాజానగరం, విశాఖపట్నం(వన్‌టౌన్): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న కల్తీ పాల ఘటనలో మరో చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. ప్రభావిత ప్రాంతమైన స్వరూప్‌నగర్‌కు చెందిన బత్తిన మనోహర్ (6) విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరినట్లయింది. ఈ నెల 18న మనోహర్‌ను కేజీహెచ్ పిల్లల వార్డులో చేర్పించారు. బాలుడికి కిడ్నీలు దెబ్బతిన్నాయని, రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నాయని ఆసుపత్రి పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. మనోహర్ తల్లి అర్చన ఇళ్లలో పనులు చేసుకుంటూ కుమారుడిని పోషిస్తున్నారు. మరోవైపు, రాజమహేంద్రవరంలోని వివిధ ఆసుపత్రుల్లో 15 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 8 మందికి డయాలసిస్ చేస్తున్నారు. వారంతా వెంటిలేటర్‌పై విషమ స్థితిలో ఉన్నారు. మిగిలినవారి ఆరోగ్యపరిస్థితి కాస్త మెరుగుపడినా పలువురికి ఇప్పటికీ మూత్ర విసర్జన కావడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు.

11 నగరాల్లో 24 గంటల స్పీడ్ పోస్ట్, పార్శిల్ బుకింగ్ సౌకర్యం

ఈనాడు, అమరావతి: ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలోని 11 ప్రధాన నగరాల్లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా స్పీడ్ పోస్ట్, పార్శిల్ బుకింగ్ సౌకర్యం ప్రారంభించామని తపాలాశాఖ ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, రాజమహేంద్రవరం, తిరుపతి, కడప, అనంతపురం, ఒంగోలు, గుంతకల్లులలో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 242 ప్రధాన పట్టణ తపాలా కార్యాలయాల్లోనూ సాధారణ పని వేళలు 1 నుంచి 2 గంటలు పెంచామని తెలిపారు.

సురక్షిత ప్రాంగణాలుగా ఉన్నత విద్యాసంస్థలు

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఈనాడు, అమరావతి: మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిచ్చి, ఉన్నత విద్యా సంస్థలను సురక్షిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ సూచించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు, మహిళా సాధికారత సెల్ ప్రతినిధులతో మంగళగిరి నుంచి ఆమె వర్చువల్‌గా మంగళవారం సమీక్షించారు.



వ్యాపారి గణేష్ పాలు నిల్వ చేసేందుకు వినియోగిస్తున్న ఫ్రీజర్ ★ ఈ ఛాంబర్‌లోనే పాలు కలుషితమైనట్లు గుర్తించారు ★ ఫ్రీజర్‌కు లీకేజీ ఏర్పడడంతో అతికించిన ప్రాంతం

ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

- ఆ పాలు ప్రమాదకరమని బంధువు చెప్పినా పట్టించుకోని వ్యాపారి
- నిందితుడు గణేష్‌కు 14 రోజుల రిమాండ్

ఈనాడు, రాజమహేంద్రవరం -న్యూస్‌టుడే, కోరుకొండ: రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనకు సంబంధించి విచారణలో కొత్త కొత్త అంశాలు వెలుగు చూస్తున్నాయి. కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన పాల వ్యాపారి గణేష్ నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. ఇప్పటికే ఆరుగురు మృతిచెందగా, మరి కొందరు బాధితుల పరిస్థితి విషమంగా ఉంది. పాల వ్యాపారి గణేష్‌ను పోలీసులు న్యాయస్థానంలో హాజరు పరచగా.. 14 రోజులు రిమాండ్ విధించినట్లు విచారణాధికారి, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు.

విషతుల్యమని తెలిసినా 105 మందికి సరఫరా

పాలు విషతుల్యం అయ్యాయని తెలిసినా 105 మందికి పంపిణీ చేసినట్లు గణేష్ పోలీసుల ఎదుట అంగీకరించాడు. అనధికారికంగా పాల కేంద్రం నిర్వహిస్తున్న అతను రైతుల నుంచి రోజూ దాదాపు 100 లీటర్ల మేర పాలు సేకరిస్తాడు. ఇవి పాడవకుండా ఉండేందుకు నాసిరకమైన ఫ్రీజర్ వినియోగిస్తున్నాడు. 80 లీటర్ల సామర్థ్యంతో రెండు ఛాంబర్లతో ఉన్న ఇది ఆరేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఓ పాత ఫ్రీజర్ కావడం గమనార్హం.

ఈనెల 15న స్థానికంగా కొందరికి పాలు విక్రయించగా అవి చేదుగా ఉన్నట్లు వారు చెప్పినా గణేష్ పట్టించుకోలేదు. ఈ వ్యాపారం నేర్పించిన అతని బావకు చెప్పగా గ్లైకాల్ సమస్య వచ్చి ఉంటుందని, ఆ పాలను పారబోయాలని, లేదంటే ప్రమాదమని అతను హెచ్చరించాడు. అయినా గణేష్ పెడచెవిన పెట్టాడు. ఇదే విషయాన్ని పోలీసుల ఎదుట అంగీకరించాడు. ఇథలీన్ గ్లైకాల్ లీకవడం వల్ల పాలు ఐస్ మాదిరిగా గడ్డ కట్టినట్లు అధికారులు గుర్తించారు. స్థానికులు, సమీప బంధువు చెప్పిన మాట వినుంటే ఈ పరిస్థితి తలెత్తేదికాదని.. అతని నిర్లక్ష్యమే ఇంతమంది ఉసురు తీసిందని ఆవేదన చెందుతున్నారు. ఫ్రీజర్‌లో సమస్య ఉండడంతో రాజమహేంద్రవరానికి చెందిన ఓ మెకానిక్‌ను తీసుకెళ్లి లీజేజీని అరికట్టి దానినే మళ్లీ వినియోగిస్తున్నాడు.

◆ ఫ్రీజర్‌లోని రెండు ఛాంబర్లలో నేరుగా పాలు నిల్వచేసి మరుసటి రోజు తీస్తున్నారు. ఇలా నేరుగా వేయడమూ ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. ఆ ఛాంబర్లను సరిగా శుభ్రం చేయకపోతే కలుషితమయ్యే అవకాశముంది.

◆ సోమవారం నరసాపురం గ్రామానికి వెళ్లిన ఫోరెన్సిక్ బృందం అక్కడి అనధికార పాల సేకరణ కేంద్రాన్ని నిశితంగా పరిశీలించి లోపాలు గుర్తించింది. అక్కడున్న పాలు, వెనిగర్, కొన్ని ఖాళీ సీసాలు సేకరించారు.

మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ

పాల కల్తీ ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని మంగళవారం సాయంత్రం కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి నేతృత్వంలో అందజేశారు. చౌడేశ్వరీనగర్‌కు చెందిన శేషగిరిరావు (72), గాంధీపురానికి చెందిన తాడి రమణి (58), తాడి కృష్ణవేణి (76)ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పంపిణీ చేశారు. రాజానగరం ప్రాంతానికి చెందిన రాధాకృష్ణమూర్తి (74) కుటుంబానికి ఎమ్మెల్యే బలరామకృష్ణ, ఆర్డీవో కృష్ణనాయక్‌లు చెక్కు అందజేశారు.

బాధితులకు చెన్నై, ముంబై నుంచి మందులు

- కల్తీపాల ఘటనలో 8 మంది పరిస్థితి విషమం
- వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాజమహేంద్రవరంలో కల్తీపాలు వికటించిన ఘటనలో చికిత్స పొందుతున్న బాధితుల కిడ్నీల పనితీరు త్వరగా మెరుగుపడేందుకు అవసరమైన మందులు చెన్నై, ముంబై నుంచి తెప్పిస్తున్నామని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్ బృందం పరిశీలించి చేసిన సూచనల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 15 మందిలో 8మంది పరిస్థితి క్లిష్టంగా, మిగిలిన ఏడుగురి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. వెంటిలేటర్‌పై, డయాలసిస్‌లో ఉన్న వారిలో ఐదు నెలల పాప, మరో ఇద్దరు పిల్లలు ఉన్నట్లు వెల్లడించారు. మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డితో కలిసి మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

నివేదికలు వచ్చాకే స్పష్టత

'శివరాత్రి మర్నాడు పాల వ్యాపారి 110 కుటుంబాలకు పాలు పోశారు. వీటిని తాగినవారు అస్వస్థతకు గురై ఆసుపత్రుల్లో చేరారు. పాల వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం కూలెంట్‌గా వాడిన ఇథలీన్ గ్లైకాల్ లీకై పాలలో కలిసింది. ఆ పాలు తాగినవారి ఆరోగ్యం దెబ్బతింది. 110 కుటుంబాల్లోని 315 మంది రక్తనమూనాలు సేకరించాం. వీరిలో ఇద్దరిలో క్రియాటినైన్ స్థాయి ఎక్కువగా ఉంది. మరొకరిలో అనుమానిత లక్షణాలు కనిపించాయి. వీరినీ ఆసుపత్రుల్లో చేర్పించాం. సేకరించిన నమూనాలను కాకినాడలోని జేఎన్‌టీయూ, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌కు పంపించాం. బ్యాక్టీరియల్ పరీక్షలకు పంపిన నమూనాల ఫలితాలు 5-7 రోజుల్లో రావొచ్చు. ఫిజియో కెమికల్, హెవీ మెటల్ పరీక్షల ఫలితాలు 2-3 రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. పోలీసుల క్లూస్ బృందం సేకరించిన నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. శాస్త్రీయంగా ఫలితాలు వచ్చాక పాలలో ఏం కలిసిందో స్పష్టతకు వస్తాం. పాలలో యూరియా ఆనవాళ్లు ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. యూరియా కలిసినా ఆ ప్రభావం దీర్ఘకాలంగా తాగితేనే కిడ్నీ, లివర్‌పై ఉంటుంది' అని వీరపాండియన్ వెల్లడించారు.

నేటినుంచి పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు

రాష్ట్రంలో పాలవిక్రయ కేంద్రాలపై తనిఖీలకు బుధవారం నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఐపీఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు. 'హోల్‌సేల్, రిటైల్ పాల వ్యాపారులు, పాల ఉత్పత్తుల వ్యాపార ప్రాంగణాల్లో నమూనాలు సేకరిస్తాం. ఫలితాల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. పాలు, పాల ఉత్పత్తులు అమ్మేవారికి తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి. ఫుడ్ కంట్రోల్ విభాగంలో సిబ్బంది కొరత వాస్తవమే. 150 మంది నియామకానికి సీఎం సమ్మతించారు. ఈ విభాగాన్ని బలోపేతం చేస్తాం' అని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం

- గ్రూప్-1 ఉద్యోగులను అప్రాధాన్య పోస్టులకు బదిలీ.. నివేదిక ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టిన ధర్మాసనం
- నేడు కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వైకాపా హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ద్వారా ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నవారిని ప్రాధాన్య పోస్టుల నుంచి తొలగించి అప్రాధాన్య పోస్టులకు (నాన్ ఫోకల్) వెంటనే బదిలీ చేయాలని, తమ ఉత్తర్వుల అమలుకు తీసుకున్న చర్యల వివరాలతో నివేదిక సమర్పించాలంటూ ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడి వ్యవహరించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. సీఎస్ వ్యవహారశైలి కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పేర్కొంది. సుమోటోగా ధిక్కరణ కేసు ఎందుకు నమోదు చేయకూడదో బుధవారం కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ✦ వైకాపా హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో చోటుచేసుకున్న అక్రమాల నిగ్గు తేల్చేందుకు ఈ నెల 11న హైకోర్టు సిట్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దర్యాప్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉన్న నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నవారందరినీ అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంచేసింది. ఇందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని సీఎస్‌ని ఆదేశించింది. కోర్టు ఆదేశాలు అమలుకు తీసుకున్న చర్యల వివరాలతో నివేదికను వారంలో రిజిస్ట్రార్ జ్యుడిషియల్ ముందు ఉంచాలని సీఎస్‌ను ఆదేశించింది. ✦ మంగళవారం దీనిపై హైకోర్టులో విచారణ జరిగింది. సీఎస్ నివేదిక దాఖలు చేయలేదని రిజిస్ట్రార్ జ్యుడిషియల్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. నివేదిక దాఖలుపై ఏమైనా సమాచారం ఉందా? అని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. నివేదిక దాఖలు చేయలేదని ఏజీ బదులిచ్చారు. కోర్టు ఉత్తర్వులను అమలుచేసే విషయంలో న్యాయస్థానం నుంచి స్పష్టత తీసుకోవాలని సీఎస్ భావించారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఆ విజ్ఞప్తి ఏమిటో నిబంధనలను అనుసరించి కోరాల్సి ఉందని తేల్చిచెప్పింది. ఏజీ స్పందిస్తూ.. తనకు ఉన్న వ్యక్తిగత ఇబ్బందిని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చేందుకు తను ప్రయత్నం చేస్తున్నానన్నారు. తాము కోర్టు విచారణలు జరుపుతున్నామని, వ్యక్తిగత ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేమని ధర్మాసనం స్పష్టంచేసింది. ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని, ఈ వ్యవహారంపై విచారణను బుధవారానికి వాయిదా వేయాలని ఏజీ అభ్యర్థించారు. కేసును ఎలా హ్యాండిల్ చేయాలో తమకు తెలుసని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు ధిక్కరణ కేసు నమోదు చేసే ముందు సీఎస్‌కు మరో అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు పేర్కొంది. బుధవారం విచారణకు హాజరుకావాలని సీఎస్‌ను ఆదేశించింది.

పసికందును పొయ్యిలో పడేసిన కన్నతల్లి.. బాలుడి మృతి

దుండిగల్, న్యూస్‌టుడే: అభంశుభం ఎరుగని రెండు నెలల పసికందును అత్యంత పాశవికంగా కట్టెలపొయ్యిలో పడేసి కడతేర్చిందో కన్నతల్లి. ఈ అమానవీయ ఘటన తెలంగాణలోని మేడ్చల్ జిల్లా పరిధి దుండిగల్ ఠాణా పరిధిలో జరిగింది. మేడ్చల్ డివిజన్ ఏసీపీ శంకర్‌రెడ్డి, దుండిగల్ సీఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ జిల్లాకు చెందిన రాజేంద్ర, మమతా అహిర్వార్ ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె రెండు నెలల క్రితమే కుమారుడికి జన్మనిచ్చింది. బాలుడి పేరు సూర్య. బౌరంపేట అవుటర్ రింగ్ రోడ్డుకు అనుకుని నిర్మాణంలో ఉన్న సనరెల్లి అపార్ట్‌మెంట్ సముదాయంలో నెలరోజులుగా దంపతులు ఓ షెడ్డులో ఉంటూ కూలీలుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం భర్త కూలిపనికి వెళ్లాడు. చిన్నారి ఏకధాటిగా గుక్కపెట్టి ఏడుస్తుండటంతో మమత అకస్మాత్తుగా క్రూరంగా మారింది. చిన్నారి నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు, కాళ్లను తాడుతో కట్టేసి కట్టెల పొయ్యిలో పడేసి చంపేసింది. ఉదయం 11 గంటలకు తిరిగివచ్చిన భర్త పొయ్యిలో కాలిపోయిన కుమారుడిని చూసి నిర్ఘాంతపోయాడు. కాలిపోయిన బాలుడి మృతదేహాన్ని బయటకు తీసి భార్యను నిలదీయగా తానే చేసినట్లు అంగీకరించింది. వెంటనే రాజేంద్ర దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాడు.

స్పీకర్.. డిప్యూటీ స్పీకర్ 'టగ్ ఆఫ్ వార్'

- ఉత్సాహంగా ప్రారంభమైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు
- తొలి రోజు నాలుగు విభాగాల్లో తలపడిన ప్రజాప్రతినిధులు



విజయవాడలో మంగళవారం నిర్వహించిన ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు, చీఫ్ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ భరణి

ఈనాడు, అమరావతి, విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాజకీయాల్లోనే కాదు.. టగ్ ఆఫ్ వార్‌లోనూ తగ్గేదే లేదంటూ సభాపతి అయ్యన్న పాత్రుడు, ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు పోటీపడ్డారు. ఎనిమిది పదుల వయసులోనూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పరుగు పందెంలో ముందుకు దూకారు. ఉత్సాహానికి వయసుతో సంబంధం ఏంటంటూ కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్ ఆయనతో కలిశారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చురుగ్గా కదులుతూ కబడ్డీలో కూత పెట్టారు. వాలీబాల్ పోటీల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ పురుషుల జట్లకు నాయకత్వం వహించడం విశేషం. సర్వీస్, లిఫ్ట్, బూస్ట్, అండర్ ఆర్మ్‌లతో పురుషులతో సమానంగా మహిళా సభ్యులు సై అంటే సై అంటూ పోటీపడ్డారు. ఇలాంటి విశేషాలకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా నిలిచింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఆటల పోటీల్ని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ మోషేనురాజు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, చీఫ్ విప్‌లు జీవీ ఆంజనేయులు, పంచుమర్తి అనురాధ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.

వాలీబాల్ ఆడుతుంటే పిలిచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు

సభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. 'రాజకీయ నేతలకు జీవితం మొత్తం టెన్షనే. బయటేమో పనులు, ప్రజలతో.. ఇంట్లో ఎవరితోనో నేను చెప్పను. అందరికీ తెలుసు. ఆ ఒత్తిళ్ల నుంచి బయటపడటానికి క్రీడలు సహాయపడతాయి. నేను వాలీబాల్ క్రీడాకారుణ్ని. డిగ్రీ పూర్తయ్యాక ఒకరోజు ఆడుకుంటుంటే ఎన్టీఆర్ పిలుస్తున్నారంటూ గణబాబు తండ్రి వచ్చి చెప్పారు. హైదరాబాద్ వెళితే, నీకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నా అని ఎన్టీఆర్ చెప్పారు. ప్రజాప్రతినిధులకు క్రీడాపోటీల నిర్వహణకు ఆద్యుడు ఎన్టీఆరే' అని గతం గుర్తు చేసుకున్నారు. మండలి ఛైర్మన్ మోషేనురాజు మాట్లాడుతూ. . పార్టీలు, వ్యక్తుల మధ్య అభిప్రాయ భేదాలున్నా క్రీడలతో మరచిపోవచ్చని పేర్కొన్నారు.



కబడ్డీ ఆడుతున్న ప్రజాప్రతినిధులు

కబడ్డీలో ఉడుంపట్టు..

కబడ్డీలో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి జట్టుపై రఘురామకృష్ణరాజు టీం విజయం సాధించింది. రఘురామ కూతకు వెళ్లినప్పుడు ఈలలు, చప్పట్లతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. బోడె ప్రసాద్ ప్రతి రైడ్‌లోనూ బోనస్ పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. కూతకు వెళ్లి వచ్చే క్రమంలో పార్థసారథి కాలు మడతపడింది. ఫిజియోథెరపీ అనంతరం ఆయన మళ్లీ పోటీలో పాల్గొన్నారు.

రాజకీయాల్లోనూ ప్రత్యర్థులు శత్రువులు కాదు..

'క్రీడల్లో సభ్యులు చూపించే స్ఫూర్తి పార్టీల మధ్య కూడా ఉండాలి. పార్లమెంటులో ఎంపీలు సభలో ఎలా ఉన్నా.. సెంట్రల్ హాల్‌లో అందరూ కలిసిమెలిసి ఉంటారు. క్రీడల్లో ప్రత్యర్థులు శత్రువులు కానట్లే.. సభ ముగిసిన తర్వాత సభ్యులంతా స్నేహభావంతో ఉండాలి. ప్రతిపక్ష పార్టీలు ఒక టీంను లీడ్ చేసి పోటీల్లో పాల్గొనాలి. వయసులో పెద్దవారైన వరదరాజులరెడ్డి క్రీడల్లో చూపిస్తున్న స్ఫూర్తి అందరిలోనూ ఉండాలి' అని ఉపసభాపతి రఘురామ అన్నారు.

పెద్ద పర్సనాలిటీలన్నీ ఒకే వైపు..

పురుషులు, మహిళా సభ్యులు కలిసి టగ్ ఆఫ్ వార్‌లో అయ్యన్నపాత్రుడు బృందం, రఘురామ బృందం తలపడ్డాయి. ఈ సందర్భంగా 'పెద్దపెద్ద పర్సనాలిటీలన్నీ అటువైపే ఉన్నారంటూ' అయ్యన్నపాత్రుడు చమత్కరించగా నవ్వులు విరబూశాయి. ఈ పోరులో రఘురామ జట్టు ఒక్క ఉదుటున స్పీకర్ బృందాన్ని సునాయాసంగా లాగి గెలుపొందింది.



వాలీబాల్‌లో తలపడుతున్న శాసనసభ్యులు

కావలి గ్రీష్మ జట్టు విజయం..

వాలీబాల్‌లో అఖిలప్రియ జట్టుపై కావలి గ్రీష్మ జట్టు 25-17 తేడాతో గెలుపొందింది. మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. పుత్తా చైతన్యరెడ్డి, వర్ల కుమార్‌రాజు, సుందరపు విజయ్‌కుమార్, బోనెల విజయచంద్ర ప్రదర్శన ఆకట్టుకుంది.



టెన్నికాయిట్ ఆడుతున్న ఎమ్మెల్యేలు శిరీష, తోయక జగదీశ్వరి, విజయశ్రీ, లోకం నాగమాధవి, బండారు శ్రావణి, ప్రశాంతిరెడ్డి



టగ్‌ఆఫ్ వార్‌లో తలపడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు టీం, స్పీకర్ అయ్యన్నపాత్రుడు టీంలు. ఈ ఆటలో ప్రత్యేక ఆకర్షణగా 84 ఏళ్ల ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

నా సైజు టీషర్టు రాలేదమ్మా..

క్రీడా పోటీల సందర్భంగా ప్రభుత్వం అందరికీ ప్రత్యేక టీషర్టులు ఇచ్చింది. అయితే 4 ఎక్స్‌ఎల్ సైజు టీషర్టు అని ఇచ్చారే కానీ అది తనకు సరిపోలేదని, అందుకే సొంత టీషర్టుతో వచ్చానని డిప్యూటీ స్పీకర్ రఘురామ శాప్ ఎండీ భరణితో అన్నారు. రేపటికైనా తన సైజు టీషర్టు ఏర్పాటు చేయాలని కోరారు.



గెలిచిన ఆనందంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు నేతృత్వంలోని కబడ్డీ టీం



వివిధ విభాగాలలో నిర్వహించిన పరుగు పోటీలలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



70 ఏళ్ల వయసులోనూ పరుగో పరుగు..

50 మీటర్ల పరుగు ఓ విభాగంలో బూర్ల రామాంజనేయులు, శ్రీరాం తాతయ్య, వంకా రవీంద్రనాథ్, మరో విభాగంలో గద్దె రామ్మోహన్‌రావు, రఘురామకృష్ణరాజు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 70 ఏళ్లకు పైబడినా.. పరుగులో ముందుండి బుచ్చయ్యచౌదరి అందర్నీ అబ్బురపరిచారు.

ఆడకపోతే అసెంబ్లీలో మాట్లాడే అవకాశమివ్వను..

100 మీటర్ల పరుగుపందెంలో కావలి గ్రీష్మ ప్రథమ, పల్లె సింధూరరెడ్డి ద్వితీయ, శిరీషదేవి తృతీయ స్థానాల్లో నిలిచారు. మరింతమంది మహిళా సభ్యులు పరుగు పందెంలో పాల్గొనాలని ప్రోత్సహిస్తూ.. 'ఆడకపోతే అసెంబ్లీలో మాట్లాడే అవకాశమివ్వను' అంటూ అయ్యన్నపాత్రుడు చమత్కరించారు.

EENADU Vol: 52, Issue: 196 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఇక ఇ-ఓటింగ్!

డిజిటల్ ప్రజాస్వామ్యం దిశగా బిహార్ రాష్ట్ర ఎన్నికల సంఘం గొప్ప ముందడుగు వేసింది. ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో కృత్రిమ మేధ ఆధారిత ఇ-ఓటింగ్ పద్ధతిని ప్రదర్శించి, ఔరా అనిపించింది. ఇప్పటికే మున్సిపల్ ఉప ఎన్నికల్లో అమలు చేసిన దీన్ని ఇప్పుడు వచ్చే శాసనసభ ఎన్నికలకూ విస్తరించాలని ప్రయత్నిస్తోంది. ఇది విజయవంతమైతే మున్ముందు మిగతా రాష్ట్రాలూ అనుసరించినా ఆశ్చర్యపోనవసరం లేదు.



ఓటు వేయాలని ఎవరికి ఉండదు? కానీ అనివార్య పరిస్థితుల్లో కొన్నిసార్లు ఇది కుదరకపోవచ్చు. ప్రస్తుతం ఎంతోమంది కార్మికులు ఇతర చోట్లకు వలస పోతున్నారు. విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజక వర్గాల్లో చదువుకుంటున్నారు. వృద్ధులు, గర్భిణులు, వికలాంగులకు పోలింగ్ బూత్‌లకు రావటం కష్టమైన పనే. ఇలాంటివారిని దృష్టిలో పెట్టుకొనే బిహార్ ఎన్నికల సంఘం ఇ-ఓటింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. దీంతో స్మార్ట్‌ఫోన్‌తోనే ఎవరికి వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఓటు నమోదు దగ్గరి నుంచి ఓటు వేయటం వరకూ మొత్తం ప్రక్రియంతా డిజిటల్ రూపంలోనే పూర్తయ్యేలా చూడటం దీని ప్రత్యేకత.

అంతా సురక్షితంగా..

ఇ-ఓటింగ్ కోసం బిహార్ ఎన్నికల సంఘం ఆధార్ లింక్ వ్యవస్థలకు బదులు ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్) డేటాబేస్‌తో ఓటరును ధ్రువీకరిస్తుంది. ఇది ఫేషియల్ రికగ్నిషన్, ప్రత్యక్ష గుర్తింపు, పరికరం స్థాయిలో ధ్రువీకరణ, బ్లాక్‌చెయిన్ ఆధారిత ఎన్‌క్రిప్షన్ సమ్మేళనంతో కూడి ఉంటుంది. నిజమైన ఓటరును గుర్తించటానికివి తోడ్పడతాయి. నకిలీ ఓటర్లకు అవకాశముండదు. మొత్తం ప్రక్రియంతా రహస్యంగా సాగుతుంది. ఓటు పకడ్బందీగా నమోదవుతుంది.

- ప్రతి ఓటూ ఎన్‌క్రిప్ట్ అవుతుంది. బ్లాక్‌చెయిన్ పరిజ్ఞానం ద్వారా రికార్డవుతుంది. అందువల్ల వేసిన ఓటును మార్చటం కుదరదు.
- ఇందులో స్మార్ట్ కాంట్రాక్ట్ వ్యవస్థ డిజిటల్ ఈవీఎం మాదిరిగా పనిచేస్తుంది. ఓట్లను లెక్కించటానికి తోడ్పడుతుంది.
- ఎన్నికల అధికారి డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్, టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్, హ్యాష్ వెరిఫికేషన్‌తో ప్రక్రియను ధ్రువీకరిస్తేనే డీక్రిప్షన్ సాధ్యమవుతుంది.
- ఇలాంటి రక్షణ విధానాల మూలంగానే ఓటింగ్ దగ్గరి నుంచి లెక్కింపు వరకూ అన్ని దశలూ రహస్యంగా ఉంటాయి.

ఉద్దేశం ఇదీ..

ప్రజలు ఉద్యోగాలు, పనుల కోసం ఇతర చోట్లకు వలస పోవటం ఎక్కువైంది. చాలామందికి ఓటు వేయాలనే కోరిక ఉన్నప్పటికీ పోలింగు రోజున తమ నియోజక వర్గాలకు తిరిగి వెళ్లటం కష్టమవుతోంది. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తగ్గుతోంది. దీన్ని పెంచటానికే బిహార్ ఎన్నికల సంఘం ఈ వినూత్న ఆలోచన చేసింది. భౌతికపరమైన పరిమితులు ప్రజాస్వామ్యానికి ఆటంకాలుగా మారకుండా చూడాలన్న ఉద్దేశమే దీనికి పురికొల్పింది.

ఓటింగ్ ఇలా..

- ఓటరు ముందుగా అధికారిక యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- యాప్‌నకు అవసరమైన అనుమతులు ఇవ్వాలి.
- ఓటీపీ ద్వారా మొబైల్ ఫోన్‌ను ధ్రువీకరించుకోవాలి.
- ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్) వివరాలను నమోదు చేయాలి.
- ప్రత్యక్ష ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా గుర్తింపును ధ్రువీకరించుకోవాలి.
- అనంతరం ఓటు వేయాలి.

సవాళ్లు లేకపోలేదు

ఇ-ఓటింగ్ విధానం ఆసక్తికరంగా అనిపించినప్పటికీ అమలు చేయటం కొన్ని సవాళ్లు లేకపోలేదు.

- వృద్ధులకు, తొలిసారి ఓటు వేసేవారికి యాప్‌ను వాడే విధానాన్ని తెలియజేయటానికి సహాయకులు కావాలి.
- డిజిటల్ సంతకానికి డీఎస్‌సీ టోకెన్లను వాడుకోవటానికి, బ్యాలెట్లను అన్‌లాక్ చేయటానికి రిటర్నింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ అవసరం.
- పాత ఎపిక్ ఫొటోలతో ఫేషియల్ రికగ్నిషన్ ప్రక్రియ సరిగా సాగకపోవచ్చు. పరిసరాల్లో మసక వెలుతురు, ఫోన్‌లో లో రెజల్యూషన్ కెమెరాలు, అంతర్జాల కనెక్షన్‌లో అంతరాయాల వంటివి కొన్నిసార్లు ధ్రువీకరణకు ఇబ్బంది కలిగించొచ్చు. ఇలాంటి అడ్డంకులనూ బిహార్ ఇ-ఓటింగ్ విధానం అధిగమించటం గొప్ప విషయం.
- ఇ-ఓటింగ్ సమర్థ నిర్వహణకు వ్యవస్థా పరంగానూ సిద్ధం కావాల్సి ఉంటుంది. గోప్యత, పారదర్శకత విషయంలో మొదట్లో రాజకీయ నాయకుల నుంచి వ్యతిరేకత ఎదురవ్వచ్చు. దీన్ని పరిష్కరించటానికి బిహార్ ఎన్నికల సంఘం నమూనా ఓటింగ్, పారదర్శక అంశాల వంటి వాటిని వివరించటం ద్వారా నమ్మకాన్ని పొందగలిగింది.

ఓట్ల లెక్కింపు కోసమూ

ఏఐ ఆధారిత ఓసీఆర్ లెక్కింపు వ్యవస్థనూ ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ప్రదర్శించారు. ఇది ఈవీఎం డేటాను అప్పటికప్పుడు సంగ్రహించి, ధ్రువీకరిస్తుంది. వీడియో రికార్డులు, సమయంతో కూడిన ఆడిట్ లాగ్స్ ద్వారా ఏ దశలోనైనా ధ్రువీకరించొచ్చు. దీంతో మానవ తప్పిదాలు తగ్గుతాయి. ఫలితాలు సత్వరం వెలువడతాయి. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో బిహార్ ఇప్పటికే ఈ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేసి చూపించింది.

గూగుల్ పిక్సెల్ కొత్త ఫోన్

గూగుల్ మనదేశంలో పిక్సెల్10ఏ స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. దీంతో గత సంవత్సరం తీసుకొచ్చిన పిక్సెల్ 10 శ్రేణిని విస్తరించినట్టయ్యింది. గూగుల్ ఏఐ ఫీచర్లతో నిండిన ఇది పిక్సెల్ ప్రీమియం ఫోన్లలో కాస్త చవకగా లభిస్తుంది. గూగుల్ టెన్సర్ జీ4 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 ఓఎస్‌తో పనిచేస్తుంది. ఏడేళ్ల వరకూ ఓఎస్, సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. ప్రత్యేకతలు, ఫీచర్లు ఇవీ..



- 60 నుంచి 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగం, 3000 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.3 అంగుళాల పీఓలెడ్ తెర, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణ.
- వెనకాల 48ఎంపీ మెయిన్ కెమెరా, 13ఎంపీ వైడ్ యాంగిల్ లెన్స్. ముందు 10 ఎంపీ కెమెరా.
- 5,100 ఎంఏహెచ్ బ్యాటరీ. 30డబ్ల్యూ వైర్డ్ ఛార్జింగ్, 10డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్ సపోర్టు.
- దుమ్ము, తుంపర్లను తట్టుకునే ఐపీ68 రేటింగ్,
- 8జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజీ.
- లావెండర్, ఒబ్సిడియన్, ఫాగ్, బెర్రీ రంగుల్లో కనువిందు చేసే దీని ధర రూ.49,999. మార్చి 6 నుంచి అందుబాటులో ఉంటుంది.

మార్కెట్లోకి ఐకూ 15ఆర్ మొబైల్



ఈనాడు, బెంగళూరు: గేమింగ్ ప్రేమికులు అమితంగా ఇష్టపడే ఐకూ బ్రాండ్ మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను అధికారికంగా భారతీయ విపణిలో అడుగుపెట్టింది. సంస్థ ఇండియా సీఈఓ నిపుణ్ మార్య మంగళవారం బెంగళూరులో ఈ కొత్త మొబైల్‌ను ఆవిష్కరించారు. స్నాప్‌డ్రాగన్ 8జన్ 5 ప్రాసెసర్, 7,600 ఎంఏహెచ్ బ్యాటరీతో తయారైన ఐకూ 15ఆర్ మొబైల్‌లో ఆధునిక ఫీచర్లున్నాయి. ఐకూ సిరీస్‌లోని 15ఆర్ ఆండ్రాయిడ్ 16 ఆరిజన్ ఓఎస్6తో పనిచేస్తుండగా ఈ ఫీచర్‌ను నాలుగేళ్లపాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇచ్చినట్లు నిపుణ్ తెలిపారు. 6.59 అంగుళాల 1.6కే డిస్‌ప్లే, 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 5వేల నిట్స్ పీక్ వెలుతురు ఫీచర్ ఉంది. ఈ మొబైల్‌కు హెచ్‌డీఆర్ 10 సర్టిఫికేషన్ ఉంది. 700వీ మెయిన్ కెమెరా, 50 ఎంపీ సోనీఎల్‌వైటీ బ్యాక్, ఆప్టికల్ ఇమేజ్, 8ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఫీచర్‌తో ఉన్న ఈ మొబైల్ 8జీబీ, 256జీబీ వేరియంట్ రూ.44,999కాగా, 12జీబీ, 256జీబీ వేరియంట్ రూ.47,999, 12జీబీ, 512జీబీ వేరియంట్ ధర రూ.52,999గా నిర్ణయించినా ప్రారంభ ఆఫర్లతో పాటు వివిధ బ్యాంకుల క్రెడిట్ కార్డు ఆఫర్లు కూడా వర్తిస్తాయని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

ఏఐ బొమ్మలతో ప్రమాదమమ్మా!

కృత్రిమ మేధ (ఏఐ) పెద్దలనే కాదు, పిల్లలనూ ఆకట్టుకుంటోంది. అవును.. జనరేటివ్ ఏఐ ఇప్పుడు బాలల ఆట బొమ్మల్లోనూ ఇమిడిపోతోంది. కృత్రిమ మేధతో కూడిన ఇవి చిన్నారుల 'నేస్తాలు'గానూ అవతరిస్తున్నాయి. ప్రస్తుతం ప్రముఖ ఇ-కామర్స్ వేదికల్లో విరివిగా అందుబాటులో ఉంటున్న ఈ బొమ్మలు చిన్నారులకు చదువుల్లో తోడ్పడుతున్నాయని కంపెనీలు పేర్కొంటున్నాయి. కానీ పిల్లల బుద్ధి వికాసం మీద ఇవి గణనీయ ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏఐ ఆటబొమ్మలు చదువులకు సంబంధించిన ప్రశ్నలకు జవాబులివ్వటానికి, మానసికంగా దన్నుగా నిలవటానికివి తోడ్పడతాయని కంపెనీలు ప్రచారం చేసుకుంటున్నాయి. గేమ్స్ ఆడుతున్నప్పుడు, పనులు చేస్తున్నప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వటానికి.. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవటానికి దోహదం చేయగలవని చెబుతున్నాయి. ఇవి పనిచేయటానికి ఇంటర్నెట్ కనెక్షన్ కావాలి. చాలావాటిల్లో మైక్రోఫోన్, స్పీకర్ ఉంటాయి. మైక్రోఫోన్‌తో పిల్లల మాటలను విని, స్పీకర్ ద్వారా జవాబులు ఇస్తాయి.



ఎన్నెన్నో రకాలు

మెత్తటి జంతువుల ఆకారాలు, గ్రహాంతర జీవుల రూపాలు, ఆకట్టుకునే ముఖాలతో కూడిన రోబోలు.. ఇలా ఏఐ బొమ్మలు పలు రకాలుగా అందుబాటులో ఉంటున్నాయి. కొన్ని తమకు తామే ఇంట్లో నడియాడితే.. కొన్నింటిని ఎత్తుకొని వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఇవి బటన్‌ను నొక్కితే మాటిమాటికీ అవే మాటలను వినిపించే బొమ్మల వంటివి కావు. పిల్లలు మాటలను తిరిగి అలాగే వినిపించేవీ కావు. చాలా బొమ్మలు ఓపెన్‌ఏఐ సంస్థకు చెందిన చాట్‌జీపీటీ వంటి చాట్‌బాట్లతో కూడి ఉంటాయి. కొన్ని ఉదాహరణలు చూద్దాం.



- **మిరానా మూన్‌వాకర్:** ఇది చాట్‌జీపీటీతో కూడిన ఏఐ రోబో బొమ్మ. ఆగ్మెంటెడ్ రియాలిటీ గేమ్స్‌తో ఆడుకోవచ్చు, చాట్ చేయొచ్చు. ఇన్‌బిల్ట్ వైర్‌లెస్ బ్లూటూత్ స్పీకర్‌తో కూడిన దీంతో పిల్లలు ముచ్చట పెట్టొచ్చు. యాప్ లేదా రిమోట్‌తో రోబోను తేలికగా నియంత్రించొచ్చు.



- **మైకో 3 ఏఐ రోబో:** ఇది చక్రాలతో తిరుగుతూ పిల్లలతో దాగుడు మూతలు ఆడగలదు. తల్లిదండ్రులకు ఇంటర్ కమ్‌గా పని చేయగలదు. తెరలాంటి ముఖం మీద కళ్లు, నోరు ఆకారాలను కదిలిస్తూ బాగా ఆకట్టుకుంటుంది. పిల్లలను రోజురోజుకీ అర్థం చేసుకోవటం ద్వారా వారికి ఎలాంటి ఆటలు, మాటలు ఇష్టమో గుర్తించగలదు. జోక్స్ వేయటం దగ్గరి నుంచి యోగా పాఠాలూ నేర్పగలదు.



- **గ్రెమ్:** దీన్ని క్యూరియో సంస్థ మూడేళ్లు పైబడిన పిల్లల కోసం రూపొందించింది. పెద్ద కళ్లతో కనిపిస్తూ, చూడగానే ఆకట్టుకుంటుంది. మెత్తగా ఉండే ఈ ప్లష్ బొమ్మ ముద్దుగా మాటలు వినిపిస్తూ, ఏఐ తోడుగా పనిచేస్తుంది. క్లౌడ్ కనెక్టెడ్ ప్రాసెసర్ ఉండటం వల్ల ప్రత్యక్ష సంభాషణకు వీలు కల్పిస్తుంది. చదువులకు సంబంధించిన సందేహాలు తీర్చుకునేలా, సృజనాత్మకతను పెంచుకునేలా, సహజంగా ముచ్చటిస్తూ నేర్చుకునేలా దీన్ని రూపొందించామని కంపెనీ చెబుతుంది.

ముప్పులూ పొంచి ఉంటాయి

ఏఐ బొమ్మల్లో పిల్లలను నవ్విస్తూ, ఆడిస్తూ గడిపే ఫీచర్లు ఉన్నాయంటే ఎవరికైనా ఆసక్తిగానే ఉంటుంది. ఇవి వీటికే పరిమితమైతే ఇబ్బందేమీ ఉండకపోవచ్చు. కానీ కొన్ని ముప్పులూ పొంచి ఉండటం కాదనలేని సత్యం. గత సంవత్సరం అమెరికాలోని పీఐఆర్‌జీ ఎడ్యుకేషన్ ఫండ్ లేవనెత్తిన అంశమే దీనికి నిదర్శనం. ఫోలో టాయ్స్ అనే కంపెనీకి చెందిన కుమ్మ బేర్ ఆటబొమ్మలు పిల్లలను శృంగారపరమైన మాటలు పలికేలా ప్రోత్సహించినట్టు, ప్రమాదకరమైన వస్తువులను వాడుకునే తీరును తెలియజేసినట్టు గుర్తించింది. వాయిస్ ఆధారిత చాట్‌బాట్ బొమ్మలతో గడపటం పిల్లలకు అంత మంచిది కాదని కామన్ సెన్స్ మీడియా అనే టెక్, మీడియా రేటింగ్స్ సంస్థ కూడా పేర్కొంటోంది. వీటితో చిన్నారులు అనారోగ్యకర అనుబంధాలు పెట్టుకుంటున్నారని చెబుతోంది. పిల్లలకు సంబంధించిన రహస్య డేటాను బొమ్మలు సంగ్రహిస్తున్నాయని, విశ్వసనీయంగా పనిచేయటం లేదనీ గుర్తించింది. ఐదేళ్లలోపు పిల్లలు మనుషులకు, ఏఐకి మధ్య తేడాను సరిగా పసిగట్టలేరు. అందువల్ల ఏఐ బొమ్మలు పిల్లల ఎదుగుదలను దెబ్బతీసే ప్రమాదముంది. వీళ్లు కీలకమైన సంబంధాలను గుర్తించలేకపోవచ్చు కూడా. ఆరు నుంచి పన్నెండేళ్ల పెద్ద పిల్లలు సైతం ఏఐ నిజమైంది కాదని తెలిసినా ఆరోగ్యకరమైన మానవ సంబంధాలకు ప్రత్యామ్నాయంగా ఈ బొమ్మలను వాడుకుంటుండటం ఆందోళనకరం. కొన్ని అంశాలు కుటుంబాలనూ ప్రభావితం చేస్తుండటం గమనార్హం. ఉదాహరణకు- సబ్‌స్క్రిప్షన్‌తో కూడిన బొమ్మలను పిల్లలు భావోద్వేగ సాంత్వన కోసం వాడుకుంటున్నారనుకోండి. వాటికి బాగా అలవడ్డారనుకోండి. సబ్‌స్క్రిప్షన్ కట్టకపోతే పిల్లలు తీవ్ర నిరాశకు లోనవ్వచ్చు. పైగా సుమారు 27% ఏఐ బొమ్మల అవుట్‌పుట్ పిల్లల వయసుకు తగినట్టుగా లేదనీ కొన్ని పరీక్షల్లో తేలింది. దీనికి కారణం బొమ్మల్లోని ఏఐ మోడళ్లకు పెద్దవాళ్ల ఇంటర్నెట్ కంటెంట్‌తో శిక్షణ ఇవ్వటమే. తర్వాత వీటికి పిల్లల సురక్షిత లేయర్లను జోడించినప్పటికీ, అవి దెబ్బతినొచ్చు. ఏఐ బొమ్మలతో నిరంతరం వినోదాత్మకంగా గడపటం కన్నా విపత్కర పరిస్థితుల్లో పిల్లలు తమ గురించి ఆలోచించుకునేలా చూడటం, ఆరోగ్యకరమైన పద్ధతుల్లో రోజువారీ చిక్కులను ఎదుర్కొనేలా నేర్పించటం చాలా ముఖ్యమన్నది నిపుణుల సూచన.

మన టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ సబ్‌స్క్రయిబర్ల కోసం పలు ఉచిత యాప్స్ రూపొందించింది. వీటిల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.

ట్రాయ్ యాప్స్ భలే!


ట్రాయ్ డీఎన్‌డీ

ఇది అధికారిక డూ నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) యాప్. దీంతో మొబైల్ యూజర్లు తమ డీఎన్‌డీ ప్రిఫరెన్స్‌లను రిజిస్టర్, మేనేజ్, అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇది యూజర్ అనుమతి మేరకే వాణిజ్య కమ్యూనికేషన్లకు వీలు కల్పిస్తుంది. అవాంఛిత కాల్స్, ఎస్ఎంఎస్‌లు అందకుండా చేయటం దీని ఉద్దేశం. స్పామ్ కాల్స్, ఎస్ఎంఎస్‌లను ట్రాయ్‌కు రిపోర్టు చేయొచ్చు కూడా. ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయొచ్చు, టెలికం ఆపరేటర్లు ఎలాంటి చర్య తీసుకున్నారో తెలుసుకోవచ్చు. ప్రజల ఫీడ్‌బ్యాక్ ప్రకారం స్పామ్‌కు ఎక్కువ అవకాశం గల కాల్స్, మెసేజ్‌లను సమర్థంగా గుర్తిస్తుంది. రోజూ లక్షలాది మందికి స్పామ్ కాల్స్, మెసేజ్‌లు వస్తున్న నేపథ్యంలో ఇదెంతగానో ఉపయోగపడగలదు.



ట్రాయ్ మైస్పీడ్

మొబైల్ ఇంటర్నెట్ వేగం, నెట్‌వర్క్ నాణ్యతను కొలిచే యాప్ ఇది. ఫోన్ నెట్‌వర్క్‌కు సిగ్నల్ కవరేజ్, డేటా స్పీడ్ (డౌన్‌లోడ్/అప్‌లోడ్) పరీక్షించటానికి తోడ్పడుతుంది. వేగం, నాణ్యతలో ఏదైనా తేడా ఉంటే ట్రాయ్‌కు సమాచారాన్ని చేరవేస్తుంది. ఇది సేవలు మెరుగుపడటానికి తోడ్పడుతుంది. మొబైల్ డేటా నెమ్మదించటం, నెట్‌వర్క్ సమస్యలను ట్రాయ్‌కు, సర్వీస్ ప్రొవైడర్లకు తెలియజేయొచ్చు. వీటి పరిష్కారానికిది బాగా ఉపయోగపడుతుంది.



వచ్చేసింది దేశీయ ఏఐ చాట్ యాప్


ఎప్పుడూ చాట్‌జీపీటీ, జెమినై వంటి చాట్‌బాట్లేనా? ఓసారి ఇండస్ చాట్ యాప్‌నూ ప్రయత్నించి చూడండి. ఇదో దేశీయ యాప్. మనదేశానికి చెందిన అంకురసంస్థ సర్వమ్ ఏఐ దీన్ని తీసుకొచ్చింది. నిజానికి ఇటీవల ముగిసిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో 30బీ పారామీటర్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌తోనే ఇండస్ యాప్‌ను పరిచయం చేసింది. ఇప్పుడు సర్వమ్ 105బీ లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌తో దీన్ని మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దింది.

మన దేశీయులను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకునే ఇండస్ చాట్ యాప్‌ను రూపొందించారు. దీనికి టైప్ లేదా మాటల రూపంలో ప్రశ్నలను వేయొచ్చు. ఈ రెండు రూపాల్లోనూ జవాబులిస్తుంది. అందువల్ల ఎక్కువమందికి అందుబాటులో ఉండగలదని భావిస్తున్నారు. యూజర్లు తమ ఫోన్ నంబరు, గూగుల్, మైక్రోసాఫ్ట్ ఖాతాలు, యాపిల్ ఐడీతో యాప్‌లో లాగిన్ కావొచ్చు. ప్రస్తుతమిది ఐఓఎస్, ఆండ్రాయిడ్, వెబ్ బీటా వర్షన్లలో అందుబాటులో ఉంది. ఇండస్ యాప్‌లో ఖాతాను పూర్తిగా తొలగించుకుంటే తప్ప చాట్ హిస్టరీ డిలిట్ కాదు. రీజనింగ్ మోడ్‌ను డిసేబుల్ చేసుకునే అవకాశమూ ఉండదు. కాబట్టి కొన్నిసార్లు జవాబులు నెమ్మదిగా ఇవ్వచ్చు. దీని కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెంచుతున్నందువల్ల యూజర్లు కొన్నిసార్లు వేచి చూడాల్సిన అవసరముండొచ్చని సర్వమ్ ఏఐ చెబుతోంది. తమ యాప్‌ను క్రమంగా అమల్లోకి తెస్తున్నామని, మరింత మెరుగుపరచటానికి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని వివరిస్తోంది.

- ఇండస్ ఏఐ చాట్‌బాట్ ఇంటర్ఫేస్ సరళంగా ఉంటుంది. ఎవరైనా తేలికగా వాడుకోవచ్చు. ఫాంట్ శైలి చదువుకోవటానికి అనువుగా ఉంటుంది.
- ఒకసారి లాగిన్ అయ్యి, యాప్‌ను ఓపెన్ చేయగానే 'లెట్స్ మేక్ సమ్‌థింగ్ హాపెన్' అనే సందేశం వస్తుంది. దాని కింద టెల్ మీ యువర్ సెల్ఫ్, టీ20 వరల్డ్ కప్ 2026, హెల్ప్ మీ కుక్ బిర్యానీ వంటి ఆప్షన్లు కనిపిస్తాయి.



- మీకు ఇష్టమైన ప్రశ్నలేవైనా వేయొచ్చు. రికార్డు చేసిన వాయిస్ నోట్‌నూ మెసేజ్ మాదిరిగా దీనికి పంపొచ్చు. మెసేజ్ బార్ పక్కన మైక్ గుర్తు ద్వారా ఆడియో వర్షన్‌ను సెండ్ చేయొచ్చు. మాట రూపంలో ప్రశ్నలు అడగొచ్చు.
- ఇది 11 భాషల్లో అనర్గళంగా జవాబులివ్వగలదని సర్వమ్ ఏఐ చెబుతోంది. దీన్ని ఆలోచించే విధంగా రూపొందించటం గమనార్హం. బ్యాక్‌గ్రౌండ్‌లో ఏఐ ఎక్కువగా శ్రమిస్తున్నప్పుడు థింకింగ్ అనే లేబుల్ కనిపిస్తుంది మరి.
- ఇది ఇంటర్నెట్‌ను స్కాన్ చేయటం ద్వారా తక్షణం సమాధానాలిస్తుంది. తాజా వార్తలకూ నేరుగా జవాబిస్తుంది.
- ఇండస్ యాప్ త్వరలోనే ఇమేజెస్, డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయటం వంటి శక్తులను సంతరించుకోనుంది. మున్ముందు చాట్‌జీపీటీ, నానో బనానా మాదిరిగా ఇమేజ్‌లనూ సృష్టించే స్థితికి చేరుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు.



వాట్సప్‌లో గ్రూప్ మెసేజ్ హిస్టరీ

వాట్సప్ కొత్తగా గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్‌ను తీసుకొస్తోంది. కొత్త సభ్యులకు స్వాగతం పలకటానికిది ఎంతో అనువుగా ఉంటుంది. దీంతో అడ్మిన్లు, గ్రూప్ సభ్యులు కొత్తవారికి ఇటీవలి మెసేజ్‌లను షేర్ చేయొచ్చు. అప్పుడు నడుస్తున్న చర్చల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా పాల్గొనొచ్చు. అన్ని వాట్సప్ మెసేజ్‌ల మాదిరిగానే గ్రూప్ మెసేజ్ హిస్టరీ కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయ్యి ఉంటాయి. అందువల్ల కన్వర్జేషన్లు రహస్యంగానే ఉంటాయి. స్క్రీన్‌షాట్ల మీద ఆధారపడటం, మాన్యువల్‌గా మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయటం వంటి ఇబ్బందులేవీ ఉండవు. గ్రూప్ మెసేజ్ హిస్టరీ ఫీచర్ సాయంతో అడ్మిన్లు, సభ్యులు 25 నుంచి 100 వరకూ ఇటీవలి మెసేజ్‌లను ఎంచుకొని, పంపటానికి వీలుంటుంది. వీటి ద్వారా కొత్త సభ్యులు సమంజసమైన సందర్భం తెలుసుకోవచ్చు. ఒకవేళ అడ్మిన్లు వద్దనుకుంటే ఈ ఫీచర్‌ను డిసేబుల్ చేసే అవకాశమూ ఉంటుంది. అయినా కూడా అడ్మిన్లు ఎప్పుడైనా తమంతతాము మెసేజ్ హిస్టరీని షేర్ చేయొచ్చు. మెసేజ్ హిస్టరీని షేర్ చేసినప్పుడు బృంద సభ్యులందరికీ దానికి సంబంధించిన నోటిఫికేషన్ అందుతుంది. ఇది పారదర్శకతకు తావిస్తుంది.

లిరియా సంగీతం సృష్టిస్తుంది

జెమినై యాప్ మొదట్నుంచీ ఇమేజెస్, వీడియోల ద్వారా యూజర్లు సృజనాత్మకంగా వ్యక్తీకరించుకోవటానికి ఎన్నో టూల్స్‌ను నిక్షిప్తం చేస్తూ వస్తోంది. తాజాగా ఇష్టమైన విధంగా సంగీతాన్ని సృష్టించుకునే టూల్‌ను ప్రవేశ పెట్టింది. దీని పేరు లిరియా 3. ఇది గూగుల్ డీప్‌మైండ్‌కు చెందిన అధునాతన జనరేటివ్ మ్యూజిక్ మోడల్. దీని బీటా వర్షన్ ఇటీవలే జెమినై యాప్‌లో అందుబాటులోకి వచ్చింది. మీ ఐడియాను వర్ణించినా, మీరు కోరుకుంటున్న సంగీతానికి అనుగుణమైన ఫొటోను అప్‌లోడ్ చేసినా చాలు. జెమినై దాన్ని వెంటనే అత్యంత నాణ్యమైన, ఇంపైన ట్రాక్‌గా అనువదిస్తుంది. అప్‌లోడ్ చేసిన ఫొటో నుంచి స్ఫూర్తి తీసుకోవాలని జెమినైకి సూచిస్తే ఇంకా మంచి ఫలితం కనిపిస్తుంది. అయితే ఇదేమీ సంగీత కళాఖండాలను సృష్టించుకోవటానికి కాదు, మీ గురించి వినోదాత్మకంగా ఇతరులకు తెలియజేసుకోవటానికి ఒక సాధనం మాత్రమే. దీంతో 30 సెకండ్ల నిడివి ట్రాక్స్‌ను సృష్టించుకోవచ్చు. దీన్ని డౌన్‌లోడ్ చేసుకొని లేదా షేర్ లింక్ మీద క్లిక్ చేసి ఇతరులతో పంచుకోవచ్చు.

- మీకు పాట రాయటం తెలియక పోయినా ఇబ్బంది లేదు. మీరు అందించిన ప్రాంప్ట్ సాయంతో లిరియా తనే లిరిక్ రాసుకుంటుంది.
- శైలి, గొంతు, తీరు వంటి అంశాలను ఇష్టమైన విధంగా ఎంచుకోవచ్చు.
- మరింత వాస్తవంగా అనిపించే, సంక్లిష్టమైన మ్యూజిక్ ట్రాక్స్‌నూ సృష్టిస్తుంది.

ఇలా వాడుకోవాలి

- **టెక్స్ట్ నుంచి ట్రాక్:** మీకు ఇష్టమైన జోనర్, మూడ్, జోక్, జ్ఞాపకం.. ఇలా ఏదైనా కావొచ్చు. అర్థవంతంగా టెక్స్ట్ రూపంలో వర్ణించాలి. అప్పుడు లిరియా రంగంలోకి దిగి దానికి తగిన లిరిక్‌ను, వాయిద్యాల ఆడియోను సృష్టించుకుంటుంది.
- **ఫొటో, వీడియోల నుంచి:** ఫొటో లేదా వీడియోను అప్‌లోడ్ చేసి, కాసేపు వేచి ఉంటే సరి. జెమినై వాటిలోని కంటెంట్‌ను తీసుకొని మూడ్‌కు తగినట్టుగా లిరిక్‌తో ట్రాక్‌ను కంపోజ్ చేస్తుంది.



డ్రీమ్‌ట్రాక్‌లోనూ..

క్రియేటర్లు కేవలం జెమినై యాప్‌లోనే కాదు. యూట్యూబ్ డ్రీమ్‌ట్రాక్‌లోనూ లిరియా 3ని వాడుకోవచ్చు. కాకపోతే ఇది ప్రస్తుతానికి అమెరికాలోనే అందుబాటులో ఉంది. మున్ముందు ఇతర దేశాలకూ విస్తరించనున్నారు. ఇలా క్రియేటర్లు తమ షార్ట్స్‌కు ఇంపైన సౌండ్‌ట్రాక్స్‌ను జోడించుకోవచ్చు. లిరిక్ వర్షన్ అయినా బ్యాక్‌ట్రాక్ అయినా జత చేసుకోవచ్చు. దీంతో షార్ట్స్ మరింత ఆకర్షణీయంగా మారతాయనటంలో సందేహం లేదు.

ఈనాడు సినిమా

మణిరత్నం సినిమాలో సాయిపల్లవి?



అటు హిందీలోనూ... ఇటు దక్షిణాదిలోనూ అవకాశాల్ని అందుకుంటూ బిజీ బిజీగా గడుపుతున్నారు కథానాయిక సాయిపల్లవి. ప్రస్తుతం నటిస్తున్నవే కాకుండా, 'కల్కి 2' సహా పలు పాన్ ఇండియా సినిమాల విషయంలోనూ ఆమె పేరు వినిపిస్తోంది. అగ్ర దర్శకుడు మణిరత్నం సినిమాలోనూ ఆమె ఎంపికైనట్టు సమాచారం. ఓ ప్రేమకథని తెరకెక్కించేందుకు మణిరత్నం సన్నాహాలు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అందులో సాయిపల్లవి కీలక పాత్ర పోషిస్తుందని, విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించే అవకాశాలున్నాయని ప్రచారం సాగుతోంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. సహజమైన నటనకు పెట్టింది పేరైన కథానాయిక సాయిపల్లవి. ఆమెకు తాను అభిమానినని ఓ వేడుకలో ఇదివరకు చెప్పారు మణిరత్నం. ఆయన సినిమా విషయంలో సాయిపల్లవి పేరు తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

క్లైమాక్స్ కట్టిపడేస్తుంది



శ్రీదేవి, హర్ష్ రోషన్

"'బ్యాండ్ మేళం' చిత్ర కథలోని సంఘర్షణ చాలా కొత్తగా ఉంటుంది. క్లైమాక్స్ అందర్నీ కట్టిపడేస్తుంది" అంటున్నారు కోన వెంకట్. ఆయన సొంత నిర్మాణ సంస్థ కోన ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై నిర్మించిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. సతీశ్ జవ్వాజీ నిర్మించారు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. ఈ చిత్రం మార్చి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో టీజర్‌ని విడుదల చేశారు. సంగీత దర్శకుడు తమన్, నటుడు శివాజీ, దర్శకులు నందినీ రెడ్డి, శివ నిర్వాణ, వేణు ఊడుగుల తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ.. "హర్ష్ రోషన్, శ్రీదేవీల్ని చూస్తుంటే నాకు 'నువ్వే కావాలి' రోజులు గుర్తొస్తున్నాయి. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు. "మంచి ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిది. కచ్చితంగా ఇది విజయవంతమవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు నటుడు శివాజీ. దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ.. 'తెలంగాణ మట్టి వాసనతో జీవితాన్ని చూపించే చిత్రమిది" అన్నారు. "ఇది తెలంగాణ నేపథ్యంలో సాగే పల్లెటూరి ప్రేమకథతో రూపొందింది. మా 'కోర్ట్'లాగే ఈ చిత్రాన్ని ఆదరిస్తారని నమ్ముతున్నాం" అన్నారు నాయకానాయికలు హర్ష్, శ్రీదేవి. ఈ కార్యక్రమంలో సతీశ్ జవ్వాజీతో పాటు చిత్ర బృందం పాల్గొంది.



ఇమ్మానుయేల్, సుధీర్ శ్రీరామ్, వంశీ, శివాజీ, లయ, అలీ, బన్నీ వాస్, సాయికృష్ణ

వందశాతం థియేటర్ అనుభవాన్నిచ్చే సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

"థియేటర్ అనుభవమే అసలుసిసలైన సినిమా వినోదం. వేరే ఎక్కడ చూసినా అంత ఆనందం రాదు. థియేటర్‌నే లక్ష్యంగా చేసుకుని మొదలుపెట్టిన ఈ సినిమాని అక్కడే విడుదల చేస్తుండడం ఆనందంగా ఉంది" అన్నారు ప్రముఖ నటుడు శివాజీ. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ నిర్మాణంలో తెరకెక్కించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'. లయ కథానాయిక. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించారు. ఈటీవీ విన్ సంస్థ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని మార్చి 6న వంశీ నందిపాటి, బన్నీ వాస్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. విడుదల తేదీని ప్రకటించడం కోసం చిత్రబృందం మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ "ఎన్ని ఓటీటీలు వచ్చినా థియేటర్ పంచే అనుభూతి వేరు. వందశాతం థియటర్ అనుభవాన్నిచ్చే చిత్రమిది. ఈటీవీ విన్ సంస్థ సూచనల మేరకు ఏమాత్రం ఎక్కువ, తక్కువలు కాకుండా ఈ సినిమాని చేశాం. పేరున్న నటులు కీలక పాత్రల్ని పోషించారు. ఫ్రెష్ కంటెంట్ కావాలనే ఈటీవీ సంస్థ మొదట ఈ సినిమాని ఓటీటీలో విడుదల చేయాలనుకుంది. కానీ మేమంతా సినిమాని చూసుకున్నాక థియేటర్‌లోనే విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ఒక నాణ్యమైన సినిమాని తీశారని మెచ్చుకుంటూ అనిల్ రావిపూడి, వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఈ సినిమాని థియేటర్‌లోనే విడుదల చేయాలని ప్రోత్సహించారు. సినిమాకి ఏం కావాలో అదే జరుగుతుంది. ప్రతి ఒక్కరికీ నచ్చే ఓ మంచి సినిమా. అందరం ఎంతగానో ప్రేమించి పనిచేశాం" అన్నారు. లయ మాట్లాడుతూ "ఈ సినిమా ఓటీటీలో వస్తుందని తెలిశాక సంతోషంతోపాటు, ఎక్కడో అసంతృప్తి ఉండేది. చిన్నప్పటి నుంచి సినిమా అంటే థియేటర్‌లో చూడటమే అలవాటు. ఈ సినిమాని అలా చూసుకోలేను కదా అనే బాధ ఉండేది. అనిల్ రావిపూడితోపాటు, బన్నీ వాస్, వంశీ నందిపాటి కారణంగా ఈ సినిమా థియేటర్లలో విడుదలవుతోంది. శివాజీ మంగపతి పాత్రలో ఎంత గాఢంగా కనిపించారో, ఇందులోని ఆయన పాత్ర అంతే ప్రభావం చూపిస్తుంది. నేను గతంలో పోషించిన రత్నమాల పాత్రని ఎలా గుర్తు పెట్టుకున్నారో, ఇందులోని ఉత్తర పాత్ర కూడా గుర్తుండిపోతుంది. నాకు వ్యక్తిగతంగా ఇష్టమైన సినిమా ఇది" అన్నారు. దర్శకుడు సుధీర్ శ్రీరామ్ మాట్లాడుతూ "సినిమా దానికి ఏది కావాలో అది చేసుకుంటుందని అంటుంటారు. అలా ఈ సినిమా థియేటర్ కావాలనుకుంది" అన్నారు. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ "కుటుంబ వినోదంతో సాగే క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. శివాజీ, లయ జోడీ అలరిస్తుంది. అందరూ థియేటర్‌లో చూసి ఆస్వాదించండి" అన్నారు. అలీ మాట్లాడుతూ "విజయవంతమైన జోడీగా గుర్తింపు తెచ్చుకున్న శివాజీ, లయ కలిసి నటించిన నాలుగో చిత్రమిది. 'మిస్సమ్మ' మినహా నేను అన్నింట్లోనూ నటించా. రెండు గంటలపాటు హాయిగా థియేటర్‌లో కూర్చుని ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది. శివాజీ నటుడిగా, నిర్మాతగానే కాకుండా ఓ సాంకేతిక నిపుణుడిగా కూడా పనిచేశార"న్నారు. బన్నీ వాస్ మాట్లాడుతూ "ఒక క్రైమ్ థ్రిల్లర్ కథని కుటుంబ ప్రేక్షకులు ఆస్వాదించేలా చెప్పడమే ఈ సినిమా ప్రత్యేకత" అన్నారు. ఈటీవీ విన్ సినిమా అంటే ఓ ప్రత్యేకత ఉంటుంది, ఆ సంస్థ చేసిన మరో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండడం ఆనందంగా ఉందన్నారు వంశీ నందిపాటి. ఈ కార్యక్రమంలో వంశీ నందిపాటి, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



తమిళమ్మాయి కొరియన్ కలలు

ఓ తమిళ అమ్మాయి కన్యాకుమారి నుంచి కొరియాకి వెళ్లిందనేది ఓ కథ. ఆమె పాత్రలో చిన్నప్పుడు నటించి.. తనలానే దక్షిణ కొరియా వెళ్లాలని కలలు కంటుంది షెన్బా. అంతేకాదు దాని కోసం పెద్ద మొత్తంలో అప్పు చేయడానికి కూడా వెనుకాడదు. మరి ఎక్కడో చిన్న నగరంలో ఉంటూ కొరియా కలలు కంటున్న ఈ అమ్మాయి చివరికి దానిని సాధించిందా? సియోల్ చేరాక తాను ఊహించిన కలల ప్రపంచం అందంగా ఉందా? అక్కడ ఎదురైన సవాళ్లేంటో తెలియాలంటే ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ చిత్రం 'మేడ్ ఇన్ కొరియా' చూడాల్సిందే. ప్రియాంక అరుళ్ మోహన్ ప్రధాన పాత్రలో ఈ చిత్రాన్ని రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ ఇన్‌స్టాలో పోస్టర్‌ను ఆవిష్కరించింది. 'కొరియన్ కలలు.. సియోల్ వీధులు'అనే క్యాప్షన్‌ని జోడించింది. ఈ చిత్రం మార్చి 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ సినిమాలో దక్షిణ కొరియా నటుడు పార్క్ హై జిన్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ప్రియాంక ఈ సినిమాలో షెన్బా అనే పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించనుంది.

జడలు రో.. హడలు రో




"సవారీకి దొరుకు బిడ్డా.. శవాలే లేస్తాయ్ బిడ్డా.. జడలు రో.. హడలు రో" అంటూ సవాల్ విసురుతున్నాడు జడల్. మరి అతనెవరు.. తను సవాల్ చేస్తోంది ఎవరినీ తెలియాలంటే 'ది ప్యారడైజ్' చూడాల్సిందే. నాని కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం నాని పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "పొట్టు పొట్టు ఆకలుంది.. ఆయా షేర్.. మెట్టు మెట్టు ఎక్కుతర. . ఆయా షేర్.. పేరు పత్తాలేనోన్నిరా.. ఆయా షేర్.. ప్యారడైజ్‌కు అడ్రసైత.. ఆయా షేర్" అంటూ సాగిన ఈ పాటతో సినిమాలో నాని పాత్ర వ్యక్తిత్వాన్ని.. తన పోరాటాన్ని ఆసక్తికరంగా ఆవిష్కరించారు. అనిరుధ్ స్వరాలు సమకూర్చిన ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యమందించగా.. అడ్డుల జంగిరెడ్డి, అకునూరి దేవయ్య ఆలపించారు. ఈ పాటలో జడల్‌గా రా రస్టిక్ లుక్‌లో నాని కనిపించిన తీరు.. ఆయన వేసిన హుషారైన హుక్ స్టెప్స్ ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాలో మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్‌బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇది ముగింపు దశ చిత్రీకరణలో ఉంది.

చిటికెడు కరుణ.. బారెడు బీభత్సం

కథానాయకుడు నాని.. దర్శకుడు సుజీత్ కలయికలో ఓ బహుభాషా చిత్రం పట్టాలెక్కనుంది. వెంకట్ బోయనపల్లి నిర్మాత. ఈ సినిమాకి 'బ్లడీ రోమియో' అనే పేరును ఖరారు చేయనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఇప్పుడా పేరునే చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం నాని పుట్టినరోజు సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇదొక గ్యాంగ్‌స్టర్ కథతో రూపొందుతున్న సినిమా. "చిటికెడు కరుణ.. పిడికెడు కోపం.. బారెడు బీభత్సం.. మతిపోయేంత ప్రేమ" అంటూ చెఫ్ కమ్ గ్యాంగ్‌స్టర్‌గా ఈసారి నాని చేస్తున్న వంటకమేంటి.. తన పాత్ర ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా చూపించారు. మరి గ్యాంగ్‌స్టరే చెఫ్‌గా మారాల్సి వచ్చిందా? లేక చెఫే గ్యాంగ్‌స్టర్‌గా మారాడా? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈ వేసవిలోనే చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో ప్రకటించనున్నారు.

వినోదాన్ని ప్రారంభిద్దాం



బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'భూత్ బంగ్లా'. ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ చిత్రమిది. ఈ సినిమాలో టబు, వామికా గబ్బీ, పరేశ్ రావల్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రేక్షకులలో నవ్వులు పూయించేందుకు ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే సినిమాకు సంబంధించిన ప్రచారపర్వాన్ని పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇటీవలే ఈ సినిమాలో మిథిలా పాల్కర్ పాత్రని పరిచయం చేశాడు అక్షయ్. తాజాగా ఈ సినిమా నుంచి 'వినోదాన్ని ప్రారంభిద్దాం' అనే వ్యాఖ్యతో ఇన్‌స్టాలో అక్షయ్ లుక్ మోషన్ పోస్టర్‌ను పంచుకుంది చిత్ర బృందం. ఇందులో ఆయన భిన్నమైన అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు.

'కింగ్ బుద్ధ' శాంతి సందేశం



బౌద్ధ బిక్షువులతో సత్యారెడ్డి

ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ 'కింగ్ బుద్ధ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, 25 బౌద్ధ దేశాల్లో చిత్రీకరణ చేయడమే ఈ సినిమా ప్రత్యేకత అన్నారు సత్యారెడ్డి. ఆయన దర్శకనిర్మాణంలో, పలు భాషలకు చెందిన కొత్తతరం నటులతో రూపొందిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. థాయ్‌లాండ్‌కి చెందిన బౌద్ధ బిక్షువులు కర్ణాటకలోని స్వర్ణభూమి నుంచి నాగార్జున సాగర్ బుద్ధభూమి వరకూ చేస్తున్న పాదయాత్రలో 'కింగ్ బుద్ధ' దర్శకుడు, ఇతర చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రపంచానికి శాంతి సందేశాన్నిచ్చే చిత్రమిది. ఇప్పటికే పది దేశాల్లో చిత్రీకరణ చేశాం. మరో 15 దేశాలకు వెళ్లాల్సి ఉంది" అన్నారు.

కథల ఎంపికే కారణమైనా కానీ...!



చిన్న సినిమాలతో మెరుస్తూ... విజయానికి కేరాఫ్‌గా నిలుస్తున్న కథానాయిక నయన్ సారిక. 'గం గం గణేశా'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె 'క', 'ఆయ్' సినిమాలతో ప్రేక్షకులకు మరింతగా చేరువైంది. అచ్చమైన తెలుగమ్మాయిలా కనిపిస్తూ, గలగలా తెలుగు మాట్లాడేస్తోంది. ఈ మధ్య శ్రీవిష్ణుతో కలిసి 'విష్ణువిన్యాసం'లో నటించింది. ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు నయన్‌సారిక.

'విష్ణు విన్యాసం' ఎలా ఉంటుంది?

కడుపుబ్బా నవ్విస్తుంది. ఈ కథ వింటున్నప్పుడే నేను చాలా నవ్వుకున్నా. ఇద్దరు అధ్యాపకుల మధ్య జరిగే ప్రేమ కథ. విద్యార్థులు, యువతరం ప్రేక్షకులు మరింతగా కనెక్ట్ అవుతారు.

ఇందులో నటిస్తున్నప్పుడు మీకు కాలేజీ రోజులు గుర్తొచ్చాయా?

చాలా విషయాలే గుర్తొచ్చాయి. స్కూల్‌లోనూ, కళాశాలల్లోనూ ఇద్దరు టీచర్లు అందంగా, మంచి జోడీలా కనిపించారంటే వాళ్ల గురించి విద్యార్థులు ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు కదా. ఈ సినిమాలో శ్రీవిష్ణు, నేను అలాంటి జోడీనే (నవ్వుతూ). మనీషా పాత్రలో నటిస్తున్నప్పుడు నేను మా ఇంగ్లిషు టీచర్‌నే గుర్తు చేసుకున్నా.

ట్రైలర్ చూస్తుంటే మీ పాత్ర కొంచెం బోల్డ్‌గానే ఉన్నట్టు అనిపిస్తోంది...

నేను మనీషా అనే యువతిగా కనిపిస్తా. అదొక విభిన్నమైన పాత్ర. అందులో చాలా కోణాలే ఉంటాయి. జీవితంలో చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొన్న ఓ అమ్మాయి తను. తెరపైన ఆమె ఏం చేసినా దానికొక అర్థం ఉంటుంది. గత సినిమాలతో పోలిస్తే ఈ పాత్ర నిర్మాణం, అది తెరపై కనిపించే విధానం వైవిధ్యంగా ఉంటుంది. ఈ సినిమా నన్ను మరో మెట్టు పైకి ఎక్కిస్తుంది.

నవ్వించడం కష్టం అంటుంటారు. మీరు ఎక్కువగా హాస్య ప్రధానమైన పాత్రల్లోనే కనిపిస్తుంటారు. ఆ విషయం గురించి ఏం చెబుతారు?

నవ్వించడం, హృదయాల్ని బరువెక్కించేలా భావోద్వేగాల్ని పండించడం నిజంగా కష్టమైన పనే. ఆ విషయంలో కథ, పాత్రల్లోని బలం, సహనటుల టైమింగ్ చాలా ప్రభావం చూపిస్తాయి. శ్రీవిష్ణు చూడ్డానికి రిజర్వ్‌డ్‌గా, సిగ్గరిగా కనిపిస్తారు కానీ, ఆయనతో మాటలు కలిపితే మాత్రం చాలా సరదాగా ఉంటుంది. ఆయన మాటలు గుర్తుండిపోయేలా ఉంటాయి. తన కామెడీ టైమింగ్ చాలా సహజంగా ఉంటుంది. ఆ ప్రభావం ఈ సినిమాలో స్పష్టంగా కనిపిస్తుంది. దర్శకుడు యదునాథ్ మారుతీరావు రచన, ఆయన సన్నివేశాల్ని ఊహించే విధానం చాలా బాగుంటుంది. రథన్ పాటలు, నేపథ్య సంగీతం చిత్రానికి ప్రధానబలం.

ఎలాంటి కథల్లో నటించాలని ఉంది?

అన్ని రకాల సినిమాలూ ఇష్టమే. రాజమౌళి సినిమాల్లో కథానాయికగా నటించడమే నా కల.

వరుసగా విజయాల్ని అందుకుంటున్నారు. మీ కథల ఎంపికే కారణమా?

కచ్చితంగా కథల ఎంపికే. అయితే అదృష్టం ప్రభావం కూడా కాస్త ఉంటుందని నమ్ముతుంటా. నా సినిమాలకు సంబంధించిన కథల్ని నేనే స్వయంగా విని నిర్ణయం తీసుకుంటా. కథలో ఏదో ఒక ప్రత్యేకత, కొత్తదనం ఉంటేనే చేస్తున్నా. నయన్ సారిక సినిమాలో ఉందంటే కచ్చితంగా ఏదో ఉంటుందనే ఓ నమ్మకం కలగాలనే తపనతోనే పనిచేస్తుంటా. తెలుగు సినిమాల్లో నటిస్తూనే భాష నేర్చుకున్నా. ప్రస్తుతం కన్నడలో ఓ సినిమా చేస్తున్నా. తెలుగులోనే నా ప్రయాణం మొదలైంది. నా తొలి ప్రాధాన్యం తెలుగు సినిమాలే. నా తొలి చిత్రం 'గం గం గణేశా' సినిమాలో నటనకిగానూ ఇటీవలే ఉత్తమ తొలి చిత్ర కథానాయికగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం రావడంతో నా కల నెరవేరిన అనుభూతి కలిగింది. 'విష్ణు విన్యాసం' తర్వాత 'రాకాస'తో సందడి చేయబోతున్నా.

ది కేరళ స్టోరీ 2ని ముందు మాకు చూపించండి

– కేరళ హైకోర్టు

ఇటీవల విడుదలైన 'ది కేరళ స్టోరీ 2' సినిమా ట్రైలర్‌లో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలున్నాయని సామాజికమాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైంది. ఈ సినిమా విడుదలపై స్టే విధించాలని దాని సెన్సార్ సర్టిఫికేషన్ రద్దుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికేషన్‌పై కేరళ హైకోర్టు తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. అంతేకాదు బుధవారం 'ది కేరళ స్టోరీ 2'ను తమ ఎదుట ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. నిర్మాతల తరఫున న్యాయవాది కోర్టు తీర్పు వెలువరించే వరకు ప్రస్తుతం ఉన్న టీజర్‌లను తొలగించడానికి అంగీకరించారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక స్క్రీనింగ్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినట్టు సమాచారం. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రానికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు. చిత్రబృందం ఈ సినిమాని శుక్రవారం థియేటర్లలో విడుదల చేయాలనుకుంది.

అక్షయ్ మాటలు నాలో ధైర్యాన్ని నింపాయి



శరీరాకృతి ఎలా ఉన్నప్పటికీ.. ముందుగా మనల్ని మనం గౌరవించుకుంటే ఇతరులు కూడా విలువిస్తారంటోంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె గతంలో శరీర బరువు కారణంగా ఎదుర్కొన్న ట్రోలింగ్ గురించి మాట్లాడారు. అది తన ఆత్మవిశ్వాసాన్ని, మానసిక ఆరోగ్యాన్ని ఎంతగా ప్రభావితం చేసిందో పంచుకున్నారు. వాటిని పట్టించుకోవడం మానేసిన తర్వాత హీరో అక్షయ్ కుమార్ సలహా తనలో ధైర్యాన్ని నింపిందని వెల్లడించారు. "నాకు ఇంకా ఆ రోజులు గుర్తున్నాయి. ఏడుస్తూ నిద్రపోయి.. వాచిన కళ్లతో మేల్కొన్న రోజులు చాలానే ఉన్నాయి. శరీరాకృతి కోసం అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నాకు నేను చెప్పుకునేదాన్ని. కానీ, నిరంతరం చేసే వ్యాఖ్యలు నన్ను నేను ప్రశ్నించుకునేలా ఉండేవి. దాన్ని అధిగమించడానికి చాలా ధైర్యం కావాలి. అప్పట్లో నా చుట్టూ ఉండేవారు కూడా నన్ను ట్రోల్ చేసేవారు. కానీ, ఒక రోజు జిమ్‌కు వెళ్లినపుడు సన్నగా ఉన్న ఓ అమ్మాయి నా దగ్గరికి వచ్చి 'నేను మీలాగా మారాలంటే ఏం చేయాల'ని అడిగింది. అప్పుడే అర్థమైంది. మనం ఎలా ఉన్నా నచ్చేవాళ్లకు నచ్చుతామని. ముందు మనల్ని మనం ప్రేమించుకోవాలి. ఇతరులు అభిప్రాయాల కోసం చూడకూడదు. మనకు మనం అలా ఇచ్చుకునే గౌరవమే మనకు ఇతరులలో విలువనిస్తుంది. ఓ సందర్భంలో అక్షయ్ కుమార్ ఇచ్చిన సలహా తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. 'ట్రోల్స్ పట్టించుకోకుండా మీరు మీలానే ఉండే స్వభావం బావుంది. ఇలానే చుట్టూ వేలమంది ట్రోల్స్ చేసిన అవేవి వినకుండా కొనసాగాలి. సినిమాలో పాత్ర కోసం సన్నగా మారాల్సి వస్తేనే మారాల'ని చెప్పారు. అప్పుడు ఆ మాటలు నాలో ధైర్యాన్ని నింపాయి. వాటినే అనుసరిస్తున్నాను" అని అన్నారు. ఇటీవలే 'దో దివానే సెహర్ మే' చిత్రంలో కనిపించిన మృణాల్.. త్వరలోనే అడివి శేష్ సరసన 'డెకాయిట్' సినిమాతో థియేటర్లలో ప్రేక్షకుల్ని పలకరించనుంది.

ఈనాడు బిజినెస్

సెమాగ్లుటైడ్ కోసం నాట్కోతో ఎరిస్ లైఫ్‌సైన్సెస్ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: దీర్ఘకాలిక ఊబకాయం, టైప్-2 మధుమేహం నియంత్రణ కోసం వినియోగిస్తున్న సెమాగ్లుటైడ్ ఔషధాన్ని భారత మార్కెట్లో విక్రయించేందుకు ఎరిస్ లైఫ్‌సైన్సెస్, నాట్కో ఫార్మా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి, చక్కెర స్థాయిలను నియంత్రించే జీఎల్‌పీ-1 రిసెప్టార్ అగోనిస్ట్ అయిన సెమాగ్లుటైడ్.. బరువు తగ్గించడంలోనూ వైద్యపరంగా మెరుగైన ఫలితాలను ఇస్తుండటంతో.. ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక చికిత్సగా ఆవిర్భవించింది. దీన్ని దేశీయంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఈ రెండు దేశీయ సంస్థలూ చేతులు కలిపాయి. నాట్కో ఫార్మాకు ఉన్న ఔషధ తయారీ నైపుణ్యంతో దీన్ని ఉత్పత్తి చేస్తుంది. ఎరిస్ లైఫ్‌సైన్సెస్‌కు డయాబెటిస్ విభాగంలో ఉన్న బలమైన పంపిణీ వ్యవస్థతో మార్కెట్లోకి తీసుకెళ్తుంది.

'ఇటీవలి కాలంలో జీవక్రియ (మెటబాలిక్) సంరక్షణ విభాగంలో వచ్చిన అత్యంత ముఖ్యమైన చికిత్సా విధానంలో సెమాగ్లుటైడ్ ఒకటి. వినూత్న, అత్యంత ప్రభావవంత చికిత్సలతో మా డయాబెటిస్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యానికి ఈ భాగస్వామ్యం తోడ్పడుతుంది' అని ఎరిస్ లైఫ్‌సైన్సెస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ బక్షి తెలిపారు. ఎరిస్‌కున్న వాణిజ్య మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలిక చికిత్సల విభాగంలో ఉన్న విస్తృత అనుభవంతో ఈ ఔషధ వినియోగాన్ని వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, దేశీయంగా సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.


కోడి గుడ్లు

25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	470
వరంగల్	472
విజయవాడ	500
తూ/ప గోదావరి	480
విశాఖపట్నం	485
చిత్తూరు	533

మార్కెట్లకు ఐటీ షాక్

- మళ్లీ కుదేలైన సెన్సెక్స్, నిఫ్టీ
- రూ.3.15 లక్షల కోట్లు తగ్గిన సంపద



బాబోయ్.. ఐటీ షేర్లు

సెన్సెక్స్ ▼1069 82226 | నిఫ్టీ ▼288 25425

దేశీయ సూచీలను ఐటీ షేర్లు కుంగదీశాయి. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత వల్ల సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీలకు ఇబ్బందులు తప్పవనే ఆందోళనల నేపథ్యంలో ఐటీ షేర్లు కుప్పకూలాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ 1 శాతానికి పైగా నష్టపోయాయి. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు పెరగడం, బలహీన విదేశీ సంకేతాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 6 పైసలు తగ్గి 90.95 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.22% పెరిగి 71.66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ● బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.3.15 లక్షల కోట్లు తగ్గి రూ.465.64 లక్షల కోట్ల (5.12 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

● సెన్సెక్స్ ఉదయం 242 పాయింట్ల (క్రితం ముగింపు 83,294.66) నష్టంతో 83,052.54 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 81,934.73 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 1068.74 పాయింట్ల నష్టంతో 82,225.92 దగ్గర ముగిసింది. నిఫ్టీ 288.35 పాయింట్లు కోల్పోయి 25,424.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,327.60-25,641.80 పాయింట్ల మధ్య కదలాడింది.

మంగళవారం మన ఐటీ షేర్లు భారీగా పతనమయ్యాయి. 2008 ఆర్థిక మాంద్యం తర్వాత, అతి పెద్ద నెలవారీ నష్టాన్ని ఈ నెలలోనే నిఫ్టీ ఐటీ సూచీ చవిచూసింది. ఈ సూచీ ఒక్కరోజే 6% పతనమై, 30053 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఐటీ సూచీ ఈ నెలలో ఇప్పటి వరకు 21 శాతానికి పైగా క్షీణించింది. ఆర్థిక మాంద్యం భయాలతో పాటు సంప్రదాయ ఐటీ సేవలకు, ఏఐ వల్ల పొంచి ఉన్న ముప్పే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఏఐ అంకుర సంస్థ ఆంత్రోపిక్ తన 'క్లాడ్' టూల్ ద్వారా కోబాల్ కోడ్‌ను సులభతరం చేయవచ్చని ప్రకటించడంతో ఆందోళనలు రెట్టింపయ్యాయి. ఐటీ కంపెనీల దీర్ఘకాలిక ఆదాయ వనరులపై ఇది ప్రతికూల ప్రభావం చూపొచ్చనే భయాలు పెరిగాయి. ఆంత్రోపిక్ చేసిన ప్రకటన ప్రపంచ టెక్ షేర్లను వణికించింది. ముఖ్యంగా ఐబీఎం షేరు సోమవారం 13% క్షీణించింది. గత 25 ఏళ్లలో ఆ కంపెనీ షేరుకు ఇదే అత్యంత భారీ పతనం. ఫలితంగా దాదాపు 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.60 లక్షల కోట్ల) మార్కెట్ విలువను కోల్పోయింది. ఈ ప్రభావం మంగళవారం మన ఐటీ షేర్లను తాకింది. ☛ అయితే భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 11.45 గంటల సమయానికి అమెరికా ఐటీ కంపెనీల షేర్లు 4-10% వరకు కోలుకున్నాయి.

తక్కువ విలువలు ఒక్కటే సరిపోవు

ఐటీ కంపెనీల షేర్ల ధరలు క్షీణించినా, మదుపర్లు తొందరపడి కొనుగోలు చేయవద్దని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 'ఒక రంగం మార్పులకు లోనవుతున్నప్పుడు, తక్కువ ధరకే షేర్లు దొరుకుతున్నాయని కొనుగోలు చేయడం సరికాదు. భవిష్యత్తులో వృద్ధి ఎలా ఉంటుందో స్పష్టత వచ్చాకే నిర్ణయం తీసుకోవాలి' అని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఈడీ, సీఐఓ నరేన్ సూచించారు. గత 3, 5, 10 ఏళ్లలో ఐటీ కంపెనీల ఆదాయ వృద్ధి ఒక అంకె స్థాయిలోనే ఉందని, దీనికి తోడు ఏఐ ప్రభావం తోడవ్వడం వల్ల ఆదాయ అంచనాలు మరింత బలహీనపడతాయని ఆల్కెమీ క్యాపిటల్ హెడ్ అలోక్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు.

సాంకేతిక అంశాలు ఏం చెబుతున్నాయంటే..

ప్రస్తుతానికి అప్రమత్తత పాటించాలని సాంకేతిక విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతానికి నిఫ్టీ ఐటీకి 29,961 వద్ద మద్దతు ఉంది. అది కోల్పోతే 28,800 స్థాయికి పడిపోవచ్చని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ ఆనంద్ జేమ్స్ అన్నారు. సాంకేతిక చార్టుల్లో డెత్ క్రాస్ ఏర్పడిందని, ఇది ట్రెండ్ రివర్సల్‌ను సూచిస్తోందని ఛాయిస్ బ్రోకింగ్‌కు చెందిన సచిన్ గుప్తా తెలిపారు. గతంలో పడితే కొనుగోలు చేసే వ్యూహం, ఇప్పుడు పెరిగినపుడు అమ్మే వ్యూహంగా మారిందని చెప్పారు. తాజా కొనుగోళ్లకు దూరంగా ఉండాలని, ఏదైనా కోలుకున్నప్పుడు షార్ట్ సెల్లింగ్ అవకాశం కోసం చూడాలని రెలిగేర్ బ్రోకింగ్ అజిత్ మిశ్రా సూచించారు.

మరింత పతనం తప్పదా?

ప్రస్తుతం ఐటీ షేర్లు తక్కువ ధరలకే లభిస్తున్నప్పటికీ, ఏఐ సృష్టించే అనిశ్చితి ఈ రంగ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది. ఒకవేళ టెక్నాలజీ మార్పులు క్రమంగా జరిగితే, ఈ భారీ పతనం దీర్ఘకాలిక పెట్టుబడిదార్లకు గొప్ప అవకాశంగా మారొచ్చు. కానీ సంప్రదాయ సేవలకు డిమాండ్ వేగంగా పడిపోతే, షేర్ల పతనం మరి కొంతకాలం కొనసాగొచ్చు. ప్రస్తుతానికి వేచి చూడటమే ఉత్తమమని నిపుణులు సిఫారసు చేస్తున్నారు.

సెన్సెక్స్ 30 షేర్లలో 23కు నష్టాలు

ఎటర్నల్ 5.28%, ఎల్ అండ్ టీ 3.59%, ట్రెంట్ 2.93%, భారతీ ఎయిర్‌టెల్ 2.83%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.42%, బీఈఎల్ 1.07%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.02% డీలాపడ్డాయి. ఎన్‌టీపీసీ, హెచ్‌యూఎల్, టాటా స్టీల్, టైటన్, పవర్‌గ్రిడ్ 1.94% వరకు లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 4.80%, ఐటీ 4.53%, స్థిరాస్తి 2.61%, టెలికాం 1.79%, వినియోగ 1.12%, పరిశ్రమలు 0.91% పెరిగాయి. లోహ, చమురు-గ్యాస్, విద్యుత్, ఇంధన, యుటిలిటీస్, కమొడిటీస్, ఎఫ్ఎమ్‌సీజీ తగ్గాయి. బీఎస్ఈలో 2889 షేర్లు నష్టపోగా, 1344 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 151 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

మంగళవారం ఐటీ షేర్ల పతనమిలా..

కంపెనీ	ఎల్‌టీఐ	టెక్ మహీంద్రా	కేపీఐటీ	పర్సిస్టెంట్	కోఫోర్జ్	హెచ్‌సీఎల్	ఇన్ఫోసిస్	టీసీఎస్	విప్రో
నష్టం (%లో)	6.86	6.6	6.38	6.27	6.24	6.10	3.91	3.79	2.82

వీటి సామర్థ్యం తక్కువేమీ కాదు: హురున్

అన్‌లిస్టెడ్ 100 కంపెనీలతో జాబితా



అధిక సామర్థ్యం కలిగి, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకు తగిన పనితీరు ప్రదర్శిస్తున్న 100 కంపెనీల జాబితాను జేఎం ఫైనాన్షియల్ హురున్ ఇండియా విడుదల చేసింది. ఈ కంపెనీల మొత్తం విలువ 328 బిలియన్ డాలర్లు (సుమారు రూ.28.5 లక్షల కోట్లు) అని, ఫిన్లాండ్ జీడీపీ కంటే అధికమని పేర్కొంది. ఈ సంస్థల మొత్తం ఆదాయం 2025లో రూ.8.90 లక్షల కోట్లు అని పేర్కొంది. 2023 జాబితాలోని కంపెనీల మొత్తం ఆదాయం రూ.6.7 లక్షల కోట్ల కంటే ఇది 15.2% అధికం. కనీసం రూ.1,000 కోట్ల వార్షికాదాయం ఉన్న కంపెనీలతో తాజా జాబితా రూపొందించారు. ఈ జాబితాలో అగ్రస్థానంలో రిలయన్స్ రిటెయిల్ (ఆదాయం రూ.2.7 లక్షల కోట్లు) ఉంది. ఫ్లిప్‌కార్ట్ (రూ.83,000 కోట్లు), మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ (రూ.66,000 కోట్లు) తరవాతి స్థానాల్లో ఉన్నాయి.

✦ అత్యంత వేగంగా ఆదాయం వృద్ధి చెందుతున్న కంపెనీల్లో టాటా ఎలక్ట్రానిక్స్ (3173%), టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ (904%), జేఎస్‌డబ్ల్యూ వన్ ప్లాట్‌ఫామ్స్ (522%) ఉన్నాయి. లాభదాయకత పరంగా చూస్తే, రిలయన్స్ రిటెయిల్ (రూ.22,573 కోట్లు), అదానీ ప్రాపర్టీస్ (రూ.11,332 కోట్లు), జెరోధా (రూ.5664 కోట్లు) ముందున్నాయి.

తెలుగు రాష్ట్రాల నుంచి

ర్యాంకు	సంస్థ	ఆదాయం (రూ.కోట్లలో)	ప్రాంతం
34	మేధ సర్వో డ్రైవ్స్	4,380	హైదరాబాద్
41	షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్	3,859	హైదరాబాద్
43	దేవీ సీ ఫుడ్స్	3,442	విశాఖపట్నం
47	కేఎంవీ ప్రాజెక్ట్స్	3,036	హైదరాబాద్
51	గ్రీన్‌కో గ్రూప్	2,926	హైదరాబాద్
56	బయోలాజికల్ ఇ.	2,708	హైదరాబాద్
69	వైశ్యరాజు జువెలర్స్	2,296	విశాఖపట్నం
79	సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్	1,909	విజయవాడ
83	సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్	1,811	విశాఖపట్నం
97	రాఘవ కన్‌స్ట్రక్షన్స్	1,414	హైదరాబాద్
100	నోవోపోర్ అడ్వాన్స్‌డ్ సైన్స్	1,314	హైదరాబాద్

చంద్రశేఖరన్ పునర్నియామకంపై నిర్ణయం వాయిదా

టాటా సన్స్ బోర్డు సమావేశంలో భేదాభిప్రాయాల వల్లే అని వార్తలు



టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్‌ను మూడోసారి పునర్నియమించడంపై నిర్ణయాన్ని బోర్డు వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో 'కొత్త వ్యాపారాల్లో నష్టాలపై భేదాభిప్రాయాలు తలెత్తడమే' ఇందుకు కారణమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలాగే చంద్రశేఖరన్ పునర్నియామకానికి టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా కొన్ని షరతులు పెట్టినట్లు అవి వెల్లడించాయి. టాటా గ్రూపులో కొన్ని కంపెనీలకు నష్టాలు వస్తున్న అంశాన్ని కూడా సమావేశంలో నోయల్ లేవనెత్తారు. అయితే ఏ కొత్త వ్యాపారమైనా, పెట్టుబడులపై ప్రతిఫలాలు రావాలంటే కొంత కాలం వేచిచూడాల్సి ఉంటుందని చంద్రశేఖరన్ పునర్నియామకానికి మద్దతిస్తున్న బోర్డు సభ్యులు పేర్కొన్నట్లు సమాచారం. పునర్నియామక కమిటీకి సారథ్యం వహిస్తున్న అనితా జార్జ్ కూడా చంద్రశేఖరన్ పునర్నియామకానికి అనుకూలంగా మాట్లాడుతూ.. కొత్త ప్రాజెక్టుల్లో నష్టాలు ఊహించినవేనని తెలిపారు. ఒకటి రెండు కంపెనీలు నష్టాల్లో ఉన్నంత మాత్రాన, గ్రూపు మొత్తం పనితీరుకు దానిని సంకేతంగా చూడలేమని కొందరు బోర్డు సభ్యులు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇన్నేళ్లుగా సంస్థ పురోగతిలో ఛైర్మన్ అందించిన సహకారాన్ని తక్కువ చేసి చూడకూడదని వాళ్లు పేర్కొన్నట్లు సమాచారం. కాగా.. చంద్రశేఖరన్ పునర్నియామకం అంశంపై ఓటింగ్ నిర్వహించాలని బోర్డు సభ్యులు ప్రతిపాదించినా, 'దీనికంటే, ఆ నిర్ణయాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని' చంద్రశేఖరన్ అన్నట్లు తెలుస్తోంది. నిర్ణయాలు తీసుకోవడంలో టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ ఐక్యంగా ఉంటేనే.. టాటా గ్రూపు సమర్థంగా పనిచేయగలదని ఆయన చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

✦ టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీ కాలం ముగియడానికి ఇంకా ఏడాది సమయం (2027 ఫిబ్రవరి) ఉంది. 2017 నుంచి ఈ బాధ్యతల్లో ఆయన కొనసాగుతున్నారు. చంద్రశేఖరన్ హయాంలో టాటా గ్రూపునకు చెందిన 15 అతిపెద్ద నమోదిత కంపెనీల ఆదాయాలు, లాభాలు దాదాపు రెట్టింపయ్యాయి.

నోయల్ టాటా షరతులు..

చంద్రశేఖరన్ పునర్నియామకం కావాలంటే, టాటా ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా పెట్టిన షరతులివే..

✦ టాటా సన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుచేయకూడదు. అదనపు అప్పుల జోలికి వెళ్లకూడదు.

✦ అధిక ముప్పు ఉండే వ్యాపారాల్లో భారీగా మూలధన వ్యయాలను వెచ్చించడాన్ని అదుపులో పెట్టుకోవాలి.

✦ ఎయిరిండియా, బిగ్‌బాస్కెట్ లాంటి సంస్థల కొనుగోళ్ల వల్ల వస్తున్న నష్టాలు నివారించాలి.

ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మోసంలో మొత్తం సొమ్ము రికవరీ

హరియాణా సీఎం

చండీగఢ్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ శాఖలో జరిగిన మోసం కేసులో, రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన దాదాపు రూ.556 కోట్లను రికవరీ చేసినట్లు హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ మంగళవారం ప్రకటించారు. 'దాదాపు రూ.22 కోట్ల వడ్డీతో కలిపి మొత్తం రూ.556 కోట్లు 24 గంటల్లోనే తిరిగి వచ్చాయి' అని సైనీ హరియాణా శాసనసభలో పేర్కొన్నారు. హరియాణా ప్రభుత్వ విభాగాలకు చెందిన ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు కలిసి రూ.590 కోట్ల మోసానికి పాల్పడినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఘటన ప్రధానంగా చండీగఢ్‌లోని ఒక బ్యాంక్ శాఖలో జరిగిందని, ఇందులో మధ్య, దిగువ స్థాయికి చెందిన నలుగురు లేదా అయిదుగురు ఉద్యోగులు కుమ్మక్కయ్యారని ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ప్రభుత్వానికి వివరించినట్లు సైనీ తెలిపారు. ఈ మోసంపై రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణ జరుపుతుందని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఆర్థిక కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

✦ హరియాణా ప్రభుత్వ విభాగాలకు 100 శాతం అసలు, వడ్డీని చెల్లించామని, ఇది మొత్తం రూ.583 కోట్లుగా ఉన్నట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. మోసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వ శాఖలు, న్యాయ విభాగాలతో కలిసి పనిచేస్తామని బ్యాంక్ వెల్లడించింది.

✦ ముఖ్యమంత్రి గణాంకాలకు, బ్యాంకు వెల్లడించిన సమాచారానికి మధ్య తేడాలుండటం గమనార్హం.

విమానయాన సంస్థల నష్టాలు రూ.17,000- 18,000 కోట్లు

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంపై ఇక్రా అంచనా
- 2024-25తో పోలిస్తే చాలా ఎక్కువ
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.12,000 కోట్లకు తగ్గే అవకాశం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) భారత విమానయాన సంస్థల నష్టాలు రూ.17,000- 18,000 కోట్లుగా ఉండొచ్చని రేటింగ్స్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. 2024-25 నష్టం రూ.5500 కోట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ అని పేర్కొంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం నష్టాలు రూ.11,000- 12,000 కోట్లకు పరిమితం కావచ్చని వెల్లడించింది. దేశీయంగా విమాన ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటం, డిసెంబరులో ఇండిగో పరిణామాల తర్వాత తిరిగి కార్యకలాపాలు సాధారణ స్థాయికి రావడం ఇందుకు దోహదం చేస్తాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజాల్ షా తెలిపారు. 2025-26లో నష్టాలు బాగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. దేశీయ విమానయాన రంగంపై 'స్థిరత్వం'తో కూడిన అంచనానే కొనసాగిస్తున్నట్లు ఇక్రా పేర్కొంది.

ప్రయాణికుల రద్దీ అంచనాల్లో కోత

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదల 4-6% ఉంటుందని గతంలో అంచనా వేయగా, ప్రస్తుతం 0-3 శాతానికి ఇక్రా తగ్గించింది. వాతావరణ ప్రతికూలతలు, 2025 జూన్‌లో విమానం కూలిన ఘటన, డిసెంబరులో ఇండిగో సర్వీసుల రద్దు పరిణామాలు ఇందుకు కారణమవుతాయని వివరించింది. 2026-27లో దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ 6-8% పెరిగి 17.5- 17.9 కోట్ల మందికి చేరొచ్చని వెల్లడించింది.



✦ అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రద్దీలో బలమైన వృద్ధి ఉండొచ్చని తెలిపింది. లో బేస్ ఎఫెక్ట్ ఇందుకు కలిసి వస్తుందని పేర్కొంది. ఇ-వీసా/ వీసా ఆన్ ఎరైవల్ విస్తృతి పెరగడం, థీమ్ బేస్డ్, ప్రత్యేక పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం ఇస్తుండటం కూడా తోడ్పడుతుందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల సంఖ్య 7-9%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 8-10% పెరిగే అవకాశం ఉందని ఇక్రా తెలిపింది. 2025 డిసెంబరు 31 నాటికి దేశీయ విమానయాన సంస్థల వద్ద ఉన్న మొత్తం విమానాల సంఖ్య 865గా ఉంది. 2026 జనవరి 31నాటికి మొత్తంగా 1,700 విమానాల డెలివరీ పెండింగ్‌లో ఉంది. రాబోయే పదేళ్లలో ఈ విమానాలు కంపెనీలకు సరఫరా కావొచ్చు.

మెటాకు ఏఎమ్‌డీ నుంచి రూ.9 లక్షల కోట్ల చిప్‌లు!

కొనుగోలు చేయనున్న ఫేస్‌బుక్ మాతృసంస్థ

న్యూయార్క్: ఫేస్‌బుక్ యజమాని మెటా ప్లాట్‌ఫామ్స్ 100 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9 లక్షల కోట్లు) విలువైన కృత్రిమ మేధ(ఏఐ) చిప్‌లను అడ్వాన్స్‌డ్ మైక్రో డివైజెస్ (ఏఎమ్‌డీ) నుంచి కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందం కింద ఆ చిప్ కంపెనీలో 10% వరకు వాటానూ సొంతం చేసుకునే అవకాశం లభించనుంది. తన డేటా సెంటర్ల కోసం ఏఎమ్‌డీకి చెందిన ఎమ్ఐ450 రకం చిప్‌లను తీసుకోనుంది. 6 గిగావాట్ ఒప్పందంలో భాగంగా, తొలి గిగావాట్ సరఫరా ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి మొదలవుతుంది. ఈ ఒప్పందం విలువ 100 బి. డాలర్లకు మించి వెళ్లే అవకాశం ఉంది.

నేటి నుంచే ఐఆర్‌ఎఫ్‌సీ ఆఫర్ ఫర్ సేల్

దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ)లో ప్రభుత్వం 4% వరకు వాటాను విక్రయించనుంది. ఈనెల 25న ప్రారంభమయ్యే ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు కనీస ధరను రూ.104గా నిర్ణయించింది. ఈ ధర వద్ద 4% వాటా అమ్మకం ద్వారా రూ.5,430 కోట్ల వరకు నిధులు ఖజానాకు చేరతాయి. రిటెయిల్ ఇన్వెస్టర్లు గురువారం బిడ్‌లు దాఖలు చేసుకోవచ్చు.

బాండ్లతో రూ.5,000 కోట్ల సమీకరణ: కెనరా బ్యాంక్

ఈనాడు, హైదరాబాద్: భవిష్యత్తు వృద్ధి ప్రణాళికలకు మద్దతుగా, మూలధనాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు టైర్-2 బాండ్ల ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించబోతున్నట్లు కెనరా బ్యాంక్ వెల్లడించింది. ఈనెల 26 నుంచి ఎన్ఎస్ఈ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్లాట్‌ఫామ్‌లో ఈ బాండ్లు జారీ చేయనుంది. ప్రాథమికంగా ఈ ఇష్యూలో రూ.2,000 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యం. మదుపరుల స్పందనకు అనుగుణంగా మరో రూ.3,000 కోట్ల వరకు నిధులను సమీకరించుకునే వెసులుబాటు ఉంది. 10 ఏళ్ల వ్యవధితో జారీ అయ్యే ఈ బాండ్లపై 7.20% వార్షిక రాబడి అందుతుంది.

నాసుని ఆర్అండ్‌డీ కేంద్రం విస్తరణ

ఈనాడు, హైదరాబాద్: కంపెనీలకు డేటా నిర్వహణ సేవలు అందించే నాసుని హైదరాబాద్‌లోని తన పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కేంద్రాన్ని విస్తరించింది. తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, నాసుని సీఈఓ సామ్ కింగ్ ముఖ్య అతిథులుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కృత్రిమ మేధకు అవసరమైన ఫైల్ డేటా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, ప్రపంచస్థాయి ఉత్పత్తుల అభివృద్ధిని వేగవంతం చేయడం ఈ విస్తరణ లక్ష్యమని సంస్థ వెల్లడించింది. అమెరికా, ఐర్లాండ్‌లోని బృందాలతో కలిసి హైదరాబాద్ కేంద్రం పనిచేస్తుంది. ఏఐ ఇంటిగ్రేషన్, ఫైల్ డేటా ఇండెక్సింగ్, ర్యాన్సమ్‌వేర్ గుర్తింపు లాంటి సాంకేతిక అంశాలపై ఇక్కడి ఇంజినీరింగ్ బృందాలు దృష్టిసారిస్తాయని పేర్కొంది.

వ్యవసాయ ఎగుమతులకు సుంకం ప్రయోజనాలు తగ్గవ్

కేంద్రం స్పష్టీకరణ



దిల్లీ: ఎగుమతిదార్లకు మద్దతునిచ్చే పథకం కింద పన్ను ప్రయోజనాలను తగ్గించినప్పటికీ.. అవి వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులకు వర్తించవని కేంద్రం మంగళవారం స్పష్టం చేసింది. ద రెమిషన్ ఆఫ్ డ్యూటీస్ అండ్ టాక్సెస్ ఆన్ ఎక్స్‌పోర్టెడ్ ప్రోడక్ట్స్(ఆర్ఓడీటీఈపీ) పథకం కింద వస్తువుల తయారీ, పంపిణీ ప్రక్రియలో ఎగుమతిదార్లు కట్టే సుంకాలను రిఫండ్ చేస్తున్నారు. ఈ పథకం కింద వర్తించే రేట్లను తక్షణం అమల్లోకి వచ్చేలా సగానికి తగ్గిస్తున్నట్లు సోమవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తగ్గింపు రేట్లు ఐటీసీ హెచ్ చాప్టర్ 1-24 కింద వచ్చే ఎగుమతి ఉత్పత్తులకు వర్తించవని డీజీఎఫ్‌టీ స్పష్టం చేసింది. చాప్టర్ 1-24లో వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులుంటాయి. ఆర్ఓడీటీఈపీ పథకానికి 2025-26లో రూ.18,232 కోట్లు కేటాయించగా, 2026-27లో రూ.21,709 కోట్లకు పెంచాలన్న ప్రతిపాదన ఉండేది. అయితే బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు మాత్రమే కేటాయించారు.

పవర్‌గ్రిడ్ ఈక్విటీ పెట్టుబడుల పరిమితి రూ.7,500 కోట్లకు పెంపు

ఒక్కో అనుబంధ సంస్థలో పవర్‌గ్రిడ్ ఈక్విటీ పెట్టుబడుల పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు పెంచే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మూలధన ఆధారిత ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులకు మరింత నిధుల వెసులుబాటుకు ఇది దోహదం చేయనుంది.

ఐటీ ఉద్యోగులు 59.5 లక్షల మంది

- 2025-26లో 1.35 లక్షల కొత్త కొలువులు
- ఈ రంగం విలువ రూ.28 లక్షల కోట్ల పైమాటే: నాస్కామ్ నివేదిక



అంతర్జాతీయ అనిశ్చితులు, ఏఐ ప్లాట్‌ఫామ్‌ల రాకతో మార్పులు.. వీటన్నిటి మధ్య కూడా భారత టెక్ రంగం రాణిస్తోంది. 2025-26లో ఈ రంగ ఆదాయం 6.1% వృద్ధితో 315 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.28.35 లక్షల కోట్ల)కు చేరొచ్చని పరిశ్రమ సంఘం నాస్కామ్ అంచనా వేస్తోంది.

ఏఐ నైపుణ్యం.. 20 లక్షల మందికి

2024-25లో ఐటీ రంగంలో నికరంగా 1.33 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు జత చేరగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 1.35 లక్షలకు పెరిగింది. దేశంలోని మొత్తం ఐటీరంగంలోని ప్రత్యక్ష ఉద్యోగుల సంఖ్య 58.15 లక్షల నుంచి 59.50 లక్షలకు చేరుకున్నట్లు నాస్కామ్ తెలిపింది. కొత్త ఉద్యోగాల్లో నికర వృద్ధి 2,000 ఉద్యోగాలే. గత కొన్నేళ్లలో ఇది అత్యంత మందగమన స్థితి.

✦ ఉద్యోగ వృద్ధి 2.3%, ఆదాయ వృద్ధి 6.1% నమోదు కావడంపై నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ స్పందిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లోనూ ఐటీ ఉద్యోగుల సంఖ్య నికరంగా పెరగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నియామకాలు పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

✦ మొత్తం 59.5 లక్షల మంది ఐటీ ఉద్యోగుల్లో 20 లక్షల మంది ఏఐ (కృత్రిమమేధ) సాంకేతికతలో నైపుణ్యం సాధిస్తున్నారని, ఇందులో 3 లక్షల మంది అధునాతన ఏఐ స్కిల్స్ నేర్చుకుంటున్నారనీ వివరించారు.

2025-26లో ఏ విభాగంలో ఎంత ఆదాయం(బి. డాలర్లు)

విభాగం	2024-25	2025-26
ఐటీ సేవలు	143	149
బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్	55	59
సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు	21	23
ఇంజినీరింగ్, రీసెర్చ్, డెవలప్‌మెంట్	59	63
హార్డ్‌వేర్ కంపెనీలు	19	21

అమెరికాను మించి..

2025-26లో మొత్తం మీద దేశీయ సంస్థలకు ఏఐ ఆదాయాలు 10-12 బిలియన్ డాలర్ల (సుమారు రూ.90,000-1,08,000 కోట్ల) మేర ఉండొచ్చని నాస్కామ్ అంచనా వేసింది. అన్ని కంపెనీలూ ఏఐ ఆదాయాలను వెల్లడించలేదన్నారు. సాధారణంగా అమెరికా నుంచి మన కంపెనీలకు అధిక వృద్ధి లభిస్తుంటుందని, అయితే ఈసారి ఆసియా పసిఫిక్, మధ్య ప్రాచ్య ప్రాంతాలు వేగవంతమైన వృద్ధిని నమోదుచేశాయని నంబియార్ పేర్కొన్నారు. దేశీయంగా ఐటీ కంపెనీలకు ఆదాయం 2025-26లో 7.9% వృద్ధి చెందింది. ఇది ప్రపంచ స్థాయి సగటు కంటే అధికం. రంగాల వారీగా చూస్తే ఆరోగ్య సంరక్షణ, పర్యాటక, రవాణా రంగాల్లో అధిక వృద్ధి కనిపిస్తోంది.

ఏఐతో ఐటీకి ఇబ్బందులే

హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ

ముంబయి: కృత్రిమ మేధ(ఏఐ)తో జరిగే మార్పుల వల్ల ఐటీ రంగంలో 'ఇబ్బందికర' పరిణామాలు ఎదురుకావొచ్చని హెచ్‌సీఎల్ టెక్ ఎండీ, సీఈఓ సి. విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. అయితే ఐటీ రంగానికి 'సంస్మరణ' సమయం ఏమీ రాలేదని, సంక్లిష్ట ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ ఆర్కిటెక్చర్‌ను నిర్వహించగలిగే సామర్థ్యం వల్ల నిలదొక్కుకోగలదని అన్నారు. వై2కే తర్వాత పరిశ్రమ ఎలాగైతే మార్పులు స్వీకరించి ముందుకెళ్లిందో.. అలాగే ఇప్పుడు కూడా తనకు తాను పునర్ నిర్వచించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఐటీ రంగం గొప్ప మలుపు తీసుకునే సమయం ఇదని, వచ్చే 5-10 ఏళ్లలో ఈ రంగం పూర్తిగా మారొచ్చని అన్నారు.

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు



★ యెమెన్ నూతన ప్రధానమంత్రిగా 2026 జనవరిలో ఎవరు నియమితులయ్యారు?
జ: షాయా మొహ్సెన్ జిందానీ (యెమెన్ దేశ ప్రెసిడెన్షియల్ లీడర్‌షిప్ కౌన్సిల్ ప్రస్తుత ప్రధాన మంత్రి సలేం బిన్ బ్రీక్ రాజీనామాను ఆమోదించి దేశ విదేశాంగ మంత్రిగా ఉన్న షాయా మొహ్సెన్ జిందానీను నూతన ప్రధాన మంత్రిగా నియమించింది.)

★ దేశంలోని మొదటి యూసీఐ గుర్తింపు పొందిన మల్టీ-స్టేజ్ ప్రొఫెషనల్ రోడ్ సైక్లింగ్ రేస్ అయిన పుణే గ్రాండ్‌టూర్ 2026కు గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఎవరు వ్యవహరించారు?
జ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ (2026 జనవరి 19 నుంచి 23 వరకు యూనియన్ సైక్లిస్ట్ ఇంటర్నేషనల్ (యూసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఐదు ఖండాల్లోని 35 దేశాల నుంచి 29 ప్రొఫెషనల్ జట్లకు చెందిన 171 మంది రైడర్లు పాల్గొన్నారు. 437 కి.మీ. దూరం మేర ఈ రేస్ నిర్వహించారు.)

★ పిల్లల అక్రమ రవాణాను నిరోధించడంలో చేసిన అసాధారణ కృషికిగాను రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)కు చెందిన ఏ అధికారిణికి భారతీయ రైల్వే అత్యున్నత పురస్కారాన్ని ఇటీవల ప్రదానం చేశారు?
జ: చందన సిన్హా

★ జాతీయ 'స్టార్టప్ దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?(2016 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.)
జ: జనవరి 16

మరింత సమాచారం

అసలు మారదు.. వడ్డీ ఆగదు!



ఎవరైనా ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే వారి దగ్గర కారు లేకపోతే ఏదైనా టాక్సీని అద్దెకు తీసుకుంటారు. వేరే ఊరు వెళ్లినప్పుడు ఉండటానికి తాత్కాలికంగా రూమ్‌ను కొంత సొమ్ము చెల్లించి ఉపయోగించుకుంటారు. అదే విధంగా అవసరమైనప్పుడు బ్యాంకులు లేదా వ్యక్తుల నుంచి డబ్బు తీసుకొని వాడుకుంటారు. అందుకోసం అదనంగా కొంత మొత్తాన్ని చెల్లిస్తారు. డబ్బుకు ఇచ్చే ఆ అద్దెనే గణిత పరిభాషలో వడ్డీ అంటారు. తీసుకున్న అసలుపై నిర్ణీత కాలానికి ఒకే వడ్డీ రేటును లెక్కగట్టే పద్ధతిని బారువడ్డీ అంటారు. నిత్య జీవితంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేటప్పుడు, బ్యాంకుల్లో పెట్టిన పెట్టుబడులపై వచ్చే అదనపు మొత్తాలను లెక్కించేటప్పుడు ఈ బారువడ్డీల లెక్కలు అవసరమవుతాయి. ఈ విధమైన గణిత నైపుణ్యాలను అభ్యర్థుల్లో అంచనా వేయడానికి పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతుంటారు. వాటికి సమాధానాలను వేగంగా గుర్తించాలంటే సంబంధిత సూత్రాలను, అందులోని సాంకేతిక పదాలను అర్థం చేసుకోవాలి. ఇచ్చిన కాలం యూనిట్లను కావాల్సిన రీతిలో మార్చుకోవడం నేర్చుకోవాలి.

బారువడ్డీ

మనిషి ఆర్థిక జీవితంలో సమాచారంతో కూడిన ఆర్థిక నిర్ణయాలు, రుణాలను సమర్థంగా నిర్వహించడానికి, పొదుపును పెంచడానికి వడ్డీ భావాలను అర్థం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం. నిజజీవిత సందర్భాల్లో వివిధ ఆర్థిక మార్గాల్లో వడ్డీ భావన ముఖ్య పాత్ర వహిస్తుంది. పోటీ పరీక్షల్లో వడ్డీలకు సంబంధించిన భావన ల్లో ఒకటైన బారువడ్డీపై ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఈ అంశం నుంచి వచ్చే ప్రశ్నలకు సమాధానాలను రాబట్టేందుకు ప్రాథమిక గణిత పరిజ్ఞానాంశాలైన నిష్పత్తి, శాతాలపై అవగాహన ఉండాలి. దాంతోపాటు, సునిశిత పరిశీలన, విస్తృత సాధన చాలా అవసరం.

బారువడ్డీ: వడ్డీ కాలమంతా అసలు మీద మాత్రమే వడ్డీని గణిస్తే ఆ వడ్డీని 'బారువడ్డీ' అంటారు. అసలు పూర్తిగా తీరే వరకు సాంవత్సరిక బారువడ్డీ స్థిరంగా తీసుకున్న అసలుపై చెల్లించాల్సి ఉంటుంది.

ముఖ్య సూత్రాలు: బారువడ్డీ $(SI) = \frac{PTR}{100}$

P = అసలు, T = కాలం, R = వడ్డీరేటు
SI = బారువడ్డీ

అసలు $(P) = \frac{100 \times \text{బారువడ్డీ}\ (SI)}{\text{కాలం}\ (T) \times \text{వడ్డీరేటు}\ (R)}$

మొత్తం (A) = అసలు (P) + వడ్డీ (I)

మాదిరి ప్రశ్నలు

1. కొంత సొమ్మును సంవత్సరానికి 9 శాతం వడ్డీరేటు చొప్పున బారువడ్డీకి ఇవ్వగా ఐదేళ్లలో ఆ సొమ్ముపై వచ్చిన వడ్డీ రూ.4016.25 అయితే, అసలు ఎంత?
1) రూ.8925 2) రూ.9825.50
3) రూ.8032.50 4) రూ.8023.50



వివరణ: ఇచ్చిన దత్తాంశం నుంచి, వడ్డీరేటు (SI) = 9%,
కాలం (T) = 5 సంవత్సరాలు
బారువడ్డీ (SI) = రూ.4016.25,
అసలు (P) = ?

అసలు $(P) = \frac{100 \times SI}{TR} = \frac{100 \times 4016.25}{9 \times 5}$

$= \frac{401625}{45} = 8925$

∴ అసలు (P) = రూ.8925 **జ: 1**

2. కొంత సొమ్ముపై x % వడ్డీ రేటు చొప్పున x సంవత్సరాల్లో అయ్యే బారువడ్డీ x రూపాయలు అయితే అసలు ఎంత?
1) రూ.x 2) రూ.100x
3) రూ.$\left(\frac{100}{x}\right)$ 4) రూ.$\left(\frac{100}{x^2}\right)$

వివరణ: ఇచ్చిన దత్తాంశం నుంచి,
వడ్డీరేటు (SI) = x%
కాలం (T) = x సంవత్సరాలు
బారువడ్డీ (SI) = x రూపాయలు
అసలు (P) = ?

∴ అసలు $(P) = \frac{100 \times SI}{TR}$

$= \frac{100 \times x}{x \times x} = \left(\frac{100}{x}\right)$ రూపాయలు. **జ: 3**

3. రెండువేల రూపాయలకు 10 శాతం సాధారణ వడ్డీ చొప్పున 3 నెలల్లో అయ్యే వడ్డీ ఎంత?
1) రూ.100 2) రూ.50
3) రూ.60 4) రూ.30

జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్



వివరణ: పై మాదిరి సమస్యల్లో అంటే కాలం నెలల్లో ఇచ్చినప్పుడు

బారువడ్డీ $(SI) = \frac{PTR}{12 \times 100}$

T = కాలం నెలల్లో దత్తాంశం నుంచి,
అసలు (P) = రూ.2000,
వడ్డీరేటు (R) = 10%
కాలం (T) = 3 నెలలు, వడ్డీ (SI) = ?

∴ $SI = \frac{PTR}{12 \times 100} = \frac{2000 \times 10 \times 3}{12 \times 100}$ = రూ.50 **జ: 2**

4. ఒక వ్యాపారి, ఒక బ్యాంకులో కొంత మొత్తాన్ని రుణంగా తీసుకున్నాడు. ఆ బ్యాంకు అగ్రిమెంట్ ప్రకారం, తీసుకున్న మొత్తానికి వడ్డీ లేకుండా, కొన్ని సమాన వాయిదాల్లో చెల్లించాలి. ఆ వ్యాపారి 18 వాయిదాలు చెల్లించిన తర్వాత 60 శాతం రుణం మొత్తం పూర్తయిందని గమనించాడు. అయితే ఆ బ్యాంకు అగ్రిమెంట్‌లో ఉన్న మొత్తం వాయిదాల సంఖ్య ఎంత?
1) 22 2) 24 3) 30 4) 33

వివరణ: బ్యాంకు అగ్రిమెంట్ ప్రకారం, ఆ వ్యాపారి తీసుకున్న మొత్తాన్ని వడ్డీ లేకుండా సమాన వాయిదాల్లో చెల్లించాలి. ఆ వ్యాపారి 18 వాయిదాలు చెల్లించిన తర్వాత 60 శాతం లోన్ చెల్లించారు. తీసుకున్న మొత్తానికి ఒకొక్క వాయిదాకు చెల్లించాల్సిన సొమ్ము = A అనుకుంటే, తీసుకున్న మొత్తం = T అనుకుంటే

∴ దత్తాంశం నుంచి...

$18 \times A = \frac{60}{100} \times T \Rightarrow 18 \times A = \frac{3}{5} \times T$

$\therefore \frac{T}{A} = 18 \times \frac{5}{3} = 6 \times 5 = 30$

∴ మొత్తం వాయిదాల సంఖ్య = 30 **జ: 3**

5. కొంత సొమ్ము సాధారణ వడ్డీ చొప్పున 20 సంవత్సరాల్లో అసలుకు మొత్తం మూడు రెట్లు అయితే, వడ్డీరేటు ఎంత?
1) 20% 2) 10% 3) 5% 4) 15%

వివరణ: అసలు (P) = రూ.100 అనుకుంటే 20 సంవత్సరాల్లో సాధారణ వడ్డీకి అయ్యే మొత్తం (A) = 3 రెట్లు = రూ.300

∴ బారువడ్డీ (SI) = A − P = 300 − 100 = రూ.200
వడ్డీరేటు (R) = ?, కాలం (T) = 20 సంవత్సరాలు

$\therefore SI = \frac{PTR}{100} \Rightarrow 200 = \frac{100 \times 20 \times R}{100} \therefore R = \frac{200}{20} = 10\%$

సంక్షిప్త పద్ధతి: వడ్డీరేటు $(R) = \frac{100(x\ \text{రెట్లు} - 1)}{t(\text{సంవత్సరాల్లో})}$

$= \frac{100(3-1)}{20} = \frac{100 \times 2}{20} = 10\%$ **జ: 2**

6. కొంత సొమ్మును ఏడాదికి 5 శాతం వడ్డీరేటు చొప్పున బారువడ్డీకి ఇవ్వగా ఎన్ని సంవత్సరాల్లో ఆ సొమ్ము రెట్టింపవుతుంది?
1) 10 2) 15 3) 5 4) 20



వివరణ: అసలు (P) = రూ.100 అనుకుంటే
దత్తాంశం నుంచి మొత్తం (A) = రూ.200 అవుతుంది,
వడ్డీరేటు (R) = 5%, రూ.100 లపై, 5%
వడ్డీరేటుపై ఒక సంవత్సరానికి అయ్యే వడ్డీ = రూ.5
∴ అసలు రెట్టింపు అవ్వడానికి

పట్టే సంవత్సరాలు $= \frac{100}{5} = 20$ ఏళ్లు

సంక్షిప్త పద్ధతి: $\frac{100\ (x-1)}{r}$ సంవత్సరాలు

x = 2, r = 5

$\therefore \frac{100(2-1)}{5} = \frac{100}{5} = 20$ సంవత్సరాలు. **జ: 4**



రచయిత: జె.వి.ఎస్.రావు

పదో తరగతి — తెలుగు: ప్రకృతి సందేశం



ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు


1. ప్రకృతి సందేశం పాఠ్యభాగ రచయిత గురించి రాయండి. **4 మార్కులు**

జ. కవి పేరు: వైసీవీ రెడ్డి
పూర్తి పేరు: యమ్మనూరు చిన వెంకటరెడ్డి
జననం: వైఎస్ఆర్ కడప జిల్లాలోని బోనాల గ్రామం.
తల్లిదండ్రులు: లక్ష్మమ్మ, కొండారెడ్డి దంపతులు.
రచనలు: తొలకరి చినుకులు, మేనక, రంభ, సింధూర రేఖ, దక్షిణ నీలము, వైజయంతి, పారిజాతం మొదలైన కావ్యాలు, గట్టిగింజలు కథా సంపుటి.
ప్రత్యేకతలు: అభ్యుదయ రచయితగా పేరుగాంచారు.

1. ప్రకృతి సందేశం పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి. **8 మార్కులు**

జ. పర్వత సానువుల్లోని సరస్సులలో విచ్చుకుంటున్న తామరలు తుమ్మెదలకు సంతోషాన్ని పంచుతున్నాయి. కోకిలలకు మామిడి చెట్లు లేత చివుళ్లను అందిస్తున్నాయి. ఇవి ఒకరికొకరు సహకరించుకోవడం మన సంస్కృతి అనే సందేశాన్ని ఇస్తున్నాయి. ఆకాశంలో తిరుగుతున్న మేఘాలు పర్వత శిఖరాలను కౌగిలించుకుంటున్నాయి. కొండకోనల్లో నిండుగా పూసిన తీగలు చెట్లను అల్లుకుంటున్నాయి. ఇవి మనుషులంతా ఐక్యంతో ఉండాలనే సందేశాన్ని ఇస్తున్నాయి. మన్మథుడి వాహనమైన రామచిలకలు పచ్చటి రెక్కలు విప్పి ఆకాశమనే స్త్రీ కన్నులలో కాంతి నింపుతున్నాయి. అనురాగంతో గుసగుసలాడుతూ కొమ్మలపై లకుముకి పిట్టలు నివసిస్తున్నాయి. పరస్పర ప్రేమానురాగాలతో జీవించాలనే సందేశాన్ని ప్రజలకు ఇస్తున్నాయి. మబ్బుపట్టిన వేళ నెమళ్లు పురులు విప్పి నాట్యం చేస్తున్నాయి. సెలయేళ్లు కొండలపై నుంచి దూకుతున్నాయి. మలుపులు తిరుగుతున్నాయి. వయ్యారంగా సాగే సెలయేటి కన్యలకు చిరుగాలులు ఆటపాటలు నేర్పుతున్నాయి. ఇవి మనుషులంతా స్వేచ్ఛ, సమత, మమతలతో జీవించాలనే సందేశాన్ని ఇస్తున్నాయి. చీమలు కలిసి వెళ్లి తిండిగింజలు సేకరిస్తున్నాయి. తేనెటీగలు తేనెను సేకరించి ఇతరులకు పంచుతాయి. ఇవి క్రమశిక్షణతో ఐక్యంగా ఉండాలని మనుషులకు చెబుతున్నాయి. కొండల మధ్యలో పుట్టిన చిన్న ఎర్రటికాంతి కొమ్మల్లో, రెమ్మల్లో అందాలు చిందిస్తుంది. మమతానురాగాలు పంచడానికి మతాలు పుట్టాయి. కానీ, కొందరు కుటిలబుద్ధితో మతగ్రంథాలు చెప్పే విషయాలకు వక్ర భాష్యాలు చెబుతున్నారు. ఎన్నో ఎత్తులూ, జిత్తులూ వేస్తున్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. ఎందరి చావులకో కారణమవుతున్నారు. ఇలాంటివి ఇక మీదట సాగవు. ఆకాశంలో నీలి మేఘాల కింద అందంగా ఎగిరే పక్షులు, రాత్రనకా పగలనకా కష్టపడే కార్మికులు, కర్షకులు కలిసి ఈ ప్రపంచంలో సమానత్వం సాధించాలని, శాంతి, సౌఖ్యాలను నెలకొల్పాలని కోరుతున్నారు.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు




రచయిత: చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

క్రామ్‌వెల్.. కాంచెట్కా.. శుషియా!




ప్రపంచ భూగోళశాస్త్రం — సముద్ర ప్రవాహాలు



భూగోళం మొత్తాన్ని ఆవరించి ఉన్న సముద్రంలోని నీరు చూడటానికి నిలకడగా కనిపించినప్పటికీ నిరంతరం కదులుతూ, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పెద్దఎత్తున ప్రవహిస్తూ ఉంటుంది. భూభ్రమణం, గాలులు, నీటి సాంద్రతలో వ్యత్యాసాలు, సూర్యచంద్రుల గురుత్వాకర్షణ తదితర సహజ కారకాలతో జరిగే ఈ ప్రక్రియ భూగోళం ఉష్ణోగ్రతను సమతౌల్యం చేస్తుంటుంది. భూమధ్యరేఖ వద్ద వేడెక్కే జలాలను ధ్రువాలకు తరలిస్తూ, అటు నుంచి చల్లని నీటిని ఇటు తీసుకొస్తుంది. రుతుపవనాలతో పాటు ఎల్ నినో, లా నినో మొదలైన తీవ్రమైన వాతావరణ పరిస్థితులకూ ఈ సముద్ర ప్రవాహాలే కారణం. భూగోళంపై ఖండాలు, ప్రాంతాల వారీగా సముద్ర ప్రవాహ మార్గాలు, వాటికి ఉన్న పేర్లు, వేగం, అవి తెచ్చే సానుకూల ప్రభావాలు, సృష్టించే కల్లోలాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. హిందూ మహాసముద్రంలో రుతువుల వారీగా ఈ ప్రవాహాల దిశలు, నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో వాటికి ఉన్న పరస్పర సంబంధాన్నీ అర్థం చేసుకోవాలి.

1. కిందివాటిలో గల్ఫ్‌స్ట్రీమ్ సిస్టమ్ గురించి వాక్యాలు సరిచూడండి.




ఎ) ఇది సాధారణంగా 20°ల ఉత్తర అక్షాంశం నుంచి 60°ల ఉత్తర అక్షాంశాల మధ్య ఉంటుంది.
బి) ఇది మొత్తం అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్నతమైన ఉష్ణ ప్రవాహం.
సి) ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంలో సరాసరిగా 2/5 వ వంతు నీరు ఈ ప్రవాహంలోనే ఉంటుంది.
డి) ఏంటిల్లీస్ ఉష్ణప్రవాహం ఫ్లోరిడా ఉష్ణ ప్రవాహంతో కలవడం వల్ల ఈ గల్ఫ్‌స్ట్రీమ్ సిస్టమ్ ఏర్పడింది.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, సి సరైనవి; బి, డి సరికావు.

2. కిందివాటిని జతపరిచి సమాధానాలు గుర్తించండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) ఉత్తర అట్లాంటిక్ ప్రవాహం	1) పసిఫిక్ మహాసముద్రం
బి) ఫ్లోరిడా ప్రవాహం	2) శీతల ప్రవాహం
సి) లాబ్రాడర్ ప్రవాహం	3) ఉష్ణ ప్రవాహం
డి) కురోషియో ప్రవాహం	4) కరేబియన్ సముద్రంలో ప్రవహిస్తుంది

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-1, బి-4, సి-3, డి-2

3. కిందివాక్యాలు సరిచూడండి.




ఎ) ఫ్లోరిడా ప్రవాహం ప్రధానంగా ఉత్తర అట్లాంటిక్ ప్రవాహపు రెండో పాయగా ఉంటుంది.
బి) లాబ్రాడర్ ప్రవాహం, గ్రీన్‌లాండ్ ప్రవాహం రెండింటినీ శీతల ప్రవాహాలుగా పిలుస్తారు.
సి) లాబ్రాడర్ ప్రవాహం అనేది ప్రధానంగా ఆర్కిటిక్ నుంచి మొదలై గ్రీన్‌లాండ్ పశ్చిమ తీరాన ప్రవహించి న్యూఫౌండ్‌లాండ్ వద్ద గల్ఫ్‌స్ట్రీం ప్రవాహాన్ని కలుస్తుంది.
డి) లాబ్రాడర్, గ్రీన్‌లాండ్ ప్రవాహాల వేగం సరాసరిగా ఒక రోజుకు 10 కి.మీ.లు, అలాగే లోతు 100 మీటర్ల వరకు ఉంటుంది.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి సరైనవి; డి సరికాదు.
4) ఎ, డి సరైనవి; సి, డి సరికావు.

4. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి.
ఎ) బ్రెజిల్ ప్రవాహం - శీతల ప్రవాహం
బి) ఫాక్‌లాండ్ ప్రవాహం - ఉష్ణ ప్రవాహం
సి) గ్రీన్‌లాండ్ ప్రవాహం - శీతల ప్రవాహం
డి) కానరీ ప్రవాహం - శీతల ప్రవాహం
1) ఎ, సి 2) బి, డి 3) ఎ, బి 4) ఎ, డి

5. కింది వాక్యాలు సరిచూడండి.
ఎ) ఉత్తర అట్లాంటిక్ డ్రిఫ్ట్‌నే పశ్చిమ పవన డ్రిఫ్ట్ అని కూడా పిలుస్తారు.
బి) ఈ పశ్చిమ పవన డ్రిఫ్ట్‌ను ఉష్ణ ప్రవాహంగా పరిగణిస్తారు. కానీ ఇది పూర్తిగా ఉష్ణ ప్రవాహం లేదా పూర్తిగా శీతల ప్రవాహం కాదు.
సి) నార్వేజియన్ ప్రవాహం నార్వే, స్వీడన్, బ్రిటిష్ దీవుల తీరాల గుండా ప్రవహించి ఆ దేశాల ఓడరేవులు మంచుతో గడ్డకట్టకుండా చేస్తాయి.
డి) కానరీ ప్రవాహం ఆఫ్రికా వాయవ్య భాగాన కానరీ దీవుల వద్ద అప్‌వెల్లింగ్ ప్రక్రియ కారణంగా ఏర్పడుతుంది.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, డి సరైనవి; సి, బి సరికావు.

6. కిందివాటిలో సరైన జతను గుర్తించండి.
ఎ) బెంగులా ప్రవాహం - శీతల ప్రవాహం
బి) ఉత్తర పసిఫిక్ భూ మధ్య రేఖా ప్రవాహం - ఉష్ణప్రవాహం
సి) కురోషియో ప్రవాహం - శీతల ప్రవాహం
డి) ఒయాషిరో ప్రవాహం - ఉష్ణ ప్రవాహం
1) సి, డి 2) బి, సి 3) ఎ, డి 4) ఎ, బి

7. కిందివాటిలో కురోషియో ప్రవాహానికి సంబంధించిన వాక్యాలు సరిచూడండి.
ఎ) కురోషియో ప్రవాహం ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రవాహం. ఈ ప్రవాహాలు ముదురు నీలం రంగులో ఉంటాయి.
బి) కురోషియో ప్రవాహం, ఒయాషియో ప్రవాహం కలవడం వల్ల జపాన్ శీతోష్ణస్థితి ప్రభావితం అవుతుంది.
సి) కురోషియో ప్రవాహంలోని అనేక శాఖలలో సుశీమా ప్రభావం పెద్దది.
డి) జపాన్ తీరంలో ఉష్ణ, శీతల ప్రవాహాలు కలవడం వల్ల భయంకరమైన తుపాన్లు (టైఫూన్) సంభవిస్తాయి.
1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.



3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కిందివాటిని జతపరిచి సమాధానం గుర్తించండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) అగుల్‌హాస్ ప్రవాహం	1) అట్లాంటిక్ మహాసముద్రం
బి) మొజాంబిక్ ప్రవాహం	2) హిందూ మహాసముద్రం
సి) మడగాస్కర్ ప్రవాహం	3) ఉష్ణ ప్రవాహం
డి) బెంగులా ప్రవాహం	4) శీతల ప్రవాహం

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-1, బి-3, సి-2, డి-4

9. కిందివాటిలో పెరూ ప్రవాహం గురించిన వాక్యాలు సరిచూడండి.



ఎ) ఈ ప్రవాహం సగటు ఉష్ణోగ్రతలు 14°C - 17°C వరకు ఉంటాయి. వేగం ఒక రోజుకు 27 కి.మీ. వరకు ఉంటుంది.
బి) ఈ శీతల ప్రవాహంతో పెరూ, చిలీ దేశాల్లోని వాతావరణం చల్లబడుతుంది.
సి) ప్రధానంగా దక్షిణ అమెరికా పశ్చిమ తీరంలో అప్‌వెల్లింగ్ అనే ప్రక్రియ వల్ల ఏర్పడుతుంది.
డి) అప్‌వెల్లింగ్ ప్రక్రియ దాదాపుగా 5° దక్షిణ అక్షాంశం వరకు ఉంటూ పెరూ, చిలీ దేశాల్లో ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, సి సరైనవి; బి, డి సరికావు.

10. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి.
ఎ) పశ్చిమ ఆస్ట్రేలియ ప్రవాహం - శీతల ప్రవాహం
బి) దక్షిణ హిందూ భూమధ్యరేఖ ప్రవాహం - ఉష్ణప్రవాహం
సి) దక్షిణ హిందూ మహాసముద్ర డ్రిఫ్ట్ - ఉష్ణప్రవాహం
డి) బ్రిటిష్ కొలంబియా ప్రవాహం - శీతల ప్రవాహం
1) సి, డి 2) ఎ, బి 3) బి, సి 4) సి, ఎ

11. కింది వాక్యాలు సరిచూడండి.
ఎ) బ్రిటిష్ కొలంబియా ప్రవాహం కురోషియో ఉష్ణ ప్రవాహం ఒయాషియో శీతల ప్రవాహం 40° ఉత్తర అక్షాంశం వద్ద కలిసి ఉత్తర పసిఫిక్ డ్రిఫ్ట్‌గా మారుతుంది.
బి) బ్రిటిష్ కొలంబియా ప్రవాహాన్ని ఎలూషియన్ ప్రవాహం అని కూడా పిలుస్తారు.
సి) బ్రిటిష్ కొలంబియా ప్రవాహం ఉత్తర పసిఫిక్ డ్రిఫ్ట్ నుంచి విడిపోయి బేరింగ్ జలసంధి ద్వారా ఆర్కిటిక్ మహాసముద్రంలో కలిసి అక్కడి ఉష్ణోగ్రత పెంచుతుంది.
డి) దక్షణ పసిఫిక్ ప్రవాహం వేగం స్థిరంగా ఉండక తరచూ మారుతూ ఉంటుంది.
1) ఎ, బి సరైనవి; సి, డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, సి సరైనవి; బి, డి సరికావు.
4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

12. కిందివాటిలో సరికాని వాక్యాలు గుర్తించండి.
ఎ) ఎల్ నినో ప్రభావంతో భారత ఉపఖండంలో వర్షపాతం క్రమేణా పెరిగి వరదలు సంభవిస్తాయి.
బి) లా నినో ప్రభావంతో భారత ఉపఖండంలో వర్షపాతం క్రమేణా తగ్గి కరవులు సంభవిస్తాయి.
సి) భూభ్రమణం కారణంగా ఉత్తరార్ధ గోళంలో పవనాలు కుడివైపునకు, దక్షిణార్ధ గోళంలో పవనాలు ఎడమ వైపునకు వంగి ప్రయాణించడాన్ని కొరియాలిస్ ప్రభావం అంటారు.
డి) దక్షిణార్ధ గోళంలోని ఆగ్నేయ వ్యాపార పవనాలు భూమధ్య రేఖ దాటగానే కుడివైపు తిరిగి భారత దేశంలోకి నైరుతి రుతుపవనాలుగా ప్రవేశిస్తాయి.
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) డి, ఎ

13. కిందివాక్యాలు సరిచూడండి.



ఎ) ఉత్తర హిందూ మహాసముద్రంలోని ప్రవాహాలు రుతుపవనాల ఆవిర్భావం వల్ల ఏర్పడతాయి.
బి) ఉత్తర హిందూ మహాసముద్ర ఆకారం దాదాపుగా ఒంటె వీపు ఆకారాన్ని పోలి ఉంటూ ఉత్తర భాగం అంతా చిన్నదిగా ఉంటుంది.
సి) ఉత్తర హిందూ భూమధ్యరేఖ ప్రవాహం.. భారత దేశంలోకి ప్రవేశించే ఈశాన్య రుతుపవనాల వల్ల భూమధ్య రేఖ ప్రాంతంలో ఆవిర్భవిస్తుంది.
డి) హిందూ మహాసముద్రంలో ఈశాన్య రుతుపవన డ్రిఫ్ట్, నైరుతి రుతుపవన డ్రిఫ్ట్ రెండూ సంవత్సరం అంతా ఉండవు, కొన్ని నెలల తర్వాత కనుమరుగవుతాయి.
1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
3) ఎ, బి, సి, డి సరైనవి.
4) ఎ, డి సరైనవి; బి, సి సరికావు.

14. కిందివాటిని జతపరచి సమాధానం గుర్తించండి.

జాబితా – 1	జాబితా – 2
ఎ) క్రామ్‌వెల్ ప్రవాహం	1) దక్షిణ అట్లాంటిక్
బి) హంబోల్ట్ ప్రవాహం	2) సీమౌంట్
సి) గయోట్లు	3) ఉష్ణ ప్రవాహం
డి) సెయింట్ హెలీనా దీవులు	4) శీతల ప్రవాహం

1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-2, సి-3, డి-4

15. కిందివాటిలో సరికాని జతను గుర్తించండి.
ఎ) కాంచెట్కా ప్రవాహం - శీతల ప్రవాహం
బి) శుషియా ప్రవాహం - ఉష్ణప్రవాహం
సి) ఇరమింజల్ ప్రవాహం - ఉష్ణప్రవాహం
డి) బహామాస్ ప్రవాహం - శీతల ప్రవాహం
1) ఎ, డి 2) బి, సి
3) సి, డి 4) డి, ఎ




రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-3, 2-2, 3-1, 4-3, 5-2, 6-4, 7-1, 8-2, 9-3, 10-1, 11-2, 12-1, 13-3, 14-1, 15-3.

అనాలజీ అంటే పోలిక/ సారూప్యత అని అర్థం. ఈ విభాగం నుంచి వచ్చే ప్రశ్నల్లో నిర్దిష్ట సంబంధం కలిగిన పదాల జతతో పాటు మరో పదం ఇచ్చి దాని సారూప్య జతను కనుక్కోమని అడుగుతారు. మొదట ఇచ్చిన జంట పదాల మధ్య సంబంధాన్ని గుర్తించి, దాని ఆధారంగా ప్రశ్నలో అడిగిన సాదృశ్య పదాన్ని ఆప్షన్స్ నుంచి ఎంచుకోవాలి. దీనిపై పట్టు సాధించాలంటే వివిధ అంశాలపై దృష్టిసారించాలి. పురాణాలు, వర్తమాన-భవిష్యత్ కాలాలు, ప్రాంతాలు, సాధారణ విషయాల నుంచి కూడా ప్రశ్నలు వస్తుంటాయి. ఇందులో అభ్యర్థి తార్కిక జ్ఞానాన్ని అంచనా వేస్తారు. దత్తాంశంలోని పదాల మధ్య పోలికను గుర్తిస్తే సమాధానం తేలిగ్గా పొందొచ్చు.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

సారూప్యతను గుర్తించు.. సమాధానం దొరికేట్టు!

అనాలజీ

సూచన (ప్ర. 1 – 6): కింది ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించండి.

1. సోడియం : పొటాషియం :: జింక్ :
1) సల్ఫర్ 2) అయోడిన్ 3) నీరు 4) కాల్షియం
సాధన: అన్నీ లోహాలు. కాబట్టి కాల్షియం సమాధానం
సమాధానం: 4

2. హైదరాబాద్ : ముంబయి :: దిస్పూర్ :
1) చెన్నై 2) కొచ్చిన్ 3) ట్రాంబే 4) ఉదయ్‌పూర్
సాధన: అన్నీ రాజధానులు. కాబట్టి చెన్నై సమాధానం.
సమాధానం: 1

3. బొగ్గు : నల్లమబ్బు :: మసి :
1) బ్లష్ 2) యాష్ 3) రావెన్ 4) రస్ట్
సాధన: అన్నీ నలుపు రంగులో ఉంటాయి. ఇచ్చినవాటిలో రావెన్ కూడా అదే రంగులో ఉంటుంది.
సమాధానం: 3

4. జూడో : కరాటే :: తైక్వాండో :
1) వీటిని ఊబకాయం ఉన్నవారు నిర్వహించవచ్చు
2) అవి ఆసియా క్రీడల్లో ముఖ్యమైన అంశాలు
3) ఇవి వేదికపై ప్రదర్శిస్తారు
4) ఇవి యుద్ధ కళల పేర్లు
సాధన: జూడో, కరాటే, తైక్వాండో అనేవి యుద్ధ కళలు.
సమాధానం: 4

5. కరస్పాండెంట్ : వార్త : వార్తాపత్రిక
1) రోడ్డు : వాహనం : గమ్యం 2) రైతు : పంటలు : ఆహారం
3) మేఘం : నీరు : చెరువులు 4) మిషన్ : సిమెంట్ : నిర్మాణం
సాధన: ఒక కరస్పాండెంట్ వార్తాపత్రిక కోసం వార్తలను సేకరించి ఫార్మాట్ చేస్తారు. అలాగే రైతు కూడా ఆహారం కోసం పంటలు పండిస్తాడు.
సమాధానం: 2

6. వెసూవియస్ : ఎట్నా : కిలిమంజారో
1) ఇవి ఇటలీలోని కొండలు 2) ఇవి ద్వీపాలు
3) ఇవి అగ్ని పర్వత ప్రదేశాలు
4) ఇవి ధ్రువ ప్రాంతాల్లోని ప్రదేశాలు
సాధన: వెసూవియస్, ఎట్నా (ఇటలీ), కిలిమంజారో (ఆఫ్రికా) అగ్ని పర్వతాలు.
సమాధానం: 3

సూచనలు (ప్ర.7 – 14): కిందివాటిలో సరైన జతను ఎంచుకోండి.

7. I : చిన్నది :: విధేయత : II
I. 1. మరుగుజ్జు 2. చిన్న 3. పొడవైన 4. అద్భుతమైన
II. A. ద్రోహం B. కీర్తి C. అవమానం D. గౌరవం
1) 3A 2) 4B 3) 2C 4) 1D
సాధన: ప్రతి జతలోని ఇతర పదాలు వాటికి వ్యతిరేక పదాలు.
సమాధానం: 1

8. I : గమ్ :: పట్టు పురుగు : II
I. 1. బాటిల్ 2. బ్రాండ్ 3. రొట్టె 4. చెట్టు
II. A. సిల్క్ B. కీటకం C. కొకోన్ D. దారం
1) 2C 2) 4A 3) 3D 4) 1B
సాధన: ఇచ్చిన ఐచ్ఛికాల్లో రెండోది మొదటి దాని నుంచి వస్తుంది.
సమాధానం: 2

9. I : రాజ్యాంగం :: నాంది : II
I. 1. స్వాతంత్ర్యం 2. చట్టం 3. ఉపోద్ఘాతం 4. సవరణ
II. A. స్తుతి B. గిటజ్జీ C. ప్లే D. ఎపిలోగ్
1) 4D 2) 4A 3) 3A 4) 1D
సాధన: మొదటి ఐచ్ఛికం రెండోదానికి పరిచయ భాగం.
సమాధానం: 3

10. I : కెనడా :: రంగూన్ : II
I. 1. డెట్రాయిట్ 2. ఫ్లోరిడా 3. టొరంటో 4. అల్బెర్టా
II. A. ఇండోనేసియా B. బర్మా C. తూర్పు పాకిస్థాన్ D. సిలోన్
1) 3A 2) 2B 3) 3B 4) 3D
సాధన: నగరం అది ఉన్న దేశాన్ని సూచించే జతకు సంబంధించింది.
సమాధానం: 3

11. ఆధునిక : II :: I : పాత
I. 1. పురాతన 2. మరణం 3. ప్రసిద్ధ 4. నాగరికత
II. A. పారిశ్రామికీకరణ B. కొత్త C. ఫ్యాషన్ D. పాశ్చాత్య
1) 1D 2) 3C 3) 1B 4) 2A
సాధన: ప్రతి జతలోని పదాలు ఒకదానికొకటి వ్యతిరేక పదాలు
సమాధానం: 3

12. శిఖరం : అపెక్స్ :: I : II
I. 1. అందమైన 2. చిత్రం 3. ఆకర్షణీయమైన 4. మంత్రముగ్ధులను చేసే
II. A. సౌకర్యవంతమైన B. అందంగా C. ఆరోగ్యకరమైన D. ధైర్యవంతుడు
1) 3A 2) 4D 3) 2C 4) 1B
సాధన: ప్రతి జతలోని పదాలు ఒకదానికొకటి పర్యాయపదాలు
సమాధానం: 4

13. పేలుడు : I :: మిడత : II
I. 1. బాంబు 2. శిథిలాలు 3. పొగ 4. ఏదీకాదు
II. A. పంట B. హోల్‌కాస్ట్ C. తెగులు D. సీడ్
1) 1D 2) 2C 3) 3D 4) 2B
సాధన: రెండోది మొదటి చర్య ఫలితం
సమాధానం: 2

14. పార్ట్ : I :: క్లాస్ : II
I. 1. విభాగం 2. మొత్తం 3. పాఠశాల 4. విద్యార్థులు
II. A. ఒక విద్యార్థి B. పాఠశాల C. ఉపాధ్యాయులు D. గదులు
1) 2B 2) 3A 3) 4D 4) 1C
సాధన: ప్రతి జతలోని ఒక భాగం దానికి చెందిన పూర్తి సంబంధాన్ని కలిగి ఉంటాయి.
సమాధానం: 1



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

Word of the Day

932

Harangue

Telugu meaning: ఉపన్యాసం, పురాణం

English meaning: The word 'harangue' (హరాంగ్యూ) is a noun or verb that describes a lengthy, aggressive speech, often used to criticize or persuade people forcefully.

Synonyms: Lecture, Rant

Antonyms: Praise, Compliment

Usage: **1.** The manager launched into a harsh harangue about the team's poor performance during the meeting.
2. Instead of motivating the workers, his constant haranguing only created resentment among the employees.

కరెంట్ అఫైర్స్



కీలకమైన ఆర్థిక డేటాను కాపాడటానికి, ప్రధాన వ్యవస్థల కొనసాగింపును బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒడిశాలో అత్యంత సురక్షిత (హై-సెక్యూరిటీ) డేటా కేంద్రాన్ని నిర్మించింది. దాడులకు సుదూరంగా, వ్యూహాత్మక ప్రదేశంలో, భూకంప తీవ్రత లేని చోట దీన్ని నిర్మించారు. ఇందుకోసం టైర్ 4 సర్టిఫికేషన్ డిజైన్‌ను వినియోగించారని సమాచారం.



విదేశీ పార్లమెంట్ సభ్యులతో సంభాషణల ద్వారా ఆయా దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేసే సంకల్పంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా 2026, ఫిబ్రవరి 23న పార్లమెంటరీ మైత్రీ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో 11 మంది సభ్యులు ఉంటారు. మొత్తం 64 దేశాలతో సంబంధాల బలోపేతం కోసం ఇవి ఏర్పాటయ్యాయి.



తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడేనికి చెందిన చేనేత మహిళ వర్కాల విజయలక్ష్మికి అత్యున్నత ప్రతిభా పురస్కారం దక్కింది. కేంద్ర టెక్స్‌టైల్ మంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా ఆమె 2026, ఫిబ్రవరి 23న దిల్లీలో అందుకున్నారు.



స్వతంత్ర భారతదేశ తొలి, ఏకైక భారతీయ గవర్నర్ జనరల్ చక్రవర్తి రాజగోపాలాచారి విగ్రహాన్ని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్ము 2026, ఫిబ్రవరి 23న ఆవిష్కరించారు. అశోక మండపం దగ్గర గ్రాండ్ ఓపెన్ మెట్ల వద్ద ఉన్న బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుట్యెన్స్ విగ్రహాన్ని తొలగించి, ఆ స్థానంలో దీన్ని ఏర్పాటు చేశారు.

భారత్, పశ్చిమాసియా, దాని చుట్టూ ఉన్న దేశాలతో కలిసి త్వరలో షడ్భుజి కూటమి ఏర్పాటు చేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. ఇందులో భారత్, అరబ్, ఆఫ్రికా, ఆసియా దేశాలతోపాటు మధ్యధరా దేశాలు (గ్రీస్, సైప్రస్) ఉంటాయని ప్రకటించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఆంటోని లెవోయిజర్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన ఫ్రెంచ్ దేశానికి చెందిన ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త. లెవోయిజర్ దహన చర్యల గురించి అధ్యయనం చేశారు. మూలకానికి నిర్వచనం ఇచ్చారు. ద్రవ్యనిత్యత్వ నియమాన్ని ప్రతిపాదించారు. దహన, శ్వాసక్రియకు సహకరించే వాయువు పాత్రను కనుక్కుని, దానికి ఆక్సిజన్ అని పేరు పెట్టారు. హైడ్రోజన్, సల్ఫర్‌ను మూలకాలుగా గుర్తించారు. మొదటి సమగ్ర మూలకాల జాబితాను తయారు చేశారు. పదార్థం స్థితి, ఆకారంలో మార్పు వచ్చినా ద్రవ్యరాశిలో ఎలాంటి మార్పు ఉండదని నిరూపించారు. ఈయన్ను ఆధునిక రసాయనశాస్త్ర పితామహుడిగా పేర్కొంటారు. పోటీపరీక్షల కోణంలో లెవోయిజర్ జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం – వృత్తి జీవితం

- పూర్తి పేరు ఆంటోనీ లారెంట్ డి లెవోయిజర్. 1743, ఆగస్టు 26న పారిస్‌లో జన్మించారు.
- 1768లో ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు తాత్కాలిక సభ్యుడిగా నియమితులయ్యారు. అదే ఏడాది ఫెర్మ్ జనరల్ అనే ప్రైవేట్ సంస్థలో వాటాదారు అయ్యారు. ఇది ఫ్రెంచ్ రాచరికం కోసం రైతుల వద్ద నుంచి పన్నులు వసూలు చేసే సంస్థ.


చివరగా

1789లో రాచరిక, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో 'ఫ్రెంచ్ విప్లవం' ప్రారంభమైంది. 1792లో ఫ్రాన్స్ గణతంత్ర రాజ్యంగా మారాక రాజుసహా అనేకమందిని ఉరితీశారు. లెవోయిజర్ నాడు పెద్ద స్థాయిలో పదవులు నిర్వహించడంతో ఆయనపై విప్లవకారుల్లో వ్యతిరేకత ఉంది. ఆయన భాగస్వామిగా ఉన్న 'ఫెర్మ్ జనరల్ సంస్థ' రైతుల వద్ద నుంచి అక్రమంగా పన్ను వసూలు చేసిందనే నెపంతో 1784, మే 8న ఆయన్ను ఉరి తీశారు. ఆయన మరణించిన కొంతకాలానికి ప్రభుత్వం లెవోయిజర్‌ను నిర్దోషిగా ప్రకటించింది. మార్గదర్శక శాస్త్రవేత్తగా ఆయన ఖ్యాతిని పునరుద్ధరించింది.

లెవోయిజర్ చేసిన ముఖ్యమైన పరిశోధనలు - ఆవిష్కరణలు, ఆయన జీవిత విశేషాలతోపాటు ఎస్ఎస్‌సీ సీజీఎల్ తదితర పోటీపరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - పర్యావరణ సమస్యలు

వ్యర్థ నిర్వహణ - తాజా అంశాలు



అత్యంత వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం అధికమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో వ్యర్థ నిర్వహణ కోసం కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తున్నా విడుదలవుతున్న వ్యర్థాలతో పోలిస్తే వాటి నిర్వహణ అంతంతే. దీనికోసం భారత్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, రూపొందించిన చట్టాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన అవసరం.

భారత్‌లో ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలు అంటే తిరిగి వినియోగించడానికి లేదా వేరొక వస్తువులు తయారు చేయడానికి రిఫర్బిష్‌మెంట్ లేదా రిపేరింగ్ ప్రక్రియలకు వినియోగించని వ్యర్థాలను ఈ-వేస్ట్‌గా పరిగణిస్తారు.

- గ్లోబల్ ఈ-వేస్ట్ మానిటర్ 2024 ప్రకారం భారతదేశం మూడో అతిపెద్ద ఈ-వేస్ట్ ఉత్పత్తిదారుగా నిలిచింది. చైనా, అమెరికా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశం మురుగునీటి నిర్వహణను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది.

ఈ-వేస్ట్ వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ, వేస్ట్ టు వెల్త్, భారతదేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ మొదలైన అంశాలతోపాటు పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Manager Jobs

State Bank of India (SBI) has released a notification for the recruitment of various Specialist Cadre Officer (SCO) posts. The total no. of posts is 116. The application fee is Rs.750. Eligible candidates can apply online before 15 March 2026.

Jobs In SAMEER

Society for Applied Microwave Electronics Engineering and Research (SAMEER), Kolkata, is conducting walk-in interviews for the recruitment of Project Technical Assistant posts. The total no.of posts is 29. The interview dates are 9 and 10 March 2026.

Junior Engineer Posts

Hindustan Urvarak Rasayan Limited (HURL) is inviting applications for the filling of Junior Engineer Assistant, Officer, and Assistant Manager posts in various departments. The total no.of posts is 40. The last date for receipt of online applications is 3 March 2026.

Did You Apply..?

Today (February 25) is the last date for the following Jobs

☛ 515 Engineering Executive Trainee posts in NTPC.
Eligibility: Bachelor's degree.

☛ 18 posts in Hindustan Copper Limited.
Eligibility: 10th, Diploma, ITI, or Graduation.

☛ 22 Assistant Professor jobs at ABV-IIITM.
Eligibility: Ph.D.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Error Detection

Directions (Q.s.1 - 30): *In the following question, a sentence is divided into four parts and one of those fragments may have errors. Find out which part of the sentence has an error and select the appropriate option. If a sentence is free from error, select 'No Error' as your answer.*

1. The manager spoke (A)/ very polite (B)/ to the customers (C)/ during the meeting. (D)/ No error (E)
2. She completed the task (A)/ more quicker (B)/ than anyone else (C)/ in the entire team. (D)/ No error (E)
3. The results of the examination (A)/ were extremely disappointing (B)/ for the students who (C)/ had worked hardly for months. (D)/ No error (E)
4. He is one of the (A)/ most smartest employees (B)/ in the organization (C)/ and deserves promotion. (D)/ No error (E)
5. The officer handled the situation (A)/ very calm (B)/ despite the pressure (C)/ from senior management. (D)/ No error (E)
6. This problem is (A)/ comparatively easier (B)/ than the one (C)/ we solved yesterday. (D)/ No error (E)
7. The teacher explained the concept (A)/ so clear (B)/ that every student (C)/ understood it immediately. (D)/ No error (E)
8. He performed (A)/ worse than (B)/ any player (C)/ in the opposing team. (D)/ No error (E)
9. The company is (A)/ much more stronger (B)/ financially now (C)/ than it was last year. (D)/ No error (E)
10. She sings (A)/ very beautiful (B)/ and has won many awards (C)/ for her performances. (D)/ No error (E)
11. The train moved (A)/ more slowly (B)/ than usual (C)/ because of the dense fog. (D)/ No error (E)
12. This is the (A)/ most unique opportunity (B)/ we have ever received (C)/ in our career. (D)/ No error (E)
13. The employee responded (A)/ very rude (B)/ when the customer (C)/ asked for clarification. (D)/ No error (E)
14. He is (A)/ senior than (B)/ me in experience (C)/ and position. (D)/ No error (E)
15. The presentation was (A)/ too much lengthy (B)/ to keep the audience (C)/ interested till the end. (D)/ No error (E)
16. The newly appointed manager (A)/ works more efficiently (B)/ than any manager (C)/ in the department. (D)/ No error (E)
17. She was too tired (A)/ that she could not (B)/ complete the assignment (C)/ before the deadline. (D)/ No error (E)
18. The proposal seemed (A)/ more preferable (B)/ than the previous one (C)/ according to the committee. (D)/ No error (E)
19. He reacted (A)/ very angrily (B)/ than I expected (C)/ in that situation. (D)/ No error (E)
20. The instructions were (A)/ enough clear (B)/ for everyone (C)/ to understand easily. (D)/ No error (E)
21. The officer spoke (A)/ so softly (B)/ that he was (C)/ hardly heard by anyone. (D)/ No error (E)
22. She completed the project (A)/ more earlier (B)/ than the deadline (C)/ given by the supervisor. (D)/ No error (E)
23. The company performed (A)/ remarkable good (B)/ during the last quarter (C)/ despite economic challenges. (D)/ No error (E)
24. He is not only (A)/ intelligent but also (B)/ works very efficiently (C)/ under pressure. (D)/ No error (E)
25. The weather today is (A)/ more better (B)/ than it was (C)/ yesterday evening. (D)/ No error (E)
26. She was (A)/ nearly exhausted (B)/ after working (C)/ continuous for ten hours. (D)/ No error (E)
27. The senior officer (A)/ behaved more politely (B)/ with the staff (C)/ than his junior colleagues. (D)/ No error (E)
28. He arrived (A)/ lately (B)/ to the meeting (C)/ due to heavy traffic. (D)/ No error (E)
29. The lecture was (A)/ so much interesting (B)/ that students remained (C)/ attentive throughout. (D)/ No error (E)
30. No other employee (A)/ in the organization is (B)/ as dedicated like (C)/ her to the company's goals. (D)/ No error (E)

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కొలువుల కోటకు డేటా బాట

కార్పొరేట్ సంస్థల నుంచీ కిరాణా దుకాణాల యాజమాన్యాల వరకూ తీసుకున్న నిర్ణయాల్లో డేటా సైన్స్ ముఖ్యపాత్ర వహిస్తోంది. ప్రస్తుత వ్యాపార ప్రపంచానికి కొత్త జవ సత్వాలు అందిస్తోంది. సంస్థల భవిష్యత్తును నిర్ణయించే కీలక అస్త్రంగా డేటా సైన్స్ రూపొందడంతో ఈ విభాగంలో నైపుణ్యం ఉన్న వారికి కొత్త అవకాశాలు తలుపు తడుతున్నాయి.



ఆధునిక వర్తక ప్రపంచం తీసుకుంటోన్న ప్రతి నిర్ణయంలోనూ డేటా ప్రాణవాయువుగా నిలుస్తోంది. ఉదయం అలారం మోగినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ మనం చేసే ప్రతి పనీ డేటాగా మారుతోంది. ఆ డేటాను అర్థం చేసుకుని, దానితో సరైన నిర్ణయాలు తీసుకునే శక్తినే ఈ రోజు ప్రపంచం డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్‌గా పిలుస్తోంది.

చాలా మంది విద్యార్థులు డేటా సైన్స్ అనగానే క్లిష్టమైన గణితం, భారీ కోడింగ్, పెద్ద గ్రాఫ్‌లను ఊహిస్తారు. కానీ పరిశ్రమ దృష్టిలో డేటా సైన్స్ టెక్నాలజీ కాదు, నిర్ణయ విధానం. ఒక ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లో ఏ కస్టమర్ మళ్లీ కొనుగోలు చేసే అవకాశం ఉంది? ఆ ఫ్యాక్టరీలో ఏ యంత్రం త్వరలో పనిచేయకుండా ఆగిపోతుంది? ఒక స్మార్ట్ సిటీలో వచ్చే నెల ఏ ప్రాంతంలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది? ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేది డేటానే. ఇది లేకుండా వ్యాపారం లేదా ఏ పరిశ్రమ అయినా ప్రస్తుత పరిస్థితుల్లో ముందుకు సాగడం అసాధ్యం.

ఎలాగంటే


ఉదాహరణకు ఒక ఫుడ్ డెలివరీ యాప్ తీసుకుందాం. మీరు దాన్ని ఓపెన్ చేసిన వెంటనే 'ఈ రోజు మీకు ఇష్టమైన భోజనంపై 20 శాతం డిస్కౌంట్' అంటూ ఒక ఆఫర్ చూపిస్తుంది. ఇది యాదృచ్ఛికంగా వచ్చింది కాదు. మీ గత ఆర్డర్లు, మీరు ఆర్డర్ చేసే సమయం, ఆ రోజు డిమాండ్.. అన్నీ కలిపి ఒక నిర్ణయం తీసుకోవడంతో మీకు కనిపించింది ఒక చిన్న ఆఫర్ మాత్రమే. కానీ దాని వెనుక పనిచేసింది డేటా ఆధారిత ఆలోచన. ఇదే డేటా సైన్స్ అసలు అర్థం. ఇక్కడ సంఖ్యలను అర్థం చేసుకోవడం ముఖ్యం. సమాచారం కంటే నిర్ణయం ప్రధానం.

కథలా వివరించాలి

తరగతి గదిలో డేటా అంటే టేబుళ్లు, చార్టులు, పరీక్షలు. కానీ ఉద్యోగ జీవితంలో అదే డేటా ఒక నిర్ణయ సాధనం అవుతుంది. అక్కడ ప్రశ్న 'ఈ డేటా ఏమి చెబుతోంది?' కాదు, ఈ డేటా ఆధారంగా మనం ఏ నిర్ణయం తీసుకోవాలి? అనే దానికే ప్రాధాన్యం ఉంటుంది. ఉదాహరణకు ఒక సూపర్ మార్కెట్ యజమాని నిన్నటి అమ్మకాల రిపోర్ట్ చూసి సంతృప్తి పడడు. రేపు ఏ వస్తువులు ఎక్కువగా స్టాక్‌లో పెట్టాలో నిర్ణయిస్తాడు. అదే డేటా అనలిటిక్స్ అసలు విలువ. ఇక్కడే చాలా మంది విద్యార్థులు వెనకబడతారు. డేటాను చదవగలుగుతారు, కానీ దాన్ని ఒక కథలా వివరించలేరు. అందుకే నేటి పరిశ్రమకు అవసరమయ్యేది డేటా స్టోరీ టెల్లర్స్ - సంఖ్యల వెనుక అర్థాన్ని చెప్పగలవారు.

గణితంలో పట్టుండాల్సిందేనా?

ఇది చాలా సాధారణమైన భయం. గణితం అవసరం. కానీ అన్ని డేటా ఉద్యోగాలూ లోతైన గణిత పరిజ్ఞానాన్ని కోరుకోవు. ఎక్కువగా పరిశ్రమలో అవసరమయ్యేది సమస్యను అర్థం చేసుకునే సామర్థ్యం, సరైన ప్రశ్నలు అడగటం, డేటా నాణ్యతను గుర్తించడం. గణితం ఒక సాధనం మాత్రమే. ఆలోచనా విధానం అసలు మూలం. ఉద్యోగ సంస్థలు నియామకాల్లో.. ఈ వ్యక్తి డేటాలోని అర్థాన్ని గ్రహించగలడా? వ్యాపార సమస్యను డేటా సమస్యగా మార్చగలడా? అనేవి పరిశీలిస్తాయి.



అనేక దశల ప్రయాణం

డేటా సైన్స్ నేర్చుకోవడం ఒక్క కోర్సుతో పూర్తయ్యేది కాదు. నిరంతర ప్రయాణం లాంటిది. ఎప్పటికీ నేర్చుకుంటూనే ఉండాలి. మొదట డేటా అంటే ఏమిటి, అది ఎక్కడి నుంచి వస్తుంది అనే అవగాహన రావాలి. తర్వాత ఎక్సెల్, ఎస్‌క్యూఎల్, గణాంకాలు(స్టాటిస్టిక్స్) పైన పట్టు పెరగాలి. ఆ తర్వాత విజువలైజేషన్ (టబ్ల్యు, పవర్ బీఐ) ద్వారా డేటాను అర్థం చేసుకునే నైపుణ్యం రావాలి. చివరకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్పుల ద్వారా నిజ జీవిత సమస్యలను డేటాతో పరిష్కరించే అనుభవం పొందాలి. డేటా సైన్స్ సంబంధిత కోర్సుల అభ్యాసానికి కోర్స్‌ఎరా, యుడేమీ, లింక్డ్‌ఇన్ లెర్నింగ్ లాంటి ప్లాట్‌ఫామ్‌లు, యూట్యూబ్ వీడియోలను ఉపయోగించవచ్చు. ఒక మంచి డేటా అనలిస్ట్ టూల్స్ వల్ల కాదు; అనుభవం, ఆలోచనలతో తయారవుతారు. టూల్స్ మారతాయి. సాఫ్ట్‌వేర్లు అప్‌డేట్ అవుతాయి. కానీ డేటాతో ఆలోచించే విధానం మాత్రం నిలకడగా ఉంటుంది. ఆటోమేటెడ్ నివేదికలు సంఖ్యలను చూపించగలవు. కానీ వాటికి అర్థం చెప్పే బాధ్యత ఇప్పటికీ మనిషిదే.

ఎవరికి అవకాశం?

డేటా సైన్స్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకే పరిమితం కాదు. ఫైనాన్స్‌లో రిస్క్ అనాలిసిస్, మార్కెటింగ్‌లో కస్టమర్ ప్రవర్తన విశ్లేషణ, మాన్యుఫ్యాక్చరింగ్‌లో నాణ్యత విశ్లేషణ, హెల్త్‌కేర్ రంగంలో వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు డేటా ఆధారిత విశ్లేషణ.. ఇలా ప్రతి రంగంలోనూ డేటా ఉంటుంది. అందుకే బీఎస్సీ, ఎంబీఏ ఇంజినీరింగ్ లేదా డిప్లొమా.. ఏ నేపథ్యం అయినా సరే, ఆ రంగంలో డేటాను ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకుంటే అవకాశాలు తెరుచుకుంటాయి.

డేటా సైన్స్ ఉద్యోగాలను తొలగించలేదు. అవి చేసే విధానాన్ని మార్చింది. అకౌంటెంట్లు - ఫైనాన్షియల్ అనలిస్టులుగా, మార్కెటర్లు - డేటా డ్రివెన్ మార్కెటర్లుగా, ఇంజినీర్లు - ప్రాసెస్ అనలిస్టులుగా మారుతున్నారు. డిగ్రీ పునాది ఇస్తుంది. డేటా నైపుణ్యాలు దిశను చూపిస్తాయి. ఆలోచనా విధానం దీర్ఘకాలిక విజయాన్ని అందిస్తుంది.

ఈ యుగంలో బంగారం, చమురు కంటే.. డేటానే అసలైన సంపద. దాన్ని సరిగ్గా సేకరించి, విశ్లేషించి, ప్రభావవంతంగా ఉపయోగించగలిగితేనే భవిష్యత్తును మలచుకోవచ్చు. డేటా కొత్త చమురు అయితే, అనలిటిక్స్ దాన్ని శుద్ధి చేసే రిఫైనరీ, ఏఐ దాన్ని శక్తిగా మార్చే ఇంజిన్. ఈ మూడూ కలిసి పనిచేసినప్పుడే నిజమైన విలువ సృష్టి జరుగుతుంది. ప్రస్తుత డేటా యుగంలో భవిష్యత్తుకు సిద్ధమైన విద్యార్థులు రోజువారీ అలవాట్లలో భాగంగా.. చుట్టూ కనిపించేదాన్ని గమనించాలి, అనుమానాన్ని ప్రశ్నగా మార్చాలి, నేర్చుకోవడాన్ని ఎప్పటికీ ఆపకూడదు. అదే నిజమైన విద్య. అదే నిజమైన డేటా ప్రయాణం.



డా.శ్రీనివాసరావు పేర్ల
డైరెక్టర్- టెక్నికల్ ట్రెయినింగ్
సైయంట్

కన్సల్టెంట్లు

రైట్స్ లిమిటెడ్, గురుగ్రామ్.. ప్రాజెక్ట్ లీడర్/టీమ్ లీడర్ హోదాలో ఇండివిడ్యువల్ కన్సల్టెంట్‌గా బెంగళూరులో సేవలందించడానికి దరఖాస్తులు కోరుతోంది.

❖ ఇండివిడ్యువల్ కన్సల్టెంట్(ప్రాజెక్ట్ లీడర్ / టీమ్ లీడర్): 01

❖ ఇండివిడ్యువల్ కన్సల్టెంట్(సేఫ్టీ, హెల్త్, ఎన్విరాన్‌మెంట్): 02

విద్యార్హత: సివిల్ ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేషన్. ఈ రంగంలో కనీసం 25 ఏళ్ల వృత్తిపరమైన అనుభవం ఉండాలి. ఇందులో కనీసం 10 ఏళ్ల అనుభవం భారీ మౌలిక సదుపాయాలు ప్రాజెక్టుల నిర్మాణ పర్యవేక్షణలో ఉండాలి.

వయసు: 63 ఏళ్లు మించకూడదు

వేతన శ్రేణి: నెలకు రూ.80,000 - 3,00,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 09, 2026.

ఎంపిక: అర్హతలు, అనుభవంతో.

వెబ్‌సైట్: https://www.rites.com/Career

డేటా ఎంట్రీ ఆపరేటర్లు

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని మినీరత్న సంస్థ బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్.. భారత ఎన్నికల సంఘం కార్యాలయంలో పనిచేయడానికి ఒప్పంద ప్రాతిపదికన సిబ్బందిని కోరుతోంది.

❖ డేటా ఎంట్రీ ఆపరేటర్: 10 పోస్టులు.

అర్హత: ఏదైనా డిగ్రీ. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఎంఎస్-ఎక్సెల్‌లో ప్రావీణ్యం ఉండాలి. ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి కనీసం 35 పదాల వేగం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.24,000.

ఎంపిక: టైపింగ్ స్కిల్ టెస్టు, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5, 2026 **వెబ్‌సైట్:** https://www.becil.com/Vacancies

ముంబయి పోర్ట్ అథారిటీలో

ముంబయి పోర్ట్ అథారిటీ.. ఒప్పంద ప్రాతిపదికన హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

❖ హిందీ ట్రాన్స్‌లేటర్ గ్రేడ్-II: 04

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ (హిందీ, ఇంగ్లిష్ చదివి ఉండాలి)తో పాటు ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

వేతన శ్రేణి: నెలకు రూ.41,800 - రూ.1,17,600

ఎంపిక: రాత పరీక్షతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.03.2026.

వెబ్‌సైట్: https://mumbaiport.gov.in/show_content.php?lang=1&level=2&ls_id=960&lid=727

త్వరలో ఇంటర్మీడియట్ పూర్తవుతుంది. తర్వాత యానిమేషన్ వైపు వెళ్లాలనుకుంటున్నా. ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి, ఏ కోర్సులు నేర్చుకోవాలి? -అర్జున్

యానిమేషన్‌లో ఏ కోర్సులు చేయాలి?

■ మీరు యానిమేషన్‌లో ఆసక్తి ఉంటే ఈ రంగంలోకి రావాలనుకోవడం మంచి నిర్ణయం. సినిమా, టెలివిజన్, గేమింగ్, యూట్యూబ్, అడ్వర్టైజింగ్, ఈ-లెర్నింగ్ వంటి అనేక రంగాల్లో యానిమేషన్‌కు డిమాండ్ ఉంది. సృజనాత్మకత ఉన్న విద్యార్థులకు ఇదో మంచి కెరియర్. ఈ రంగంలో అనేక రకాల ఉద్యోగావకాశాలున్నాయి. ముఖ్యంగా 2డీ యానిమేటర్, 3డీ యానిమేటర్, 2డీ గ్రాఫిక్ డిజైనర్, వీఎఫ్‌ఎక్స్ ఆర్టిస్ట్, వీడియో ఎడిటర్, గేమ్ డిజైనర్, మోషన్ గ్రాఫిక్స్ డిజైనర్ లాంటి ఉద్యోగాలు ఉంటాయి.



సినిమా, టీవీ రంగంలో పనిచేయాలనుకునే వాళ్లు వీఎఫ్‌ఎక్స్, త్రీడీ యానిమేషన్ వైపు వెళ్లవచ్చు. యూట్యూబ్, సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్ రంగాల్లో మోషన్ గ్రాఫిక్స్, వీడియో ఎడిటింగ్‌కు చాలా డిమాండ్ ఉంది. గేమింగ్ రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది కాబట్టి గేమ్ డిజైన్ కూడా ఒక మంచి ఎంపిక.

ఇంటర్ తర్వాత మీరు డిప్లొమా ఇన్ యానిమేషన్, బీఎస్సీ ఇన్ యానిమేషన్, బీఎఫ్‌ఏ (యానిమేషన్), మల్టీమీడియా కోర్సులు చేయవచ్చు. వీటిలో డ్రాయింగ్, క్యారెక్టర్ డిజైన్, స్టోరీబోర్డింగ్, టూడీ, త్రీడీ యానిమేషన్, వీఎఫ్‌ఎక్స్ వీడియో ఎడిటింగ్ వంటి విషయాలు నేర్పిస్తారు. అడోబ్ ఫొటో షాప్, ఇలస్ట్రేటర్, ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, ఆటో డెస్క్, మాయా, బ్లెండర్ వంటి టూల్స్ నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో యానిమేషన్ నేర్పించే శిక్షణ కేంద్రాలు చాలా ఉన్నాయి. వీటితో పాటు కొన్ని డిగ్రీ కాలేజీలూ యానిమేషన్ కోర్సులు అందిస్తున్నాయి. నాణ్యమైన ఫ్యాకల్టీ, ల్యాబ్ సౌకర్యాలు, ప్లేస్‌మెంట్ సపోర్ట్, విశ్వసనీయత ఉన్న సంస్థను ఎంచుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. కొంత వృత్తి అనుభవం గడించాక యూట్యూబ్, ఫ్రీలాన్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అంతర్జాతీయ ప్రాజెక్టులు పొందవచ్చు. యానిమేషన్ రంగంలో సృజనాత్మకత ముఖ్యం. డ్రాయింగ్, డిజైన్, కంప్యూటర్ పనులపై ఆసక్తి కలిగి ఉంటే ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుంది. సరైన కోర్సును ఎంపిక చేసుకొని, సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు నేర్చుకుని, మంచి పోర్ట్‌ఫోలియో తయారు చేసుకుంటే ఈ రంగంలో విజయం సాధించవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎస్‌బీఐలో మేనేజర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) వివిధ స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్: 12
- డిప్యూటీ మేనేజర్ (ఆడిట్): 104

అర్హతలు: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 21 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు. మిగిలినవారికి రూ.750.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-03-2026.

వెబ్‌సైట్: https://sbi.bank.in/web/careers/recruitment-results-archive

రైట్స్ లిమిటెడ్‌లో

రైట్స్ లిమిటెడ్, గురుగ్రామ్.. ప్రొఫెషనల్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- ప్రొఫెషనల్స్: 03 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్)తో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 40 ఏళ్లు మించకూడదు.

వేతన శ్రేణి: నెలకు రూ.40,000 - 1,40,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 12, 2026.

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 17, 18.

వెబ్‌సైట్: https://www.rites.com/Career

అంతరిక్ష కేంద్రంలో ఇంటర్న్‌షిప్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రం సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల కోసం వివిధ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు ప్రకటించింది.

అర్హత: బీఈ/ బీటెక్ లేదా ఎంఈ/ ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, బీఎస్-ఎంఎస్‌లలో ఏదైనా కోర్సు కనీసం 60 శాతం మార్కులు లేదా 6.32 సీజీపీఏ కావాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 16.03.2026.

వెబ్‌సైట్: https://www.vssc.gov.in/STUDENTS/

ఈఎస్ఐసీ ఇండోర్‌లో

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ), ఇండోర్ ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రొఫెసర్: 09
- అసోసియేట్ ప్రొఫెసర్: 18
- అసిస్టెంట్ ప్రొఫెసర్: 27
- సీనియర్ రెసిడెంట్: 47

విభాగాలు: అనాటమీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, ఫార్మకాలజీ, ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్. మొదలైనవి.

అర్హత: ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

మూల వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,23,100. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.78,800. అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్‌కు రూ.67,700.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

దరఖాస్తు: మార్చి రెండో తేదీ లోపు ఈమెయిల్ ద్వారా dean-indore.mp@esic.gov.inకు పంపాలి. **దరఖాస్తు ఫీజు:** మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు. మిగిలిన వారికి రూ.500.

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 9, 10, 11.

వేదిక: డీన్ కార్యాలయం, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, నందానగర్, ఇండోర్, మధ్యప్రదేశ్ - 452011.

వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

ఆరోగ్య పరిరక్షణ, జీవశాస్త్రాల రంగంలో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఈ విభాగాల్లోనూ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీ) విస్తరిస్తున్నాయి. ఏటా విస్తరణ, భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం దృష్ట్యా 2030 నాటికి కొత్తగా 4.2 లక్షల ఉద్యోగాలు వస్తాయని నిపుణుల అంచనా. అందువల్ల హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో యూజీ, పీజీ కోర్సులతో మేటి అవకాశాలు దక్కించుకోవచ్చు.



ఆసక్తి ఉంటే ఎదిగే రంగం

ప్రస్తుతం ఆరోగ్య పరిరక్షణ, జీవశాస్త్రాల రంగాల్లో దేశవ్యాప్తంగా సుమారు 150 జీసీసీలు ఉన్నాయి. ఇవి ఎక్కువగా బెంగళూరు, హైదరాబాదుల్లో నెలకొల్పారు. ప్రస్తుతం వీటిలో 3 లక్షల మంది నిపుణులు పనిచేస్తున్నారు.

జీసీసీలు ఏం చేస్తాయి?

దేశంలోని జీసీసీలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పనిచేస్తున్నాయి. కృత్రిమ మేధ ఆధారిత ఔషధాల పరిశోధన, క్లినికల్ ట్రయల్స్, డిజిటల్ హెల్త్ మొదలైన వాటిలో ఇవి నిమగ్నమై ఉన్నాయి. దేశంలోని విభిన్న జీసీసీల్లో పనిచేసే ఉద్యోగుల్లో 15 శాతం మంది ఆరోగ్య పరిరక్షణలోనే ఉన్నారు. దీన్ని బట్టి ఈ తరహా జీసీసీల్లో ఎక్కువగా ఉద్యోగావకాశాలున్నాయని స్పష్టమవుతోంది.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బయో ఆసియా 2026 సదస్సులో హెల్త్‌కేర్ జీసీసీలపై నివేదిక సమర్పించారు. దీని ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ జీసీసీల్లో ఔషధాలకు చెందినవి 30-35 శాతం, జీవశాస్త్రాలవి 20 నుంచి 25 శాతం, వైద్య పరికరాల విభాగంలో 20-25 శాతం ఉన్నాయి. విదేశాలకు చెందిన పలు ఔషధ, జీవశాస్త్ర సంస్థలు భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నందున విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఎంతో మేలు జరుగుతుంది..

ఏ తరహా ఉద్యోగాలు?

ఆరోగ్య పరిరక్షణ జీసీసీల్లో ఐదు విభాగాల్లో ఉద్యోగావకాశాలుంటాయి.

పరిశోధన, ఆవిష్కరణలు (ఆర్అండ్‌డీ): ఇందులో క్లినికల్ ట్రయల్ డేటా సైంటిస్టు, బయోఇన్ఫర్మేటిక్స్ సైంటిస్టులు, డ్రగ్ డెలివరీ ఏఐ (కృత్రిమ మేధ) ఇంజినీర్లు, జినోమ్ డేటా అనలిస్ట్ హోదాలు అందుబాటులో ఉంటున్నాయి.

ఔషధ, వైద్య వ్యవహారాలు (క్లినికల్, మెడికల్ అఫైర్స్): ఔషధపరమైన కార్యకలాపాలు కేంద్రంగా ఉండే ఈ విభాగంలో మెడికల్ రైటర్స్, క్లినికల్ ఆపరేషన్స్ మేనేజర్లు, బయో స్టాటిషియన్స్, క్లినికల్ డేటా మేనేజర్ హోదాల అవసరం ఉంటోంది.

డేటా సైన్స్, ఏఐ స్పెషలిస్టులు: జీవశాస్త్రాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జత చేయడం ద్వారా మానవాళికి మేలు చేసే ఫలితాలు సాధిస్తున్న నేపథ్యంలో ఈ విభాగంలో స్పెషలిస్టులను జీసీసీలు ఆహ్వానిస్తున్నాయి. జీవశాస్త్ర విద్యార్హతలతో పాటు కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న యువతకు మంచి అవకాశాలున్నాయి.

నియంత్రణ, భద్రత (రెగ్యులేటరీ, సేఫ్టీ): ఈ విభాగం ఔషధ నాణ్యతా ప్రమాణాలు, ప్రభుత్వ నియంత్రణ ప్రమాణాల అమలుపై దృష్టి పెడుతుంది. రెగ్యులేటరీ ఇన్ఫర్మేటిక్స్ స్పెషలిస్టులు, క్వాలిటీ అస్యూరెన్స్ స్పెషలిస్టు ఉద్యోగాలుంటాయి.

సాంకేతికపరమైన హోదాలు: ఇంజినీరింగ్‌లో కొన్ని ప్రత్యేక సబ్జెక్టులపై పట్టు ఉండి, వైద్య, ఔషధ రంగాల్లో ఆసక్తి ఉన్న వారికి ఈ విభాగంలో అవకాశాలున్నాయి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, ల్యాబ్ ఆటోమేషన్ స్పెషలిస్టు హోదాలు ఇంజినీరింగ్ విద్యార్హతలున్న వారికి సరిపోతాయి.

ఏయే కోర్సులు?

ఆరోగ్య పరిరక్షణ జీసీసీల్లో ఉద్యోగాలకు పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సైన్స్ ముఖ్యంగా జీవశాస్త్రాల్లో ఆసక్తి ఉన్నవారికి బీఎస్సీ కోర్సులను పలు సంస్థలు అందిస్తున్నాయి. బీఎస్సీలో లైఫ్ సైన్సెస్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ.. ఈ తరహా కోర్సులు చదివినవారికి అవకాశాలుంటాయి.

✦ బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మ్-డీ కోర్సులు చేసినవారు రాణించగలరు.

✦ పలు లైఫ్ సైన్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ చదివినవారు ఉన్నత అవకాశాలు పొందగలరు.

✦ మేనేజీరియల్ పోస్టులు లక్ష్యంగా ఉన్నవారు బీఫార్మసీ తర్వాత ఎంబీఏ ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులు పూర్తిచేస్తే ప్రయోజనం.

✦ మెడికల్ రైటింగ్, మెడికల్ కోడింగ్ లాంటి సర్టిఫికేషన్ కోర్సులతోనూ అవకాశాలు పొందవచ్చు.

✦ ఈ జీసీసీల్లో అత్యున్నత స్థాయి పరిశోధనల్లో రాణించాలనుకున్న వారికి పీహెచ్‌డీతో ఎక్కువ ప్రయోజనం దక్కుతుంది.

ఎలాంటి నైపుణ్యాలు?

సైన్స్ సబ్జెక్టులపై సాధికారతతో పాటు కొన్ని సాంకేతిక నైపుణ్యాలు సాధించాలి.

మౌలిక సైన్స్ సబ్జెక్టులు: బయాలజీ, కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, మెడిసిన్.. మొదలైన వాటిలో ప్రాథమికాంశాలపై లోతైన అవగాహన ఏర్పరచుకోవాలి. వీటిలో విద్యార్హతలు పెంచుకుంటూ, కొత్త విషయాలు తెలుసుకోవాలి.

డేటా, డిజిటల్ నైపుణ్యాలు: ఒకప్పుడు ఔషధ రంగంలో ప్రవేశించాలంటే కేవలం సబ్జెక్టు పరంగా పట్టుంటే సరిపోయేది. కానీ నేడు టెక్నాలజీ అనుసంధానం రీత్యా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్యం ఉండాలి. డేటాలిటరసీ, బయోఇన్ఫర్మేటిక్స్, ఏఐఎంఎల్‌లతో పాటు ల్యాబ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో ఏదైనా ఒకదానిలో పరిజ్ఞానం ఉండాలి.

సాఫ్ట్ స్కిల్స్: ఔషధ తయారీ ప్రక్రియలో నిరంతరం పనిచేసేందుకు ఏకాగ్రత, సహనం ఉండాలి. భద్రతా ప్రమాణాల రీత్యా విధుల నిర్వహణలో రాజీలేని తత్వం ఈ రంగంలో ముందుకెళ్లడానికి దోహదపడుతుంది.

✦ సైంటిస్టులు, క్లినికల్ స్పెషలిస్టులు, మార్కెటింగ్ నిపుణులతో కలిసి పనిచేయగల నైపుణ్యం పెంచుకోవాలి.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

✦ సంక్షిప్త సమాచార విశ్లేషణ, సమస్య పరిష్కార సామర్థ్యాలను ఏర్పరచుకోవాలి. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా నేర్చుకుని, అన్వయించే నైపుణ్యం అవసరం.

భవిష్యత్ అవకాశాలు

ఆరోగ్య పరిరక్షణ జీసీసీలు గతంలో తెర వెనుక పరిమిత పాత్ర పోషించేవి. నేడు మేధాసంపత్తి (ఇంటలెక్చువల్ ప్రాపర్టీ) నుంచి వ్యూహాత్మక ప్రక్రియలను నిర్వహిస్తున్నాయి. ఫలితంగా ఇవి సంస్థలకు విలువైన ఆస్తిగా మారాయి. వీటిలో వివిధ హోదాలలో పనిచేసే ఉద్యోగుల సేవల విలువ పెరిగింది. ఆకర్షణీయ వేతనాలూ అందుతున్నాయి. తక్కువ వ్యవధిలో పదోన్నతులూ పొందుతున్నారు. లైఫ్ సైన్సెస్ డిగ్రీతో జీసీసీల్లో చేరిన ఉద్యోగులు ఐదు-పదేళ్ల అనుభవంతో ప్రాజెక్ట్ మేనేజర్లు, డేటా మేనేజర్లు, డైరెక్టర్ స్థాయికి చేరుకోగలుగుతున్నారు.



- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఐదో ఏట అడుగుపెట్టిన యుద్ధం

- కనుచూపు మేరలో కనిపించని పరిష్కారం
- సైనికపరంగా భారీగా నష్టపోయిన రష్యా, ఉక్రెయిన్

కీవ్, మాస్కో: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మంగళవారం ఐదో ఏట అడుగుపెట్టింది. అయినా కనుచూపు మేరలో పరిష్కారం కనిపించడం లేదు. ఇప్పటికే సైనికపరంగా రెండు దేశాలు భారీగా నష్టపోయాయి. సంధికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో యుద్ధం కొనసాగుతూనే ఉంది. 2022 ఫిబ్రవరి 24 వ తేదీన ఉక్రెయిన్‌పై రష్యా తొలిసారిగా దాడులకు దిగింది.

ఎంత ప్రయత్నించినా తమ దేశాన్ని రష్యా చీల్చలేదని, యుద్ధంలో విజయం సాధించలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం స్పష్టం చేశారు. యుద్ధానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఉక్రెయిన్‌కు మద్దతుగా డజనుకుపైగా దేశాల నేతలు మంగళవారం కీవ్‌కు వచ్చారు. యుద్ధంలో మరణించిన వారికి నివాళులర్పించేందుకు గుమికూడిన వేల మందితో కలిసి వారు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కీవ్‌కు వచ్చిన వారిలో ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తోపాటు ఏడుగురు ప్రధానులు, పలు విదేశాంగ మంత్రులు ఉన్నారు.



ఈయూ నేతలతో జెలెన్‌స్కీ

✦ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిదాకా 20 శాతం ఉక్రెయిన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించిందని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద స్టడీ ఆఫ్ వార్ వెల్లడించింది. అయితే కేవలం 0.79 శాతం భూభాగాన్నే రష్యా ఆక్రమించగలిగిందని మంగళవారం జెలెన్‌స్కీ స్పష్టం చేశారు.

✦ యుద్ధం కారణంగా ఉక్రెయిన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు, నీటి సరఫరాలకు అంతరాయం కలిగింది.

✦ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశంలో పర్యటించాలని కీవ్‌లో జరిగిన యుద్ధ నివాళి కార్యక్రమంలో జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. అప్పుడే యుద్ధం దుష్ఫలితాలు అర్థమవుతాయని అభిప్రాయపడ్డారు.

✦ అమెరికా మధ్యవర్తిత్వంతో 10 రోజుల్లో మళ్లీ చర్చలు ప్రారంభమయ్యే అవకాశముందని జెలెన్‌స్కీ తెలిపారు.

✦ లక్ష్యాలను సాధించే వరకూ దాడులను ఆపేది లేదని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పష్టం చేశారు. నాటోలో ఉక్రెయిన్ చేరకూడదని, సైన్యాన్ని తగ్గించుకోవాల్సిందేనని, తమ భూభాగాలను వదులుకోవాల్సిందేనని పేర్కొన్నారు.

✦ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇంత భారీ స్థాయిలో సైనికులను రష్యా కోల్పోవడం ఇదే ప్రథమం.

✦ యుద్ధం కారణంగా 2 లక్షల మంది రష్యా సైనికులు మరణించారని ఉక్రెయిన్ మీడియా వెల్లడించింది. బీబీసీతో కలిసి రష్యా వార్తా సంస్థ మీడియాజోనా సేకరించిన సమాచారం ప్రకారం.. 2,00,186 మంది సైనికులు మరణించారు. అయితే అటు రష్యాగానీ, ఇటు ఉక్రెయిన్‌గానీ తమ దేశాల్లో మరణాల గురించి కచ్చితమైన సమాచారం ఇవ్వడం లేదు. 6,000 మంది సైనికులు మరణించారని రష్యా ధ్రువీకరించింది.

✦ ఉక్రెయిన్‌కు అత్యవసర విద్యుత్తు సరఫరాను నిలిపేస్తున్నట్లు స్లొవేకియా ప్రకటించింది. రష్యా నుంచి తమ దేశానికి సరఫరా అయ్యే చమురును ఉక్రెయిన్ ఆపడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

డిటోనేటర్ పేల్చి పోలీసు అధికారి హత్య

మాస్కో: రష్యా రాజధాని మాస్కోలో పెట్రోలింగ్ చేస్తున్న వాహనం సమీపంలో డిటోనేటర్‌తో గుర్తు తెలియని వ్యక్తి పేలుడుకు పాల్పడ్డాడు. దుండగుడు తనను తాను పేల్చుకోవడంతో పక్కనే ఉన్న పోలీసు అధికారి మరణించారు. మరో ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి సవ్యోలొవ్స్కీ రైల్వే స్టేషన్‌వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.



అమెరికాలోని ఫిలడెల్ఫియాలో భారీగా కురిసిన మంచు

అమెరికాలో తీవ్ర మంచు తుపాను

నాలుగు రోజుల్లో 10 వేల విమాన సర్వీసుల రద్దు

ఇంటర్నెట్‌డెస్క్‌: అమెరికాలో మంచు తుపాను తీవ్ర రూపం దాల్చింది. ఈశాన్య ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తోంది. దీంతో లక్షల మంది ఇళ్లకే పరిమితమయ్యారు. మంచు తుపాను, బలమైన ఈదురు గాలుల కారణంగా రవాణా సౌకర్యాలు స్తంభించాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాను తీవ్రత దృష్ట్యా తమ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ముందుగానే ప్రకటించాయి. శనివారం నుంచి సోమవారం వరకు 10,000 కంటే ఎక్కువ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానాల ట్రాకింగ్ సర్వీస్ సంస్థ 'ఫ్లైట్‌అవేర్' తెలిపింది. ఇందులో సోమవారమే 5వేల కంటే ఎక్కువ రద్దయ్యాయని పేర్కొంది. పలు రాష్ట్రాల్లో రైలు, బస్ సేవలు కూడా నిలిచిపోయాయి. న్యూయార్క్ నగరంలోని సెంట్రల్ పార్కులో 15 అంగుళాల కంటే ఎక్కువ మంచు కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో రెండు అడుగులకుపైగా మంచు పేరుకుపోయింది. ఈ భారీ హిమపాతం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడింది. దీంతో లక్షలాది ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో అంధకారం అలుముకుంది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారని అధికారులు తెలిపారు.



బర్డ్‌ఫ్లూ కాదు.. కుక్కలకు సంబంధించిన వ్యాధే

థాయ్ పులుల మరణంపై అధికారుల వెల్లడి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఉత్తర ప్రాంతంలోని జూలో 72 పులుల మరణానికి కారణం.. కుక్కలకు సంబంధించిన వ్యాధేనని, బర్డ్‌ఫ్లూ కాదని అధికారులు తెలిపారు. ఈ వైరస్ మనుషులకు సోకుతుందని ఎక్కడా తేలలేదని వివరించారు. ప్రజలు, పర్యాటకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటివరకూ ఎవరిలోనూ ఎటువంటి లక్షణాలు కనిపించలేదని మంగళవారం వారు తెలిపారు. అయితే ఇటీవల ఆ పులుల వద్దకు వెళ్లినవారి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు. జంతువుల నుంచి మనుషులకు ఇన్ఫెక్షన్ సోకినట్లు నిర్ధారణ కాలేదని థాయ్‌లాండ్ ప్రజారోగ్యశాఖ మంత్రి పత్తన ప్రాంఫట్ తెలిపారు.

అమెరికా అధీనంలోకి మూడో చమురు నౌక

వాషింగ్టన్: హిందూ మహాసముద్రంలో మూడో చమురు నౌకను అమెరికా అధీనంలోకి తీసుకుంది. కరేబియన్ సముద్రం నుంచి వస్తున్న ఈ నౌకను వెంబడించి స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం పెంటగాన్ ప్రకటించింది. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా అదుపులోకి తీసుకున్న తర్వాత డజనుకుపైగా చమురు నౌకలు ఆ దేశ తీరం నుంచి వెళ్లాయని, మిగిలి ఉన్న ఒక్క నౌకనే ఇప్పుడు అమెరికా ఆధీనంలోకి తీసుకుందని నౌకల కదలికలను పరిశీలించే 'ట్యాంకర్ ట్రాకర్స్ డాట్ కామ్' తెలిపింది. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలను ధిక్కరిస్తూ కరేబియన్ సముద్రంలో ఈ నౌక తిరుగుతోంది. తప్పించుకునేందుకు ప్రయత్నించింది. కరేబియన్ నుంచి హిందూ మహాసముద్రం వరకు దీని కదలికలను కనిపెడుతూ వచ్చి చివరకు ఆపగలిగాం" అని అమెరికా దక్షిణ కమాండ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. కూక్ దీవులకు 19 లక్షల బ్యారెళ్ల ముడిచమురు నిల్వతో ఈ నౌక ప్రయాణిస్తోంది.

ఐదు ఓటీటీలను బ్లాక్ చేసిన ప్రభుత్వం

దిల్లీ: అసభ్యకర సన్నివేశాలను ప్రసారం చేస్తున్నందుకు కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ మంగళవారం ఐదు ఓటీటీ వేదికల్ని బ్లాక్ చేసింది. మూడ్‌ఎక్స్ వీఐపీ, కోయల్ ప్లేప్రో, డిజి మూవీప్లెక్స్, ఫీల్, జుగ్నూ ఓటీటీలపై ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇవి ఎవరికీ లభ్యం కాకుండా చూడాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రియురాలి అనుచరుడిపై నిఘా పెట్టి.. ఎల్ మెంచోను చుట్టుముట్టి!

- సైనిక ఆపరేషన్ వివరాలు వెల్లడించిన మెక్సికో రక్షణ మంత్రి ట్రెవిల్లా

ఇంటర్నెట్ డెస్క్: మెక్సికోలో మోస్ట్‌వాంటెడ్ నేరగాడు, డ్రగ్ మాఫియా డాన్ ఎల్ మెంచోను.. అతడి ప్రియురాలి అనుచరుడిపై నిఘా పెట్టడం ద్వారా సైన్యం హతమార్చగలిగినట్లు తాజాగా వెల్లడైంది. ఈ మేరకు ఎల్ మెంచో కోసం ఆదివారం చేపట్టిన సైనిక ఆపరేషన్ వివరాలను మెక్సికో రక్షణ మంత్రి రికార్డో ట్రెవిల్లా వెల్లడించారు. "ఎల్ మెంచో ప్రియురాలి నమ్మకస్థుడైన అనుచరుడిపై మా సైన్యం ఇటీవల నిఘా పెట్టింది. ఆ అనుచరుడితో కలిసి ఆమె గత శుక్రవారం ఎల్ మెంచోను హలిస్కోలోని తపాల్పాలో కలిసింది. ఆ కచ్చితమైన లొకేషన్‌ను అమెరికా నిఘా వర్గాలు మాకు షేర్ చేశాయి. మరుసటి రోజు ఎల్ మెంచో ప్రియురాలు అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత మా ప్రత్యేక దళాలు ఆపరేషన్ ప్రణాళికను ఖరారు చేశాయి. డ్రగ్ మాఫియా డాన్ అక్కడే ఉన్నట్లు నిర్ధారించుకున్న తర్వాత ఆదివారం ఆపరేషన్ చేపట్టాయి. ఎల్ మెంచో ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టి నిర్బంధ తనిఖీలు నిర్వహించాయి. అతడు తపాల్పా వదిలి పారిపోకుండా శివారు ప్రాంతాల్లో ఆరు హెలికాప్టర్లు, అదనపు దళాలను మోహరించాయి. సైన్యాన్ని చూడగానే ఎల్ మెంచో అనుచరులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. కాల్పులు కొనసాగుతుండగా ఎల్‌మెంచో తన ఇద్దరు బాడీగార్డులతో కలిసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అండర్‌గ్రౌండ్‌లో నక్కాడు. ఆ ప్రాంతాన్ని గుర్తించిన దళాలు భీకర కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో ఎల్ మెంచో తీవ్రంగా గాయపడ్డాడు. అతణ్ని గగన మార్గంలో ఆసుపత్రికి తరలించేందుకు సైన్యం ప్రయత్నించింది. అయితే, అక్కడకు చేరుకునేలోపే మెంచో మరణించాడు" అని ట్రెవిల్లా వివరించారు.

మళ్లీ భూ కక్ష్యలోకి చైనా రహస్య అంతరిక్ష విమానం

బీజింగ్: అంతరిక్ష ప్రయోగాల్లో చైనా దూకుడు ప్రదర్శిస్తోంది. తాజాగా తమ రహస్య అంతరిక్ష విమానం షెన్‌లాంగ్‌ను మరోసారి భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి లాంగ్‌మార్చ్-2ఎఫ్ రాకెట్ సాయంతో ఈ నెల 7న దీనిని అంతరిక్షంలోకి పంపించినట్లు తెలుస్తోంది. షెన్‌లాంగ్‌ను భూ కక్ష్యలోకి చైనా ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. అయితే దీని యాత్రల సమాచారాన్ని బీజింగ్ ప్రభుత్వం అత్యంత రహస్యంగా ఉంచుతోంది. దీంతో ఈ ప్రయోగాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో అంతరిక్షాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవడం, అందుబాటు వ్యయాల్లో ప్రయోగాలను చేపట్టడం వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు వీలుగా తాము ఈ అంతరిక్ష విమాన ప్రయోగాలు చేపడుతున్నట్లు చైనా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. విమానం నమూనా, మోసుకుపోయే భారం, దాని కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. దీంతో పలు దేశాల అంతరిక్ష నిపుణులు షెన్‌లాంగ్‌ను ట్రాక్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో చైనా షెన్‌లాంగ్ మిషన్లు చేపట్టిన సమయంలో విమానం కనిష్ఠంగా రెండు రోజుల నుంచి గరిష్ఠంగా ఎనిమిది నెలల వరకు కక్ష్యలో ఉన్నట్లు వారు గుర్తించారు. అది కక్ష్యలోకి చిన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టడం వంటివి గమనించినట్లు తెలిపారు. 2020 నుంచి చైనా ఈ తరహా ప్రయోగాలు చేపడుతోంది.

ఆసుపత్రికి ఇమ్రాన్‌ఖాన్.. చికిత్స అనంతరం మళ్లీ జైలుకు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను మంగళవారం ఉదయం జైలు నుంచి పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆయన కుడి కన్నుకు సెంట్రల్ రెటీనల్ వీన్ అక్లూజన్ సమస్య కారణంగా ఆసుపత్రిలో రెండో విడత ఆంటీ-వీఈజీఎఫ్ ఇంజెక్షన్ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స అనంతరం ఇమ్రాన్‌ను మళ్లీ రావల్పిండిలోని అడియాలా జైలుకు తరలించారు. ఆయనకు జనవరి 24న మొదటి విడత చికిత్స జరగగా.. మూడో విడత ఇంజెక్షన్‌ను వచ్చే నెల 24న ఇవ్వనున్నారు. అయితే తాము ప్రభుత్వ ఆసుపత్రి అందించిన వైద్యాన్ని, పరీక్షా నివేదికలను విశ్వసించలేమని ఇమ్రాన్ సోదరి అలీమా ఖానుమ్ ఓ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఇమ్రాన్‌ను ఆసుపత్రికి తరలించినట్లు వార్తల ద్వారానే తెలిసిందన్నారు. వైద్య ప్రక్రియలకు ముందు కుటుంబానికి సమాచారమివ్వాలని డిమాండ్ చేశారు. 2023 నుంచి అవినీతి కేసులో ఇమ్రాన్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

దిల్లీ విమానాశ్రయంలో రూ.5కోట్ల విలువైన వజ్రాలు, బంగారం స్వాధీనం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అమెరికా పాస్‌పోర్ట్ కలిగిన ఒక ప్రయాణికురాలి నుంచి రూ. 5.42 కోట్ల విలువైన లగ్జరీ వస్తువులను, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం అధికారులు తెలిపారు. హాంకాంగ్ నుంచి వస్తోన్న ఆమెను కస్టమ్స్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్వాధీనం చేసుకున్న బ్యాగులో 1.2 కిలోల బంగారం, వజ్రాలు, 10 కిలోల వెండి సామగ్రి, విలాసవంతమైన వాచీలు, 9,084 అమెరికన్ డాలర్లు, 605 యూరోలు, 2540 హాంకాంగ్ డాలర్లు లభించాయి. అనంతరం ప్రయాణికురాలిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.

తండ్రిని కాల్చిచంపిన తనయుడు

- మృతదేహం ముక్కలు చేసి డ్రమ్ములో దాచిపెట్టాడు
- ఎవరికైనా చెబితే అంతు చూస్తానని చెల్లికి హెచ్చరిక



ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని నగరమైన లఖ్‌నవూలో ఓ యువకుడు తండ్రిని తుపాకీతో కాల్చిచంపి, మర్నాడు తానే పోలీస్‌స్టేషనుకు వెళ్లి మిస్సింగ్ కేసు పెట్టిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. మానవేంద్ర సింగ్ (50)కు నగరంలో పాథాలజీ ల్యాబులు, మద్యం దుకాణాల వ్యాపారం ఉంది. ఈయన భార్య తొమ్మిదేళ్ల క్రితం మరణించారు. ఆర్థికంగా ఏ లోటు లేకున్నా కుమారుడిని డాక్టరుగా చూడాలన్నది ఆయన కల. ఇంటర్‌లో బైపీసీ చదివి మంచి మార్కులు తెచ్చుకొన్న కుమారుడు అక్షత్ ప్రతాప్ (19) ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు. నీట్ పరీక్ష రాయాలని తండ్రి అతడిపై తరచూ ఒత్తిడి తెచ్చేవాడు. కుటుంబ వ్యాపారాలు చూసుకుంటే చాలంటూ అక్షత్ తండ్రితో గొడవపడేవాడు. ఈ నెల 20న ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. విచక్షణ కోల్పోయిన అక్షత్ ఇంట్లోని లైసెన్స్‌డ్ తుపాకీతో తండ్రిని కాల్చి చంపాడు. ఆ శబ్దానికి తన గదిలో నుంచి పరుగున వచ్చిన చెల్లెలి (16)ని ఈ విషయం బయట చెబితే అంతు చూస్తానని అక్షత్ బెదిరించి నోరు మూయించాడు. మృతదేహాన్ని మూడో అంతస్తు నుంచి కిందికి తీసుకువచ్చి.. రంపంతో ముక్కలుగా కోసి డ్రమ్ములో కుక్కాడు. కొన్ని శరీర భాగాలను కారులో మారుమూల ప్రాంతానికి తీసుకువెళ్లి విసిరేశాడు. మర్నాడు పోలీసుల వద్దకు వెళ్లి.. దిల్లీకి వెళ్లిన తన తండ్రి జాడ తెలియడం లేదని, ఫోను స్విచ్ఛాఫ్ వస్తోందని మిస్సింగ్ కేసు పెట్టాడు. ఈ క్రమంలో స్థానికులు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు మానవేంద్ర ఇంటిని తనిఖీ చేయగా.. గుట్టంతా బయటపడింది. డ్రమ్ములోని శరీర భాగాలను స్వాధీనం చేసుకొని, అక్షత్‌ను అరెస్టు చేసినట్లు డీసీపీ విక్రాంత్ వీర్ తెలిపారు.

నమో భారత్ రైలులో తొలిరోజే లక్ష దాటిన ప్రయాణికులు

ఈటీవీ భారత్: దిల్లీ- గాజియాబాద్- మేరఠ్ నమో భారత్ కారిడార్ సరికొత్త ఘనత సాధించింది. పూర్తిస్థాయి కార్యకలాపాలు నిర్వహించిన తొలిరోజే రికార్డు స్థాయిలో ప్రయాణికులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం దాదాపు లక్ష మందికి పైగా ఈ రైల్లో ప్రయాణించినట్లు తెలిపారు. 'నమో భారత్ కనెక్ట్ యాప్'లో రైళ్ల కదలికల ప్రత్యక్ష సమాచారం, పార్కింగ్ స్థలం అందుబాటు వివరాలు వంటివి లభిస్తున్నాయి. ఈ-రిక్షాలు, ఆటోలు, ఫీడర్ బస్సులు, అద్దెకు లభ్యమయ్యే సైకిళ్లు/ ద్విచక్ర వాహనాల వివరాలు ఇందులో ఉంటాయి. సమీకృత పట్టణాల మధ్య వేగవంతమైన ప్రయాణం కోసం నమో భారత్ ప్రాంతీయ శీఘ్ర రవాణా వ్యవస్థను కేంద్రం తీసుకొచ్చింది. గరిష్ఠంగా గంటకు 180 కి.మీ. వేగంతో వెళ్లగలిగేలా సెమీ హైస్పీడ్ రైళ్లను రూపొందించగా, ప్రస్తుతం సగటున 90 కి.మీ. వేగంతో నడిపిస్తున్నారు.

సూర్యునిపై నిరంతర నిఘాకు త్రీడీ నమూనా

- తొలిసారిగా ఆవిష్కరించిన ఐఐటీ-కాన్పుర్

దిల్లీ: సూర్యగోళంలో సంభవిస్తున్న పరిణామాల పరిశీలనకు ఐఐటీ- కాన్పుర్‌కు చెందిన పరిశోధకులు ప్రపంచంలో మొట్టమొదటిసారిగా డేటా ఆధారిత త్రీడీ నమూనాను రూపొందించారు. ఈ నమూనా ఖగోళ వాతావరణ అధ్యయనానికి ఎంతో కీలకం కానుంది. సూర్యునిపై నిరంతరం సౌర తుపానుల వంటి పరిణామాలు సంభవిస్తూనే ఉంటాయి. ఈ పరిణామాలు కొన్నిసార్లు తీవ్రంగా, మరికొన్నిసార్లు తేలికగా ఒక నిరంతర వృత్తంలా సాగుతుంటాయి. 11 సంవత్సరాలు సాగే ఈ సౌర వలయంలో అత్యధిక పరిణామాలు సంభవించే కాలాన్ని మ్యాగ్జిమా అని, అత్యల్ప కార్యకలాపాల కాలాన్ని మినిమా అని పిలుస్తారు. సూర్యుని ఉపరితలంపై సంభవించే తుపానుల కారణంగా విద్యుదావేశం కలిగిన రేణువులు, విద్యుదయస్కాంత క్షేత్రాలు సౌర వ్యవస్థలోకి భారీ స్థాయిలో విడుదల అవుతుంటాయి. ఖగోళ రేణువులు అధికసంఖ్యలో భూ వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు ఉపగ్రహ ఆధారిత సేవలకు ఆటంకం కలగడంతోపాటు కమ్యూనికేషన్ల వ్యవస్థకు అంతరాయం కలగడం వంటి పరిణామాలు సంభవించి ఆధునిక సామాజిక జీవనాన్ని స్తంభింపజేస్తాయి. తాము అభివృద్ధి పరిచిన త్రీడీ నమూనాకు కనీసం గత 11 సంవత్సరాల సౌర సమాచారాన్ని అందిస్తే అది రానున్న ఐదేళ్లలో సూర్యగోళంపై ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో తెలియజేస్తుంది అని ఐఐటీ - కాన్పుర్‌కు చెందిన భౌతిక శాస్త్ర శాస్త్రవేత్తలు గోపాల్ హజ్రా, సౌమ్యదీప్ చటర్జీలు పేర్కొన్నారు. సౌర తుపానులకు, సౌర విస్ఫోటాలకు కారణమయ్యే సన్‌స్పాట్ కార్యకలాపాలను నిరంతరం అధ్యయనం చేసేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పరిశోధన సారాంశ నివేదికను 'ద ఆస్ట్రో ఫిజికల్ జర్నల్ లెటర్స్' ప్రచురించింది.

రక్తనాళాల పూడిక తక్కువగానే ఉన్నా మహిళలకు గుండెపోటు ముప్పు

దిల్లీ: మహిళల రక్తనాళాల్లో తక్కువ మొత్తంలో పూడిక చోటు చేసుకున్నా గుండెపోటుకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుందని సరికొత్త అధ్యయనం హెచ్చరిస్తోంది. సాధారణంగా మహిళల్లో రక్తనాళాల పూడిక పరిమాణం పురుషుల కన్నా తక్కువగా ఉంటుంది. కాబట్టి మహిళల్లో గుండెపోటుకు ఆస్కారం ఉండబోదని చెప్పడానికి వీల్లేదని తమ పరిశోధన ఫలితాలు వెల్లడిస్తున్నట్టు హార్వర్డ్ మెడికల్ స్కూల్ రేడియాలజీ విభాగానికి చెందిన పరిశోధకుడు బోరెక్ ఫోల్డీనా తెలిపారు. గుండెకు రక్తాన్ని మోసుకెళ్లే రక్తనాళాలు పురుషులతో పోలిస్తే మహిళల్లో సన్నగా ఉంటాయి. అందుకే వాటిలో తేలికపాటి పూడిక సంభవించినా దాని పరిణామం తీవ్రంగా ఉంటుందని ఫోల్డీనా తెలియజేశారు. ఆయన నేతృత్వంలో జరిగిన పరిశోధన నివేదిక 'సర్క్యులేషన్ : కార్డియోవాస్కులార్ ఇమేజింగ్ జర్నల్'లో ప్రచురితమైంది. 4,267 మంది మహిళా రోగులపై ఈ అధ్యయనం నిర్వహించారు. మహిళలతో పోలిస్తే పురుషుల్లో పూడిక బాగా పెరిగిన దశలోనే గుండెపోటు సంభవిస్తున్నట్టు గుర్తించారు.

అరెస్టయిన 11 గంటల్లోనే బెయిల్

- ఎప్‌స్టీన్ ఫైళ్ల కేసులో విడుదలైన మాండెల్సన్

లండన్: ఎప్‌స్టీన్‌తో సంబంధాలు నెరపిన కేసులో అరెస్టయిన బ్రిటన్ ప్రధాని సన్నిహితుడు, మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్ మంగళవారం బెయిల్‌పై విడుదలయ్యారు. అమెరికాలో బ్రిటన్ రాయబారిగా గతంలో ఆయన పనిచేశారు. ఎప్‌స్టీన్‌కు ప్రభుత్వ కీలక సమాచారాన్ని చేరవేశారనే ఆరోపణలతో 72 ఏళ్ల మాండెల్సన్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్‌చేయగా, 11 గంటల్లోనే బెయిల్‌పై ఆయన బయటికొచ్చారు. అయితే, పీటర్ మాండెల్సన్ అరెస్టు, విచారణ, బెయిల్‌పై స్పష్టమైన సమాచారాన్ని బ్రిటన్ పోలీసులు వెల్లడించలేదు. 72 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేసి ప్రశ్నించామని, ఆయన బెయిల్‌పై విడుదలయ్యారని మీడియాకు పోలీసుశాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ప్రభుత్వ సమాచారాన్ని ఎప్‌స్టీన్‌కు అందించారనే ఆరోపణలతో బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూను ఈ నెల 19న పోలీసులు అదుపులోకి తీసుకొని, 11 గంటల విచారణ అనంతరం ఆయనను విడుదల చేశారు. ఈ పరిణామం జరిగిన నాలుగు రోజుల తర్వాత మాండెల్సన్‌ను అరెస్టుచేయడం గమనార్హం.

వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఎస్‌కేఎం దేశవ్యాప్త ఉద్యమం

కురుక్షేత్ర: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి, కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) మంగళవారం ప్రకటించింది. కేంద్రం రైతుల డిమాండ్లను అంగీకరించే వరకూ నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. హరియాణాలోని కురుక్షేత్రలో జాట్ ధర్మశాలలో జరిగిన ఎస్‌కేఎం జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. పంజాబ్, హరియాణా, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, దిల్లీ, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మార్చి 9న దిల్లీలోని జంతర్‌మంతర్‌లో కిసాన్ మజ్దూర్ పార్లమెంటు నిర్వహిస్తామని ఎస్‌కేఎం పేర్కొంది. ఆరోజు దేశవ్యాప్తంగా గ్రామస్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తారు. వీటిద్వారా అమెరికా వాణిజ్య ఒప్పందం మాటున దాగిన ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని మోర్చా పేర్కొంది. మార్చి 10 నుంచి ఏప్రిల్ 13 వరకు మోర్చా దేశవ్యాప్తంగా మహాపంచాయత్‌లు నిర్వహిస్తుంది. పంజాబ్‌లోని బర్నాలాలో తొలి పంచాయత్ జరగనుంది. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల పర్యవసానాలను ప్రజలకు వివరిస్తామని వెల్లడించింది. మార్చి 23ను సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటిస్తామని తెలిపింది. ఈ నెల 27న ఎస్‌కేఎం ప్రతినిధులు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నేతలను కలిసి కేంద్రం అనుసరిస్తున్న అధికార కేంద్రీకరణ విధానాన్ని నిరసన తెలియజేస్తారు. జీఎస్టీ ఆదాయంలో రాష్ట్రాల వాటాను 33% నుంచి 60 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తారు.

స్థానిక ఎన్నికలకూ సార్వత్రిక హంగు

- చట్టాలను సమన్వయపరచాలని ఈసీ, రాష్ట్రాల ఎన్నికల కమిషన్ల నిర్ణయం

దిల్లీ: స్థానిక ఎన్నికలనూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లా నిర్వహించేలా చట్టాలను సమన్వయ పరచాలని ఎన్నికల సంఘం (ఈసీ), రాష్ట్రాల ఎన్నికల కమిషన్లు (ఎస్‌ఈసీలు) నిర్ణయించాయి. జాతీయ, రాజ్యాంగ ప్రయోజనాల దృష్ట్యా దేశంలోని అన్ని ఎన్నికలను ఒకేలా నిర్వహించేలా పరస్పరం అంగీకారయోగ్యమైన యంత్రాంగాలను, చట్టపరంగా నిలవగలిగే ఫ్రేమ్‌వర్క్‌లను రూపొందించేందుకు కలిసి పని చేయాలని తీర్మానించాయి. మంగళవారం దిల్లీలో ఈసీ, ఎస్‌ఈసీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికలను నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చలు జరిగాయి. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు.. 1950, 52 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం నేరుగా ఎన్నుకునేలా జరుగుతున్నాయి. ఈసీ, ఎస్‌ఈసీలు కలిసి పని చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గుర్తు చేశారు. 27 ఏళ్ల తర్వాత జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో.. 'ఏ కాన్ఫ్లుయెన్స్ ఆఫ్ డెమోక్రసీస్' అనే పుస్తకాన్ని ఈసీ ఆవిష్కరించింది. గతంలో 1999లో ఈసీ, ఎస్‌ఈసీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రోజంతా జరిగిన ఈ సమావేశంలో ఈవీఎంలు, ఈసీఐనెట్, ఓటర్ల జాబితాల బదిలీ వంటి అంశాలపై చర్చలు జరిగాయి.

అమెరికాతో ఒప్పందం రద్దుకు దమ్ములేని మోదీ: రాహుల్

భోపాల్: అమెరికా ఒత్తిడితోనే భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందని, ప్రధాని నరేంద్ర మోదీకి దమ్ముంటే ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ చేశారు. మోదీ పిరికివాడని, ఒప్పందంపై సంతకం చేయడంద్వారా అమెరికాకు లొంగిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మంగళవారం భోపాల్‌లో జరిగిన కిసాన్ ర్యాలీలో వారు మాట్లాడారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం మన రైతుల గుండెల్లో గుచ్చిన బాణమని, ట్రంప్ సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినందున ఇకనైనా ఒప్పందాన్ని మోదీ రద్దు చేయాలని రాహుల్ డిమాండు చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్లు బయటపడటం, గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు పెట్టడంతో అమెరికాతో ఒప్పందాన్ని మోదీ రద్దు చేసుకోలేకపోతున్నారని విమర్శించారు. అదానీపై అమెరికాలో నడుస్తున్న కేసు నిజానికి మోదీపై ఎక్కుపెట్టినదని, ఈ ఒత్తిడిని భరించలేకే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని అంగీకారం తెలిపారని ఆరోపించారు. చైనా ట్యాంకులు మన సరిహద్దుల దగ్గరకు వచ్చేస్తున్నాయని తాను హెచ్చరించినా మోదీ ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేదని మాజీ సైన్యాధిపతి నరవణె తన పుస్తకంలో వెల్లడించారని రాహుల్ తెలిపారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని, రైతులను బానిసలుగా మార్చేస్తున్నారని ఖర్గే విమర్శించారు.



భోపాల్ కిసాన్ ర్యాలీలో అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే



ఝార్ఖండ్‌లోని ఛత్రా జిల్లాలో కూలిపోయిన ఎయిర్ అంబులెన్స్

రూ.8లక్షలు అప్పు చేసి ఎయిర్ అంబులెన్స్ బుకింగ్

రాంచీ దుర్ఘటనలో కొత్త కోణం

రాంచీ: హోటల్‌లో విద్యుదాఘాతం కారణంగా చెలరేగిన మంటల్లో తీవ్రంగా గాయపడిన సంజయ్ కుమార్(41)ను కాపాడుకోవడం కోసం ఆయన కుటుంబం తీవ్రంగా ప్రయత్నించింది. అప్పటికప్పుడు రూ. 8లక్షలు అప్పు చేసి మరీ బీచ్‌క్రాఫ్ట్ సీ90 ఎయిర్ అంబులెన్సును బుక్ చేసుకున్నట్లు తెలిసింది. కాలిన గాయాలతో విషమ పరిస్థితిలో ఉన్న సంజయ్‌ను దిల్లీకి తరలించి రక్షించుకోవాలన్న ఆ కుటుంబం ఆశలను ఆకస్మిక ప్రమాదం చిదిమివేసింది. ఎయిర్ అంబులెన్స్ సోమవారం రాత్రి చత్రా జిల్లాలోని సిమరియా వద్ద అటవీ ప్రాంతంలో కుప్పకూలిపోయింది. సంజయ్‌తో పాటు ప్రయాణిస్తున్న అతడి భార్య అర్చన సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను మంగళవారం కుటుంబసభ్యులకు అందజేసినట్లు తెలిపారు.

ప్రతిరోజూ పరీక్ష అన్నట్లు సిద్ధమవ్వాలి

- మంత్రులు, ఎమ్మెల్యేలూ పూర్తి పరిజ్ఞానంతో సభలో మాట్లాడాలి
- ఎలా మాట్లాడుతున్నారో ఏఐతో విశ్లేషిస్తాం
- మంత్రులతో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రతిరోజూ పరీక్ష అనే స్ఫూర్తితో మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో సన్నద్ధమై అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏదైనా అంశాన్ని సభలో ఒకసారి సమర్థంగా ప్రజంట్ చేయగలిగితే అది ఏడాది పాటు ఇంటింటికీ తిరిగి చెప్పేదానికి సమానంగా ఉంటుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో విషయాన్ని ఎంత ప్రభావవంతంగా ప్రస్తావిస్తున్నారు? వారి ప్రజంటేషన్ ఎలా ఉందనేదానిపై 'ఏఐ' ద్వారా విశ్లేషిస్తున్నామని చెప్పారు. బడ్జెట్ పద్దులపైనా మంత్రులు పూర్తిస్థాయిలో సన్నద్ధమై వచ్చి సభలో సమాధానాలివ్వాలన్నారు. ప్రతిపక్షం సభకు వచ్చి నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సింది పోయి.. బయట బాధ్యత లేని రాజకీయాలు చేస్తోందని సీఎం విమర్శించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రోజూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఒక అంశంపై లఘుచర్చ చేపడదామని సీఎం సూచించారు. సంబంధిత శాఖ మంత్రి చర్చను లీడ్ చేస్తారని, కూటమి పార్టీల సభ్యులంతా భాగస్వాములై అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సందర్భాన్ని బట్టి తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్చలో పాల్గొంటామని మంత్రులకు సీఎం చెప్పారు.

శ్రీకాకుళం, రాజమహేంద్రవరం ఘటనల్లో బాధ్యులపై కఠిన చర్యలు

శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల విక్రయం ఘటనలను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని సీఎం తెలిపారు. ఆ ఘటనలకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖలవారీగా జరుగుతున్న అభివృద్ధి, కార్యక్రమాలను ప్రజలకు తెలిపేలా సంబంధిత మంత్రులు పనిచేయాలని, కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ దస్త్రాలను త్వరితగతిన పరిష్కరించాలని నిర్దేశించారు.

అదీ మన నిబద్ధత

ఈసారి ఒకటో తేదీ ఆదివారం వచ్చినందున, ముందురోజు శనివారమే (ఈ నెల 28) పింఛన్లు పంపిణీ చేయాలని సీఎం చెప్పారు. 'పింఛన్లు ఒక్క రోజు కూడా ఆలస్యం కాకుండా ఇస్తున్నాం. అదీ మన నిబద్ధత. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా మీ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో విధిగా పాల్గొనాలి' అని స్పష్టం చేశారు. దీంతో ఈ నెల 28న శాసనసభకు సెలవు ఇవ్వాలనే అంశం చర్చకు వచ్చింది. ఆరోజు శాసనసభలో కార్యకలాపాలు వద్దని తీర్మానించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించి వైకాపా హయాంలో చేసిన అపచారంపై మంగళవారం శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో భావోద్వేగంగా మాట్లాడారని కొందరు మంత్రులు ప్రస్తావించారు. కొందరు మంత్రులు, సభ్యులు దీనిపై సన్నద్ధమై గురువారం శాసనమండలిలోనూ ప్రభావవంతంగా ప్రజంటేషన్ ఇవ్వాలని సీఎం సూచించారు.

మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు

- రిలయన్స్ కన్స్యూమర్స్ లిమిటెడ్, సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్, రేమండ్ గ్రూప్ ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్, జేకే మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థలకు కేటాయించిన భూములకు సంబంధించి డబ్బు చెల్లింపు, ప్రాజెక్టుల గడువు పెంపు ప్రతిపాదనకు ఆమోదం.
- పల్నాడు జిల్లా కొండవీడు వద్ద 12.31 ఎకరాల్లో ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అర్షధాతు గ్రీన్ నానోటెక్నాలజీస్‌కి అనుమతి.
- రాధికా వెజిటబుల్ ఆయిల్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ చెందిన మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ అప్‌గ్రెడేషన్/ విస్తరణకు, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు గత ఏడాది సెప్టెంబరు 9న ఇచ్చిన ఉత్తర్వు సవరణకు, స్నేహా ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు గత ఏడాది ఏప్రిల్ 14న ఇచ్చిన ఉత్తర్వు సవరణకు, ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీ పొడిగింపునకు అనుమతి
- హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, అజాద్ ఇండియా మొబిలిటీ, జిన్‌ప్రా ప్రెసిషన్స్, జూపిటర్ రెన్యువబుల్ సంస్థకు గతంలో చేసిన భూ కేటాయింపులు రద్దు చేస్తూ నిర్ణయం.

రామాయపట్నం రైలు కార్గో టెర్మినల్‌కు 153.77 ఎకరాలు


- ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు నుంచి నేరుగా 153.77 ఎకరాల్ని రామాయపట్నం కార్గో రైల్ టెర్మినల్ (ఆర్‌సీఆర్‌టీ)కి బదిలీ చేసేందుకు అనుమతి.
- నెల్లూరు జిల్లాలోని తెట్టు రైల్వేస్టేషన్ సమీపంలో మల్టీ కార్గో మాడ్యులర్ రైల్ టెర్మినల్ అభివృద్ధి చేస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,300 మందికి ఉపాధి లభిస్తుంది.
- చిత్తూరు జిల్లా తవనంపల్లె మండలం పట్నం గ్రామంలోని 8.16 ఎకరాల భూమిని ఎకరానికి రూ. 8.75 లక్షల చొప్పున మార్కెట్ విలువ చెల్లించే ప్రాతిపదికన కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి కేటాయింపు. దానిలో యాత్రికులకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తారు.
- ఎన్‌హెచ్-216 నుంచి మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు అనుసంధాన రహదారి నిర్మాణానికి కృష్ణా జిల్లా నార్త్ మచిలీపట్నం మండలంలోని పోతేపల్లి గ్రామంలో 3.50 ఎకరాల భూమి ఏపీ మారిటైమ్ బోర్డుకు ఎకరం రూ.62.62 లక్షల చొప్పున కేటాయింపు.
- శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని హాళుకూరులో వక్క మార్కెట్‌యార్డు ఏర్పాటుకు 10 ఎకరాల ప్రభుత్వ భూమి మార్కెటింగ్ శాఖకు కేటాయింపు. అక్కడ ఎకరం మార్కెట్ విలువ రూ.7.50 లక్షలు.
- కర్నూలు జిల్లా లక్ష్మీపురం మండలంలోని కల్లూరులో అంతర్జాతీయ గురుకుల పాఠశాల ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ సంస్థకు 10 ఎకరాల భూమి ఎకరం రూ.71.36 లక్షల చొప్పున కేటాయింపు.
- బాపట్ల జిల్లా చీరాల మండలం కావూరివారిపాలెంలో 2.41 ఎకరాల భూమి ఏపీఐఐసీకి ఎకరం రూ.20 లక్షల చొప్పున కేటాయింపు.

పలు విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతి

- అనంతపురం జిల్లా కణేకల్లు, డి.హీరేహాళ్, రాయదుర్గం మండలాల్లో 160 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సంస్థకు అనుమతి.
- అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల్లో 160 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సంస్థకు అనుమతి.
- కర్నూలు జిల్లా దేవనకొండ, కొండాపురం, ముత్తుకూరు మండలాల్లో 125 మెగావాట్ల పవన, సౌర హైబ్రిడ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు.. రెన్యూ ఫొటో వోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి. దీనిలో భాగంగా 200 మెగావాట్స్ పర్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్ట్ ఏర్పాటుకి అనుమతి.
- పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామంలో 200 టీపీటీ కంప్రెస్డ్ బయోగ్యాస్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం.
- శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం బీచిగానిపల్లి గ్రామ పరిధిలో 200 మెగావాట్ల సోలార్ పవర్ పార్క్ ఏర్పాటుకు యశ్వ పవర్ ఎల్ఎల్‌పీకి అనుమతి.
- కర్నూలు జిల్లా ఆలూరు, చిప్పగిరి, హొళగుంద, ఆత్మకూరు, నారాయణపూర్ మండలాల్లో ఎన్టీపీసీ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ 900 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అనుమతి.

హోటళ్లు, రిసార్టులకు ప్రోత్సాహకాలు

- రాజమహేంద్రవరంలో మెర్క్యూర్ బ్రాండ్ పేరు మీద ఫోర్‌స్టార్ హోటల్ ఏర్పాటుకు కంపాస్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనకు ఆమోదం.
- రాజధాని అమరావతిలో 'మాలక్ష్మి వన్' పేరుతో ఇంటిగ్రేటెడ్ అల్ట్రా మెగా టూరిజం అండ్ హాస్పిటాలిటీ ప్రాజెక్టు ఏర్పాటుకు అకాసియా హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.
- విశాఖపట్నంలోని రుషికొండలో 'వి హోటల్' బ్రాండ్ పేరుతో త్రీస్టార్ హోటల్ ఏర్పాటుకు వీరాంజనేయ హాస్పిటాలిటీ సంస్థకు ప్రోత్సాహకాలు
- చీరాల బీచ్‌లో ఫోర్ స్టార్ హోటల్ ఏర్పాటుకు అక్షయ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సంస్థకు ప్రోత్సాహకాలు
- విశాఖపట్నంలోని రుషికొండలో వెస్టిన్ బ్రాండ్ కింద విలాసవంతమైన ఆతిథ్య ప్రాజెక్టు ఏర్పాటుకు రుషికొండ బీచ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.



- అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలోని నందకోట వద్ద రిసార్ట్ కమ్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఎకో-ఐజిల్ రిసార్ట్స్ సంస్థకు ప్రోత్సాహకాలు.
- 'తిరుపతి వన్' పేరుతో ఇంటిగ్రేటెడ్ కల్చరల్ అండ్ మైస్ డెస్టినేషన్ ప్రాజెక్టు అభివృద్ధికి దివ్యశ్రీ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.
- విశాఖపట్నంలోని రుషికొండలో క్రౌన్ ప్లాజా బ్రాండ్ మీద కోస్టల్ హాస్పిటాలిటీ ప్రెసింక్ట్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేపీపీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థకు ప్రోత్సాహకాలు.
- కాకినాడలో ఫైవ్‌స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఎస్‌వీఎస్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు స్థలం కేటాయింపు, ప్రోత్సాహకాలు అందజేసేందుకు అనుమతి.
- శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో గనగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం కొండ దిగువన భారీ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రం ఏర్పాటుకు ఇస్కాన్ సంస్థకు స్థలం, ప్రోత్సాహకాలకు ఆమోదం.

300 మెగావాట్ల విద్యుత్ తీసుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతి

- సెకీతో కుదిరిన విద్యుత్ విక్రయ ఒప్పందం ఆధారంగా 300 మెగావాట్ల విద్యుత్ తీసుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతి.
- ఏపీ ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న 67 ఏఈఈ/ఎలక్ట్రికల్ పోస్టుల అప్‌గ్రెడేషన్‌కు అనుమతి.
- ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ తీసుకున్న రూ.500 కోట్ల రుణానికి ప్రభుత్వం హామీ ఇచ్చే నిర్ణయానికి అనుమతి.
- ఏపీ జల జీవన్ వాటర్ సప్లై కార్పొరేషన్, జల జీవన్ మిషన్ కార్యక్రమం అమలుకు నాబార్డ్ మంజూరు చేసిన రూ.650 కోట్ల రుణానికి ప్రభుత్వ హామీ ఇచ్చేందుకు అనుమతి. ఈ కార్పొరేషన్ల వనరుల సమీకరణ పరిమితిని రూ.12 వేల కోట్ల నుంచి రూ.14 వేల కోట్లకు పెంచారు.

పోలవరం ప్రాజెక్టు కింద కృష్ణాకు మళ్లించేది 80 టీఎంసీలు మాత్రమే

- బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

ఈనాడు, అమరావతి: 'పట్టిసీమ.. తాత్కాలిక వరద జలాల ఆధారిత ఎత్తిపోతల పథకం మాత్రమే. నికర ప్రవాహాన్ని సృష్టించే ప్రాజెక్టు కాదు. అందువల్ల పట్టిసీమ నుంచి 105.9 టీఎంసీల కోసం తెలంగాణ వాదనను పరిగణనలోకి తీసుకోకూడదు. పోలవరం ప్రాజెక్టు కింద కృష్ణాకు మళ్లించేది 80 టీఎంసీలు మాత్రమే. అంతకుమించి నీటిని మళ్లించడానికి ఏపీ ఎన్నడూ ప్రతిపాదించలేదు. అందువల్ల 105.9 టీఎంసీలు కేటాయించాలనడం అదనపు పరిశీలనాంశాల్లోకి రాదు' అని బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్‌గుప్తా వాదనలు వినిపించారు. జస్టిస్ బ్రిజేష్‌కుమార్, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాళపత్రల ముందు మంగళవారం ఆయన ఏపీ తరఫున వాదనలు కొనసాగించారు. సీనియర్ న్యాయవాది ఉమాపతి, న్యాయవాదులు శరత్‌చంద్ర, సంజయ్‌లు సహకరించారు.

- కృష్ణా డెల్టా కోసం 20 టీఎంసీల డ్రెయిన్ నీటిని వినియోగించడాన్ని ఆధునికీకరణ సమయంలోనే కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తిరస్కరించింది. సీడబ్ల్యూసీ సమ్మతి లేకుండా ఏ పునఃప్రతిపాదననూ పరిగణనలోకి తీసుకోలేం. చట్టబద్ధమైన సంస్థ ద్వారా ఇప్పటికే పరిశీలించి తిరస్కరించిన ప్రతిపాదనను తెలంగాణ పునరుద్ధరించలేదు.
- కృష్ణా డెల్టా అవసరాలను లెక్కించేందుకు పట్టిసీమ ద్వారా తీసుకునే జలాలను పరిగణనలోకి తీసుకోకూడదు. వీటిని కేటాయింపుల కోసం లెక్కించకూడదు. ట్రైబ్యునల్ లెక్కల్లోనూ పరిగణనలోకి తీసుకోకూడదు. పట్టిసీమతో సంబంధం లేకుండా.. పోలవరం కుడి కాలువ సామర్థ్యం 80 టీఎంసీలు మాత్రమే చట్టబద్ధమైన నీటి మళ్లింపుగా పరిగణించాలి.
- గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వినియోగించిన 22.5 టీఎంసీలు కృష్ణా డెల్టా వెలుపల ఉన్న పాత ఆయకట్టు కోసమే. ఈ నీళ్లు బచావత్ లేదా బ్రిజేష్ ట్రైబ్యునల్ కేటాయింపుల్లో భాగం కాదు. కృష్ణా డెల్టా నికర సరఫరాలో ఈ నీళ్లు చేర్చాలని తెలంగాణ అడగడం సరికాదు. పట్టణీకరణ ఆధారంగా నీటికి కోత విధించాలన్న వారి వాదన ఆమోదయోగ్యం కాదు. చట్టబద్ధం కాదు. భూ వినియోగ మార్పిడి.. నోటిఫై చేసిన చట్టబద్ధ పత్రాల ఆధారంగా ఉండాలి. కేవలం 217 చదరపు కి.మీ రాజధాని నగర ప్రాంతమే పట్టణీకరణ కోసం నోటిఫై చేశారు. పట్టణీకరణ వల్ల వచ్చే 10 టీఎంసీలు తాగునీటి అవసరాలను కలపాలి తప్ప, ఉన్నవి తొలగించకూడదు.
- హైదరాబాద్ మెట్రోపాలిటన్ అథారిటీ 10,472 చదరపు కి.మీ.లకు విస్తరించి తన సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంది. తెలంగాణ తన సొంత తగ్గింపులను విస్మరించి ఏపీ నీటి వినియోగాన్ని తగ్గించడానికి పట్టణీకరణను ఎంచుకొని ఒక సాకుగా వర్తింపజేయాలనుకోవడం తగదు.
- పులిచింతలకు దిగువన ఎలాంటి నికర నీటి ప్రవాహాలు లేవు. ఆ దిగువన ఉత్పత్తి అయ్యే 12 టీఎంసీలకు పైగా నీటిని మున్నేరుకు మళ్లించాలని తెలంగాణ వాదిస్తోంది. పులిచింతల దిగువన నీటి లభ్యతకు చట్టబద్ధ ఆధారమేదీ లేదు. ఈ వాదనను కూడా ట్రైబ్యునల్ తిరస్కరించాలి.
- ట్రైబ్యునల్ కేవలం చట్టపరంగా కేటాయింపుల పరిమాణాన్ని మాత్రమే నిర్ణయిస్తుంది. రాష్ట్రం ఎక్కడి నుంచి నీటిని తీసుకోవాలో ఆదేశించజాలదు.
- తాగునీరు, నేవిగేషన్, ఇతర అవసరాలను తెలంగాణ ప్రతిపాదిత లెక్కలు విస్మరించాయి. తాగు, పారిశ్రామిక, పర్యావరణ అవసరాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.
- కృష్ణా డెల్టా ఆధునికీకరణ ప్రక్రియలో భాగంగా 152.20 టీఎంసీలను సాంకేతిక సలహా మండలి ఆమోదించింది. ఈ నీళ్లు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. పులిచింతల దిగువన 53 టీఎంసీల ప్రవాహాలు ఇప్పటికే ఉన్న కేటాయింపుల్లో భాగమే. ఆమోదించిన విధానాల ప్రకారం నీటి వాడకం ఉంది.

చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సువర్ణరాజు అనుబంధ పిటిషన్ల కొట్టివేత

- సత్యప్రసాద్ బెయిల్ పిటిషన్‌పై విచారణ మార్చి 2కు వాయిదా
- మద్యం కుంభకోణం కేసులో హైకోర్టు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులు, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి(ఏ-2), ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్(ఏ-3)లకు ముందస్తు బెయిలు ఇవ్వొద్దని, ఈ పిటిషన్లలో తమను ప్రతివాదిగా చేర్చుకొని(ఇంప్లీడ్) వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలంటూ సహ నిందితుడు, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి(ఏ38), మూడో పక్షం సువర్ణరాజు అనే వ్యక్తి దాఖలుచేసిన ఇంప్లీడ్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. వీరిరువురు దాఖలుచేసిన అనుబంధ పిటిషన్లకు విచారణార్హత లేదని స్పష్టంచేసింది. మరోవైపు వాసుదేవరెడ్డిని ఇప్పటికే సీఐడీ అరెస్ట్ చేసిన నేపథ్యంలో బెయిలు కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ నిరర్థకమయ్యిందని హైకోర్టు పేర్కొంది. ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. సత్యప్రసాద్‌ను అరెస్ట్ చేస్తారేమోనని, రక్షణ కల్పించాలని ఆయన తరఫు న్యాయవాది అభ్యర్థించగా.. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది మనుశర్మ స్పందిస్తూ తదుపరి విచారణలోపు ఏమీ జరగబోదని, అరెస్టు గురించి ఆందోళన అవసరం లేదన్నారు. ఈ వివరాలను న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి పరిగణనలోకి తీసుకున్నారు. సత్యప్రసాద్ ముందస్తు బెయిలు పిటిషన్‌పై విచారణను మార్చి 2కు వాయిదా వేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

వడగాలులు.. జనం బెంబేలు!

- పెరుగుతున్న వేడితో ప్రజారోగ్యానికి ముప్పు
- ఈ ఏడాది మరింత తీవ్రమయ్యే అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు ప్రజలను ఆందోళనకు గురిచేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యంపై వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దేశంలో ఏటా సగటున దాదాపు 100 కోట్లమంది వీటివల్ల ప్రభావితమవుతున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. దేశంలో 23 రాష్ట్రాలు తరచూ వడగాలుల తీవ్రతను ఎదుర్కొంటున్నట్లు గతంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చెప్పింది. ఈ ఏడాదీ దేశంలో వాటి తీవ్రతతో పాటు తరచుదనం (ఫ్రీక్వెన్సీ) పెరుగుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వడగాలుల తీవ్రతను తగ్గించడానికి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

రికార్డు స్థాయిలో..

గత 40 ఏళ్లలో దేశంలో వేడి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఫలితంగా 2013, 2016, 2019, 2024లో రికార్డు స్థాయిలో వడగాలులు సంభవించాయి. ఉష్ణోగ్రతలను ఎల్‌నినో, లానినా ప్రభావితం చేస్తున్నాయి. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న జిల్లాల్లో వెచ్చటి రాత్రుల పెరుగుదల ఎక్కువగా కనిపిస్తోంది. దీనికి 'అర్బన్ హీట్ ఐలాండ్' పరిణామం కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పగటి పూట తీవ్రమైన వేడితో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు రాత్రి పూట కూడా ఉపశమనం దొరకట్లేదు. తద్వారా వడదెబ్బ, ఇతర ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.

ఎనిమిదో స్థానంలో ఏపీ..

జిల్లా స్థాయిలో వేడి తీవ్రతను అంచనా వేయడానికి కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, వాటర్ (సీఈఈడబ్ల్యూ) గతేడాది 734 జిల్లాలకు సంబంధించిన హీట్ రిస్క్ ఇండెక్స్ (హెచ్ఆర్ఐ)ను అభివృద్ధి చేసింది. దేశ సమాచారాన్ని 12 కి.మీ. గ్రిడ్‌లుగా విభజించి.. 1982 నుంచి 2022 మధ్యలో దీర్ఘకాలిక ఉష్ణ ధోరణులను మ్యాప్ చేసింది. వాటి ప్రకారం.. దేశంలోని నగరాలు మిగిలిన ప్రాంతాల కంటే రెండు రెట్లు వేగంగా వేడెక్కుతున్నాయి. 57 శాతం జిల్లాల్లో నివసిస్తున్న 76 శాతం జనాభా హైరిస్క్ కేటగిరీలో ఉన్నారు. పది రాష్ట్రాల్లో వేడి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించగా అందులో ఏపీ.. ఎనిమిదో స్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఎక్కువ జిల్లాలు తీవ్రమైన వేడికి ఎక్కువగా గురయ్యే ప్రమాదముంది. రాష్ట్రంలో ఎక్కువ శాతం జనాభాకు వ్యవసాయమే ఆధారం. వారంతా రోజులో ఎక్కువ భాగం ఆరుబయట పనిచేస్తుంటారు. దీంతో వడగాలులకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది.

జిల్లాల్లో ఇలా...

- సీఈఈడబ్ల్యూ విడుదల చేసిన హెచ్ఆర్ఐ ప్రకారం ఉమ్మడి శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు 'వెరీ హై రిస్క్' జాబితాలో ఉన్నాయి. మిగిలిన విజయనగరం, విశాఖపట్నం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలు 'హై రిస్క్' కేటగిరీలో ఉన్నాయి.
- క్లైమేట్ హజార్డ్స్ అండ్ వల్నరబులిటీ అట్లాస్ ఆఫ్ ఇండియా ప్రకారం.. 1969-2019 మధ్య రాష్ట్రంలో 700 నుంచి 1000 రోజులపాటు వడగాలులు వీచాయి. వీటి ద్వారా దేశంలో ఏపీ మొదటి స్థానంలో ఉంది. పలువురు ప్రాణాలు కోల్పోయారు.
- 1961 నుంచి 2020 వరకు వడగాలులపై వాతావరణ స్టేషన్ల వారీగా ఐఎండీ సేకరించిన సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూరు, గుంటూరు, మచిలీపట్నం, కాకినాడ, విశాఖలో వడగాలుల తీవ్రత పెరుగుతోంది. కళింగపట్నం, మచిలీపట్నం, ప్రాంతంలో వీటి తీవ్రత తగ్గుతోంది. అనంతపురం, కర్నూలు, గుంటూరు, కడప, నెల్లూరు, మచిలీపట్నం, విశాఖలో వడగాలులు వీచే రోజులు పెరుగుతుండగా.. కళింగపట్నం, కాకినాడలో తగ్గుతున్నాయి.

ప్రణాళికలు బలోపేతమైతే..

దేశంలో తీవ్రమైన వేడిని ఎదుర్కోవడానికి కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. తద్వారా గత దశాబ్దంలో వేడి సంబంధిత అనారోగ్యాలు, మరణాల సంఖ్య తగ్గాయని పరిశోధనలు చెబుతున్నాయి. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రణాళిక సిద్ధం చేసేటప్పుడు.. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రులు, తేమ, జనాభా, ఆరోగ్య పరిస్థితులు తదితరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

వీరిపై ఎక్కువ ప్రభావం..

- వృద్ధులు
- చిన్నారులు
- గర్భిణులు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు

వృత్తిపరంగా వీరికి అవస్థలు..

- గిగ్ వర్కర్స్, డెలివరీ బాయ్స్
- పోలీసులు
- రైతులు, వ్యవసాయ కూలీలు
- భవన నిర్మాణ కార్మికులు

రాజకీయాలు కొనసాగిస్తా..: దేవ్‌జీ



అనారోగ్య కారణాల వల్లే రహస్య జీవితాన్ని వదిలి బహిరంగ జీవితంలోకి వచ్చానే తప్ప.. వ్యక్తిగత జీవితం కొనసాగించేందుకు మాత్రం కాదు. ప్రజల సమస్యలపై చట్టబద్ధంగానే పని చేయాలని నిర్ణయించుకున్నా. ఇకముందూ నా రాజకీయ జీవితాన్ని కొనసాగించాలనుకుంటున్నా. దశాబ్దాల తరబడి నమ్మిన సిద్ధాంతాల మేరకే ముందుకు సాగుతా. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీడియా అడిగే ప్రశ్నలకు సమయాభావం వల్ల సమగ్రంగా జవాబివ్వలేను. 15 నిమిషాల పాటు చెప్పాల్సిన జవాబును రెండు నిమిషాల్లో ముగిస్తే అపార్థాలకు, అనర్థాలకు, అనవసర చర్చలకు దారి తీస్తుంది. దాన్ని నివారించేందుకు ఎక్కువగా మాట్లాడొద్దని నిర్ణయించుకున్నా. ఇది మీడియాను అగౌరవపర్చడం ఎంతమాత్రం కాదని విజ్ఞప్తి చేస్తున్నా. కొంతకాలం తర్వాత మీరు అడిగే ఎలాంటి ప్రశ్నలకైనా సుదీర్ఘంగా సమాధానాలిస్తాం. **– ఈనాడు, హైదరాబాద్**

మావోయిజం ఎప్పుడూ ముగియదు: రాజిరెడ్డి



మావోయిజం ఎప్పుడూ ముగియదు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. సాయుధ పోరాటం ముగిసిందా అంటే అవుననీ.. కాదనీ చెప్పలేం. ఇకపై మేం ప్రజల తరఫున వారితో నిలబడి పని చేస్తాం. ప్రజాస్వామిక పద్ధతుల్లోనే వ్యవహరిస్తాం కానీ.. పార్లమెంటరీ విధానంలోకి వెళ్లాలనేది మా ఉద్దేశం కాదు. ప్రజల్ని సంఘటితపరిచేందుకు. ఇంతకాలం మేం చెప్పిన రాజకీయాలు, సిద్ధాంతాలను వదులుకోకుండానే చట్టబద్ధమైన రీతిలో పనిచేస్తాం. అవకాశం ఉన్నంతవరకు ప్రజల పోరాటాల వెనక నిలుస్తాం. **– ఈనాడు, హైదరాబాద్**

ఫిబ్రవరి నెలది.. 'చిన్న' కథ కాదు..!

అన్ని నెలల్లో 30 లేదా 31 రోజులుండగా.. ఒక్క ఫిబ్రవరిలో మాత్రం ఎందుకని 28 రోజులున్నాయని ఎప్పుడైనా ఆలోచించారా? దీనికి ప్రాచీన రోమన్ల మూఢనమ్మకాలు, గణిత లెక్కలే కారణం. మొదట్లో రోమన్ క్యాలెండర్‌లో కేవలం 10 నెలలే(మార్చి నుంచి డిసెంబరు వరకు) ఉండేవి. చలికాలంలో పంటలు పండవని ఆ సమయాన్ని(జనవరి, ఫిబ్రవరి) వారు లెక్కలోకి తీసుకోకుండా వదిలేశారు. తరువాత క్రీస్తు పూర్వం 713లో రోమన్ రాజు 'నుమా పోంపిలియస్' చంద్రుని గమనాన్ని బట్టి క్యాలెండర్‌ను 12 నెలలుగా మారుస్తూ జనవరి, ఫిబ్రవరి నెలలను చేర్చారు. అలాగే రోమన్లు సరిసంఖ్యలను అరిష్టంగా భావిస్తారు. 12 చంద్ర చక్రాలు పూర్తి కావడానికి సుమారు 354 రోజులు పడుతుంది. కాబట్టి మొదటి క్యాలెండర్ 354 రోజులతోనే ప్రారంభమైంది. ఇది సరి సంఖ్య కావడంతో చక్రవర్తి పోంపిలియస్ మరో రోజును అదనంగా కలిపి మొత్తం 355 రోజులు చేశారు. తర్వాత ప్రతి నెలలోనూ బేసి సంఖ్యలు ఉండేలా 29 లేదా 31 రోజులకు విభజించారు. అయితే 355 రోజులు రావాలంటే కచ్చితంగా ఒక నెలలో సరి సంఖ్య ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి క్యాలెండర్‌లో ఫిబ్రవరి చివరి నెలగా ఉండేది. ఆ నెలను రోమన్లు శుద్ధీకరణ(ఫిబ్రం), చనిపోయిన వారిని స్మరించుకునే నెలగా భావించేవారు. ఆ కారణంగా దీన్ని అశుభ నెలగా భావిస్తూ 28 రోజులు కేటాయించారు. తర్వాత జూలియస్ సీజర్ క్యాలెండర్‌ను సవరించినపుడు భూమి సూర్యుడి చుట్టూ తిరగడానికి పట్టే కాలాన్ని బట్టి సంవత్సరానికి 365 రోజులుగా నిర్ణయించారు. దాని ప్రకారం నెలలనూ సవరించారు. ఫిబ్రవరిలో 28 రోజులను మాత్రం అలాగే ఉంచారు. ఇప్పటికీ అదే కొనసాగుతోంది. సూర్య సంవత్సరానికి సరిపడేలా.. ప్రతి నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి నెలకు ఒక రోజును జోడించడంతో 29 రోజుల లీప్ ఇయర్ వస్తుంది.

– ఈనాడు, ప్రత్యేక విభాగం

ఆపరేషన్ ఆక్టోపస్!

- 16 రాష్ట్రాల్లో నగర సైబర్‌క్రైమ్ పోలీసుల దాడులు
- 104 మంది అరెస్ట్.. రూ.36 లక్షలు స్వాధీనం

ఈనాడు, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు నగర సైబర్‌క్రైమ్ పోలీసులు పాన్‌ఇండియా స్థాయిలో 'ఆపరేషన్ ఆక్టోపస్' నిర్వహించారు. 16 రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. పెట్టుబడులు, డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్ పేరిట రూ.కోట్లు కొల్లగొట్టడంలో సహకరించిన 104 మందిని అరెస్ట్ చేసినట్టు నగర కొత్వాల్ వీసీ సజ్జనర్ మంగళవారం తెలిపారు.

పక్కా వ్యూహంతో..: వందల కిలోమీటర్ల దూరంలో కూర్చొని అక్రమాలకు పాల్పడుతున్న వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు సీపీ సజ్జనర్ ఆపరేషన్ ఆక్టోపస్‌కు రూపకల్పన చేశారు. బ్యాంకు ఖాతాలు, సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా నిందితుల ఆచూకీ కనిపెట్టారు. మహారాష్ట్ర, దిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర 16 రాష్ట్రాల్లోని సైబర్ నేరాల హాట్‌స్పాట్లపై దాడులు నిర్వహించారు. 10 రోజుల దాడుల్లో 104 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో 86 మంది మ్యూల్ ఖాతాదారులు, 17 మంది మోసగాళ్లకు అవసరమైన వస్తువులు, సమాచారం చేరవేసేవారు, బంధన్ బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్ ఒకరు ఉన్నారు. అరెస్టయిన నిందితులకు దేశవ్యాప్తంగా 1,055 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. వారి నుంచి సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, డెబిట్/క్రెడిట్ కార్డులు, ల్యాప్‌టాప్‌లు, రూ.36 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసాల్లో బాధితులు రూ.127 కోట్లు నష్టపోయినట్టు చెప్పారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు, నగదు

గనులశాఖ సంచాలకుడిగా చంద్రశేఖర్‌కు పదోన్నతి

ఈనాడు, అమరావతి: గనులశాఖ అదనపు సంచాలకుడు డబ్ల్యూబీ చంద్రశేఖర్‌కు సంచాలకుడిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన కొంతకాలంగా సంచాలకుడిగా అదనపు బాధ్యతలు చూస్తున్నారు. తాజాగా ఆయనకు పూర్తిస్థాయి పదోన్నతి లభించింది. ఈయన ఈ నెలాఖరులో పదవీ విరమణ చెందనున్నారు. తర్వాత కూడా మరికొంత కాలం ఆయన్ను సంచాలకుడిగా కొనసాగించే అవకాశం ఉందని గనులశాఖ వర్గాలు తెలిపాయి.

11 ఏళ్ల తర్వాత అవకాశం

గనులశాఖ అధికారికే ఆ శాఖ పూర్తిస్థాయి డైరెక్టర్‌గా 11 ఏళ్ల తర్వాత అవకాశం లభించింది. రాష్ట్ర విభజన తర్వాత సుశీల్‌కుమార్ గనులశాఖ సంచాలకుడిగా ఉన్నారు. ఆయన 2015 ఆగస్టులో తెలంగాణకు వెళ్లిపోయారు. అప్పటినుంచి గనులశాఖ అధికారులెవరూ.. ఆ శాఖకు సంచాలకుడిగా పనిచేయలేదు. ఐఏఎస్‌లే డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. 2019 డిసెంబరులో అప్పటి జగన్ ప్రభుత్వం ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో సీనియర్ సివిలియన్ స్టాఫ్ ఆఫీసర్ అయిన వెంకటరెడ్డిని నిబంధనలకు విరుద్ధంగా డైరెక్టర్‌గా నియమించింది. ఇప్పుడు గనులశాఖ అధికారి అయిన చంద్రశేఖర్‌కు ఆ శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహించే అవకాశం దక్కింది.

జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాలు విడుదల

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ పేపర్-2 తొలి విడత ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా ఇద్దరికి 100 పర్సంటైల్ దక్కింది. వారిద్దరూ కేరళ వారే కావడం విశేషం. పేపర్-2ఏ(బీ ఆర్క్)కు 45,452 మంది, పేపర్-2బీ(బీ ప్లానింగ్)కు 21,067 మంది హాజరయ్యారు. పేపర్-2ఏలో తెలంగాణకు చెందిన తెల్లూరి శ్రేయాస్‌రెడ్డి 99.99 పర్సంటైల్, ఏపీ విద్యార్థి ఓరుగంటి శరణ్య అశ్విని 99.95 స్కోర్ సాధించారు. పేపర్-2బీలో తెలంగాణ నుంచి మద్దూరి నాగ ప్రద్యుమ్నారెడ్డి 99.98, ఏపీ నుంచి పైలా హర్షాదిత్య, వానపల్లి శ్రీ ఈశ్వర్‌రాజ్, సింగంశెట్టి వెంకట భీమ తులిప్‌లు 99.95 పర్సంటైల్ సాధించారు. పేపర్-2బీలో ఏపీ విద్యార్థి కుంభా జీవన్ సాయిరామ్ 99.77 పర్సంటైల్‌తో ఎస్టీ విభాగంలో జాతీయస్థాయి టాపర్‌గా నిలిచాడు. ఇదే పేపర్‌లో దివ్యాంగుల విభాగంలో ఏపీ విద్యార్థి బలగం ఆదిత్య వీర విజయ భార్గవ్ 95.39 పర్సంటైల్‌తో జాతీయస్థాయి అగ్రగణ్యుడిగా నిలిచాడు. మరోవైపు జేఈఈ మెయిన్ తుదివిడత పరీక్షకు దరఖాస్తుల గడువు బుధవారం అర్ధరాత్రితో ముగియనుంది.



సభా సమయం

బడ్జెట్ డిమాండ్లపై శాసనసభలో నేడు చర్చ

ఈనాడు, అమరావతి: పొరుగుసేవల ఉద్యోగులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీల్లోని ఇళ్లకు మరమ్మతులు, అనంతపురంలో టెక్స్‌టైల్ పార్క్, యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు బుధవారం సభలో సమాధానాలివ్వనున్నారు. తర్వాత వివిధ శాఖలకు సంబంధించిన బడ్జెట్ డిమాండ్లు, గ్రాంట్లపై చర్చ చేపట్టనున్నారు.

◆ వ్యవసాయంపై శాసనమండలిలో బుధవారం లఘు చర్చ నిర్వహించనున్నారు. అంతకుముందు ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో డయాలసిస్ కేంద్రాలు, అతిసార వ్యాధి వ్యాప్తి, జల్ జీవన్ మిషన్, భోగాపురం విమానాశ్రయం, నౌకాశ్రయాలు-ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం వంటి అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలివ్వనున్నారు.

మాజీ ఎమ్మెల్యేల మృతికి శాసనసభ నివాళి: శాసనసభలో మంగళవారం ఏడుగురు మాజీ ఎమ్మెల్యేల మృతికి సభ్యులు నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు పి.రాంభూపాల్‌రెడ్డి, అసిఫ్ పాషా, జి.వెంకటేశ్వర ప్రసాద్, జి.సుమన, గుండ అప్పల సూర్యనారాయణ, ఈలి వరలక్ష్మి, తడపట్ల రత్నబాయి మృతికి సభాపతి అయ్యన్నపాత్రుడి సూచనపై సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించారు.

నెయ్యి కల్తీతో ప్రజావిశ్వాసంపై ప్రతికూల ప్రభావం

- తప్పిదాలపై తితిదేలో మొదలైన దిద్దుబాటు చర్యలు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటన

ఈనాడు, అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అయిన వ్యవహారంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) దిద్దుబాటు చర్యలు ప్రారంభించిందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెయ్యి కల్తీపై శాసనసభలో మంగళవారం స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం విషయమై చర్చలో పాల్గొని వివరాలు వెల్లడించాల్సి రావడం బాధాకరమని చెప్పారు. ఘటన వెలుగులోకి వచ్చినప్పట్నుంచి ఇప్పటి వరకు జరిగిన పరిణామాలపై 23 పాయింట్లతో రూపొందించిన ప్రకటనను సభలో చదివి వినిపించారు. అందులోని కీలకాంశాలు..

◆ నెయ్యి సేకరణలో 2014-19 మధ్య ఎంతో కఠినంగా అమలుచేసిన నిబంధనలు 2020లో సడలించడంతో అక్రమాలకు అవకాశం ఏర్పడినట్లు విచారణలో వెల్లడైంది. అనుభవం, వార్షిక టర్నోవర్, ఆవుపాల కొవ్వు ఉత్పత్తి ప్రమాణాలు, తప్పనిసరి పాలసేకరణ నిబంధనలు తొలగించారు.



◆ నెయ్యి ఉత్పత్తిలో అనుభవం లేని డెయిరీల ప్రవేశానికి నిబంధనల సడలింపు బాగా దోహదం చేసింది. భోలే బాబా ఓర్గానిక్ డెయిరీ మిల్క్, శ్రీవైష్ణవి డెయిరీ తదితర సంస్థలు ఇలాగే టెండర్లు దక్కించుకున్నాయి. 2024 మార్చి 12న తితిదే 10 లక్షల కిలోల ఆవునెయ్యి సరఫరా కోసం పిలిచిన ఈ-టెండర్‌ను ఏఆర్ డెయిరీ ఫుడ్ సంస్థ దక్కించుకుని కిలోకు రూ.319.80 చొప్పున సరఫరా చేసింది. ఆ ధరకు నిజమైన ఆవు నెయ్యి సరఫరా చేయడం అసాధ్యం.

◆ సరఫరా చేసిన నెయ్యిపై అనుమానంతో నమూనాలు ఎన్‌డీడీబీ, సీఏఎల్ఎఫ్ ప్రయోగశాలకు పంపినపుడు నెయ్యిలో వనస్పతి, జంతువుల కొవ్వుతో కల్తీ జరిగినట్లు వెల్లడైంది. పామాయిల్, పామ్‌కెర్నల్ ఆయిల్, పామోలిన్‌తోపాటు బీటా-కెరోటిన్ ఇతర రసాయనాలు ఉపయోగించి అసలు నెయ్యి రుచి, సువాసన పోలి ఉండేలా కల్తీనెయ్యి తయారుచేసినట్లు విచారణలో తేలింది. ◆ నెయ్యి సేకరణ, పరీక్షల కోసం ఎస్‌వోపీ ప్రవేశపెట్టాం. థర్డ్ పార్టీ సర్టిఫికేషన్, విజిలెన్స్ వ్యవస్థను తితిదే బలోపేతం చేస్తోంది. ◆ సమగ్ర ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ తయారీ, పునర్వ్యవస్థీకరణ, సాంకేతికత మూల్యాంకనంతో పాటు ఫైల్ ప్రాసెసింగ్ విధానాలు మెరుగుపరుస్తున్నాం. కీలకమైన సాంకేతిక పోస్టులు నిపుణులతో భర్తీ చేయనున్నాం. ◆ తిరుమలలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రయోగశాల ఏర్పాటుతోపాటు తిరస్కరించిన సరకులు పారేయడం కోసం మెరుగైన యంత్రాల ఏర్పాటుకు తితిదే ఆమోదించింది.

◆ టెండర్ నిబంధనల సడలింపులో సహకరించిన, నాణ్యత పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులను గుర్తించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.

జగన్‌ను విచారిస్తే అసలు నిజాలు బయటకొస్తాయి

- వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిలను ముద్దాయిలుగా చేర్చాలి
- తప్పులు అంగీకరించకుండా ఎదురుదాడి చేస్తున్నారు
- కల్తీనెయ్యిపై చర్చలో ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: కల్తీనెయ్యిపై సిట్ విచారణ పూర్తిస్థాయిలో జరగలేదని, దీనిపై సమగ్ర విచారణ జరగాలని, మాజీ సీఎం జగన్‌ను విచారిస్తేనే అసలు నిజాలు బయటికొస్తాయని తెదేపా ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ఈ కేసును ఆషామాషీగా తీసుకోకూడదని, నాడు ఛైర్మన్లుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలను ముద్దాయిలుగా చేర్చాలని డిమాండ్ చేశారు. అన్ని నివేదికల్లో కల్తీ నెయ్యి వాడినట్లు స్పష్టంగా బయటపడినా.. వైకాపా నేతలు చేసిన తప్పును అంగీకరించకుండా ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. కల్తీ నెయ్యి అంశంపై మంగళవారం శాసనసభలో జరిగిన లఘుచర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు.

ఎంపీ సుబ్బారెడ్డి ఇంట్లోనే బేరసారాలు

– ధూళిపాళ్ల నరేంద్ర, పొన్నూరు ఎమ్మెల్యే

నాటి ప్రభుత్వ పెద్దలు, పాలకులు, తితిదే ఛైర్మన్లుగా ఉన్న వ్యక్తుల భాగస్వామ్యం లేకపోతే ఇంత పెద్దఎత్తున ఐదేళ్లు కల్తీనెయ్యి వ్యవహారం నడిచే అవకాశం ఉందా? ప్రభుత్వం సిట్ వేయగానే వైవీ సుబ్బారెడ్డి కోర్టులో కేసు ఎందుకు వేశారు? కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి గత ప్రభుత్వంలో ఐదేళ్లూ ఒక్క ట్యాంకర్ కూడా తీసుకోలేదు. రాష్ట్రంలో అన్ని ఆలయాలకూ కల్తీ నెయ్యి సరఫరా అయింది. సహకార డెయిరీల నుంచే నెయ్యి తీసుకోవాలనే నిబంధనను దేవాదాయ శాఖ 2022లో మార్చి, ట్రేడర్స్‌కు అవకాశం ఇచ్చారు.

జగన్ కోసమే సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకు వెళ్లారు

.– జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట ఎమ్మెల్యే

వేంకటేశ్వరస్వామికి సుబ్రహ్మణ్యస్వామి అపచారం చేశారు. ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేయగానే సుప్రీం కోర్టులో కేసు వేశారు. దానికి కారణం జగన్. ప్రస్తుతం తితిదేకు సరిపడా నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం డెయిరీలకు సరిపోకపోవడంతో, 1,500 కి.మీ.కు పైన ఉన్న డెయిరీలకూ అవకాశం కల్పించాం. ఇందులో ఇందాపూర్ డెయిరీ వచ్చింది. మంచి నెయ్యి సరఫరా చేసేలా ఉంటే భోలేబాబా డెయిరీ కూడా రావచ్చు. ఇప్పుడు తప్పు జరిగితే మేం బాధ్యులం. నాడు తప్పు జరిగినప్పుడు బాధ్యత అప్పటివారికి ఉండాలి. సిట్ వారి తప్పు ఎత్తి చూపలేదు. అందుకు ఏ శక్తి అడ్డుకుందో?

సనాతన ధర్మంపై సైతాన్ల దాడి ఇది

– కాల్వ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే

తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యితో రూ.వందల కోట్ల వ్యాపారం చేసినా, సిట్ దర్యాప్తు ఆ స్థాయిలో జరగలేదు. దేవాదాయ మంత్రి ప్రకటనలో సైతం ఉద్యోగులను శిక్షిస్తామని చెప్పారేగానీ, అసలు దోషుల ప్రస్తావన లేదు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిల కుట్రతోనే ఇదంతా జరిగింది. 2006-08లో కరుణాకరరెడ్డి తొలుత తితిదే ఛైర్మన్‌గా ఉన్నారు. 2011లో ఆయన కుమార్తెకు మెదక్ చర్చిలో, జగన్ బంధువుల అబ్బాయితో వివాహం చేశారు. అదే కరుణాకరరెడ్డిని జగన్ మళ్లీ తితిదే ఛైర్మన్ చేశారు. వైవీ సుబ్బారెడ్డి హయాంలో టెండర్ల నిబంధనలు మార్చారు. తదుపరి ఛార్జిషీట్‌లో సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డిలను నిందితులుగా పేర్కొంటేనే అందరికీ నమ్మకం కలుగుతుంది.

కీలకనేతకు తెలియకుండా ఉంటుందా?

– సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

నాడు వైఎస్సార్ నుంచి మొన్నటి జగన్ హయాం వరకు.. తితిదేను నాటి ఛైర్మన్లు, అక్కడి ఎమ్మెల్యేలు ప్రైవేట్ కంపెనీలాగా మార్చుకొని భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. కీలక నేతకు చెందిన మనుషులంతా కల్తీ నెయ్యి వ్యవహారాన్ని సాగిస్తుంటే, ఆయనకు తెలియకుండా ఎలా ఉంటుంది? అసలు సూత్రధారులపై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ఏకసభ్య కమిషన్ సమగ్ర విచారణ జరిపి, ఈ కుంభకోణం వెనుకున్న వారికి శిక్షపడేలా చూడాలని శ్రీవారి భక్తులు కోరుకుంటున్నారు.

రెండు కొండలేనన్న వైఎస్ ప్రభుత్వం

– కూన రవికుమార్, ఆమదాలవలస ఎమ్మెల్యే

గత ప్రభుత్వ హయాంలో వైకాపా పింక్ డైమండ్ అని హడావిడి చేసింది. తిరుమలకు వెళ్లే బస్ టికెట్లపై హజ్‌యాత్ర, జెరూసలెం యాత్రల ప్రకటనలు ముద్రించారు. హిందూయేతరులు డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరంలేదని నాడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గోవిందరాజస్వామి ఆలయ బంగారు తాపడంలో 50 కేజీల బంగారం మాయం చేశారు. అర్హతలేని ధర్మారెడ్డిని ఈవోగా తీసుకొచ్చి, దిల్లీలో జగన్ అక్రమ కేసుల మాఫీ కోసం ఆయనను వాడుకున్నారు.

ఐదేళ్లపాటు వైకాపా వైరస్

– గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

కరోనా వైరస్ కంటే భయంకరమైన వైకాపా వైరస్ 2019-2024 మధ్య వచ్చింది. ఆ ఐదేళ్లూ తితిదిలో ప్రతిదీ కుంభకోణమే. భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. నాడు ఛైర్మన్లుగా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డిల మతాలు ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఆధారాలతో సహా బయటపడినాసరే.. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఆలయాలపై దాడులపైనా విచారణ వేయాలి

–పంచకర్ల రమేశ్‌బాబు, పెందుర్తి ఎమ్మెల్యే

నెయ్యిలో కల్తీ నిజం. అన్ని నివేదికలూ ఇదే చెప్పాయి. ఇద్దరు అధికారులను బలిచేసి, వారిపై నెట్టేస్తే సరిపోదు. వెనుక ఉన్న పెద్దలందరినీ శిక్షించాలి.

కల్తీ నెయ్యితో మహాపాపం చేశారు

– పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

60 లక్షల కిలోల కల్తీనెయ్యి వినియోగించి రూ.235 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారు. మహాపాపం చేశారు. దీనిపై సరైన విచారణ జరగాలి. జగన్ ప్రభుత్వ హయాంలో అంతర్వేది రథాన్ని కాల్చారు. అందులో సీబీఐ ఎవరినీ అరెస్ట్ చేయలేదు. రామతీర్థంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే సీఐడీ ఎవరినీ పట్టుకోలేదు.

లడ్డూలో కల్తీ నెయ్యి వాడటం దుర్మార్గం

– యార్లగడ్డ వెంకట్రావు

తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వ్యవహారంలో భక్తుల మనోభావాలను వైకాపా తీవ్రంగా దెబ్బతీసింది. సాక్షాత్తు కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి కల్తీ నైవేద్యం పెట్టడం క్షమించరాని నేరమని అన్నారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 'భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా తితిదే గోవుల పెంపకాన్ని చేపట్టాలి. గోవుల్ని దానంగా తీసుకోవడం, కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలి. దీనివల్ల అంతరించిపోతున్న దేశవాళి ఆవులు, ఒంగోలు జాతి ఆవులను కాపాడినట్లూ అవుతుంది.

మీడియాపాయింట్

ఈనాడు, అమరావతి: మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో పలువురు ఎమ్మెల్సీలు మాట్లాడారు.

◆ '20 నెలల పాలనలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైంది' అని వైకాపా ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, మొండితోక అరుణ్‌కుమార్, తూమాటి మాధవరావు విమర్శించారు.

◆ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా.. సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు గొప్పలు చెప్పడం సరికాదని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు.

◆ ఒంటిమిట్ట కోదండరామ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామన్న ప్రభుత్వ హామీలు నెరవేర్చాలని ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి కోరారు.

◆ జమ్మలమడుగు నియోజకవర్గం రాజోలి ప్రాజెక్టు పరిధిలో ముంపునకు గురైన 8 వేల ఎకరాల్లో 4 వేల ఎకరాలకు అవార్డు పాస్ చెయ్యలేదని ప్రభుత్వం సభలో తప్పుడు సమాధానం ఇచ్చిందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆరోపించారు.



మంగళవారం శాసనసభ సమావేశాలు తిలకించేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

50 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

6 రెవెన్యూ డివిజన్‌లకు కొత్త ఆర్డీవోలు

ఈనాడు, అమరావతి: డిప్యూటీ కలెక్టర్లుగా కొన్ని నెలల కిందట పదోన్నతులు పొందిన పలువురికి రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగులిచ్చింది. మరికొందరిని బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 50 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ, పోస్టింగులిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బనగానపల్లె రెవెన్యూ డివిజన్‌కు వై.నరేంద్రనాథ్‌రెడ్డి, పలాసకు రాచర్ల అప్పలరాజు, మార్కాపురానికి పెంచల ప్రభాకర్, చీపురుపల్లికి మాలతి సుధారాణి, మచిలీపట్నానికి కె.సాంబశివరావు, నగరికి ఎం.అనుపమను ఆర్డీవోలుగా నియమించారు. మిగతా వారిని సీఆర్‌డీఏ, వివిధ సాగునీటి ప్రాజెక్టులు, ఇతర విభాగాల్లో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లుగా నియమించారు.

ఆర్అండ్‌బీ విశ్రాంత సీఈపై అభియోగాల నమోదు

ఈనాడు, అమరావతి: ఆర్అండ్‌బీలో గతంలో ఒంగోలు సర్కిల్ ఎస్ఈగా పనిచేసిన పి.సి.రమేశ్‌కుమార్‌పై అభియోగాలు నమోదుచేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీచేసింది. గతంలో టెండర్ల విషయంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఆయనపై అభియోగాలు నమోదుచేశారు. కొంతకాలం కిందట ఆయన చీఫ్ ఇంజినీర్ హోదాలో రిటైర్ అయ్యారు. ఇదే కేసులో బాపట్ల ఈఈగా పనిచేసిన డి.ప్రసాదరావుపై కూడా అభియోగాలు నమోదు చేస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీచేసింది.

డిప్యూటీ కలెక్టర్లుగా 9 మంది నియామకం

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ ద్వారా ఇటీవల ఎంపికైన తొమ్మిది మంది గ్రూప్-1 అధికారుల్ని డిప్యూటీ కలెక్టర్లుగా నియమిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. తాత్కాలిక ప్రాతిపదికన వీరిని డిప్యూటీ కలెక్టర్లుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. కె.లక్ష్మీ దీపిక, పెనుమెత్స యోగిత సంజన, గూడూరు గీతాంజలి, పెసల ప్రియంవద, భాగం నిఖిలశ్రీ, తొగట ప్రియాంక, కనపాల రాజా మాథ్యూ, సెటకం సాయి ప్రవల్లిక, యడసంద్రం సురేశ్ డిప్యూటీ కలెక్టర్లుగా నియమితులయ్యారు. మానవ వనరుల సంస్థలో 72 వారాల శిక్షణ అనంతరం వీరికి జిల్లాలవారీ కేటాయింపులు ఇవ్వనున్నారు.

ఆలయాల పరిపాలన సంస్థ డైరెక్టర్‌గా ముక్తేశ్వరరావు

ఈనాడు, అమరావతి: దేవాదాయశాఖ పరిధిలో ఉండే.. రాష్ట్ర ఆలయాల పరిపాలన సంస్థ (ఎస్ఐటీఏ) డైరెక్టర్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్.ముక్తేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీచేసింది.

జగనన్న లేఔట్లలో రూ.7 వేల కోట్ల కుంభకోణం

- నాటి అధికార పార్టీ నేతల భూదందా
- పేదల ఇళ్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం
- మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

ఈనాడు, అమరావతి: పేదలకు ఇళ్లస్థలాల పేరుతో వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న లేఔట్లలో రూ.7వేల కోట్ల కుంభకోణం జరిగిందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. నాటి అధికారపార్టీ నేతలు ప్రజల నుంచి తక్కువ ధరకు భూములు లాక్కొని, అంతకు రెండు, మూడు రెట్ల ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించారని తెలిపారు. జగనన్న లేఔట్ల ఏర్పాటుకు రూ.10,414 కోట్లు కేటాయించగా, అందులో సగానికిపైగా నిధులు దుర్వినియోగమైనట్లు మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో.. 'గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల మంజూరులో అవకతవకలు జరిగాయా' అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి అనగాని సమాధానమిచ్చారు.

అనర్హులకు 7 లక్షలకు పైగా ప్లాట్లు

'గత ప్రభుత్వంలో 31,35,320 దరఖాస్తులు రాగా, 22,80,358 మందికి స్థలాలు ఇచ్చారు. వారిలో 15 లక్షల మందే అర్హులు. మిగిలిన 7 లక్షలకు పైగా స్థలాలు వైకాపా నేతల బంధువులకు కట్టబెట్టారు. అధికారుల కమిటీ పరిశీలించి, ఇప్పటికే 43,948 మందిని అనర్హులుగా గుర్తించింది. మరో 1.11 లక్షల పట్టాలు పరిశీలనలో ఉన్నాయి. అనర్హులకు కేటాయించిన స్థలాలు రద్దుచేస్తాం' అని సత్యప్రసాద్ తెలిపారు.



అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు

'పేదలకు ఆవాసం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇవ్వాలన్నది ప్రణాళిక. పట్టణాల్లో స్థలాల కొరత ఉన్నందున టిడ్కో, పట్టణ స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించాం. స్థలాల కోసం ప్రజల నుంచి 4 లక్షలకు పైగా దరఖాస్తులొచ్చాయి. 1.03 లక్షల మందిని అర్హులుగా గుర్తించాం. 1.41 లక్షల దరఖాస్తులు తిరస్కరించాం. మరో 1.56 లక్షల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి' అని మంత్రి వివరించారు.

లోక్‌భవన్‌లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం ఆవిర్భావ వేడుకలు

గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని ఏపీ లోక్‌భవన్‌లో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం ఆవిర్భావ వేడుకలను మంగళవారం నిర్వహించారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్'లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ అందమైన పర్వతాలు, బౌద్ధ మఠాలు, సరస్సులు, సంస్కృతికి ప్రసిద్ధి చెందిన రాష్ట్రమని పేర్కొన్నారు. భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో తెగలు ఉన్న రాష్ట్రం మిజోరం అని తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము, సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా విశాఖ



పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: విశాఖ తీరంలో పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణకు అవరోధంగా ఉన్న సీఆర్‌జడ్ నిబంధనల్లో సడలింపుల కోసం కేంద్రాన్ని సంప్రదిస్తున్నామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ యాదవ్, వెలగపూడి రామకృష్ణబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'విశాఖను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం. సీ-ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలిటూరిజంపై దృష్టి సారించాం. అడ్వెంచర్, యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామ'ని వివరించారు. విశాఖలో వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తే అక్కడినుంచి పర్యాటకులు విదేశాలకు వెళ్లాల్సిన అవకాశం రాదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగుల వైద్యానికి అదనపు సాయం



రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కింద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్సకు అందిస్తున్న రూ.2 లక్షల ప్రభుత్వ సహాయంతో పాటు అదనంగా మరో రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'ఈహెచ్ఎస్‌లో ఆర్టీసీ ఉద్యోగులతోపాటు వారి కుటుంబసభ్యులకూ వైద్యసేవలు అందిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 1,900 ఆసుపత్రుల్లో 45వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు వైద్యసేవలు పొందుతున్నారు' అని చెప్పారు.

రూ.1,077 కోట్లతో అడవితల్లి బాటలు



మంత్రి నాదెండ్ల మనోహర్

అడవితల్లి బాట కింద గిరిజన గ్రామాల్లో రూ.1,077.26 కోట్లతో 393 రోడ్లు, 33 వంతెనల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు బదులుగా మనోహర్ సమాధానమిచ్చారు. 'ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లోని కొఠియా గ్రామాల వివాద పరిష్కారానికి రెండు రాష్ట్రాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. ఆ గ్రామాల ప్రజలు ఏపీలోనే కలిసేందుకు సుముఖంగా ఉన్నా, ఒడిశా అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చి ఆ రాష్ట్రంలో కలిపేందుకు యత్నిస్తున్నారు. ఆ గ్రామాల ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లోనూ ఓటు వేస్తున్నారు' అని ఎమ్మెల్యే రామకృష్ణ పేర్కొన్నారు.

గుడికట్ల పూజారులకు గౌరవవేతనం అందించాలి

దేవాదాయశాఖ మంత్రిని కోరిన సవిత



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కోరారు. ఈ మేరకు ఆమె సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్రంలో 700 వరకు ఉన్న గుడికట్ల దేవాలయాల్లో కురబ సామాజికవర్గానికి చెందిన పూజారులున్నారు. వారికి గౌరవవేతనం అందించి అండగా నిలవాలి. చిన్న ఆలయాలకు అందిస్తున్న తరహాలోనే గుడికట్ల ఆలయాల నిర్వహణకు రూ.10 వేల చొప్పున అందించాలి' అని విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ సంక్షేమ సంఘం నాయకులు, గుడికట్ల దేవాలయ పూజారులు ఉన్నారు.

◆ బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి సవిత సభ్యుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 891 వసతిగృహాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేందుకు వీలుగా యూపీఎస్/ఇన్వర్టర్లు, 814 వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు, 397 హాస్టళ్లలో స్వల్ప మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం

హోం మంత్రి వంగలపూడి అనిత

కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'రాష్ట్రంలో అన్ని కేసులపై పోలీసుశాఖ దృష్టి పెట్టింది. ఆఖరికి డోర్ డెలివరీ చేసిన వారి కుటుంబ సభ్యులనూ (ఎమ్మెల్సీ అనంతబాబు కుటుంబానికి సంబంధించి) వెతుకుతున్నాం. ఈ ఏడాది మహిళలపై హత్యలు, అత్యాచారాలు 4 శాతం తగ్గాయి. అన్ని రకాల నేరాలకు సంబంధించిన కేసులు 6 శాతం తగ్గాయి' అని పేర్కొన్నారు.

◆ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 125 మంది అక్రమ వలసదారులు ఉన్నట్లు గుర్తించామని మంత్రి అనిత జనసేన ఎమ్మెల్సీ నాగేంద్రరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వారిలో 92 మంది సరైన పత్రాలతో రాష్ట్రానికి వచ్చారని వీసా గడువు ముగిసిన తర్వాతా రాష్ట్రంలోనే ఉండిపోయారన్నారు.

◆ పోలీసు అంశం రాష్ట్ర జాబితాలో ఉన్నందున.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పోలీసుల పనితీరును మూల్యాంకనం చేసే ప్రక్రియ లేదని సభ్యుల ప్రశ్నకు మంత్రి అనిత సమాధానంగా చెప్పారు. న్యాయ సంహిత చట్టాలకు సంబంధించి కేంద్రం డ్యాష్‌బోర్డు తయారు చేసిందని.. అందులో రాష్ట్రానికి సంబంధించిన డేటా సరిగా పంపించకపోవడంతో ఎన్‌సీఆర్‌బీ నివేదికలో రాష్ట్రస్థానం పడిపోయిందని మంత్రి పేర్కొన్నారు.


వెయ్యి మంది లస్కర్ల నియామకం

మంత్రి నిమ్మల రామానాయుడు



చిట్టచివరి ఆయకట్టుకు నీరు సరఫరా చేసేందుకు కాలువల్లో పూడిక తీస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు సభ్యుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అవసరానికి అనుగుణంగా లస్కర్లను ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమిస్తున్నట్లు తెలిపారు. 'గతంలో 7,224 మంది లస్కర్లు ఉండేవారు. పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త నియామకాలు లేక.. ప్రస్తుతం 1,517 మంది మాత్రమే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1,033 మంది లస్కర్లను ఔట్‌సోర్సింగ్ విధానంలో తీసుకున్నాం' అని అన్నారు. ◆ గుంటూరు కాలువ ఆధునికీకరణ కోసం రూ.369 కోట్లతో అంచనాలు రూపొందించడానికి పరిశీలిస్తున్నామని మంత్రి రామానాయుడు చెప్పారు. '2015లో రూ.378 కోట్లతో అప్పటి తెదేపా ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. వైకాపా ప్రభుత్వం వాటిని రద్దు చేసింది' అని వివరించారు.

జ్యుడిషియల్ జిల్లాలుగా ఇంకా గుర్తించలేదు



◆ రాష్ట్రంలో 28 రెవెన్యూ జిల్లాలు ఉండగా.. 13 జ్యుడిషియల్ జిల్లాలు ఉన్నాయని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. కొత్తగా ఏర్పడిన 15 జిల్లాలను జ్యుడిషియల్ జిల్లాలుగా ఇప్పటికి గుర్తించలేదని సభ్యుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

'కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేయాలి'

ఈనాడు, అమరావతి: కోనసీమలో కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, అయితాబత్తుల ఆనందరావు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పీపీపీ విధానంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలని కోరారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ.. కోనసీమలో కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ప్రస్తుతానికి లేవని సమాధానమిచ్చారు.

కాజ్‌వేల స్థానంలో వంతెనలు నిర్మించాలి

శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో దెబ్బతిన్న కాజ్‌వేల స్థానంలో వంతెనలు నిర్మించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వాన్ని కోరారు. వర్షాకాలంలో దెబ్బతిన్న కాజ్‌వేల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. దీనికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ.. ప్రతిపాదనలు పరిశీలించి నిధుల లభ్యతను బట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.